

ఎల్. షేయినిన్



అపరాధ పరిశోధకుడి నోట్సు







ఎల్. షేయినిన్

అపరాధ పరిశోధకుడి నోట్సు



"రాదుగ" ప్రచురణాలయం మాస్కో

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్

అనువాదం: ఆర్వియార్
డిజైను: పి. ఇవాష్చెన్కొ

Л. ШЕЙНИН
ЗАПИСКИ СЛЕДОВАТЕЛЯ
На языке телугу

L. SHEININ
DIARY OF A CRIMINOLOGIST
In Telugu

సోవియట్ యూనియన్‌లో ముద్రింపబడింది

ISBN 5-05-001443-3

విషయసూచిక

నా గురించి నాలుగు మాటలు

ఎవరయినా సాహిత్యంలోకి రచయితగా యెలా ప్రవేశిస్తారు. రకరకాల దారులున్నాయి. నా దారి క్రిమినల్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో మొదలైంది. యివాళ, 1956 మార్చి నెల 25వ తారీకున, నా యాభయ్యవ పుట్టిన రోజున, రచయితగా నా జీవితం యెలా మొదలైందో వెనక్కి చూసుకుంటున్నాను. 1923వ సంవత్సరం ఫిబ్రవరి నెల చలివణికించే రోజు మాస్కో యెలా వుందో గుర్తువస్తోంది. అప్పుడు నేను ''లిటరేచర్ అండ్ ఆర్ట్ బ్రూసావ్ ఇన్‌స్టిట్యూట్'' విద్యార్థిని. కామ్సొమోల్ సభ్యుణ్ణి. క్రాస్నొప్రెస్‌నెన్‌స్కీ జిల్లా కామ్సొమోల్ కమిటీ నన్ను తక్షణం రమ్మని కబురు చేసింది ఆ రోజున.

1923 నాటి మాస్కో, నా యౌవన దినాల మాస్కో, నిన్ను నేనెన్నడూ మార్చిపోలేను. కళ్లు మూసుకున్నా మంచు కమ్మిన నీ వీధులు, యిరుకు త్వేర్‌స్కయా వీధి, ఒఖోత్‌నీ రియాద్‌లోని అవర్ లేడీ ఇవేర్‌స్కయా చాపెల్ నాకు కనిపిస్తూ వుంటాయి. సంఖ్యలో తక్కువగా వుండటంతో ఉండీ వుడిగీ వస్తూ వున్న ఆ ట్రాములు, వీధి మొగల్లో జోగుతూ వుండే బళ్లవాళ్లు దాణా సంచీల్లోనుంచి ఓట్ గింజల్ని నమిలే గుర్రాలు గుర్తువస్తాయి. మొస్సెల్‌ప్రోమ్ సేల్స్‌గరల్స్ (మొదటి సోవియట్ కంపెనీ అదే) గుర్తువస్తారు. వాళ్లు చక్కగా కుట్టిన ముచ్చటైన యూనిఫాం టోపీలు పెట్టుకునే వాళ్లు. చాకొలెట్లనీ, 'ఇరా' సిగరెట్లనీ (పాత ప్రపంచ అవశేషంగా మిగిలిందల్లా ఆ సిగరెట్లేనని వాళ్లు అనేవాళ్లు) ట్రేలలో అమ్మేవాళ్లు గుర్తువస్తారు. నాకు జత్సెపా మార్కెట్ దగ్గర పొగకమ్మిన టీ కేంటీన్ కళ్ల ముందు కనిపిస్తుంది. హాకర్లు, స్టూడెంట్లు, బళ్లవాళ్లు, జత్సెపా మాంసం వర్తకులు, బజారు జేబు దొంగలు, పొంకమైన వక్షస్సూ యెర్రటి బుగ్గలూ వున్న మిల్క్ మెయిడ్లు చలికాగడం కోసం అక్కడికి మూగేవాళ్లు. యీ అమ్మాయిలు పవెలేత్‌స్కయా స్టేషన్లో శివారు రైళ్ల కోసం చూసేవాళ్లు. నీ రైల్వే స్టేషన్లు, కిక్కిరిసిపోయిన విద్యార్థుల హాస్టళ్లు, మాస్కో ఆర్ట్ థియేటర్ బుకింగ్ కౌంటర్ దగ్గర తెల్లవార్లూ క్యూలో నుంచునే సందోహ

భరిత గుంపులు, త్వేర్‌స్కాయ్ బులెవాలోని ''గొప్ప మూకీ'' సినిమా కనిపిస్తాయి నాకు. అవును అప్పట్లో ఆ సినిమా మూకీ సినిమాయే.

అవి వింత రోజులు, మాస్కోయే వింతగా వుండేది. పూర్వం వర్తకులు నివసించే భవనాలలో కామ్సొమోల్ క్లబ్‌లు, చిన్నచిన్న దుకాణాలూ, బడ్డీ కొట్లూ ఉరవడిగా వ్యాపారం సాగే సుఖరెవ్‌స్కీ మార్కెట్ పక్కన సహజీవనం చేసేవి. షాపుల బయట అప్పుడే కొత్తగా తగిలించిన బోర్డులతో నెప్‌మన్* ఆఫీసులు, మొఖోవయా వీధిలో పక్కనే పొక్‌రోవ్‌స్కీ వర్కర్స్ హైస్కూల్ ఆడిటోరియమ్‌లు వుండేవి. యీ హై స్కూల్‌కి నిన్నటి దాకా లేత్ ఆపరేటర్లు, ఫిట్టర్లు, ఇంజన్ డ్రైవర్లు కాలేజీ ప్రవేశ పరీక్షల కోసం వచ్చేవాళ్లు. త్వేర్‌స్కయ వీధిలోని మాస్కో అనార్కిస్టుల క్లబ్బు బయట పెద్ద నల్లని బోర్డు వుండేది (''అరాచకత్వం క్రమపద్ధతికి తల్లి''), స్త్రస్నాయ చౌకు మొగలో ''పెగాసస్ కెఫే''లో గోడలమీద వికృతమైన బొమ్మలుండేవి. అక్కడ ఇమేజిస్టులు తమ రచనలు చదివి వినిపించేవాళ్లు. వాళ్ల శ్రోతలు మందు కొట్టేసి మత్తుగా వుండే నానా రకాల వాళ్లూనూ.

కామ్సొమోల్ క్లబ్‌లలోని యువజనం ''కార్మిక కర్షక యువ రక్షకులం మేము'' అని పాడేవాళ్లు. అన్ని దేశాల్లోని శ్రామికులకీ ఒక యేకీకృత భాష ద్వారా ప్రపంచ విప్లవాన్ని త్వరితంగా తీసుకొచ్చెయ్యాలని ''ఎస్పెరాంతో'' కల్పిత భాషని చదివేవాళ్లు. మహా కసిగా విజ్ఞానం అనే నల్లరాతిని దొలిచేసేవాళ్లు, తాము తాత్కాలికంగా భరించాల్సివచ్చిన నెప్‌మన్‌లని అసహ్యించుకునేవాళ్లు.

యీలోపున అన్ని సందుగొందుల్లోనుంచీ నానారకాల భ్రష్టులూ లుకలుకలాడుతూ యివతలికి వచ్చేరు. వృత్తి రీత్యా పేకాట మోసగాళ్లు, పొగరు మోతు రౌడీలు, దురాశతో నిండిపోయిన దొంగ వ్యాపారులు, తార్పుడు గాళ్లు, గొప్పింటి వాళ్లల్లా నటించే బందిపోట్లు, పూర్వం గొప్పింటి వాళ్లైనా బందిపోట్లుగా మారిన వాళ్లు, ప్రేమోన్మాదులు, నానా రకాల శుద్ధ సాదా దొంగలు వీళ్లల్లో వున్నారు.

యిట్టేట్టే అంతరించిపోయే దొంగ ''కంపెనీలు'', పేరులేని ''స్టాక్ ఎక్స్‌చేంజి కంపెనీలు'' రోజు రోజు పుట్టుకొచ్చేవి. గంటగంటకి అంతరించి పోయేవి. కొత్తగా స్థాపించిన ప్రభుత్వ సంస్థలని మోసం చేసే వరకే అవి వుండేవి. యేదో నిర్మిస్తామనో, వస్తువులు సరఫరా చేస్తామనో ఆ సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుని మోసం చేసేవి యీ కంపెనీలు. మొదట విదేశీ గుత్త కంపెనీలు పుట్టుకొచ్చాయి: కలప మిల్లులు, పెన్సిల్ ఫాక్టరీలు, బసిన్లు డ్రాయర్లు మేజోళ్లు ఉత్పత్తి చేసే ఫాక్టరీలు.

యీ గుత్త కంపెనీల వాళ్లకి మాస్కోలో, లెనిన్‌గ్రాడ్‌లో స్థిరమైన కేంద్ర

---

* ఎన్.ఇ.పి.నుంచి – న్యూ ఎకనామిక్ పాలసీ (నూతన ఆర్థిక విధానం). – సం.

కార్యాలయాలుండేవి. వాళ్లకి ముచ్చటైన మగువలు వుండేవాళ్లు. రహస్యంగా ఫర్నీ, కరెన్సీనీ, ప్రాచీన రుబ్ల్యోవ్ విగ్రహాలనీ, వోలొగ్డ లేసుల్నీ, వెలలేని పెయింటింగుల్నీ స్ఫటికం పాత్రలనీ కొనేసేవాళ్లు. గుట్టుచప్పుడు కాకుండా వాటనన్నిట్నీ స్వదేశం పంపేసే వాళ్లు. కాని మళ్లీ బాలేలన్నా బాలేరినాలన్నా పడి చచ్చేవాళ్లు. ''పాపం! రష్యన్ ప్రజల''ని చెప్పి రష్యన్ ప్రజల ''ఖర్మ''కి జాలిపడి నిట్టూర్చేవాళ్లు. ''కమ్యూనిస్టులు వాళ్లని అదమరిచి వుండగా పట్టేసుకున్నా''రట. కమ్యూనిస్టులకి ''మామూలు మానవ నియమాలు'' లేవట. కాని ''ఆఖరికి బుద్ధి తెచ్చుకుంటున్నా''రట. అలా అని వాళ్లు అనుకునేవాళ్లు.

రమ్మని చెప్పిన వేళకి జిల్లా కామ్సొమోల్ కమిటీకి వెళ్లాను. అంత అర్జంటుగా నన్ను యెందుకు పిలిపించిందీ వూహించలేకపోయాను. ఆర్గనైజేషనల్ విభాగం అధిపతి ఓసిపావ్‌ని అడిగితే ఆయన నిగూఢంగా చిరునవ్వు నవ్వాడు. యెందుకైందీ జిల్లా కార్య దర్శి సాష గ్రాంవ్ చెప్తాడన్నాడు.

నేను జిల్లా కమిటీ సభ్యుణ్ణి. గ్రాంవ్‌ని బాగా యెరుగుదును. ఓసిపావూ నేనూ కలిసే ఆయన గదికి వెళ్లాం.

''హల్లో లెవ్, కూర్చోండి. మనం ఒక సీరియస్ విషయం చర్చించాలి.''

నేను ఆయనకి యెదురుగా కూర్చున్నాను. ప్రజా సేవ కోసం దీర్ఘ కాలంగా కామ్సొ మోల్‌లో వున్న సభ్యుల్ని సమీకరించాలని మాస్కో కామ్సొమోల్ కమిటీ తీర్మానం చేసిందని ఆయన చెప్పాడు. నేను 1919 నుంచీ సభ్యుణ్ణి కావడంవల్ల నన్ను అందులో వేసుకున్నారట.

''మాకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లూ, క్రిమినల్ ఇన్వెస్టిగేటర్లూ చచ్చేటంత అవ సరంగా వున్నారు'' అని గ్రాంవ్ చెప్పేడు. పెద్ద పైపుని పీల్చాడు. అదంటే అసలు ఆయనకి అయిష్టం. కాని మరింత గొప్పగా కనిపించాలని అలా పైపు కాల్చేవాడు. ''రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు నెప్‌మన్‌ల దగ్గర్నుంచి పన్నులు వసూలు చెయ్యాలి. కాని నెప్‌మన్‌లు వాళ్లని నానారకాల ప్రలోభాలు చూపించి పక్క దారి పట్టిస్తున్నారు. చివ రకి ప్రభుత్వం నష్టపోతోంది. తెలిసిందా?'' అని అడిగాడు.

''ఆఁ, కాని నా పాత్ర యేమిటిందులో?'' అని అడిగాను.

''ప్రభుత్వం నష్టపోకూడదు కదా'' అని గ్రాంవ్ యెదురు ప్రశ్నించాడు, బెదిరి స్తున్నట్టు పైపు పీల్చి. ''కాని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లకంటే ఇన్వెస్టిగేటర్ల అవసరం యింకా యెక్కువ వుంది. మాస్కో రీజినల్ కోర్టులో వున్న ఇన్వెస్టిగేటర్లలో మూడింట రెండు వంతులు పార్టీ వాళ్లు కారు. కొంతమంది జార్ టైమ్‌లో కూడా యిదే ఉద్యో గాల్లో వున్నారు. విప్లవానికి తన షెర్లాక్ హోమ్స్ వుండాలి, ఆఁ, అర్థమైందా?'' అన్నాడు.

''కాని, సాష, నేను రెవెన్యూ ఇనస్పెక్టరుని అవాలనీ, లేదా క్రిమినల్ ఇన్వెస్టిగేటర్‌ని అవాలని అనుకోలేదు'' అని అభ్యంతరం చెప్పాను. ''నా బుర్ర లెక్కలకి పనికి రాదు. యిక షెర్లాక్ హోమ్స్ గురించి నాకు తెలిసింది అతను పైప్ కాల్చేవాడని, బేకర్ స్ట్రీట్‌లో వుండేవాడనీ, వయొలిన్ వాయించేవాడనీనీ. ఓ రకం డిడక్టివ్ పద్ధతిని కనిపెట్టాడు. అతనికి డాక్టర్ వాట్సన్ అని స్నేహితుడుండేవాడు. యీ వాట్సన్ సరిగ్గా అదునులో యెప్పుడూ చవట ప్రశ్నలు అడిగేవాడు, షెర్లాక్ హోమ్స్ యుక్తిగా సమాధానం చెప్పేవాడు. కాని విషయం అసలు అది కాదు. నేనేమో లిటరేచర్ ఇన్‌స్టిట్యూట్‌లో చదువుతున్నాను, నా జీవితాన్ని సాహిత్యానికి అర్పించాలనుకుంటున్నాను....'' అన్నాను.

''తెలివితక్కువతనం'' అని గ్రాంప్ అడ్డం వచ్చేడు. ''నీ చిల్లర కోరికలు విప్లవానికి యేం పడతాయి? పైగా రచయిత కావాలనుకుంటే రెవెన్యూ ఇనస్పెక్టర్‌లా మొదలెట్టడం కంటే, క్రిమినల్ ఇన్వెస్టిగేటర్‌లా మొదలెట్టడం యింకా మెరుగైన దారి. అంతకంటే మంచి దారి యేముంటుంది? నీకు కథ, పాత్రలు జగన్నాటకం వుంటాయి — సాహిత్యం అక్కడే వుంది, బాబూ. కాని అసలు విషయం అదీ కాదు. సోవియట్ ప్రభుత్వానికి రెవెన్యూ ఇనస్పెక్టర్లు, ఇన్వెస్టిగేటర్లు కావాలి. వాళ్లని మనం సమకూర్చాలి. ఒకడుగా నిన్ను యిస్తున్నాం, అదీ సంగతి. యిదిగో యిక్కడ రైటు మార్కు పెట్టు, కావాలంటే ఆశ్చర్యార్థకం కూడా. కాని క్వొశ్చెన్ మార్కులు వద్దు. యెక్కడ పని చేస్తావు రీజినల్ ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్‌లోనా లేదా రీజినల్ కోర్టులోనా?''

''మీరిప్పుడే అన్నారు కదా క్వొశ్చెన్ మార్కులొద్దని. మళ్లీ మీరే వ్యతిరిక్తం చేస్తే?''

''కామ్రేడ్ షేయినిన్, యిది పార్టీ సమీకరణ. ఎక్కడ పని చేసేదీ నిర్ణయించుకోవడానికి సాయంత్రందాకా టైమ్ వుంది. అప్పుడొచ్చి నాకు చెప్పు. యీ సాయంత్రం నిన్ను చూస్తాను, బైరన్'' అన్నాడు గ్రాంప్ గంభీరంగా.

అప్పట్లో నా చొక్కాకి మెత్తటి కాలరు వుండేది. నాకు జుట్టు ఒత్తుగా వుండేది. అందుకని గ్రాంప్ నన్ను బైరన్ అన్నాడు. యిప్పుడు సరే, జుట్టు వూడిపోయింది లెండి.

యీ రకంగా మాస్కో రీజినల్ కోర్టు ఇన్వెస్టిగేటర్‌ని అయాను.

న్యాయశాస్త్రపరమైన విద్య యేమీ లేని పదిహేడేళ్ల కుర్రాణ్ణి యెలా యీ పదవికి నియమించుకున్నారో యివాళ అర్థం చేసుకోడం కష్టం. కాని జరిగింది మాత్రం అదీ. సోవియట్ ప్రభుత్వపు తొలి రోజుల్లో యిదంతా జరిగింది. కొత్త రాజ్యాన్ని నిర్మించడంలో ప్రతి రంగంలోనూ కొత్త సిబ్బందిని యేర్పాటు చేసుకోవాలని జీవితమే అప్పుడు ఒత్తిడి చేసింది. న్యాయశాస్త్ర రంగంలో పరిస్థితి మరీ గడ్డుగా వుండింది. సోవియట్ ప్రొక్యురేటర్ ఆఫీసుని వి. ఐ. లెనిన్ సూచన మేరకి అప్పటికి ఒక యేడాది ముందే

స్థాపించారు. సోవియట్ ప్రభుత్వం ప్రజా కోర్టుల్నీ, రీజినల్ కోర్టుల్నీ ప్రవేశపెట్టింది. తొలినాళ్లనాటి విప్లవ ట్రిబ్యునల్స్ స్థానంలో అవి వచ్చాయి. క్రిమినల్ కోడ్‌నీ, సివిల్ కోడ్‌నీ ఆమోదించారు. న్యాయం యిప్పుడు చట్టం మేరకి జరుగుతుంది ''విప్లవ చైతన్యం మేరకి'' కాదు.

నన్ను చేర్చుకున్నందుకు విచారించాను. నా కొత్త ఉద్యోగం నా చదువుకీ, మరీ ముఖ్యంగా రచయిత కావాలన్న కోరికకీ అంతరాయం కలిగిస్తుందని భయపడ్డాను. రచయిత ఉత్తమోత్తమ పాఠశాల జీవితమేననీ, యే కాలేజీ చదువూ, లిటరేచర్ డిగ్రీ దాని స్థానం ఆక్రమించలేవనీ నేను అప్పట్లో గుర్తించనే లేదు చిత్రం.

రచయితకీ, క్రిమినల్ ఇన్వెస్టిగేటర్‌కీ మధ్య ఉమ్మడిగా చాలా వుంటుందనీ, క్రిమినల్ ఇన్వెస్టిగేటర్ అనునిత్యం విభిన్న వ్యక్తులతోటి, సంఘర్షణలతోటి, నాటకీయమైన సంఘటనలతో తలబడుతూ వుంటాడనీ అప్పట్లో నేను గుర్తించనే లేదు. తెల్లవారి లేస్తే యే కేసు బల్లమీది కొచ్చి పడుతుందో యే ఇన్వెస్టిగేటరూ చెప్పలేడు. అది యేమన్నా కానివ్వండి – దొంగతనం, అసూయాపరమైన హత్య, మోసం, లంచం – యేమైనా గానీ, ఆ నేరం వెనక్కాల వున్న మనుషులు ముఖ్యం. ప్రతి వ్యక్తికీ సొంత వ్యక్తిత్వం వుంది. ఉద్రేకాలున్నాయి. జీవితగతి వుంది. నేరం చేసిన వాళ్ల మనస్తత్వం తెలుసుకుంటేనే గాని నేరం వెనకాల వున్న కారణాన్ని ఇన్వెస్టిగేటర్ కనిపెట్టలేడు. ప్రతివాది అంతరంగంలోకి చొచ్చుకుపోతే తప్ప, సంక్లిష్టమైన, చిక్కు ముళ్లు పడ్డ సంఘటనల మయసభలోకి చొచ్చుకుపోతే తప్ప, వ్యక్తుల దోషాల, దురలవాట్ల, బలహీనతల, కాంక్షల మయసభలోకి చొచ్చుకుపోతే తప్ప ఇన్వెస్టిగేటర్‌కి కేసు కరతలామలకం కాదు.

అందుకనే ఇన్వెస్టిగేటర్ పని మానవ స్వభావాన్ని, మనస్తత్వాన్ని అర్థం చేసుకోవడంమీద ఆధార పడుతుంది. దీనికీ రచయిత పనికీ పోలిక వుంది. రచయిత కూడా తన పాత్రల మనస్తత్వం శోధించాలి. ఆయా పాత్రల సుఖదుఃఖాలు, విజయాలు, ఓటములు, బలహీనతలు, తప్పులు గ్రహించాలి.

నేను యాదృచ్ఛికంగా ఇన్వెస్టిగేటర్‌ని అయాను. అదే యాదృచ్ఛికత రచయితగా నా భవిష్యత్తుని నిర్ణయించింది.

గ్రాంప్ అన్నది రైటే. మాస్కో ఇన్వెస్టిగేటర్లలో చాలా మంది నాన్-పార్టీ వాళ్లూ, కొంతమంది ''జూరిస్టు'' నిపుణులూ వున్నారు. యీ జూరిస్టు నిపుణుల్లో ఇవాన్ స్లితోవ్‌స్కీ ఒకడు. ఆయన దృఢగాత్రుడు. అరవై యేళ్లుంటాయి. ముఖం కొంటెగా వుంటుంది. నవ్వుతూ వుండే నల్లని కళ్లు. ఆయన ఉక్రేనియన్. ఆయన నాకు మహా యిదిగా నచ్చేడు. ఆయనకి కోర్టు ఇన్వెస్టిగేటర్‌గా ముప్పై యేళ్ల అను

భవం వుంది. విప్లవానికి ముందు మాస్కో జ్యూడీషియల్ కౌన్సిల్‌లో పెద్ద కేసులు చూసేవాడు. తన సహోద్యోగులు చాలా మందిలాగా స్నితోవ్‌స్కీ విప్లవం తర్వాత వలస వెళ్లలేదు. గొప్పింటి వాడైనా, విప్లవ ఆదర్శాలని అంగీకరించాడు. తను వాటిమీద ఆశలు పెట్టుకున్నాడు. తన రంగంలో గొప్ప నిపుణుడు. తన జీవిత కృషి పట్ల చాలా ఉత్సాహం చూపించేవాడు. తన కింద పని చేసే కుర్రాళ్లకి సాయం చెయ్యడానికి సిద్ధంగా వుండేవాడు. వాళ్లల్లో యింతకుముందు చాలా మంది ఫాక్టరీ వర్కర్లో పార్టీ వర్కర్లో అయివుండేవాళ్లు.

రీజినల్ కోర్టులో నన్ను నియమించారు. స్నితోవ్‌స్కీ కింద, మరో సీనియర్ ఇన్వెస్టిగేటర్ మినాయ్ లాస్కిన్ కింద నన్ను ప్రొబేషనరుగా వేశారు.

లాస్కిన్ 1918లో స్టూడెంట్‌గా వుండగానే క్రిమినల్ ఇన్వెస్టిగేటర్‌గా ఉద్యోగ జీవితం మొదలెట్టాడు. అప్పుడాయన్ని విప్లవ ట్రిబ్యునల్‌కి అప్పగించారు. ఆయన పొట్టిగా వుండేవాడు. ఉత్సాహంగా వుండేవాడు. చురుగ్గా వుండేవాడు. ఆయనకి కూడా తన వృత్తి అంటే అభిమానం. మాస్కో రీజినల్ కోర్టులో ఉన్నత ఇన్వెస్టిగేటర్లలో ఒకడిగా ఆయన్ని పరిగణించేవారు.

రీజినల్ కోర్టు ప్రిసీడియమ్‌కి నా వయసు చూసి బెంగపట్టుకుంది. సహజమే. యీ యిద్దరూ నన్ను లైనుమీదకి లాగడానికి, యీ "ప్రమాదకరమైన ప్రయోగం" — అలా అని చైర్మన్ అన్నాడు — వల్ల యేం జరుగుతుందో చూడ్డానికి ఆర్నెల్లు పడుతుం దని ప్రిసీడియం అనుకొంది.

స్నితోవ్‌స్కీకి నా ఉద్యోగం గురించీ, తన కొత్త బాధ్యతల గురించీ తెలుసు. నేను మొదట ఆయన ఆఫీసుకి వెళ్లినప్పుడు ఆయన గబుక్కున లేచి చిరునవ్వు నవ్వుతూ నా దగ్గరికి వచ్చాడు.

"బాగుంది, యెలా వున్నారు? బాబూ, మీకు పద్దెనిమిది యేళ్లు కూడా వుండవ్, యేం?" అన్నాడు నాతో షేక్ హేండ్ చేస్తూ.

"త్వరలో నిండుతాయి" అన్నాను. ఆదరంగా, మంచిగా వున్న ఆయనంటే యెందు కనో ఆకర్షణ కలిగింది. ఆయన కవళికలు తీర్చినట్టున్నాయి. ఆయనవి గోధుమ రంగు పెద్ద కళ్లు. నాకు ఆయనంటే యిష్టం కలిగింది.

"ఆఁ, ఆఁ, సిగ్గు పడాల్సిందేమీ లేదు. పడుచుదనం దూకుడు ఒక ఆటంకం. యేటేటికీ నయమవుతుంది. రండి, యీ కుర్చీలో కూర్చోండి. పరిచయం చేసుకుందాం."

ఓ గంట గడిచేటప్పటికి చిరునవ్వు నవ్వుతూ వుండే యీ మంచి మనిషి నా గురించి తెలుసుకోవాల్సిందంతా తెలుసుకున్నాడు. ఆ విషయం నేను గమనించనే లేదు. నేరుగా ప్రశ్నలడగకుండా, కళ్లల్లోకి చూడకుండా తనకి కావలసిన దాన్ని ఆదరంగా, నిర్లిప్తంగా రాబట్టుకుంటూ కబుర్లాడుతూ, నవ్వుతూ, వేళాకోళాలాడుతూ, అవతలి

వాణ్ణి యేం యిబ్బంది పడనీయకుండా చేస్తూ విషయావలోడన చేసే ఆయన కుశలత ఆ తర్వాతనే నాకు తెలిసింది.

మా మొదటి సంభాషణ ముగిసేటప్పటికి ఆయనంటే నాకు యిష్టం కలిగింది. మొగ్గతొడిగే నా శక్తి సామర్థ్యాల మేరకి పని చేసి ఆయన పొగడ్తనీ, విశ్వాసాన్నీ పొందడానికి తగ్గ అన్నీ చెయ్యాలని అనుకున్నాను.

అదే రోజున నేను లాస్కిన్‌ని కలిశాను. ఆయన నా రెండో పోషకుడు. మేం యిద్దరం ప్స్కావ్ ప్రాంతంలోని తొరొపేత్స్ పట్టణం వాళ్లమే. నా చిన్నతనం చాలా భాగం అక్కడే గడిచింది. అక్కడే కామ్సొమోల్‌లో చేరాను. మా అక్కయ్యలు ఆయనకి బాగా తెలుసు. అదే వూళ్లో ఆయన సెకండరీ స్కూల్లో ఆఖరి యేడు చదువుతూ వుండగా మా అక్కలు యింకో సెకండరీ స్కూల్లో వుండేవాళ్లు.

నా బాధ్యత చూసే వీళ్లు, "యీ ప్రయోగంవల్ల యేం జొరుగుతుందో" చూసేందుకు, తమకి అప్ప చెప్పిన పనివి సీరియస్‌గానే తీసుకున్నారు. ఆ యిద్దరికీ నేను రుణపడి వున్నాను. ఆర్నెల్ల తర్వాత రీజినల్ కోర్టు సర్టిఫైయింగ్ కమీషన్ నన్ను పరీక్షిస్తుంది. ఆ తీర్పు నా భవిష్యత్తుని నిర్ణయిస్తుంది.

మా గురువులిద్దరూ తెలివైన వాళ్లు, ధర్మపరాయణులు. వాళ్ల నేతృత్వం నాకు మా వృత్తిపట్ల ఆసక్తినీ, గౌరవాన్నీ కలిగించింది. నేను క్రిమినల్, లీగల్ కోడ్‌ల అధికరణాలు క్షుణ్ణంగా చదివేను. అవి అనుదినం సజీవంగా కేసుల రూపంలో తగిలేవి. దాంతోటి నేర పరిశోధనని గాఢంగా చదివే ఆసక్తి పుట్టింది.

దగ్గరదగ్గర మూణ్ణెల్ల తర్వాత, ఒక రోజున స్నితోవ్‌స్కీ నా భుజంమీద చెయ్యి వేశాడు. నా కళ్లల్లోకి నిబ్బరంగా చూస్తూ శాంతంగా నిండు మనస్సుతో:

"నువ్వు భేషైన వాడివి అవుతావు, కాకపోతే నా చెవి కదపా యిస్తా. నువ్వు పరీక్షలేం పాసై డిగ్రీ పుచ్చుకోలేదు నిజమే. లీగల్ ప్రొఫెషన్‌కి పోటీ పడలేదు నిజమే. యింకా పసివాడివి. కాని యేం అడ్డం వచ్చినా గానీ నిన్ను ఇన్వెస్టిగేటర్‌ని చేస్తాను. చూడు చెయ్యక పోతే" అన్నాడు.

లాస్కిన్ అప్పుడే గదిలోకి వచ్చాడు. ఆయన లాస్కిన్‌కేసి తిరిగి

"లాస్కిన్ నువ్వు తెలిసినవి. చెప్పు, నిజం చెప్పు. యితను పెద్ద కేసుల పరిశోధకుడౌతాడా అవడా?" అని అడిగాడు.

"నన్ను యిరుకున పెట్టేస్తున్నారు మీరు" అన్నాడు లాస్కిన్ చిరునవ్వు నవ్వుతూ. "నన్ను చూసి చెప్పలేరా అతను భేషుగ్గా అవుతాడని. అతనూ నాలాగా తొరొపేత్స్ వాడే. తొరొపేత్స్ వాళ్లు చెయ్యలేనిది లేదు, అలెగ్జాండర్ నేవ్‌స్కీ ఆ వూళ్లో పెళ్లి చేసుకున్న నాటినుంచీ" అన్నాడు.

ఆర్నెల్ల తర్వాత పరీక్షలయాయి. దెగ్త్యర్యోవ్‌గారు రీజినల్ కోర్టు సర్టిఫైయింగ్ కమీషన్ ఛైర్మన్. చాలా నిక్కచ్చి మనిషి. కుంగిపోయినట్టుంది ఆయన ముఖం. నిర్దాక్షిణ్యంగా నన్ను చిక్కులు పెట్టేశాడు. క్రిమినల్ కోడ్‌లో, లీగల్ కోడ్‌లో, లేబర్ కోడ్‌లో అన్ని అధ్యాయాలమీదా అడిగేడు. నేను జవాబులు చెప్తూ వుంటే గుర్రుగుర్రు మంటూనే వున్నాడు.

''యిదేం పిల్లాట కాదు బాబూ. యిప్పుడు ఇన్నోసెన్స్ ప్రిన్సిపుల్ అంటే యేమిటి, యెలా అమలు జరుపుతావు చెప్పు'' అని అడిగాడు.

''ప్రతివాది నేరం చెయ్యలేదన్న దానిమీద ఆధారపడి కోర్టువారూ, ఇన్వెస్టిగేటరూ ఆరంభమవాలి, యిదీ క్రిమినల్ న్యాయంలో ఇన్నోసెన్స్ ప్రిన్సిపుల్. అంటే తన నిర్దోషిత్వాన్ని అతనే రుజువు చేసుకోవాలని లేదు. కాని తగినంత సాక్ష్యం వుంటే ఇన్వెస్టిగేషన్ అతని నేరాన్ని రుజువు చెయ్యాలి. నేరం న్యాయపరంగా రుజువయే దాకా ఒక వ్యక్తి దోషికాడనే భావించాలి.''

''హుమ్... సరే, అదేం నువ్వనుకున్నంత తేలిగ్గాదులే. పిల్లల్ని యెలా విచారణ చెయ్యాలో చెప్పు.''

''పిల్లల్ని ఇన్వెస్టిగేటర్ ఒంటరిగా గాని లేదా తల్లిదండ్రుల సమక్షంలో గాని, సంరక్షకుల సమక్షంలోగాని విచారించాలి. పిల్లవాడినుంచి తను ఆశించే జవాబులు రాబట్టే లీడింగ్ క్వశ్చన్లని అడగకూడదు. పైగా నేరస్థుణ్ణి గురించి, అతని నడవడిక వేష భాషలు వగైరాల గురించి పిల్లవాడు చెప్పేదాన్ని శ్రద్ధగా వినాలి. పిల్లలు మహా పరిశీలనగా వుంటారు. వాళ్ల గ్రహణ శక్తి నిశితంగా వుంటుంది. పిల్లల్ని ప్రశ్నించేటప్పుడు వాళ్ళు పెద్దవాళ్లు అయినట్టే సీరియస్‌గా వుండాలి. చిన్న పిల్లల మాటలు వాడకూడదు. అలా అయితే పిల్లవాడు ముడుచుకు పోతాడు. యే బాలికైనా అత్యాచారానికి గురయితే ఆమెని ప్రశ్నించడం విషయంలో ఇన్వెస్టిగేటర్ బహు మెలకువగా ప్రశ్నలు అడగాలి. అత్యాచారం విషయం సూటిగా ప్రస్తావించకుండా అడగాలి. లేకపోతే మనస్తాపం కలగవచ్చు.''

''హుమ్, సరే బాగానే వుంది. నువ్వింకా చిన్న పిట్టవే అయినా నీకు ఇన్వెస్టిగేటర్ సర్టిఫికేట్ యిస్తున్నాం. ఎప్పటికీ గుర్తుపెట్టుకో: యెప్పుడూ నిబ్బరంగా వుండు. ప్రొసీజర్ 'ఇన్నోసెన్స్ ప్రిన్సిపుల్' పుస్తకాలు కంఠతా పడితే రాదు హృదయంతో గ్రహించాలి. యే వ్యక్తినైనా ప్రశ్నించడం నీకు నిత్యకృత్యం కావచ్చు కాని అతనికి మాత్రం జీవితాంతం మనసులో ముద్రపడిపోతుంది. గుర్తుంచుకో. పైగా యింకోటీ గుర్తుంచుకో, కేసులో తగిలిన మొదటి రూపమే సర్వదా సరైనదవాలని లేదు. దొంగల్నీ, హంతకుల్నీ, మోసగాళ్లనీ, నేరస్థుల్నీ ప్రశ్నించేటప్పుడు వాళ్లు కూడా యీ ప్రపంచంలో నీకులాగానే పుట్టారని యెన్నడూ మర్చిపోవద్దు, యిది చాలా ముఖ్యం. వాళ్లూ

మనంత మంచి పౌరులుగా అవచ్చు. యీ ఉద్యోగం పూలపాన్పు కాదు. యెప్పుడన్నా విసుగొచ్చినా, మనుషులమీద నమ్మకం తగ్గినట్టనిపించినా యిందులో వుండద్దు వాయనా వుండద్దు. ఒక్క రోజు కూడా వుండకు, యిక ఇన్వెస్టిగేటర్‌గా పనికి రానని చెప్పి రాజీనామా చేసెయ్యి.''

ఆ ముసలాయన అసాధ్యుడైన బొల్షెవిక్. జార్ రోజుల్లో రాజకీయ ఖైదీ. కోర్టులో ఆయన్ని యెంతో గౌరవిస్తారు. కాని ఆయన మాట పెళుసు. అందుకని ఆయనంటే భయం. చీల్చేసే తీర్పు చెబుతాడు. న్యాయవాదుల్లో యెవళ్లేనా తమ ప్రవర్తనలో బెసిగితే సహించలేడు. ఆయన రీజినల్ కోర్టు డిసిప్లినరీ కల్లీజియమ్ చైర్మన్ కూడా. ఆయన యీ ప్రశ్నలడగడం అయాక లేచి నాతో షేక్ హేండ్ చేసి, నాకేసి గుచ్చిగుచ్చి చూశాడు. చిరునవ్వు నవ్వేడు. అంతకు ముందు ఆయన నవ్వడం నేను చూళ్లేదు.

నేను బయటికి వచ్చేను. స్విర్లోవ్‌స్కీ, లాస్కిన్ కారిడార్‌లో వున్నారు. అటూ యిటూ పచారుచేస్తూ వున్నారు. మా ప్రియమైన గురువులకి యిది పెద్ద సస్పెన్స్‌గా వుంది. యిద్దరూ రీజినల్ కోర్టుకి హడావుడిగా వచ్చేరు. నా కోసం యెదురు చూస్తూ వున్నారు. ''గడ్డ'' పాయన్ని తిట్టుకుంటూ వున్నారు. వాళ్లు దెగ్త్యర్యోవ్ అలా పిలిచేవాళ్లు. తమ శిష్యుడి కుంకకి గడ్డు పరీక్ష పెట్టి ఫెయిల్ చెయ్యాలని ప్రయత్నిస్తున్నాడేమోనని తిట్టుకుంటూ వుండిపోయారు.

ఉప్పొంగిపోయి సంతోషంగా బయటికి వెళ్లిన నన్ను చూసి హమ్మయ్య అని తెరిపినబడి యెలా జరిగిందీ యేమిటీ అనీ, ''గడ్డం పులీ, మంద్రగబ్బ'' యెలా నన్ను వేధించిందీ చెప్పమనీ ప్రశ్నలతో ముంచెత్తేశారు.

అదే ''పులి'' తర్వాత నన్ను జాగ్రత్తగా కనిపెట్టే వున్నాడు, నేను లెనిన్‌గ్రాడ్ ట్రాన్స్ఫరు అయేదాకా. నాకు తెలీదు గాని నేను రీజినల్ కోర్టుకి పంపిన అన్ని కేసుల్నీ ఆయన చదివే వాడట. ఎక్కువగా నన్ను వాళ్లింటికి టీకి రమ్మని పిలిచేవాడు. అదే రకంగా యెగాదిగా చూస్తూ, నెరసిపోతూ వున్న గడ్డానికి చెయ్యి అడ్డం పెట్టుకుని దగ్గుతూ, సోవియట్ న్యాయ శాఖలో పని చేసేవాడికి కావాల్సిన ''టెన్ కమాండ్‌మెంట్స్‌నీ'' బోధిస్తూనే వుండేవాడు. ఆయన సీరియస్‌గా వుండే వాడైనా ఆయనంటే యిక నాకు భయం పోయింది. కోపంగా ఆయన దగ్గడం గాని, ఆయన గడ్డం గాని యిక నన్ను భయపెట్టలేదు. దయగల యీ తెలివైన వృద్ధుడు నాకు అర్థం అయాడు. ఆయన జీవితం కష్టభూయిష్టమైంది. నిజాయితీగా జీవించేడు. ఆయన్ని నేను యెన్నడూ మర్చిపోలేను.

ఆయన్ని గురించి నాకులాగానే అనుకున్న వాళ్లు చాలా మంది వున్నారు. కొన్ని యేళ్ల తర్వాత దెగ్త్యర్యోవ్ గుండె జబ్బువల్ల చనిపోయాడు. మొత్తం రీజినల్ కోర్టు అంతా ఆయన శవపేటిక వెనక వెళ్లింది. నా కళ్లల్లో నీళ్లు తిరిగాయి. స్విర్లోవ్‌స్కీ, లాస్కిన్‌ల కళ్లల్లో కూడా నీళ్లు తిరగడం నాకు కనిపించింది. అలాగే చాలా మందికీనీ.

కీర్తిశేషులైన డిసిప్లినరీ కల్లీజియమ్ చైర్మన్‌గారు ''చెవులు పిండిన వాళ్ళా'' వాళ్లల్లో చాలా మంది వున్నారు. అనేక తప్పులకి వాళ్లని ఆయన అలా దండించేడు. వాళ్లు కూడా ఆయన పోయినప్పుడు కంట తడిపెట్టారు.

అప్పుడే నా తప్పూ నాకు గుర్తొచ్చింది. అందుగ్గాను నేను డిసిప్లినరీ కల్లీజియమ్ ముందు హాజరవవలసివచ్చింది. నా ఉద్యోగానికి నీళ్లేనని అప్పుడు భయపడ్డాను — అదీ యీ ఉద్యోగం అంటే నాకు యిష్టం కలిగిన సమయంలో.

నా తొలి కేసుల్లో ఒకసారి యీ తప్పు జరిగింది. పాత కాలపు చిల్లు దినార్‌లని పట్టుకోవాల్సివచ్చిన కేసు అది. ఆ సందర్భంలో ''అడ్మిరల్ నెల్సన్''తో కలవడం వగైరాలు జరిగాయి. తమాషాగా బోధనాత్మకంగా వుండే ఈ సంఘటనని ''చిల్లు దినార్‌లు'' అనే కథలో వర్ణించాను.

* * *

సర్టిఫైయింగ్ కమీషన్ పరీక్ష పాస్ అయాక ప్రజా నేరపరిశోధకుడిగా నన్ను ఒరేహావొ-జూయెవొ పంపేరు. యీ మాస్కో సమీపంలో వో టౌన్లో ఆర్నెల్లు వున్నాను. మొదటి కేసులు పరిశోధించాను. అవి గుర్రాల దొంగతనాలు, ఓ సహకార సంస్థలో మోసం, భగ్న ప్రేమవల్ల జరిగిన ఆత్మహత్య, ఓ పల్లెటూరి పెళ్లిలో తాగుబోతుతనం వల్ల జరిగిన హత్య. దెగ్త్యర్యోవ్, స్పితోవ్‌స్కీ, లొస్కిన్‌లు బోధించిన ఇన్వెస్టిగేటర్ ''టెన్ కమాండ్‌మెంట్స్'' తు. చ. తప్పకుండా అనుసరించేవాణ్ణి: నిబ్బరంగా వుండడం ముఖ్యం, క్రాస్ ఎగ్జామినేషన్ కళ ప్రశ్నించడంలో యెంత వుందో వినడంలోనూ అంతే వుంది, మొదటి రూపమే నిజం కావాలనే నియమం లేదు, ప్రశ్నించేటప్పుడు యెవడికేనా కోణుకు పుట్టచ్చు, వాడు నేరస్థుడైనా కాకపోయినా. అలాగే యింకో విషయాన్నీ గుర్తు వుంచుకున్నాను. ఒకసారి దొస్తొయేవ్‌స్కీ యీ ముక్క అన్నాడు. అది నిజమే. వంద కుందేళ్లని కలిపితే గుర్రం అవుతుందా, అలాగే ప్రతివాది దోషాన్ని వంద చిన్న చిన్న సాక్ష్యాల తునకలతో నిర్మించినా అది తిరుగులేని సాక్ష్యాన్ని అందివ్వలేదు.

ఆర్నెల్ల తర్వాత అనుకోకుండా నన్ను మాస్కోకి బదిలీ చేశారు. మళ్లీ రీజినల్ కోర్టు ఇన్వెస్టిగేటింగ్ డిపార్ట్‌మెంట్‌కి వేశారు. కొన్ని రోజుల తర్వాత నా మొదటి తప్పు జరిగింది. నాకది చాలా ఆందోళన కలిగించింది, బాధ కలిగించింది. నగల వ్యాపారి విసోత్‌స్కీకి సంబంధించింది అది.

1924 వసంత రుతువులో వానగానూ, బురదగానూ వుంది. అప్పట్లో నేను మాస్కో నది అవలగా జాత్సెపాలో వుండేవాణ్ణి. నా ఆఫీసు స్రెతేన్‌స్కొవ్ వీధిలో. చాలా టైమ్ పట్టేది ఆఫీస్‌కి వెళ్లాలంటే. గాలోషెస్ (బూట్లకి పైన తొడుగులు)

అవసరమనిపించాయి. బాగా నదురుగా వుండే జతని కొన్నాను. ఎర్రటి జీర, లోపల లైనింగు వున్నాయి.

గొప్ప సరుకు కొనుక్కున్నానన్న గర్వంతో మర్నాడు ఆఫీసుకి వెళ్లాను. దివ్యంగా మెరిసిపోతూ వుండే గాలోషెస్‌ని ఓ మూల పెట్టాను. నా చిన్న ఆఫీసులో నేను పని చేసుకునే డెస్కు దగ్గర చేరాను. మధ్య మధ్యన ఆ మూలకి చూసేవాణ్ణి తల యెత్తి. యెంత గొప్ప ఐశ్వర్యం కదా అని మురిసిపోయాను.

అప్పుడు స్పితోవ్‌స్కీ యీ విసోత్‌స్కీ కేసులో పని చేస్తున్నాడు. ఆ నగల వర్తకుడు ఒక విదేశీ రాయితీ వర్తకుడికి వజ్రాలు కొనిపెడుతున్నాడనీ, వాటిని సరిహద్దులు దాటించి దొంగ రవాణా చెయ్యడానికి సాయపడుతున్నాడనీ సాక్ష్యం వుంది. యీ మనిషి నేర కార్యకలాపాలూ, సంబంధాలూ విషయమై సాక్ష్యం పోగు చెయ్యడంలో స్పితోవ్‌స్కీ చాలా శ్రమ పడుతున్నాడు. నగల వర్తకుణ్ని అరెస్టు చెయ్యడానికి వారంట్ సంపాదించగలిగినంత సాక్ష్యం వుంది. కాని స్పితోవ్‌స్కీకి అనేక యితర కేసులవల్ల తీరికలేకపోయింది. అందు కని విసోత్‌స్కీని పిలిపించి, క్రాస్ ఎగ్జామిన్ చేసి, అతనికి అరెస్ట్ వారంట్ చదివి విని పించి జైలుకి పంపించమని నాతో చెప్పాడు.

విసోత్‌స్కీని పిలిపించాం. అతను కచ్చితంగా టైమ్‌కి వచ్చాడు. నలభై యేళ్లుం టాయి అతనికి. కొంచెం పిచ్చి షోగ్గా కనిపించినా దర్జాగానే బట్టలు వేసుకున్నాడు. నోరంతా బంగారం కట్టుడు పళ్లే వున్నాయి. తియ్యటి నవ్వు నవ్వుతూ వున్నాడు. ఆ నవ్వు యిక శాశ్వతంగా అలానే వుండి, నిద్రలో కూడా అలానే వున్నట్టు వుంది.

అతన్ని క్రాస్ ఎగ్జామినేషన్ చెయ్యడం మొదలుపెట్టాను. అప్పర్ క్లాస్ వాళ్ల ధోరణి అని అనుకునేదాన్ని అనుకరించడం అతనికి యిష్టంలా వుంది. రెండు గంటలు ''దయచేసి యీ యదార్థం తమ దృష్టికి తీసుకురానివ్వండి'', ''తమరు అనుమతీ యిస్తే'', ''మిమ్మల్ని విసిగించ వుండా వుండేందుకు'', ''దీన్ని పరిగణనలోకి తీసుకునే టంత దయగలవారై''లాంటి పదబంధాల్తో నన్ను తోమేశాడు.

క్రాస్ ఎగ్జామినేషన్ పూర్తిచేసి క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ ఆర్టికల్ 145 మేరకి అతన్ని అరెస్టు చేస్తున్నట్టు వారంట్ యిచ్చాను. కొన్ని అసాధారణ సంద ర్భాల్లో నిందితుడికి హేతువులు చూపించక్కర్లేకుండా, రెండు వారాలకి మించనట్టుగా అరెస్టు చేసేందుకు యీ ఆర్టికల్ అవకాశం కలిగిస్తుంది. అతను అభ్యంతరాలు చెప్పేడు, నేను ఓపిగ్గా విన్నాను. తనకి ''మతిపోయింద''నీ, ''యెంతో నిర్ఘాంతపోయా''డనీ, ''మీరు గనక నన్ను చెప్పనిస్తే యీ విషయం శుద్ధ పొరపాటువల్ల జరిగిం''దని తను భావిస్తున్నాననీ, తన ''సర్వాత్మనా'' యిది త్వరలో విడిపోతుందని ఆశిస్తున్నాననీ అన్నాడు.

అంతసేపూ యీ జిత్తులమారి యీ ఆరితేరిన కంత్రీ చాలా కులాసా

గానే వున్నాడు. యేదోలాగ బయట పడచ్చని భావిస్తున్నట్టుంది. స్నితోవ్‌స్కీ సలహా మేరకి నేను మొత్తం సాక్ష్యం అంతా అందివ్వలేదు. అతన్ని అరెస్టు చెయ్యడానికి గల అసలు కారణాల్ని కావాల్సికే తొక్కి పట్టేను.

తన అరెస్ట్ వారంట్ చదువుకున్నట్టు విసోత్‌స్కీ సంతకం పెట్టేడు. నేను కేస్‌ని నా అల్మారాలో పెట్టి తాళం వేశాను. సిబ్బందినీ, జైలు వాన్‌నీ పిలవనంపమని ఎగ్జిక్యూటివ్ సెక్రటరీకి చెప్పడానికి వెళ్లాను. నేను సెక్రటరీ ఆఫీసులోకి వెళ్లేటప్పటికి అతను కిటికీ తీనెమీద నుంచున్నాడు. ఓ యెలక గదిలో పరిగెడుతోంది. ఎలకలంటే నాకే అసహ్యం. కాని అతని అరుపులు చూసి నాకు నవ్వొచ్చింది. ఫరవా లేదని అతనితో అనడం మొదలెట్టాను. ఎలక కన్నంలోకి పోయేదాకా అతను తీనె దిగలేదు. యేం చెయ్యాల్సిందీ చెపుతూ కొంత సేపు అక్కడ గడిపేను.

నేను నా గదికి తిరిగివచ్చేటప్పటికి విసోత్‌స్కీ లేడు, నా కొత్త గాలోషెస్‌లూ లేవు. చూడండి నాకు కలిగిన షాక్!

నా బల్లమీద ఓ నోట్ వుంది.

"నాలాంటి పెంపకం వున్న మనిషి మీ గాలోషెస్‌లని కొట్టేస్తాడని మీరు భావించరను కుంటున్నాను. బయట చాలా చెమ్మగా వుండడం మూలాన వాటిని బదులు తీసి కెడుతున్నానంతే మీకు కృతజ్ఞతలతోటే ననుకోండి, యేమంటే నా ప్రయాణం చాలా దూరం వుంది ఎదర. శుభాకాంక్షలు.

విసోత్‌స్కీ."

బిత్తరపోయి స్నితోవ్‌స్కీ దగ్గరికి పరిగెత్తేను.

ఆయన నోట్ చూసి, టెలెఫోన్ యెత్తి 'మూర్'*ని పిలిచాడు. యేమంటే విసోత్‌స్కీ ఉంపుడుకత్తె పేరు యింతకుముందు పట్టేడు స్నితోవ్‌స్కీ. ఈ విషయం విసోత్‌స్కీకి తెలీదు. యిప్పుడు ఆమె యింటిమీద ఓ కన్ను వేసి వుంచమని స్నితోవ్‌స్కీ 'మూర్'కి చెప్పాడు. మాస్కో వదిలివెళ్లే ముందు విసోత్‌స్కీ తన ప్రియురాలి దగ్గర సెలవు తీసుకునే వెడతాడని ఆయన బాగానే వూహించాడు. విసోత్‌స్కీ వివాహితుడు కాబట్టి తన ఉంపుడుకత్తె విషయం రహస్యంగా వుంచేడు.

స్నితోవ్‌స్కీ రిసీవర్ పెట్టేశాడు. నాకేసి తిరిగాడు.

"సరే, లేవ్, ఆ వెధవని అరెస్ట్ చేస్తారు, అందులో అనుమానం లేదు. కాని నీ

---

* మూర్ (MUR) — మాస్కో క్రిమినల్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో. — అను.

గాలోషెస్‌తో యీ విచారకరమైన అనుభవం నీకు గుణపాఠంగా వుండాలి. ఇన్వెస్టిగేటర్ అనేవాడు మహా చురుగ్గా వుండాలి అని నీకు తెలియాలి'' అన్నాడు.

ఆ సాయంత్రం 'మూర్' ఏజెంట్లు విసోత్‌స్కీని పట్టుకొచ్చేదాకా నాకు మనసు మనసులో లేదు. అతను వెళ్లి తన ప్రియురాలిని చూస్తాడని స్విరోవ్‌స్కీ బాగానే వూహించాడు. నా ఆఫీసుకి రాగానే యెప్పటిలాగానే తొణక్కుండా బెణక్కుండా ఆ నగల వర్తకుడు నా గాలోషెస్ విప్పుతూ శీఘ్రం అన్నాడు: ''క్షమించండి. కాని బయట చాలా చెమ్మగా వుంది. మీరేం అనుకోకపోతే చెప్తాను—అలాంటి వాతావరణం నాకు పడదు. మరో సారి—వెయ్యి క్షమాపణలు.''

నేను 1927 దాకా మాస్కోలో వున్నాను. తర్వాత నన్ను లెనిన్‌గ్రాడ్ రీజినల్ కోర్టులో సీనియర్ ఇన్వెస్టిగేటర్‌గా నియమించారు.

నాలుగేళ్ల తర్వాత నన్ను మాస్కోకి మళ్లీ బదిలీ చేశారు. పెద్ద కేసులకి ఇన్వెస్టిగేటర్‌గా వేశారు. 1935లో యు.ఎస్.ఎస్.ఆర్. ప్రాక్యురేటర్ ఆఫీసులో ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్‌కి ఛీఫ్‌గా వేశారు. 1950 జనవరి దాకా అక్కడ పని చేశాను. తర్వాత రచనా వ్యాసంగానికే అర్పితం కావాలని నిర్ణయించుకున్నాను.

ఆ రకంగా నేను క్రిమినల్ కేసుల్ని పరిశోధిస్తూ యిరవై యేడు యేళ్లు గడిపాను. నా రచనా విషయాన్ని యెంచుకోవడంలో యిది నిర్ణాయకమైన అంశం కావడం సహజమే. నా మొదటి కథ ''కిరిల్ లవ్రినేంకొ జీవితం'' 1928లో ''కోర్ట్సు ఇన్ సెషన్'' పత్రికలో ప్రచురితమైంది.

''అపరాధ పరిశోధకుడి నోట్సు''గా పేరు వచ్చిన దాంట్లోని మొదటి కథల్లో యిది ఒకటి. యీ నోట్సు ''ప్రావ్ద'', ''ఇజ్వేస్తియా'' పత్రికల్లో, యింకా కొన్ని పత్రికల్లో వచ్చింది. పుస్తక రూపంలో 1938లో వచ్చింది. యీ పుస్తకం మొదటి భాగం ఇన్వెస్టిగేషన్ పని రెండు చేతులా వున్నప్పుడు వచ్చింది. అప్పట్లో వెంట వెంటనే చేతిలో వున్న పని చూడాల్సివచ్చేది. కొన్ని కథలు, స్కెచ్‌లూ ముతగ్గా వున్నాయి. దొరికిన కాస్త కాళీ టైమ్‌లోనూ రాసినవి అవి. వాటిని గనక యిప్పుడు రాస్తే యింకా యెక్కువగా వాటిమీద కృషి చేసేవాణ్ణి. కాని అప్పట్లో వ్యవధిలేకపోయింది.

యీ పుస్తకాన్ని ప్రచురణకి సిద్ధం చేసేటప్పుడు నాకు కలిగిన మొదటి ప్రేరణ చాలా పాత కథల్ని తిరగరాయడం. తర్వాత వద్దులే యెలా వున్న వాటివి అలా వుంచేద్దాం అనిపించింది. దీనికి కారణం యేమిటైందీ చెప్పడం కష్టం. నా శారీరక, సాహిత్యపర యౌవనాన్ని అలానే వుంచెయ్యాలన్న సుప్త చేతనలోని కోరిక కావచ్చు—ఆ తప్పులూ, ఆవిష్కరణలూ, సంతోషాలూ, దుఃఖాలూ అన్నీ. యీ కథల్ని పాలిష్ చేసి వాటిల్లో వున్న నిజాయితీని ''తోసేస్తామేమో'' నన్న భయమూ కావచ్చు. తర్వాత పరిణత వయస్సులో చేసిన రచనలతో పోల్చి చూసుకోవడానికి ఆ కథలని అసలు అలాగే

దాచుకున్నాను, అదీ కారణం కావచ్చు. ఆ రకంగా రచయితగా నా పురోగతిని స్పష్టంగా చూడాలనిపించింది. లేదా యివన్నీ కలిపే కారణం కావచ్చు.

మొత్తంమీద మొదట్లో యెలా అచ్చయాయో అలానే యీ కథలన్నిట్నీ వుంచేశాను. ప్రతి దానికీ తారీకులు వేశాను. నిజ జీవితంలో యీ నేరస్థులు చాలా మంది శిక్షా కాలం పూర్తిచేసి నిజాయితీపరులైన పౌరులుగా మారడం వల్ల పాత్రల పేర్లు మాత్రం మార్చేను. వాళ్లంతా సుఖంగా వుండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటు న్నాను. గతానికి సంబంధించిన మరకల్నీ మచ్చల్నీ మళ్లీ చూపించి వాళ్లకి కళంకం కలి గించదలచుకోలేదు. గతాన్ని అలానే వదిలెయ్యాలి.

ఆ రోజుల్లో నేరానికి వ్యతిరేకంగా పోరాడేటప్పుడు ఒక దృక్పథాన్ని అనుసరించారు. రాటుదేలిన నేరస్థులని నిజాయితీపరులైన వాళ్లుగా, కష్టపడి పని చేసేవాళ్లుగా ''తిరిగి తయారు'' చెయ్యడం అనేదే ఆ దృక్పథం.

ఒక మనిషి సత్స్వభావాన్ని ఉద్దీప్తం చెయ్యడం ద్వారా, అతను నేరస్థుడైనాగానీ, సదవగాహనాబంధాన్ని స్థాపించుకోవడానికి ఖాయంగా ఉపయోగపడుతుందని నేరపరిశోధ కుడిగా నేను పని చేసిన కాలంలో గుర్తించాను. నేరపరిశోధకుడు అలాంటి బంధాన్ని యేర్పాటు చేసుకోలేకపోతే, పేషెంట్‌తో సంబంధంలేని డాక్టరు కచ్చితంగా రోగనిర్ధారణ చెయ్యలేనట్టుగానే, అతను నేరాన్ని ఫలవంతంగా నిర్ధరించలేడని నాకు అర్థమైంది. మానసిక సంబంధం అనే సిద్ధాంతం, దాన్నే నేను ''పరస్పర విశ్వాస పద్ధతి'' అంటాను, నేను యెన్నో యేళ్ల పరిశీలన ఫలితంగా నేర్చుకున్నాను. దాన్ని ఒక్క పూటలో సాధించడం జరగలేదనుకోండి. నా ఒక్కడి అనుభవంమీదా ఆధార పడే దాన్ని నమ్మకోనూ లేదు. నా సహోద్యోగుల కృషిని కూడా దృష్టిలో వుంచుకున్నాను. పాఠకుడికి యీ పుస్తకంలో నా సహోద్యోగుల పేర్లు చాలా కనిపిస్తాయి. నేరపరిశోధన దిశలో నా కృషికి సహకరించి, నాకు నేర్పినందుకు వాళ్లకి సోదర కృతజ్ఞతలు తెలియ చెయ్యడం నా కర్తవ్యంగా భావించాను.

పరస్పర విశ్వాస పద్ధతిని చాలా విశాలంగా వర్తింపచెయ్యవచ్చని నా నమ్మకం. బోధనకి యిది గట్టి మార్గం.

దొస్తొయేవ్‌స్కీ ''నేరమూ శిక్షా'' అన్న నవలని ప్రస్తావిస్తూ ప్రఖ్యాత రష్యన్ అపరాధ పరిశోధకుడు అకడమీషియన్ ఎ. కోని యిలా రాశాడు: ''ఆయన సృష్టించిన పాత్రలు కళాత్మక అనుభూతితో చిరస్థాయిగా వుంటాయి. పరమ ముతక, మబ్బు కమ్మిన, అందవిహీనమైన గుల్ల కింద వున్న ''సజీవ ఆత్మ''ని ఆవిష్కరించడానికి సమున్నత సామర్థ్యపు ఉదాహరణలుగా వాటికి మృతి లేదు. ఆ ఆత్మని ఆవిష్కరించడంలో యింతలో మెత్తగా వెలుగుతూ యింతలో తేజోవంతంగా మండుతూ వుండే సంధానజ్వాలని జాలి గొలిపేటట్టు వెల్లడి చెయ్యడంలోనూ....''

మన రోజుల్లో, మన సోషలిస్టు సమాజంలో, అకడమీషియన్ కోని చెప్పిన యీ మాటకి ప్రత్యేక అర్థం వచ్చింది.

విప్లవ ప్రతీఘాతంతో పోరాటంచేసే గడ్డు రోజుల్లో కూడా ఎఫ్. జెర్జిన్‌స్కీ పిల్లల కమ్యూన్‌లనీ, వర్క్ కాలనీలనీ, అనాథలైన పిల్లలకి హోమ్‌లనీ, శిక్ష అనుభవించే సంస్థల్లో పని ద్వారా పునర్ బోధన అనే వ్యవస్థనీ స్థాపించడానికి వ్యవధినీ సంకల్పాన్నీ కనపరిచేడు.

యీ మహత్తర సాంఘిక, మానసిక సమస్యలు ఎ. మకారెన్‌కో లాంటి వాళ్ళు రాసిన సుప్రసిద్ధ సోవియట్ రచనలకి ప్రేరణ యిచ్చాయి. ఆ పుస్తకాలు ప్రపంచాన్ని కుదిపాయి. బూర్జువా సాహితీ బృందాలు, బోధకులు, క్రిమినాలజిస్టులు కూడా వాటి పట్ల గౌరవ పురస్సరంగా ఆసక్తిని ప్రదర్శించి వాటిని పొగడ్డం జరిగింది. పూర్వపు నేరస్థులకి బోధించే యీ పద్ధతి ముఖ్యంగా కుర్ర నేరస్థుల్ని బాగు చేసే యీ పద్ధతి ద్వారా సాధించిన గణనీయమైన ఫలితాలని, గర్వంగా అభినందనాత్మకంగా పొగుడూతూ గోర్కీ చాలా సార్లు రాసేడు.

* * *

నేను గడిచివచ్చిన పథాన్ని సింహావలోకనం చేసుకుంటూ ఇన్వెస్టిగేటర్‌గా పని చేస్తూ నేను చూసిన వాటినీ, విన్న వాటినీ, తెలుసుకున్న వాటినీ నేను గుర్తు చేసుకుంటున్నాను. రచయితగా నాకు అవి యెంతో సహకరించిన విషయాలు. క్రిమినాలజిస్టుగా నేను పని చేసిన రోజుల్ని కృతజ్ఞతా భావంతో గుర్తుచేసుకుంటాను. నా రచనా విషయానికి, సన్నివేశాలకి, పాత్రలకి, కథాంశాలకి ఆ అనుభవం తోడ్పడినందుకు ఆ రోజులకి నేను రుణపడి వున్నాను.

యీ విషయాలలో నాకు అతిసన్నిహితంగా వుండేది నేరస్థుణ్ణి సరిదిద్దడం. నేరస్థుడెవడేనా గానీ సజీవుడై గాలి పీలుస్తూ, పరిశీలించి, ఆలోచించి ఆచరించే సామర్థ్యం వున్న వాడైనంత కాలం మన బృహత్తర, సుఖమయ సోవియట్ కుటుంబంలోకి తీసుకురావడానికి, మన వ్యవస్థలోకి తీసుకురావడానికి సమయం మించిపోలేదనేవా విశ్వాసం. అందుకు తగ్గ సహాయాన్ని అతనికి అందివ్వాలంతే.

యీ నోట్సు అలాంటి సహాయ పథంగా ఉపయోగ పడితే, నా పాఠకులు నా నమ్మకాలని పంచుకోగలిగితే, రచనా వ్యాసంగం అనే కష్టభూయిష్ట మార్గంమీద నా ప్రయాణం వృథాకాలేదని సంతోషిస్తాను.

చిల్లు దినార్‌లు

ఆసక్తికరమైన యీ కేసుని గురించి చెప్పే ముందు నా ఉద్యోగ జీవితం ఆరంభమైనప్పుడు జరిగిన సంఘటన వొకటి చెప్తాను. నాకు ఒక దొంగ చెప్పిన కథ అది. నమ్మకం అనేది నేరస్థుని హృదయంలో యెలాంటి వూహించని మార్పుని కలిగిస్తుందో నాకు తెలియజేసింది అది. ప్రస్తుతం చెప్పకుంటూ వున్న యీ నేరస్థుడు పొడగరి, దృఢగాత్రుడు. కొంచెం నిద్రమత్తుగా వుండే ముఖం. కాని అతని వృత్తిలో మామూలుగా వుండని జాలి ముఖం. అతని గుండ్రటి కళ్లు ప్రపంచాన్ని ఆశ్చర్యపడి చూస్తున్నట్టుగా వుండేవి. అతను అంతకు ముందే యెక్కువ సార్లు శిక్షలు అనుభవించాడు. ఆ అధో ప్రపంచంలోనూ, 'మూర్'లోనూ ''మోట మనిషి'' అని పేరు మోశాడు.

ప్రశ్నించడం పూర్తయిం తర్వాత అతను ఒక సిగరెట్ అడిగాడు. దాన్ని ముట్టించుకుని యిలా చెప్పాడు:

''పొగాకు బాగుందండో, సంభాషణా చక్కగా వుందండీ. ఉపకారానికి ఉపకారం చేసి బదులు తీర్చుకొమ్మన్నాడు. అంచేత మీరేం అనకపోతే నా జీవితంలో జరిగిన ఒక విషయం చెప్తాను. అలాంటిది చాలా వింత అని అంటాను.''

''అలాగే కానీ'' అన్నాను. ఆ మోటు మనిషి వున్నట్టుండి యిబ్బంది పడ్డట్టు కనిపించాడు. నాకు ఆశ్చర్యం కలిగింది.

''మీకు తెలిసినట్టుగానే నేనీ పనిలో చాలా కాలంగా వున్నాను'' అని ఆ మోటు మనిషి మాటమాటకీ మరింత సిగ్గుపడుతూ చెప్పాడు. ''కాని నేనెన్నప్పుడూ యెవర్నీ చంపలేదు, చంపబోను. నేను యెప్పుడూ రాత్రిళ్లప్పుడే నా వృత్తి సాగిస్తూ వుంటాను. యెవళ్లైనా వస్తారా అని చూస్తూ, ముఖ్యంగా ఆడమనుషుల కోసం చూస్తూ, ఓ మూల చీకటి గొందిలో పొంచి వుంటాను. దగ్గరికి వెళ్లి హలో అని పలకరించి ఆవిడగారి ఫర్ కోటో, గడియారమో, వానిటీ బేగో, యేదుంటే అది వదుక్కుంటాను. కాని యెప్పుడూ కూడా పెద్ద మనిషి తరహాగానే చేస్తాను. నేను సంస్కారవంతుణ్ణి గదా. నాకు సినిమాలంటే యిష్టమే కాని నీచత్వం భరించలేను. అది పాత ప్రపంచపు

ర్తేస్తు. అంచేత యెవళ్ల వొంటిమీదా చెయ్యి వెయ్యలేదని నేను అంటున్నానంటే మీరు నా మాట నమ్మాలి. నాకు లాంటి చేతులని అలాంటి పన్లకి ఉపయోగించకపోతే బాగుటుంది. మీరే చూడండి.''

అతను చిరునవ్వు నవ్వి కండపుష్టిగల పెద్ద అరిచేతిని ముందుకు చాచాడు. నిట్టూర్చి మళ్లీ మొదలెట్టాడు.

''అబద్ధం చెప్పడం యెందుకు, నా అంతరాత్మ నన్ను యెప్పుడూ క్షోభపెట్టలేదు. సామెత చెప్పినట్టు కాళ్లకి మట్టి అంటుకోకుండా హాయిగానే బతికాను, ఒకసారి ఒక చిన్న ఆడావిడ తగిలే దాకా.''

''ప్రేమ వ్యవహారమా?'' అని అడిగాను. భగ్న ప్రేమ గాథ వుంటుందేమోనను కున్నాను. యిలాంటి నేరస్థులు అలాంటి కథలు చెప్పగా అంతకు ముందు చాలా సార్లు విన్నాను.

''వుహు కాదు, నా అంతరాత్మ విషయం. దేవిచ్యె పోల్యె పక్క సందులో ఒకనాటి రాత్రి జరిగింది యీ సంఘటన. నంజాడు దొరుకుతుందని చూస్తూ నేను ఒక చీకటి మూల నుంచున్నాను. పొగమంచు రాత్రి. కటిక చీకటిగా వుంది. కనుచూపు మేరలో ఒక్క పురుగు లేదు. హఠాత్తుగా ఒక తలుపు ధనామని కొట్టుకోవడం వినిపించింది. ఓ యింట్లోనుంచి యెవరో అమ్మాయి బయటికి దూసుకుంటూ వచ్చింది. ఆమె నాజూగ్గా వుంది. చిన్న వయసుదే. ఫర్‌కోటు తొడుక్కుంది. చుట్టూతా వున్న చీకటి శూన్యం చూసి బెదిరి వుండచ్చునేమో మరి, కాలర్ పైకి యెత్తి పెట్టుకుంది. తనని యెవళ్లేనా వెంటాడుతున్నారేమోనని వెనక్కి చూస్తూ చూస్తూ పరిగెత్తడం మొదలుపెట్టింది. ఆమె హై హీల్స్ పేవ్‌మెంట్‌మీద టకటక కొట్టుకుంటున్నాయి. నక్క తోక తొక్కివచ్చాన్రా అనుకున్నా. ఆ ఫర్‌కోటుని జాతీయం చెయ్యడం నా వంతు అనుకున్నా. నేను గేట్లో నుంచి యివతలికి వచ్చి నేరుగా ఆమెకేసి వెళ్లాను. వూహించండి యేం జరిగిందో. ఆమె నా చేతిని టపక్కున పట్టుకుని, జాలిగా 'ఓ, మిస్టర్, యేమనుకోకండి, నాకు యెంత భయం వేసేసిందో. కను చూపు మేరలో ఒక్క పురుగూ లేదు. నన్ను యేదేనా బండి దాకా తీసికెళ్లరూ' అంది. నన్ను చీల్చి వుంటే బాగుండేది ఆమె. యేం జరిగిందో నాకింకా అర్థమవదు. నేను ఆమె మోచేతికి నా చెయ్యి మెలివేసి 'మరేం భయం లేదు, నేను వున్నా కాపాడ్డానికి' అన్నాను. 'మీ రుణం తీర్చుకోలేను. మీరు పెద్దమనుషులని తెలుసు నాకు' అంది. మేం నడిచాం. నా గుండె దడదడ కొట్టుకుంటోంది. నాకు ఆవేశంగా వుంది. నాకేం జరుగుతూ వుందో నాకు తెలియలేదు, కాని నా పనికి దిగలేకపోతున్నాను. నిజంగా, నమ్మండి. యెలాంటి పరిస్థితి! మొత్తంమీద ఆమెని స్లెడ్జి బండిలో యెక్కించాను. ఆమె యెక్కడానికి సాయం చేశాను. ఫర్ కోటుని సర్దికప్పి హాయిగా వెళ్లమని చెప్పాను. మనిషిలో నమ్మకం యెలాంటి పని చేయిస్తుందో చూడండి.''

''కాని తర్వాత కూడా చెయ్యి వాటం మానలేదుగా, మానేవా?'' అని అడిగాను.

''మూ(డోజుల దాకా అలాంటి పని చెయ్యలేకపోయాను. అప్పుడు మళ్లీ వెళ్లాను. కాని మీకు చెప్తున్నా నా లోపల యేదో బీట తీసినట్టయింది. ఆడవాళ్ల దగ్గర దోచుకో లేకపోయాను, మొహం మొత్తింది. నాలోనే నాకు నమ్మకం పోయి అధైర్యం వచ్చే సింది. యిప్పుడు నేను శిక్ష అనుభవించి బయటపడ్డాక యిక యిలాంటివి చెయ్యను. చాలు. ఆ రా(త్రి తుపాకీ దెబ్బ తగిలినట్టు దిమ్మెరపోయాను.''

అతని కళ్లల్లో ఒక విచార రేఖ కనిపించింది. అతను అన్నమాటమీదే వుంటాడని నాకనిపించింది.

అప్పట్లో నేను మాస్కోలోని (క్రాస్నయా (ప్రేస్న్యా పేటలో ఇన్వెస్టిగేటర్ పని చేశాను. నా కింద గోర్కీ వీధి మొత్తం వుండేది. (క్రాస్నయా (ప్రేస్న్యా ఆ పక్క వీధులు, గొందులు వుండేవి. 'మూర్' బల్షోయ్ గ్నెజ్నికోవ్స్కీయ్ వీధిలో వుండేది అప్పుడు. ఆ వీధి కూడా నా కిందే వుండేది. దాని వల్ల 'మూర్' సిబ్బంది చాలా మందితోటీ, ముఖ్యంగా మొదటి విభాగం ఛీఫ్ నికొలాయ్ ఓసిపొవ్‌తోటీ, ఆయన అసిస్టెంట్ గియోర్గీ తిల్నర్‌తోటీ నాకు సన్నిహిత స్నేహం కలిగింది. వాళ్లిద్దరూ ముప్పయ్యవ పడిలో వాళ్లే.

హత్యలూ, సాయుధ దోపిడీలూ పరిశోధించడం 'మూర్' మొదటి విభాగం పని. నేరపరిశోధక సంస్థకి యిదే గుండెకాయ. ఆ రోజుల్లో రాటుదేలిన నేరస్థులు యెంత మంది వుండేవాళ్లో గుర్తుచేసుకుంటే తెలుస్తుంది, మా మి(త్రులు రా(త్రింబగళ్లు యెంత తీరిక లేకుండా వుండేవాళ్లో.

వీళ్లిద్దరూ కూడా నిశితమైన నేరపరిశోధకులే. తమ కష్టభూయిష్టమైన ఉద్యో గాలంటే వాళ్లకి యిష్టమే. తమ పని బాగా తెలుసు వాళ్లకి. ఓసిపొవ్ సన్నగా వుండే వాడు. రాగి జుట్టు. యెప్పుడూ నీట్‌గా (డెస్ చేసుకునేవాడు. ఆయన చురుకైన బూడిద రంగు కళ్లల్లో తెలివితేటలు ఉట్టిపడేవి. మానవ స్వభావం గురించి ఆయనకి బాగా తెలుసు. అధోలోకపు మనుషుల మనస్తత్వం, వాళ్ల పరిభాష ఆయనకి తెలుసు. మోటార్ సైకిల్ బాగా తోలేవాడు.

నేను చాలా కు(రవాణ్ణి, అప్పుడే ఉద్యోగ జీవితం ఆరంభించిన వాణ్ణి కావడంతో వాళ్లతో నా స్నేహం సరదాగానూ వుండేది, లాభదాయకంగానూ వుండేది. వాళ్ల దగ్గ ర్నుంచి నేను బోలెడు నేర్చుకున్నాను. నేరాల గురించీ, (ప్రమాదాల గురించీ, నేరాల్ని కనిపెట్టడం గురించీ వాళ్లు చెప్పే కథలు ఉత్సాహంగా వినేవాణ్ణి.

ఓసిపొవ్‌గాని, తిల్నర్‌గాని యెవరేనా నేరస్థుణ్ణి విచారణ చేసేటప్పుడు నేను తర చుగా అక్కడ వుండేవాణ్ణి. వాళ్లు యేం మాట్లాడుకుంటున్నదీ మొదట్లో నాకు అర్థం అయేది కాదు. అధోలోకపు పదజాలం, వృత్తిపరమైన పదజాలం వాళ్లడిగే (ప్రశ్నల్లోనూ,

జవాబుల్లోనూ యెంతో వుండేది. దాంతోటి వాళ్లేదో పరాయి భాష మాట్లాడుకుంటు న్నారని నాకు అనిపించేది.

మాస్కో అధోలోకం జనానికి యీ యిద్దరూ బాగా తెలుసు. సామాన్యంగా నేర స్థులు 'మూర్' అంటే అసహ్యించుకున్నా ఓసిపొవ్‌నీ, తిల్నెర్‌నీ గౌరవంగా చూసేవాళ్లు. యిది వింతగా కనిపించవచ్చును గాని వాళ్లని ఒక రకమైన అభిమానంతో చూసేవాళ్లు. వాళ్లు నిజాయితీగా వుండేవాళ్లని ప్రతివాళ్లకీ తెలుసు. వాళ్ల ధైర్యం, నిష్పాక్షికత కూడా ప్రతి వాళ్లకీ బాగా తెలుసు.

అదీగాక యీ వింత ప్రపంచం గురించి బాగా తెలిసిన ఓసిపొవ్ ఖైదీల్ని అవ హేళనగా చూడ్డం గాని వాళ్లని అవమాన పరచడం గాని యెన్నడూ చెయ్యలేదు. ఆయన చట్టాన్ని తు. చ. తప్పకుండా అమలు పరిచేవాడు. ప్రత్యేక రాయితీలు యెన్నడూ యివ్వలేదు. అయినా యెప్పుడూ మనిషి సాటి మనిషితో మాట్లాడినట్టే వాళ్లతో మాట్లాడేవాడు, చాలా నేర్పుగా మాట్లాడేవాడు.

తిల్నెర్ మర్యాదైనవాడు, మంచి నడవడిక వున్నవాడు. అందంగా వుండేవాడు. ఆయన ధారణా శక్తి అద్భుతం. 'మూర్'లో వాళ్లన్నట్టు 'మొత్తం మాస్కో అధోలోకం ఆయన బుర్రలో వుండేది.' ఆయనకి దాదాపు అన్ని పుట్టు పేర్లూ, పెట్టు పేర్లూ పోలిక గుర్తులూ, మాస్కో నేరస్థులు గతంలో అనుభవించిన శిక్షలూ అన్నీ గుర్తే. యీ సంగతి నేరస్థులకి బాగా తెలుసు. ఆయనతో దొంగాట ఆడడానికి వీల్లేదు కాబట్టి 'బారన్ తిల్నెర్ దృష్టిలో పడకుండా తప్పించుకుని వుండడమే మెరుగని' అనుకునే వాళ్లు, అంటే తమతమ పోలికలకి సంబంధించి నంతవరకూ ఆయన కన్ను గప్పడం కుదరదని వాళ్ల అర్థం.

గోర్కీ వీధిని ఆనుకొని వున్న బ్లగొవెష్చెన్‌స్కీ సందులో ముచ్చటైన బిళ్లపెంకు గోడల యిల్లు ఒకటి వుంది. అందులో గవర్నమెంట్ ఆఫీసర్ల కుటుంబాలు వుండేవి. ఎన్. అనే ప్రజా కమిస్సార్ ఒకాయన అక్కడ కాపరం వుండేవాడు.

జూలై నెలలో ఎన్., ఆయన కుటుంబం వూరికి వెళ్లారు. ఒకనాటి రాత్రి దొంగలు ఆయన వాటాలోకి చొరబడి బోలెడు సామాన్లు దోచుకుపోయారు. అందులో పాత నాణేల వల్లువం కూడా ఒకటి. ఆయన ఆ నాణేల్ని చాలా కాలంగా పోగుచేస్తూ వున్నాడు.

పెద్ద గగ్గోలు లేచిపోయింది. దొంగతనాలని కనిపెట్టే బాధ్యత వున్న 'మూర్' రెండవ విభాగం దొంగని పట్టుకోవడం కష్టమనీ, పైనుంచి తిట్లు తినడం తప్ప యేమీ లాభం వుండదనీ గ్రహించింది. స్తెపానొవ్ రెండవ విభాగానికి హెడ్. ఆయనది ఎత్తరిగా రాజసం వుట్టిపడే విగ్రహం. మహా మర్యాదగా వుండే మనిషి. చాలా నేర్పు, కుశలత వున్నాయన. ఆయన యీ కేసు విషయం తెలిశాక మహా తల్లకిందులైపోయి క్రమం తప్పి అదనంగా వొక సిగరెట్ కాల్చేసాడు. (ఆయన జీవితం మొత్తం జాగ్రత్తగా

ఒక క్రమ పద్ధతిగా గడిచింది. యెప్పుడూ తొందర పడలేదు. తొందర పడ్డం ఆరోగ్యానికి మంచిది కాదని ఆయన ఉద్దేశం. ఆయన ఆరోగ్యాన్ని చాలా యెక్కువగా చూసుకునే వాడు. అధోలోకంలో ఆయన ''మందగమనుడు'' అనే పేరుతో బాగా తెలుసు.) ఆయన జాగ్రత్తగా కత్తిరించుకుని మెరుస్తూ వుండే గోళ్లకేసి చూసుకుంటూ తన అసిస్టెంట్ క్రోతొవ్‌ని ''యిది చెయ్యితిరిగిన దొంగతనం కదా, సాదాది కాదు, యేమంటావ్?'' అని మెత్తగా అడిగేడు.

క్రోతొవ్ బుద్ధికుశలుడు. అతను తన బాస్‌కేసి ఆశ్చర్యంగా చూసాడు. కాని పరిస్థితిని క్షణంలో గ్రహించాడు. (శిక్షా స్మృతి 108వ అధికరణం ప్రకారం సాదా దొంగతనాలని 'మూర్' పరిశోధించేది. చెయ్యితిరిగిన దొంగతనాల్ని పీపుల్స్ ఇన్వెస్టిగేటర్లు చూసేవాళ్లు). తన యావజ్జీవితంలోనూ యింతకంటే గొప్ప చెయ్యితిరిగిన దొంగతనాన్ని చూళ్లేదని అతను తన పిల్లలమీద ఒట్టుపెట్టుకుని అనేశాడు.

యిళ్లకి కన్నాలు వేసే ప్రత్యేక పనిముట్లతో యిళ్లల్లోకి దూరి చేసే దొంగతనాలు చట్టం ప్రకారం చెయ్యితిరిగిన దొంగతనాల కింద లెక్క. యిది అలాంటి కేసు కాదు. యేమంటే ఆ దొంగ లేదా దొంగలు కిటికీలోనుంచి దూరి లోపలికి ప్రవేశించారు. అంచేత ''కిటికీలు బద్దలుకొట్టిదూరే మనుషు''లనే తరగతి కిందకి అనుమానం లేకుండా వస్తారు. అందుకని క్రోతొవ్ అన్న మాటలకి అదోలా మొహం పెట్టాడు స్తెపానొవ్.

''162వ ఆర్టికల్‌లో వున్న చెయ్యితిరిగిన దొంగతనానికి ప్రత్యేకమైన క్రోతొవ్ వ్యాఖ్య వున్నట్టు యేమీ నాకు గుర్తులేదు. యిది కిటికీ వ్యవహారం నాయనా, కదా?'' అన్నాడు.

క్రోతొవ్ మధ్యలోనే ఆగేడు. కళ్లు వాల్చుకున్నాడు. కానీ లొంగలేదు.

''కావచ్చు, కాని వాళ్లు కిటికీని ప్రత్యేకమైన పనిముట్లతో తెరిచారు'' అన్నాడు అతను. ప్రముఖంగా తేటగా వుండే అతని కళ్లు ఛీఫ్‌గారిమీదే లగ్నం అయాయి.

"అలాగా? అదీ గుర్తురావడం లేదే. వేళ్లే ప్రత్యేకమైన పనిముట్లని రుజువు చేస్తే తప్పు, మిత్రమా'' అన్నాడు స్తెపానొవ్.

''దీంటో వేళ్లకేం సంబంధం లేదు. కిటికీని ఉలితో కొట్టి, గడియ బద్దలు చేసి తీసినట్టు దాఖలాలు వున్నాయి. బద్దలు కొట్టడానికి ప్రత్యేకమైన పనిముట్లు వున్నాయి'' అన్నాడు క్రోతొవ్ ఉద్రేకంగా.

''నిజమా? చాలా చెడ్డది. యిలాంటి సరదా అయిన కేసుని వదులుకోవడం సిగ్గు చేటే. కాని ముందు చట్టం కదా'' అన్నాడు స్తెపానొవ్. క్రమం తప్పి యింకో సిగరెట్ ముట్టించాడు. యీ సారి కొంచెం తేలిక పడినందుకు. ''లేదు, నేస్తం మనం చెయ్యగలిగిందేమీ

లేదు. యీ కేసుని ఆర్టికల్ 108 ప్రకారం పీపుల్స్ ఇన్వెస్టిగేటర్‌కి పంపెయ్యి. కాగితాలు తయారు చెయ్యి'' అని పురమాయించాడు.

మర్నాడు నాకు వచ్చింది యీ కేసు. మంచి పదగుంఫనతో వున్న నోట్ ఒకటి జోడించి వుంది దీనికి. ''ఉలి లాంటి ప్రత్యేక పనిముట్లని వాడడం అనేదాన్ని కిటికీని పరిశీలించిన మీదట నిర్ధరించగల''మనీ ''కిటికీ గడియని బద్దలు కొట్టిన రీతిని చూస్తే యిళ్లకి కన్నాలు వేసే ప్రత్యేక చిహ్నాలు కనబడతాయి, కాబట్టి దాన్ని దీనికి సాక్ష్యంగా చూపించడం జరిగిందనీ'' క్రోతొవ్ ఉత్సాహంగా ఉద్రేకంగా వర్ణించాడు.

నాకా కేసు అందిన ఓ గంట తర్వాత స్త్రెపనొవ్ ఫోన్ చేసి నా పనెలా వుందనీ, ఆరోగ్యం యెలా వుందనీ మహా మర్యాదగా కుశల ప్రశ్నలడిగాడు. వాతావరణం బాగుందని మెచ్చుకున్నాడు. తల్యానా బాఖ్ ''క్వీన్ ఆఫ్ జార్‌దాన్''లో పాట బాగా పాడిందని మెచ్చుకుని, నన్ను కూడా వెళ్లి చూడమని గట్టిగా సలహా యిచ్చేడు. తర్వాత ఆఖర్న యధాలాపంగా అడిగినట్టు యీ కేసు విషయం అడిగాడు.

''ఆఁ, యింతకీ, మేం మీకో చిన్న కేస్ పంపాం. అది మాది కాదు. ముందు చట్టాన్ని పాటించాలి కదా. మీకు యే సాయం కావాల్సివచ్చినా మేం చేస్తాం అనుమానం వద్దు. యీ కేసుని మీరు తీసుకుంటున్నట్టు నాకు నోట్ పంపించగలరా? మా రికార్డుల కోసం లెండి అది. క్రోతొవ్‌ని పంపిస్తా దానికోసమన్చెప్పి'' అన్నాడు.

వెర్రిబాగుల వాణ్ణి, నాకు తెలీలా యీ తెలివైన ''మందగమనుడు'' నా నెత్తి మీద యేం రుద్దిందీనీ. దాంతోటి క్రోతొవ్‌కి వాళ్లడిగిన నోట్ యిచ్చేశాను. చిత్రం చూడండి, ఆ నోట్ కోసం అతగాడు ఆఘమేఘాలమీద వచ్చేశాడు.

ఆ మర్నాడు పొద్దున్న అంతా తేటతెల్లమైంది. రీజినల్ ప్రొక్యురేటర్ షెవెర్‌దిన్ తక్షణం నన్ను తన ఆఫీస్‌కి రమ్మనమనీ, బ్లగొవెష్చెన్‌స్కీ సందులో జరిగిన దొంగతనం కేసుని తీసుకురమ్మనీ ఫోన్ చేశాడు. ఆయన పెద్దాయన. తెలివైన వాడు. జాలి గుండె మనిషి. జార్ ప్రభుత్వం కింద రాజకీయ ఖైదీగా వున్నాడు.

బయల్దేరే ముందు నేను జాగ్రత్తగా కేస్‌ని చూశాను. చెయ్యితిరిగిన దొంగతనం ఆధారాలు యెంత వుఫ్ అంటే యెగిరిపోయేటట్టు వున్నాయో అప్పుడు గమనించాను. కాని చేసేదేముంది! కేసుని నేను తీసుకుంటున్నట్టు నిర్ణయం అయిపోయింది. తోడేలు మేక పిల్లని యెత్తుకుపోయినట్టుగా క్రోతొవ్ నా సంతకంతో నోట్‌ని అంకించుకుని పోయాడు. దాంతోటి నా కాళ్లూ చేతులూ కట్టేసినట్టయిపోయింది.

షెవెర్‌దిన్ నేను చెప్పింది విని, కేసుని చదివాడు. అప్పటికది తయారైంది. ముఖ్యంగా 'మూర్' దాన్ని నాకు యెలా అందజేసిందీ పత్రాలు వున్నాయి. ఆయన చిరునవ్వు నవ్వాడు.

''సరే బాగానే వుంది. చాలా సరదాగా వుంది. స్త్రెపనొవ్ తెలివితక్కువ వాడు

కాదు. తన చేతులు కడిగేసుకున్నాడు. నూనూగు మీసాల కుర్రాడివి, పరిగెత్తి వెళ్ళి పట్టేసుకున్నావు. నువ్విప్పుడు కులాసాగా వుండే వయసు వాడివి, కాని యీ వయసే ప్రమాదకరమైంది. నువ్వప్పుడే యేం చెయ్యాల్సిందీ నేర్చుకున్నావు కాని యేం చెయ్యకూడదో నేర్చుకోలేదు. స్త్రైపానొవ్ రెండింటినీ నేర్చుకున్నాడు, ముఖ్యంగా రెండో దాన్ని. యిప్పుడు మనం యేం చెయ్యాలి? కిటికీల్లోనుంచి దూరే దొంగని పట్టుకోవడం దాదాపు అసాధ్యం. ఎస్. బుసకొట్టేస్తున్నాడు, ఆంబోతులాగా రంకెలు వేస్తున్నాడు. మనం ఆయనకి రిపోర్టు యివ్వాలని గొడవ చేస్తున్నాడు. మరి మొదలెడదాం, బాబూ. నాకు శుభం కనిపించడం లేదు. దెబ్బతిన్న వాడి స్వభావం నాకు బాగా తెలుసు.''

మేం ఎస్.గారి ఆఫీసుకి వెళ్ళాం. యీ కేసుని చూస్తున్న ఇన్స్పెక్టర్నని షెవెర్దిన్ నన్ను ఆయనకి పరిచయం చేశాడు. ఎస్. పొట్టిగా, లావుగా వుంటాడు. జుట్టు నెరుస్తోంది. ఆయన మహా చిరాకు పడిపోయాడు.

''హుఁ, యితనేనా ఇన్స్పెక్టరు?'' అని గంయ్మన్నాడు. ''నాకిప్పుడు అర్థమైంది ప్రజా కమిస్సార్ల యిళ్ళల్లోకి నానా రకాల దొంగలూ యెందుకు తలుపులు బద్దలు కొట్టి దూరతారో, పట్టుబడకుండా పోతారో! కామ్రేడ్ షెవెర్దిన్ మీరు కిండర్ గార్టెన్ నడుపుతున్నారా, ప్రాక్యురేటర్ ఆఫీస్ నిర్వహిస్తున్నారా?'' అని అడిగాడు.

షెవెర్దిన్ మర్యాదగా, కాని చాలా హుందాగా, జవాబు చెప్పాడు. నేను చిన్న వాణ్ణి అయినా గానీ వర్ధమాన పరిశోధకుణ్ణి అనీ, బాగా పని చేస్తాననీ చెప్పాడు. కమిస్సార్ ప్రశ్నకి సంబంధించి ఆయన ఇన్స్పెక్టర్లు యెంత వయసు వాళ్ళైందీ తను అడగదలచుకోలేదనీ చెప్పాడు.

ఎస్. చిందులు తొక్కేసేడు. నేరస్థులని గనక మూ్రడ్రోజుల్లో పట్టుకోకపోతే ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తానని అరిచాడు. మిగతా వస్తువులు పోతే తనేం ఖాతరు చెయ్యడనీ, తను పురాతన నాణేలని పోగు చేసేవాడనీ, వాటిని పోగు చెయ్యడానికే తన యావజ్జీవితం వెచ్చించాడనీ చెప్పాడు. తన అమూల్యమైన సేకరణలో అలెగ్జాండ్ర్ ది గ్రేట్కి చెందిన చిల్లు దినార్లు వున్నాయనీ, అదేం తమాషా కాదనీ అన్నాడు. రీజినల్ ప్రాక్యురేటర్ అలసత్వం యేమిటో తనకి అర్థం కావడం లేదనీ, అప్పుడే పొత్తిళ్ళల్లోనుంచి బయటపడి పిడికిలి తెరిచిన పరిశోధకులంటే తనకి మామూలుగా నమ్మకం లేదనీ, అంచేత మూ్రడ్రోజులకి మించి వ్యవధి యివ్వడం లేదనీ అన్నాడు. ఆ క్షణంనుంచీ లెక్కపెట్టి అట, మూ్రడ్రోజులూనూ.

షెవెర్దిన్ కూడా వేడెక్కిపోయాడు. కాని కుర్ర పరిశోధకుడి ముందు సంభాషణ కొనసాగించడం అసంభవంగా వుంటుందని చూసి నన్ను బయట నుంచోమన్నాడు. అరగంట తర్వాత బయటికి వచ్చాడు. కోపంతో జేవురించుకుపోయాడు. నన్ను తన ఆఫీసుకి లాక్కుపోయాడు.

ఎన్. ''పెత్తాందారీ తనాని''కీ, ''సోషలిస్టు వ్యతిరేక పొగరు మోత్తనాని''కీ దారిలో ఆయన్ని దుమ్మెత్తి పోశాడు. నిజమే, కొన్ని యేళ్ల తర్వాత బాధ్యతాయుతమైన ఉద్యోగాలకి అనర్హుడని చెప్పి ఎన్.ని ప్రజా కమిస్సార్ ఉద్యోగంనుంచి తొలగించారు.

మనసులో నక్కజిత్తుల స్తెపానొవ్‌నీ నా హ్రస్వదృష్టినీ తిట్టుకున్నాను. ''మీరు చూసినట్టుగా తలుపులు బద్దలు కొట్టి యిళ్లల్లో దూరే దొంగతనాలు మహాకష్ట మైనవి. పరిష్కారమైన కేసుల శాతం చాలా తక్కువ. పరిశోధకుడిగా నా చేతిలో డిటెక్టివ్‌లూ లేరు, నాకు పరిచయాలూ లేవు, ఒట్టి సిద్ధాంత రీత్యా నాకుగా యీ కేస్‌ని పరిష్కరించలేను'' అని వణుకుతో నత్తుతూ షెవెర్‌దిన్‌తో అన్నాను.

నేను 'మూర్'కి వెళ్లి యీ ముదనష్టపు కేస్‌లో సాయం చెయ్యడానికి స్తెపానొవ్ తన బలగాన్నంతట్నీ సమాయాత్తం చేసేటట్టు చూడాలని నిర్ణయించాం.

వృధా ప్రయత్నం! నేను ఆయనతో మాట్లాడినప్పుడు ఫలితం అనుకూలంగా వుంటుందని తనకి యేమీ నమ్మకం లేదని ఆయన నిర్మోహమాటంగా చెప్పేశాడు.

''చూడండి బాబూ, మీరు అర్థం చేసుకోవాలి. యిది కిటికీ వ్యవహారం. దొంగతనం చేసిన వాడికి యెవళ్ల యింట్లో చొరబడుతున్నదీ తెలీదు. రాటుదేలిన నేరస్థుడు ఆ యింట్లో చచ్చినా అడుగుపెట్టడు. వాడెవడో కొత్తగా గజ్జెకట్టి వుంటాడు వ్యసనంగా అపరాధాలు చేసేవాడు కాదు. మీరు వాణ్ణి యెన్నటికీ కనిపెట్టలేరు. కేస్‌ని మీ వొళ్లో పడేసే ముందు క్రోతొవ్, నేనూ అన్నీ కూలంకషంగా ఆలోచించాం'' అన్నాడు.

తియ్యగా, మహా సానుభూతిగా వుండే చిరునవ్వుని యీ మాటలకి జోడించాడు స్తెపానొవ్.

నీరసించిపోయి నా మొదటి విభాగం మిత్రుల్ని చూడ్డానికి వెళ్లాను. నన్ను వివరంగా ప్రశ్నించి ఓసిపొవ్ తల ఆడించి ''మందగమనుడు తస్సగొయ్య! యెప్పుడూ యెవళ్లనో యిరికిస్తూనే వుంటాడు తన చేతులకి మట్టి అవకుండా'' అన్నాడు.

మొదటి విభాగంలోని కుర్రాళ్లకి స్తెపానొవ్ అన్నా, ఆయన కుయుక్తులన్నా యిష్టం లేదు. నేను యిబ్బందుల్లో వున్నాననీ, నాకు సాయం చెయ్యాలనీ ఓసిపొవ్ అనుకున్నాడు. కాని యీ కేసు వట్టి పనికి మాలిన వ్యవహారం అని అనుభవజ్ఞుడైన ఇన్‌స్పెక్టర్‌గా ఆయనకీ తెలుసు. ''నిజమైన, వృత్తి దొంగ'' ప్రజా కమిస్సార్ యింట్లోకి చొరబడ్డనీ, ప్రాణం పోయినా అలా చెయ్యడనీ స్తెపానొవ్ అభిప్రాయంతో ఆయనా యేకీభవించాడు.

''నీకు యెలా సాయం చెయ్యాలో నాకు తెలీటం లేదు నాయనా. వున్న పరిస్థితిని బట్టి చూస్తే ఆ పాత నాణేల్ని పోగుచేసే ఆయన నిన్ను మనశ్శాంతిగా వుండనిచ్చేటట్టు లేదు. యిలాంటి వాళ్లతో యిరుక్కోవడం కంటే అధ్వాన్నం అయింది మరోటి లేదు.

వాళ్లంతా పిచ్చి పట్టుతో వుంటారు. చిల్లుల దీనార్లు! చిల్లులు లేకపోయినా కలిసొచ్చేదీ లేదు, యింకా అయితే చిల్లులవల్ల అదృష్టం పోయిందేమో కూడా.''

ఆ సమయంలో ఓసిపొవ్ సెక్రటరీ లోపలికి వచ్చి ఒదేస్సనుంచి వచ్చిన కోడెడ్ మెస్సేజ్‌ని అందించింది. ఆయన ఆ టెలెగ్రామ్‌ని చదివి, ఆలోచనలో పడ్డట్టు కనిపించాడు. హఠాత్తుగా ఆయన ముఖం వెలిగింది. టెలెగ్రామ్‌ని నాకు అందించాడు. అసాధ్యమైన పరిస్థితిలో అనుకోకుండా ఆశా కిరణం గోచరించిన వాడిలా కనిపించాడు.

''చదవ్వయ్యా బాబూ. యీ కేసుతో దీనికేదో సంబంధం వుంది. నీకు సుడి వుందిలే'' అన్నాడు.

నేను టెలెగ్రామ్‌ని లటక్కున అందుకున్నాను. రెండు సార్లు చదివాను. కాని అంతకు ముందున్న దానికంటే అదృష్టం యేమీ పెరిగినట్టు కనిపించలేదు.

> '' 'మూర్' ఛీఫ్ యెమెల్యానొవ్. 'అడ్మిరల్ నెల్సన్' యివాళ మొదటి తరగతి స్లీపింగ్ కార్‌లో మాస్కో ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణం అయివెళ్లాడు. బహుశా యేదో సీరియస్ టూరే అయివుండాలి. కిందటేడాదే క్షమాదానం కింద వదిలిపెట్టడం జరిగింది. అతన్ని అరెస్టు చెయ్యడానికి తగ్గ కారణం లేకపోయింది. విప్లవాత్పూర్వపు మారు పేర్లు: జాన్‌స్త్రెజెబ్‌స్కీ, రోమానేస్కు, షుల్జ్.
>
> ఒదేస్స ఇన్వెస్టిగేషన్ బ్యూరో ఛీఫ్ నికొలాయెవ్''

అని వుంది అందులో.

''చిల్లుల దీనార్‌లకీ దీనికీ యేమిటి సంబంధం?'' అని అడిగాను బెరుగ్గా.

''బోలెడు వుందిలే. నాకు 'అడ్మిరల్ నెల్సన్' బాగా తెలుసు. ఇనప్పెట్టెలు బద్దలు కొట్టేవాళ్లల్లో అతన్ని మించిన వాడు లేడు, — ప్రస్తుతం బతికున్న వాళ్లల్లో. జారిస్టు రోజుల్లోనే జీవితం మొదలుపెట్టాడు. యూరప్‌లో అందరికీ తెలుసు. ది లాస్ట్ ఆఫ్ ది మోగికాన్స్ అనవచ్చు. అధోలోకంలో రాజు. అతని మాట సుగ్రీవాజ్ఞ. అతను మనకి సాయం వస్తాడు. రేపు ఉదయం యిక్కడికి రా. అతన్ని స్టేషన్‌లో కలుసుకుందాం'' అన్నాడు.

మర్నాడు పొద్దున్నే కీయెవ్ స్టేషన్‌కి వెళ్లాం. ఒదేస్స మాస్కో ఎక్స్‌ప్రెస్ కోసం చూశాం. రైలు ప్లాట్‌ఫాంమీదకి రాగానే మొదటి తరగతి స్లీపింగ్ కార్ దగ్గరికి వెళ్లి 'అడ్మిరల్ నెల్సన్' కోసం యెదురు చూశాం. అతను దిగాడు. గడ్డి టోపీ పెట్టుకున్నాడు. ఖరీదైన రెయిన్ ప్రూఫ్ కోట్ చేతిమీద వేసుకున్నాడు. చేతిలో నదురుగా

కనిపించే పేం బెత్తం వుంది. దానికి దంతంతో చేసిన సింహం తల పిడి వుంది. 'అడ్మిరల్' వడి వయస్కుడు. బక్క పల్చగా వున్నాడు. యెర్రటి తల. ఒంటి కన్ను. నవ్వుతూ, స్థైర్యంగా వున్న కన్ను. రెండో కంటిమీద నల్లని సిల్కు గుడ్డని పట్టీలాగా కట్టేడు. అతన్ని చూస్తే వ్యాపారం మూడు పువ్వులూ ఆరు కాయలూగా వర్థిల్లే వ్యాపారస్థుడనో, సిద్ధహస్తుడైన నౌక కేప్టెన్ అనో, విదేశీ వర్తకుడనో రష్యా ఫిల్ము స్టూడియో సీరియల్స్‌లోని అంతర్జాతీయ విలన్ అనో అనుకుంటారు.

"హల్లో అడ్మిరల్, రాజధానీ నగరానికి స్వాగతం" అన్నాడు ఓసిపావ్.

"యేమిటి ఓసిపావ్‌గారా? యిలా వచ్చేశారేమిటి?" అని 'అడ్మిరల్' సంతోషంతో అరిచి గట్టిగా షేక్ షేండ్ చెయ్యడం మొదలుపెట్టాడు. ఆ షేక్ షేండ్ యివ్వడం చూస్తే దాని కోసమే రాత్రంతా నిద్రలేకుండా పడిగాపులు పడి వున్నాడన్నట్టు అనిపిస్తుంది. "మీరు యింత కాలం యెక్కడున్నారు? అయితే ఇన్వెస్టిగేషన్‌లో కుర్రాళ్లు నా రాక గురించి వూదారన్న మాట. బిజీమేన్‌ని యాతన పెట్టడం తప్ప వాళ్లకి వేరే పని లేదా యేమిటి? అయ్యొయ్యో... నేను వుత్త చేతుల్తో వచ్చాను, దిసమొల చంటి బిడ్డలాగా. ఓ సంచీ లేదు, సరంజామా లేదు. వూఁ, అయితే వాళ్లు యేం బెకబెక లాడుతున్నారో? నేను వూరికే యే మార్పు కోసం యిక్కడికి వచ్చాను. ఖైదు తర్వాత కాలు సాగదీసుకుందామని. కాని యిక్కడ మిమ్మల్ని యిబ్బంది పెడుతున్నారు. ఓ రకంగా మంచిదే లెండి, వాళ్లకి థేంక్స్ చెప్పాలి. మిమ్మల్ని చూస్తే అవకాశం కల్పించారు" అన్నాడు.

"అడ్మిరల్, మీతో చర్చించాల్సిన సీరియస్ విషయం ఒకటుంది. కాస్త మనం మాట్లాడుకోగలిగే చోటుకి పోదాం" అని ఓసిపావ్ అతని మాటలకి అడ్డం వెళ్లేడు.

"ఒదేస్సలో వాళ్లు అన్నట్టు 'పోలీసాయన కూర్చో అన్నప్పుడు నుంచోవడం మర్యాద కాదు', ఆఁ" అని చిరునవ్వు నవ్వుతూ అన్నాడు 'నెల్సన్'. "పదండి ఓ బీరు కొట్టి మాట్లాడుకుందాం. యీ ముచ్చటైన కుర్రాడెవరు?" అని అడిగాడు, నాకేసి చూపిస్తూ.

"నాకు స్నేహితుడు. యిదంతా యేమిటైందీ అతనికి తెలుసు."

రెస్టారెంట్‌లోకి వెళ్లాక చిల్లుల దీనార్‌ల గురించి ఓసిపావ్ చెప్పింది శ్రద్ధగా విన్నాడు 'అడ్మిరల్.' అతనికి అరికాలిమంట తలకెక్కిపోయింది.

"యీ మీ రాజధానిలో యేం జరుగుతోందంట? మాస్కో దొంగలు దిగజారిపోయారు. ఆఁ! యెన్ని గుండెలు! ప్రజా కమిస్సార్ యింట్లోకి చొరబడ్డం! వున్న నేవ్‌మన్‌లూ, ప్రైవేటు ఆఫీసులూ, ఫారెన్ సంస్థలూ చాల్లేదటనా వీళ్లకి? వుహు, లేదు, వాళ్లు సోవియట్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా చెయ్యి యెత్తుతున్నారు. సోవియట్ పౌరుడిగా నే చెప్తున్నా, యిది ప్రతీఘాత విప్లవం. ఓసిపావ్‌గారూ, మీకు తెలుసు నా "క్రి

కులమ్ విటాయె''*, నాకు లాటిన్ అంత బాగా రాదు, మరి యిదేనో యేమిటో. మీకు అన్నీ తెలుసు. మిమ్మల్ని అడుగుతున్నా: 'అడ్మిరల్ నెల్సన్' యెన్నడన్నా ఒక్క ప్రభుత్వ ఇనస్పెక్టెని గాని, సహకార సంస్థ ఇనస్పెక్టెని గాని మహత్తర అక్టోబరు విప్లవం తర్వాత ముట్టుకున్నాడా?''

''లేదు. ఒక్క దాన్ని కూడా. అది వాస్తవమే'' అని ఓసిపావ్ అంగీకరించాడు.

''వాస్తవమా? వాస్తవం కాదు. యిది ప్రపంచ దృక్పథానికి సంబంధించిన సమస్య. నా ప్రొఫెషన్. వినండి, బాబూ, మీరు కుర్రాళ్లు యిప్పుడే గడపలో కాలుపెట్టారు. మీకిది ఉపయోగం. నా ప్రపంచ దృక్పథం. యీ నా చేతులు చూడండి: 1913లో వియన్నాలో జరిగిన క్రిమినాలజిస్టుల ప్రపంచ మహాసభలో బెర్లిన్ పోలీసు ప్రెసిడెంట్ అద్భుతమైన ఫెనామెనా అన్నాడు. విన్నారా ఆయనేమన్నాడో: 'మె డియర్, దిసీజ్ వండర్‌ఫుల్ అండ్ ఆర్టిస్టిక్' యీ చేతులు యెప్పుడేనా ఒక సేవింగ్స్ బేంక్‌మీద గాని, స్టేట్ బాంక్ రూరల్ బ్రాంచీమీద గాని పడ్డాయా? పాపం శమించుగాక! నేనెప్పుడు నాకు నేనే అనుకుంటా: 'ప్రజల సొమ్ము ఒక్క పైసా తీసుకునేకంటే యీ చేతుల్ని నరికేసుకో'. అందుకనే యిప్పుడు నాకంత కోపంగా వుంది'' అన్నాడు.

''ఆ విషయం మనం నిర్ణయిద్దాం అడ్మిరల్'' అన్నాడు ఓసిపావ్ కోపంగా సాగే అతని వాగ్ధాటిని అడ్డగిస్తూ.

'అడ్మిరల్ నెల్సన్' భావగర్భితంగా ఆయనకేసి చూసి శాంతమైన స్వరంతో

''నా సూత్రాలు మీకు తెలుసు కదా. యింకోలా చెప్పాలంటే మీకా నాణేలు తిరిగి వస్తాయి, మనిషి కాదు సరేనా?'' అన్నాడు.

''సరే'' అన్నాడు ఓసిపావ్ పెద్ద ఒప్పందం కుదుర్చుకునే వాటాదార్లు పవిత్రమైన ఒడంబడికకి వచ్చినట్టు ఘనంగా లేచి నుంచున్నాడు.

ఓసిపావ్ టెలిఫోన్ నంబరు రాసుకుని ''రాజకీయపు టెత్తు వేసి అల్టిమేటం యివ్వడానికి'' తగ్గ వ్యక్తుల్ని కలుసుకుంటానని మాట యిచ్చి 'అడ్మిరల్' వెళ్లిపోయాడు. తర్వాత మేం కారు యెక్కాం. 'మూర్' దగ్గరికి వెళ్లాం.

''యీ ఒదేస్స వాడు యేమన్నా చెయ్యగలడంటారా?'' అని ముఖం ముడుచుకుని అడిగాను.

''దెయ్యంగాకుండా మనిషే యీ నాణేల్ని కొట్టేసి వుంటే మహా అయితే రెండ్రోజుల్లో మనకి చేరతాయి. అతన్ని గురించి నువ్వు యెరగవు. అతను మాస్కో వచ్చాడన్న సంగతే యిక్కడి అధోలోకంలో పెద్ద సంచలనం కలిగిస్తుంది. నిజంగా కోపంగా వున్నాడు. తొర్రలో దాంకుంటే దెయ్యాన్ని యివతలకి లాగేస్తాడు. 'అడ్మిరల్ నెల్సన్' పోలీసు ఇన్

---

* నా ప్రపంచ దృక్పథం. — అను.

ఫార్మర్ కాదు, కాబోదు, ఒట్టే. కాని ముఖా ముఖీ మాట్లాడితే చావసేనా ఛస్తాడు గాని మాట తప్పడు'' అని ఓసిపొవ్ నిబ్బరంగా జవాబిచ్చాడు.

''పెద్ద ఉత్తర కుమారుడనిపించాడు నాకు. పరవశించి పోయి బెర్లిన్ పోలీసు ప్రెసిడెంట్‌ని గురించి కథ చెప్పడం చూడండి ఉదాహరణకి'' అన్నాను.

''కథా? పద, మా ఆఫీసుకి వెడదాం. యీ కథ యేమిటో చూపిస్తా. యీ మనిషిని నిజంగానే మేజిక్ వేళ్లు'' అని ఓసిపొవ్ బుస్‌మన్నాడు.

అరగంట తర్వాత మాస్కో పోలీసు ఫోర్స్ కేస్ హిస్టరీ పసుప్పచ్చ కాగితాల్ని తిరగేస్తున్నాను. కవరు పేజీమీద యిలా రాసి వుంది:

''జాన్‌త్రెజెబ్‌స్కీ కజిమీర్ స్తనిస్లావొవిచ్, జాన్ రొమానేస్కు, విల్‌హెల్మ్ షుల్జ అనే పేర్లున్న వ్యక్తి — ఇనప్పెట్టెలు బద్దలు కొట్టడంలో అంతర్జాతీయంగా పేరు మోసిన ప్రమాదకరమైన మనిషి. రష్యా సామ్రాజ్యంలోనూ, విదేశాల్లోనూ పని చేస్తూ వుంటాడు. సెయింట్ పీటర్స్‌బుర్గ్, ఒదేస్స, మాస్కో, రొస్తోవ్ — ఆన్ — దోన్, నఖిచెవాన్, పోలండ్ రాజ్యంలోనూ వున్న పోలీసు బలగాల పుస్తకాల్లో నమోదైన పేరు.''

చిక్కడు దొరకడు 'అడ్మిరల్ నెల్సన్' సాహస కృత్యాల్ని వర్ణించే పోలీసుల విచారణలతోటే, నివేదికలతోటే నిండిపోయి వుంది మొత్తం కేసు.

అందులో బాగా వివరంగా వున్నటువంటిది ఆంతరంగిక మంత్రిత్వ పోలీసు విభాగపు చీఫ్ ఎస్. పి. బెలేత్‌స్కీ ఆంతరంగిక శాఖా మంత్రి ఘనత వహించిన ఎన్. ఎ. మక్లకోవ్‌కి 1913 మార్చి 12న సమర్పించిన పత్రం. మంత్రిగారి తీర్మానం మేరకి ఆ పత్రపు కాపీలని తదనుగుణంగా చర్యలు తీసుకోవడానికి రష్యన్ సామ్రాజ్యపు అతి పెద్ద నగరాల్లోని పోలీసు బలగాల డిటెక్టివ్ బ్రాంచీల అధిపతులందరికీ పంపించడం జరిగింది.

ఆ పత్రం యిలా వుంది:

''ఘనత వహించిన మీ ఆదేశాల మేరకి ఒదేస్స వాస్తవ్యుడు, జాన్‌త్రెజెబ్‌స్కీ, రొమానేస్కు, షుల్జ అనే పేర్లతో వ్యవహారంలో వున్న వ్యక్తి అయిన నేరస్థుని గురించి నివేదిక సమర్పిస్తున్నాను. యితను యినప్పెట్టెల్ని బద్దలు కొట్టడంలో, వాటిని కరిగించెయ్యడంలో అందె వేసిన చెయ్యి. యితనికి యెన్నో సార్లు శిక్షలు పడ్డాయి, పైన పేర్కొన్న అదే నేరానికి.

''గతంలో మాదిరిగానే యీ యేడు కూడా సామ్రాజ్యపు అనేక నగరాల్లో సాహసోపేతంగా జరిగిన బేంకు దోపిడీల గురించి పోలీసు శాఖకి వార్తలు అందాయి. ముఖ్యంగా చెప్పుకోవాల్సినవి నీజ్నీ నోవ్‌గొరొద్, సమార నగరాలలో జరిగిన దోపిడీలు.

''1912వ సంవత్సరం ఆగస్టు 12వ తేదీ రాత్రి వోల్గ కామ బేంక్ నీజ్నీ నోవ్‌గొరొద్ బ్రాంచ్‌కి ఒక గుర్తు తెలియని వ్యక్తి వచ్చాడు. అక్కడి ప్రత్యేక నమూనా

ఇనప్పెట్టెల్ని తెరిచాడు. యీ పైన పేర్కొన్న బేంక్ ఆ పెట్టెల్ని లైప్జిగ్‌లోని 'ఆట్టో గ్రిల్ అండ్ కంపెనీ'కి ప్రత్యేకం పురమాయించి చేయించిన పెట్టెలు అవి.

''నీజ్ని నోవ్‌గొరొద్ డిటెక్టివ్ ఫోర్స్, నీజ్ని నోవ్‌గొరొద్ గవర్నర్‌కి సహాయంగా వుండే ప్రత్యేక విషయాల అధికారి సాయంతో జరిపిన విచారణలో ఆ నేరస్థుడు బేంక్‌లో అరగంటకి మించి లేడని తేలింది. ఆ సమయంలో నైట్ వాచ్‌మన్ ఇవాన్ కొజొలువ్ అక్కడ లేడు. యీ వాచ్‌మన్ యెన్నో యేళ్ల సర్వీసు వున్న వాడు. స్థానిక పోలీసులు, నీజ్ని నోవ్‌గొరొద్ రష్యన్ పీపుల్స్ యూనియన్, ఫాదర్ వర్సొనొఫీ వాచ్‌మన్ గురించి ఉత్తమంగా సిఫార్సు చెయ్యడం జరిగింది. అంచేత వాచ్‌మన్‌ని అనుమానించే ప్రశ్నే లేదు.

''కొజొలువ్ చెప్పిందాని ప్రకారం అప్పుడు అర్ధరాత్రి ఒంటి గంట దాటిందట. బయట రద్దీ తగ్గిందిట. వీధుల్లో జన సంచారం లేదు. 'రష్యా' రెస్టారెంట్‌లో దీపాలు ఆర్పెయ్యడం జరిగింది. యింటి దగ్గర ఓ కప్పు టీ తాగి వద్దామని అతను వెళ్లాడట. రాత్రిళ్లు మెలుకువగా వుండవలసి వచ్చినప్పుడల్లా అలా చెయ్యడం అతనికి అలవాటట. అతను కాపరం వుండేదీ ఆ పక్కనే కాబట్టి అలా చేసేవాడు. ముందు గుమ్మం తాళం వేసి వెళ్లాడట. దారిలో అతనికి డర్బీ టోపీ పెట్టుకున్న యువకుడొకడు కనిపించాడు. అతను యితన్ని అగ్గి పెట్టె అడిగాడట.

''ఓ ముప్పై నిముషాల తర్వాత కొజొలువ్ తన పనిలోకి తిరిగివచ్చేటప్పటికి ముందు గుమ్మం తలుపు తీసి వుంది. అది బేస్‌మెంట్ వాల్ట్‌లకి దారిగా వుండే గుమ్మం కూడా. అతను వెంఠనే పోలీసుల్ని పిలిచి బేంక్ ప్రెసిడెంట్ గొలొష్చేకిన్ కోసం వెదకడం మొదలుపెట్టాడు. ఆయన నగర డ్యూమా సభ్యుడు, గౌరవ పౌరుడు. నాలుగ్గంటలు దాటాక గానీ ఆయన దొరకలేదు. అదీ అతి కష్టంమీద, స్థానిక పోలీసుల సాయంతో మేడమ్ స్కొరొఖోదొవా నడిపే కనావ్‌ఫ్కి పేట వేశ్యాగృహంలో ఆయన దొరికాట్ట.

''నేరస్థుడు అద్భుతమైన నైపుణ్యంతోటి, తన వృత్తికి సంబంధించిన అద్భుతమైన పరిజ్ఞానంతోటీ — ఆ పెట్టెలు యెవళ్లకీ అంతు పట్టని గూఢమైన తాళాలతో వున్నా — రెండింటిని తెరిచాడని తర్వాత రుజువైంది. పెట్టెల్లోనుంచి లక్ష రూబుళ్లని కాజేసి అతను యెటో మాయమైపోయాడు.

తమ ఇనప్పెట్టెలు ప్రత్యేకమైన, రహస్య నమూనావి కాబట్టి కొత్త వాళ్లెవరికీ వాటిని తెరవడం అసాధ్యం అని 'ఆట్టో గ్రిల్ కంపెనీ' వోళ్లు కామా బేంక్ బోర్డుకి హామీ యివ్వడం జరిగింది. అంచేత గొలొష్చేకిన్ వెంటనే ఆ ఫర్మ్ హెడ్ శ్రీ గ్రిల్ గారికి యీ దొంగతనం గురించి తెలియ చేస్తూ టెలిగ్రాం యిచ్చాడు. తమ కంపెనీ సీనియర్ ఇంజనీర్ శ్రీ హాన్స్ ష్మెల్ట్స్‌ని నీజ్ని నోవ్‌గొరొద్‌కి అన్ని ఖర్చులూ తామే భరించి పంపుతున్నామని ఆ ఫర్మ్ హెడ్ అదే రోజున జవాబు యిచ్చాడు. కొన్ని రోజుల

తర్వాత ఆ ష్మెల్ట్స్‌గారు నీజ్నీ నోవ్‌గొరొద్ వచ్చారు. బేంక్ ప్రెసిడెంట్, పోలీసులు వుండగానే బహుజాగ్రత్తగా రెండు ఇనప్పెట్టెల్నీ పరీక్షించాడు. పరీక్ష పూర్తయాక తను, ఆ పెట్టెల నమూనా తయారు చేసి గూఢమైన తాళాలని అమర్చిన తనే, ముప్పై నిముషాల్లో వాటిని తెరిచి వుండలేవనీ, కనీసం అయిదు గంటలు పడుతుందనీ, అదీ ప్రత్యేకమైన పరికరాలతోనేననీ ప్రకటించాడు.

''తర్వాత నీజ్నీ నోవ్‌గొరొద్ పోలీస్ ఛీఫ్‌తో ప్రైవేట్‌గా మాట్లాడుతూ, ఆ నేరస్థుడు దొరికి శిక్ష పడినట్లయితే అతని శిక్షాకాలం పూర్తయాక 'అట్టో గ్రీల్ కంపెనీ' సంతోషంగా అతనికి పెద్ద జీతంతో ఉద్యోగం యిస్తుందని ష్మెల్ట్స్ అన్నాట్ట. నేరస్థుడితో రాయబారం జరపడానికి మధ్యవర్తిగా వుండేటట్టయితే పోలీసు ఛీఫ్‌కి చాలా ఖరీదైన బహుమతిని యివ్వడానికి ష్మెల్ట్స్ సాహసించాడన్నది యీ పై మాటలకి దాఖలా. పోలీసు ఛీఫ్ బహుమతిని నిరాకరించాడు, సహజమే కదా — కనీసం అలా అని అతను నీజ్నీ నోవ్‌గొరొద్ గవర్నర్‌కి సమర్పించిన నివేదికలో వేర్కొన్నాడు.

''యీ లోపున స్థానిక పోలీసులు తీసుకున్న చర్యల ద్వారా యీ విషయం రుజువైంది. ఆగస్టు 13వ తేదీ రాత్రి చక్కగా ముస్తాబై, డర్బీ టోపీ పెట్టుకున్న ఎర్ర తల అజ్ఞాత యువకుడొకడు ఫస్ట్ క్లాస్ టికెట్ కొనుక్కుని 'కవ్‌కాజ్ మెర్క్యురీ స్టీమ్‌షిప్ కంపెనీ'' వారి 'ప్రిన్సెస్ తత్యానా' అనే నౌక యెక్కి వోల్గ నదిమీద ప్రయాణం అయ్యాడట. అదే రోజు సాయంత్రం ఫస్ట్ క్లాస్ ప్రయాణీకులతో పేకాట ఆడేడట. జిగ్ముంత్ స్పెదేల్‌స్కీ కూడా ఆ ఆటగాళ్లల్లో వున్నాడని తర్వాత తెలిసింది. యితను పేకాట మోసగాడని పేరు మోశాడు. యితను నీజ్నీ నోవ్‌గొరొద్ సంతనుంచి తిరిగి వెడుతున్నాట్ట. నీజ్నీ నోవ్‌గొరొద్‌లో తను పోలిష్ కౌంట్ లాంకేవిచ్‌నని చెప్పుకున్నాట్ట. అక్కడ అనేక పేకాట జూదాల్లో పెద్ద పెద్ద మేజాలకి ఆడేడట. ఆ సంత నుంచి చాలా మంది రష్యన్ వర్తకులూ, పర్షియన్ వర్తకులూ తిరుగు ప్రయాణంలో వున్నారు. అది చూసి స్పెదేల్‌స్కీ పెద్ద మేజాలకి ఆట ఆరంభించాడు. అందులో పైన చెప్పిన డర్బీ టోపీ యువకుడు పాల్గొన్నాడు.

''నౌక స్టీవర్ట్ ముర్జాయేవ్ అనే పేరుగల తాతార్. అతను ఆటగాళ్లకి చిరుతిళ్లు, మత్తుపానీయాలు సరఫరా చేసేడు. అతను చెప్పిందాని ప్రకారం మేజాలు చాలా పెద్దవట. వందల వేల మొత్తంతో ఆడుతున్నారట. కొంచెం సేపట్లోనే స్పెదేల్‌స్కీ ప్రఖ్యాతుడైన సమార పిండి వ్యాపారి ప్రోఖొరొవ్‌ని వూడ్చేశాట్ట. గూసెన్ హజార్, సులెమాన్ అయిరామ్ అనే యిద్దరు పర్షియన్ వర్తకుల్నీ, ఖ్వలీన్ ప్రాంతపు గొప్పవాళ్ల మార్షల్ కౌంట్ కుషెలేవ్ వూడ్చేశాట్ట. మొత్తంమీద లక్ష రూబుళ్లకి తక్కువ కాకుండా గెల్చుకున్నాడు. ముర్జాయెవ్ చెప్పిన దాన్ని బట్టి డర్బీ టోపీ యువకుడు కూడా సుమారుగానే పోగొట్టుకున్నాట్ట. నెగ్గిన వాడికి సొమ్ము యిచ్చేటప్పుడు పెద్ద తోలు బ్రీఫ్

కేస్‌లోనుంచి తీసి యిచ్చాట్ట. అతను దాన్ని విడవకుండా పక్కనే పెట్టుకున్నాడు. అది నోట్ల కట్టలతో నిండిపోయి వుండడం ముర్జాయెవ్ చూశాడు.

"ఆట అయిపోయాక ప్రయాణీకులు తమ కేబిన్లకి తిరిగివెళ్లిపోయారు. ముర్జాయెవ్ హాలుని శుభ్రం చేస్తూ వున్నాడు. మూడవ కేబిన్‌లో యేదో గడబిడ జరగడం అతనికి వినిపించింది. గబగబా తలుపు దగ్గరికి వెళ్లి తాళం చెవి కంతలోనుంచి చూశాడు. అక్కడ ష్పెదేత్‌స్కీ డర్బీ టోపీ యువకుడు కనిపించారు. డర్బీ టోపీ యువకుడు ష్పెదేత్‌స్కీని గట్టిగా కుదుపుతూ "మోసగాడా, నెగ్గిందాంటో సగం యిలా యియ్యి లేక పోతే నీ భరతం పడతా" అని అరుస్తున్నాడు. డర్బీ టోపీ యువకుడు వోడి పోయింది తిరిగి యిస్తానని ష్పెదేత్‌స్కీ అన్నాడు. యిద్దరూ కొట్టుకున్నారు. డర్బీ టోపీ యువకుడు ష్పెదేత్‌స్కీ నెత్తిమీద మోదుతూ వున్నాడు. ఆఖరికి అతను సగం యివ్వడానికి వొప్పుకున్నాడు. తన చిన్న సూట్ కేస్‌ని అంది పుచ్చుకుని ష్పెదేత్‌స్కీ మొదటగా నౌక ఆగిన చోట ఆదరాబాదరా ఆ రాత్రి పూట దిగిపోయాడు. డెక్కుమీదనుంచి ఎర్ర తల మనిషి అతన్ని చూసి "నీకు ఒదేస్స జేజిని చూపిస్తా. భష్టుడా! నువ్వు డాబుల రాయుడివి, పేకాట గాడివి కాదు" అని అరుస్తూనే వున్నాడు. మొత్తంమీద అతను చాలా హుషారుగానే వున్నాడు.

కొన్ని రోజుల తర్వాత 'ప్రిన్సెస్ తత్యానా' సమారలో లంగరేసింది. ఆ డర్బీ టోపీ అతను అక్కడ దిగిపోయాడు. ఆ తర్వాత రాత్రి ఒక అజ్ఞాత నేరస్థుడు ధైర్యంగా "సమార మర్చెంట్స్ బేంక్"ని దోచుకున్నాడు. అక్కడ రెండు ఇనప్పెట్టెల్ని తెరిచి లక్షా యాభైయారు వేల రూబుళ్లు కాజేశాడు. నీజ్ని నోవ్‌గొరొద్‌లో మాదిరిగానే యిక్కడా ఆశ్చర్యకరమైనంత తక్కువ వ్యవధిలో పని జరిగిపోయింది.

"డర్బీ టోపీ పెట్టుకున్న ఎర్ర తల మనిషి ఒకతను సమారలో "ప్రిన్సెస్ తత్యానా" లంగరు దింపిన రాత్రి 'వోల్గ' హోటెల్‌కి వెళ్లాడనీ కజిమీర్ జాన్‌త్రెజెబ్‌స్కీ అనే పేరున్న పాస్‌పోర్ట్‌ని చూపించి గది తీసుకున్నాడనీ పోలీసు విచారణలో వెల్లడైంది. ఆ తెల్లవార కట్ల మూడు గంటల ప్రాంతంలో వూళ్లోనుంచి సూట్ కేస్ మోసుకొచ్చి తలుపు తీసిన కాపలా మనిషి అగ్రఫేనా గోరినాకి అయిదు రూబుళ్లు టిప్ యిచ్చాట్ట. అతను మత్తులేకుండా బాగానే వున్నాడనీ, కాని బాగా అలిసిపోయినట్టు వున్నాడనీ ఆమె విచారణలో చెప్పింది.

"యీ వాస్తవాల వల్ల విషయం కొంత విశదమవుతుంది. ఇనప్పెట్టెలు పగలగొడతాడని ప్రఖ్యాతుడైన షుల్జ్ – రొమానేస్కు హొర్కొవ్ పోలీసులకి జాన్‌త్రెజెబ్‌స్కీ పేరుతో బాగా తెలుసు కాబట్టి.

"కాని యీ వాస్తవాలు అందే సమయానికి షుల్జ్ – జన్‌త్రెజెబ్‌స్కీ అదృశ్యం అయిపోయాడు.

"ఎనిమిది నెలల తర్వాత అతను బెర్లిన్‌లో కనిపించాడు. బెర్లిన్ పోలీసు ప్రెసిడియం యీ కింది సమాచారాన్ని అందజేసింది. అది జర్మన్ పోలీసుల దృష్టిని ఆకట్టుకుంది.

"1913వ సంవత్సరం ఫిబ్రవరి నెలలో బెర్లిన్‌లో ఇండస్ట్రియల్ ఫెయిర్ జరిగింది. అక్కడ జర్మన్ ఫర్మ్‌లూ, యితర యూరపియన్ ఫర్మ్‌లూ తమ వస్తువుల్ని ప్రదర్శించాయి. 'బేంకింగ్ అండ్ కమ్మర్షియల్ ఎక్విప్‌మెంట్' శాలలో కొన్ని ఫర్మ్‌లు తమ రహస్య తాళాలున్న తమ ఇనప్పెట్టెల్ని ప్రదర్శించాయి. వాటిలో 'ఆట్టో గ్రిల్ అండ్ కంపెనీ' వారివీ వున్నాయి. జర్మన్ 'సీమెన్స్–షుకెర్ట్' ఎలక్ట్రికల్ ఎక్విప్‌మెంట్ ఫర్మ్ కూడా రహస్య ఎలక్ట్రికల్ సిగ్నలింగ్ మెకానిజమ్ వున్న ఇనప్పెట్టెల్ని ప్రదర్శనకి పెట్టింది. యీ రెండు ఫర్మ్‌లూ ప్రచారానికి కొన్ని పద్ధతులు అవలంబించాయి. ప్రదర్శన చూడవచ్చిన వాడెవడేనా గానీ, మొదటగా, ఇనప్పెట్టెని తెరిస్తేనూ, రెండవదిగా, అలారమ్ తాకకుండా అలా చేస్తేనూ పెద్ద బహుమతులని యిస్తామని ప్రకటించాయి.

"ఫిబ్రవరి 7వ తేదీన డర్బీ టోపీ పెట్టుకున్న ఎర్ర తల మనిషి ఒకతను ప్రదర్శన శాల మేనేజర్‌ని కలుసుకుని, పలకరించి, లైప్జిగ్ నగరపు 'ఆట్టో గ్రిల్ అండ్ కంపెనీ' వారి పెట్టెని తెరవ ప్రయత్నిస్తాననీ, 'సీమెన్స్–షూకెర్ట్' వారి పెట్టెని కూడా నీ పెద్ద గుంపు ముందు అన్నాడు. అలాగే తెరవమని అతనికి చెప్పారు. ఇరవై రెండు నిముషాల్లో అతను రెండు పెట్టెల్నీ తెరిచాడు. ఫర్మ్ రిప్రజెంటేటివ్‌లూ, అక్కడ పోగయిన జనం అవాక్కయి పోయారు. రెండవ ఇనప్పెట్టె విషయంలో అతను ఒక రహస్య అలారమ్‌కి తాకకుండా అలా చేశాడు.

"అతనికి బహుమతీ సొమ్మిని నుంచున్న పాటున యివ్వడం జరిగింది. అతను వచ్చీరాని జర్మన్‌లో అక్కడున్న వాళ్ళందర్నీ 'వాగ్నర్' బీర్ గార్డెన్‌కి రమ్మని ఆహ్వానించేడు. బాగా తాగిం తర్వాత అతను మండల నాట్యం చేసి ఒదేస్స నగరాన్ని 'ఒదేస్స దీ ముట్టేర్' అంటూ కీర్తించి టోస్టు చెప్పాడు.

"యీ లోపున యీ 'ఆట్టో గ్రిల్ అండ్ కంపెనీ' సీనియర్ ఇంజనీర్ హాన్స్ ష్మెల్ట్స్ బెర్లిన్ పోలీసులకి ఫోన్ చేసి యీ కొత్త వ్యక్తి ఇనప్పెట్టెని తెరిచిన తీరు తనకి వోల్గ కామా బేంక్ నీజ్ని నోవ్‌గొరొద్ బ్రాంచిలో చూసిన దాన్ని గుర్తు తెచ్చిందని తెలియ చేశాడు.

"బెర్లిన్ పోలీసు ప్రెసీడియం ప్రతినిధులు 'వాగ్నర్' బీరు గార్డెన్‌కి హుటాహుటీ వెళ్లారు. ఆ యువకుణ్ణి పాస్‌పోర్ట్ చూపించమని నిగ్గదీశారు. అతను ఎవరో జాన్ స్త్రెజెబ్‌స్కీ యిచ్చిన రష్యన్ పాస్‌పోర్ట్‌ని, కనతోవ్ డిస్ట్రిక్ట్ పోలీస్ ఆఫీసరు కౌంటర్ సంతకం చేసిన ఎగ్జిట్ వీసాతో సహా చూపించాడు. తను యెవర్నైందీ నిర్ద

రించుకుందుకు తమతో రమ్మని బెర్లిన్ పోలీసులు అతన్ని ఆజ్ఞాపించారు. కాని జాన్ త్రెజెబ్‌స్కీ కరాఖండిగా రానుపొమ్మని చెప్పి, అక్కడ చేరి తన ఖర్చుమీద తాగుతూ వున్న గుంపుని రక్షించమని అడిగాడు. ఆ గుంపులో ప్రతి వాడూ యితని రక్షణకి వచ్చి పోలీసు ఆఫీసర్లని పట్టుకుని యితను గుమ్మం దాటి పోయేందుకు దారి కలిగించారు.

"మీరు ఘనత వహించిన విదేశాంగ శాఖామాత్యులు పజోనొవ్‌ని అర్థించి, క్రమ పద్ధతిలో జర్మన్ పోలీసులకి యీ పై చెప్పిన జాన్ త్రెజెబ్‌స్కీ — షుల్‌త్స్ యెక్కడు న్నదీ కనిపెట్టి, పట్టుకుని, ప్రమాదకరమైన నేరస్థునిగా ఎక్స్‌ట్రాడైట్ చెయ్యమని విజ్ఞప్తి చేయించగలరని భావిస్తూ యీ విషయాన్ని నేను తమకి నివేదిస్తున్నాను.

ఎస్. పి. బెలెత్‌స్కీ
ఆంతరంగిక మంత్రిత్వ శాఖ పోలీసు ఛీఫ్"

యీ ఆంతరంగిక మంత్రిత్వ శాఖ విదేశాంగ మంత్రిత్వ శాఖద్వారా జర్మన్ పోలీసుల్ని ఒక యేడాది పాటు సంప్రదిస్తూనే వుందనీ ఆ జర్మన్ పోలీసులు 'అడ్మిరల్ నెల్సన్' కోసం వెతికినట్టూ, లేదా వెతికినట్టు నటిస్తూనూ కనిపించారనీ యీ కేసుకి సంబంధించిన యితర పత్రాలు తెలియజేశాయి. సున్నితమైన యీ ఉత్తర ప్రత్యుత్తరాలని యుద్ధం ఆటంకపరిచింది.

కాలగతిలో పసుపు తిరిగిన యీ పత్రాల్ని చదవడం, ఆసక్తికరమైన వాటిని యెత్తి రాసుకోవడం నేను ముగించే సరికి సాయంత్రం అయింది. ఓసిపొవ్వూ నేనూ కలిసి 'ఆర్స్' సినిమాకి వెళ్లాం. యిప్పుడక్కడ స్తనిస్లావ్‌స్కీ డ్రామా థియేటర్ వుంది.

రెండు టిక్కెట్లు కొనుక్కుని, కాసేపు షికారుగా నడిచి వెడదా మనుకున్నాం. సినిమా మొదలవడానికి యింకా దగ్గర దగ్గర గంట వుంది.

"యెలా 'అడ్మిరల్ నెల్సన్' కడకి తేలతాడనుకుంటున్నారు?" అని అడిగాను.

"నేను అతన్ని గురించీ అతనిలాంటి వాళ్ల గురించీ చాలా సార్లు అనుకుంటూ వుంటాను. యిది కష్టమైన సమస్య. గత ప్రపంచంనుంచి మనకి పెద్ద అధోలోకం — దాని అలవాట్లతోటీ, సంప్రదాయాలతోటీ, విభేదాలతోటీ, వృత్తి 'శాఖల'తోటీ కూడా — సంక్రమించింది. నూతన ఆర్థిక విధానం అమలు జరిగిన సంవత్సరాలలో దానికి కొత్త వూపిరి వచ్చింది. హై క్లాస్ రెస్టారెంట్లూ, గుర్రప్పందేలూ, సొంత దుకాణాలూ, సొంత వ్యాపారం, కాబరేలు, నెప్‌మన్‌లూ అన్నీ కూడా నేరాన్ని పెంచుతాయి. యింకా చాలా మంది పాత 'స్పెషలిస్టులు' తప్పించుకునే వున్నారు. తాళాలు బద్దలు కొట్టి ఇళ్లు దోచుకునేవాళ్లు, దొంగలు, నానా రకాల ముఠాల యజమానులు అలాంటి వాళ్లూ

తప్పించుకునే వున్నారు. యివాళో రేపో వాళ్లల్లో చాలా మందిని పట్టుకుని తీరతాం, జైలుకి పంపుతాం. కొంత మంది యివన్నీ వదులుకుని నిజాయితీపరులైన వారులు అవచ్చు. 'అడ్మిరల్' యేమిటవుతా డన్నది అప్పుడే చెప్పడం కష్టం. కాని అతను ప్రభుత్వంది కాని, కోఆపరేటివ్‌లది కాని ఒక్క పైసా కూడా ఇనప్పెట్టెల్లో తాకలేదన్నది మాత్రం ముమ్మాటికీ నిజం. నాకు చూస్తే అది మరి గొప్ప సంగతిలాగే కనిపిస్తుంది. యేమైనా కాలమే సాక్షి."

ఆ మర్నాడు ఎన్. కార్యదర్శి ఫోన్ కాల్‌తో మొదలైంది. తన ఛీఫ్ యింకా కలవిళ పడి వున్నాడనీ, యింక రెండ్రోజులే వ్యవధి వుందని మాకు గుర్తు చెయ్యమన్నాడనీ ఆమె చెప్పింది. నాకు అది శుభ సూచకంగా కనిపించలేదు. రెండు గంటల వేళ ఓసిపావ్ టెలిఫోన్ చేశాడు. పని ఉరుకుల పరుగులమీద సాగుతోందనీ, కాని యింకా కను చూపు మేరలో నాణేలు లేవనీ 'అడ్మిరల్ నెల్సన్' అప్పుడే తనకి ఫోన్‌లో తెలియ చేసినట్టు చెప్పాడు.

సాయంత్రం వేళకి షెవెర్‌దిన్ ఫోన్ చేశాడు. యీ కేసు గురించి యీ మంచి ముసలాయన ఆతృతగా వాకబు చెయ్యడం బట్టి చూస్తే ఆయన నిజంగా ఆందోళనగా వున్నాడనీ నాణేలు దొరక్కపోతే నాకు కష్టాలు తప్పవనీ ఆయన బాధపడుతున్నట్టు నాకు అర్థం అయింది. 'మూర్' కామ్రేడ్స్ యేయే ప్రయత్నాలు చేస్తూ వున్నదీ స్థూలంగా చెప్పాను. కాని యింకా యేమీ సాధించలేదనీ చెప్పాను.

"యేం బాగా లేదు. మన బాధితుడు దుమ్ము లేపెయ్యడానికి తయారుగా వున్నాడు. శాయశక్తులా కృషి చెయ్యండి, యే మినహాయింపులూ మిగల్చద్దు. లేకపోతే చిక్కుల్లో యిరుక్కుంటాం" అని ఆయన నిట్టూర్చాడు.

ఆ సాయంత్రం కిందనుంచి ఓసిపావ్ కారు నాకు పరిచితమైన హారన్ కొడుతూ వుంటే నాకు కలిగిన ఉత్సాహం వూహించుకోవచ్చు. నేను యింట్లోనుంచి యివతలికి ఒక్క ఉదుట్న పోయి దూరంనుంచే మా మిత్రుడు చిరునవ్వు నవ్వుతూ వుండడం చూశాను. ఆయన పక్కన నొజ్నీత్‌స్కీ కూర్చున్నాడు. ఆయన భేషైన అసిస్టెంట్లలో ఒకడతను.

"ఎక్కు. 'సాంస్కృతిక కచేరీ'లో నరానరి తనని కలుసుకొమ్మని 'అడ్మిరల్' ఫోన్ చేశాడు" అని ఓసిపావ్ అరిచాడు.

మేం గోర్కీ వీధిలో వేగంగా వెళ్లాం. మాలి గ్నెజ్నికోవ్‌స్కీయ్ సందులోకి మొగలో ఓ చిన్న యింట్లోకి వెళ్లాం. చాలా కాలం కితమే ఆ చోటని కూల్చేసి దాని స్థానంలో పెద్ద యింటిని కొత్తగా కట్టారు. కాని అప్పట్లో ఈ యింట్లో 'సాంస్కృతిక కచేరీ' బీరు గార్డెన్ వుంది. బీరుకీ, వాటితోపాటు బాగా ఉడక పెట్టిన పీతలకీ, వేయించిన

హెర్రింగ్ చేపలకీ, వూరేసిన పచ్చి బఠానీలకీ, పేరు పొందినంతగా అది సంస్కృతికి పేరు పొందలేదు.

'అడ్మిరల్ నెల్సన్' మా కోసం ఓ మూల బల్ల దగ్గర చూస్తూ వున్నాడు. యెప్పటిలాగానే నీటుగా డ్రస్ చేసుకున్నాడు. శాస్త్రోక్తంగా మాకు స్వాగతం చెప్పాడు.

"గుడ్ యీవెనింగ్" అన్నాడు హుందాగా. "మీరు నిజంగా నాకు గట్టి పని చెప్పారు, తెలుసా. నేనేదో యేమార్పుకి వచ్చి విశ్రాంతి తీసుకుందా మనుకున్నాను. 'యిలాంటి విశ్రాంతి నిన్ను ముంచుతుంది' కీర్తిశేషులైన మా నాన్నగారు చెప్పినట్టు. ఒదేస్స మొత్తంమీద మహా చురుకైనవాడు ఆయన, అలాంటి వాడు మళ్లీ దొరకడు. చూశారూ ఆ మహా నగరంలో ఆయనే సాటి లేని ఫిట్టరూ, మెకానిక్కూనూ. వంశ పారంపర్య నియమాలని కన్నం దొంగలు వూహించలేదనే నా అనుభవం చెప్తోంది. నాకు గుర్తుంది యింకా నేను చెప్పేది నిజం కాకపోతే పురుగులు పట్టిపోతాను..." అని చెపుతూ వున్నాడతను.

"సరేగాని వ్యవహారం మాట్లాడుకుందామా యిక. కీర్తిశేషుడైన మీ నాన్న గురించి అంతా నాకు 1921లో చెప్పారు" అని ఓసిపావ్ అడ్డం వెళ్లాడు.

"పొరపాటు, యేమనుకోకండి, నిజంగా నేను మర్చేపోయాను. సరే వ్యవహారం చూద్దాం. నిన్న స్టేషన్‌నుంచి సరాసరి వెళ్లి మనకి కావాల్సిన కుర్రాళ్లని పోగేశాను. ఓ ప్లీనరీ మీటింగు జరిపాను. నేను యెలాంటి ఉపన్యాసం యిచ్చానంటే అంతా యేడ్చారు. 'దరిద్రపు గొట్టు విప్లవ ప్రతీఘాత సర్పాల్లారా' అన్నాను. 'ప్రజా కమిస్సార్ యింటిమీద చెయ్యి వేసి, ఆయన విలువైన జీవితాన్ని తగ్గించే ముక్క కంపు నాణేలని కాజెయ్యాలన్న ధైర్యం యేమిటి మీకు? వెధవ చిల్లుల దినార్‌లకి గాను ప్రభుత్వంలో ఒక వ్యక్తిని ముఖ్యమైన రాజ్య వ్యవహారాలనుంచి పక్కకి మళ్లించారు. శుంఠల్లారా! 'వూయె' అని చెప్పడానికి నేను ఒదేస్సలో నా పనులన్నీ మానుకుని యిక్కడికి హుటాహుటీ రావాల్సివచ్చింది. మీరు చేసిన పని విని మూడ్రోజులుగా మొల్డావంకా పేటలో వాళ్లు విషం కక్కుతున్నారు, విప్లవ ప్రతీఘాతకుల్లారా! మాటల్లో చెప్పలేనంత నైచ్యం యిది.' కనీసం అర్ధగంట మాట్లాడి వుంటాను. వాళ్లు నాకు మూడు గ్లాసులకి తక్కువ కాకుండా నీళ్లిచ్చారు. అంత ఉద్రేక పడిపోయాను నేను. అప్పుడు లేచాడు మాస్కో దొంగల రాజు, మీకు తెలుసు వాడు" అన్నాడు ఓసిపావ్ కేసి తిరిగి.

"ఆఁ తెలుసు, సెంకా బావురుపిల్లి" అని ఓసిపావ్ తల ఆడించాడు.

"రైట్. తను చేసిన పని కాదు బాబోయ్ అని వలవల యేడ్చాడు. ఆఁ, మాటల వల్ల లాభం యేమిటి? మాస్కోలో చెయ్యి తిరిగిన వాళ్లంతా అక్కడున్నారు. మా అందరికీ తల వంపులు తెచ్చిన ఆ దరిద్రపు గొట్టు నాణేల్ని పట్టుకునే దాకా యెవళ్ల

తమ 'పనులు' చెయ్యమన్నారు. వాళ్ళ అన్న మాట తప్పలేదని మీకంటే బాగా అర్థం చేసుకునేవాళ్ళ వుండరు."

"అవును. గత యిరవై నాలుగ్గంటల్లోనూ ఒక్క యింటికి కూడా కన్నం వెయ్యడం జరగలేదు. కొన్ని యేళ్ళగా యిలాంటిది యిదే మొదటి సారి" అన్నాడు ఓసిపావ్.

"యింటికన్నమా? కన్నం యేమిటి గత యిరవై నాలుగ్గంటలుగా ఒక్కళ్ళూ చిటికిన వేలు కూడా కదపందే! మేం మొత్తం అందర్నీ, కాస్తంత మొనగాడన్న ప్రతీ వాణ్నీ సమాయత్త పరిచాం. ఒక్క నెప్‌మన్నైనా దోచుకున్నారా, ఒక్క ముద్దుల గుమ్మైనా తన పర్సు పోయిందందా, ఒక వానిటీ బేగైనా పోయిందా? మొత్తం నగర మంతా ముట్టడిలో వున్నప్పుడు అసలు మాట్లాడే పనేముందని? ఆ చిల్లుల దినార్‌లు మాకు బాగా పని చెప్పాయి. మాలో యెవళ్ళైనా పది నిముషాలేనా నిద్రపోయాడను కుంటున్నారా? అలా అనుకుంటే మిమ్మల్ని గౌరవించడం మానేస్తాను" అన్నాడు 'అడ్మిరల్'.

"లేదు, అనుకోను" అని ఓసిపావ్ గబగబా అతనితో అన్నాడు.

"యెందుకంటే మీరు నిక్కచ్చి అయిన వాళ్ళ కాబట్టి. పై పెచ్చు నేనే స్వయంగా రహస్య స్థావరంలో రాత్రంతా గడిపాను."

"జొలొగిచెస్కీ సందులోనా" అని ఓసిపావ్ చిరునవ్వు నవ్వుతూ అడిగాడు.

"మీరలా అడుగుతారనుకోలేదు. తన జీవితంలో 'అడ్మిరల్ నెల్సన్' యెన్నడూ యే ఒక్క రహస్య స్థావరంమీదా వేలు పెట్టలేదు. యిలాంటి ప్రశ్న అసందర్భం. యింక అంతకంటే యెక్కువ చెప్పను" అన్నాడు 'అడ్మిరల్' జడంగా.

"సర్లే, మర్చిపోండి దాన్ని. ఆ మీటింగు సంగతి కానీండి."

"బాగుంది. ఆ స్థావరంలో తెల్లవారే దాకా వున్నాను. అరగంట అరగంటకీ నగరం నాలుగు మూలలనుంచీ నా దగ్గరికి వాళ్ళ వస్తూ వుండేవాళ్ళ, 'లేదు' అని చెపుతూ వుండేవాళ్ళ. పొద్దుట ఏడు గంటల వేళకి నేను బతుకుతానని యే డాక్టరూ ప్రపంచంలో దమ్మిడీ పందెం కాసేవాడు కాదు. అంతలా చచ్చుబడిపోయాను. ఎనిమిది గంటల వేళకి ఒక కాలు శ్మశానంలో వుంది. చిత్తడి వాసన తగిలేసింది నాకు. నా గుండె కొట్టుకుంటోందా లేదా అన్నట్టు వుంది. నాడి అందనే లేదు. దొంగలు దాంకునే స్థావరం యజమానురాలు మంకా జోరీగ వెక్కి యేడ్చింది. 'అయ్యో అడ్మిరల్! వెధవ చిల్ల దినార్‌ల కోసం నామీద పడి చచ్చిపోతావా! ఓరి భగవంతుడా, ఒదేస్సలో వాళ్ళకి మేం యేం చెప్పాలి? నిన్ను ప్రాణంతో కాపాడలేదంటే కారణం యేం చెప్పగలం? వాళ్ళ నా కొంపకి అగ్గెట్టేస్తారు' అని మొత్తుకుంటూనే వుంది. యింతకీ కడకి యెవరు నన్ను కాపాడేరో తెలుసా? సెంకా బావురుపిల్లి. 9.30కి పరిగెత్తుకుంటూ వచ్చాడు.

నా పని అయిపోయిందని చూసి అతనికి ఓ ఐడియా తట్టింది. చూశారా, మంచి చదువు సంధ్యలున్న మనిషి అతను. జ్మెరింకా మెడికల్ కాలేజీ పట్టా పుచ్చుకునే వాడే కొంచెంలో, యింటి కన్నాల దొంగ కాకపోయినట్లయితే నామీద ఒట్టు, యెప్పుడో మెడిసిన్‌లో ప్రొఫెసర్ అయివుండేవాడు. యింతకీ యేమయిందంటే. సరాసరి దగ్గర్లో వున్న ఓ హాస్పిటల్‌కి దూసుకుపోయి ఓ పేషెంట్ దిండు కింద వున్న ఆక్సిజన్ లాగేసుకుని నా దగ్గరికి తీసుకొచ్చాడు. దేవుడు కాపాడుగాక, ఆ రోజున మాస్కోలో జరిగిన దొంగతనం అదొక్కటే. నా విశ్రాంతి బాగానే వుంది మాస్కోలో, యేమంటారు ఓసిపావ్‌గారూ?

"అసలు విషయానికి రారాదా?" అన్నాడు ఓసిపావ్.

"వస్తున్నా. లంగరు దించబోతున్నా. నేను కొంచెం తెప్పరిల్లేటప్పటికి మార్యినా రోష్చానుంచి కోల్యా కుందేలు లోపలికి వూడి పడ్డాడు. టర్కీ సుల్తాన్ కట్టేసిన బొండ కొయ్యనుంచి విడిపించుకు పారిపోయివచ్చినట్టూ, 'బి' ట్రామ్ బండిలో బ్రిటిష్ కిరీటం కాజేసి వచ్చినట్టూ కనిపించాడు. గొంతుచించుకుని అరుస్తూ వున్నాడు. 'యెందుకురా శుంఠా అరుస్తావ్?' అని అడిగేను. పెంకా బావురుపిల్లి వాణ్ణి పిండేదాకా అరుస్తూనే వున్నాడు. మొత్తంమీద కుర్రాళ్లు దొంగ వెధవని పట్టేరు. మొదటగా వాడు మాస్కో వాసి కాదు. రెండోదీ యింకా ముఖ్యం అయిందీ వాడు ఒదెస్సవాడూ కాదు. మూడవదిగా, వాడు నిజమైన దొంగ కాదు. యిప్పుడిప్పుడే ఓనమాలు దిద్దుకుంటున్న తూల పట్టణం మనిషి. యిలాంటి పిచ్చి ప్రపంచంలో మనిషి బతకడం యెలాగండీ?" అన్నాడు 'అడ్మిరల్.'

"నాణేలు యేవి?" అని ఓసిపావ్ నిబ్బరంగా అడిగేడు. 'అడ్మిరల్' కళ్లల్లోకి సూటిగా చూస్తూ.

"నేను వింత మనిషిని కాకపోవడంవల్ల యిదే ప్రశ్నని కోల్యా కుందేలు అడిగాను" అని అతను వెటకారంగా జవాబిచ్చేడు. "నాణేలు తులాలో వున్నాయి. యీ అర్భకుడు అక్కడికి తరలించేడు. వాటి కోసం ఓ బృందాన్ని పంపేం. ప్రఖ్యాత ఆయుధాల ఫాక్టరీ మిగిలినా ధ్వంసం కాకుండా, నగర సోవియట్ ఉత్సవం జరుపుకోవచ్చు. కొంచెం సేపట్లో వస్తాయి" అన్నాడు.

ఓసిపావ్ కూడా హమ్మయ్య అనుకున్నాడు. నాకు సంతోషంతో వెర్రెక్కిపోయింది. నొబీల్‌స్కీ కళ్లమ్మట నీళ్లు తిరిగే దాకా నవ్వేడు.

సరిగ్గా అప్పుడే యెవళ్లో కిటికీమీదకి ఓ గులక రాయిని విసిరారు. 'అడ్మిరల్ నెల్సన్' టక్కున లేచి నుంచుని "దూతలు వచ్చారు. బాండ్ వాయించండి" అని అరిచాడు. యీ మాటలు అని బార్‌లోనుంచి బయటికి పరిగెత్తాడు.

కొన్ని క్షణాల్లో విజేతలాగా లోపలికి తిరిగివచ్చాడు. అతను పెద్ద తోలు వల్లువాన్ని మోసుకొచ్చాడు. దానికి యిత్తడి బకుల్స్ వున్నాయి.

"యివిగో" అన్నాడతను, వున్న ఒక్క కన్నూ రాక్షస గర్వంతో మెరిసింది. "ప్రపంచంలోని మొత్తం పోలీసులంతా, బెర్లిన్ పోలీసు ప్రెసిడెంట్ నా వేళ్ల గురించి ఆత్మీయంగా నిజం చెప్పిన ఆ అంతర్జాతీయ అపరాధ పరిశోధకుల వియన్నా మహా సభకి హాజరైన ప్రతినిధులందరితో కలిసి యీ నాణేల కోసం యిక్కడ సమావేశమైనా కూడా అవమానంతో మాస్కో నదిలో మునిగిపోతారని పందెం కాస్తున్నాను... యంగ్ మేన్" అన్నాడు నాకేసి తిరిగి, "మీరిప్పుడే జీవిత పథంమీదకి వస్తున్నారు. మీరంటే నాకు చాలా యిష్టం అయింది. బాగా పరిశీలించండి మీరు చూసింది గుర్తుపెట్టు కొండి: దొంగలు తమ గౌరవం పణం పెట్టినప్పుడు యేమన్నా చెయ్యగలరని. 'అడ్మిరల్ నెల్సన్' బ్రహ్మాండమైన పలుకుబడి మీకుంటుంది" అన్నాడు.

అతను కొక్కేలు విప్పదీసి వల్లువం తెరిచాడు. విడిగూళ్లల్లో కూచున్న గువ్వల్లా వున్నాయి నాణేలు.

వాటిని పరీక్షించాం. రెండు వందలుంటాయి. అన్నీ రాగివే. కిలం పట్టి కాల గమనంలో అరిగిపోయాయి. చిన్నా పెద్దా నాణేలు వున్నాయి. ఎద్దులు, పాములు, గద్దలు, పొట్టేళ్లు, స్ఫింక్స్‌లు, కొంగలు బొమ్మలు వాటిమీద వున్నాయి.

"యుగాల గౌరవార్థం నుంచుందాం" అని 'అడ్మిరల్' శాస్త్రోక్తంగా అని నిజం గానే నుంచున్నాడు. "చిల్లుల్ని బట్టి చూస్తే యింత గొడవ సృష్టించిన దినార్‌లు యివేనని తెలుతోంది. ఓరి దేముడోయ్! 1915లో యెట్టకేలకి పోలీసులు నన్ను పట్టుకున్నప్పుడు నా తరఫున వాదించిన ఒదేస్స బారిస్టర్ నికొలాయ్ ష్మెయెర్సోన్ చెప్పినట్టు జీవితపు యెంత అంద వికారమైన భంగిమ! నిజంగా భయంకరం. వాటిని ముట్టుకోవాలంటే నాకు అసహ్యం. యీ మహా నగరపు గొప్ప మనుషులు కాలుకాలిన పిల్లుల్లా కలదిరిగేశారు యీ చెత్త కోసం అని అనుకోవడం! యీ కిలం పట్టిన రాగి కోసం ఆ ప్రజా కమిస్సార్‌గారు యెందుకంత యిదైపోతున్నాడో నాకర్థం కాదు. నిజమే లెండి, గొప్ప వ్యక్తులు కూడా దద్దమ్మల్లా వుంటారు ఒకో అప్పుడు తత్త్వ వేత్త స్పినోజ అంటూ వున్నట్టు – నిజానికి అతను అలాంటి దాన్ని దేన్నీ అనకపోయినా" అన్నాడు.

'అడ్మిరల్'ని ఆపడం అనేది వుండదు. వోడ్కా కొన్ని పెగ్గులు పట్టించేడు. తర్వాత బీరు బిగించేడు. యిక మమ్మల్ని తన వాగ్ధాటితో ముంచెత్తేడు. అతన్ని ఆపుదామంటే మర్యాద అడ్డం వచ్చింది. మాకు సాయం చేశాడాయిరి. ఓసిపొవ్‌కి చిరాగ్గా వుంది. సొల్లు కబుర్లంటే ఆయనకి అసహ్యం. చవకబారు వేదాంతం, గొప్పలు పోయే బడాయి

కోరుతనం, మృదువాక్కులు, ఒదేస్సలోని మొల్దావన్కా పేట దొంగల కథలు మామీద చిలకరించుకుంటూ పడ్డాయి.

యిక సరుకు అయిపోయే వేళకి, లేదా అతను అలిసిపోయే వేళకి దొరికిన సందు ఆసరా చేసుకుని గుడ్బై చెప్పేద్దా మనుకున్నాం. అతను వున్నట్టుండి మొదలెట్టాడు.

"యీ వింత కేసులో మహా వింతైన విషయం యేమిటో తెలుసా? మొట్ట మొదటి సారిగా తన జీవితంలో 'అడ్మిరల్ నెల్సన్' చట్టం వేపు వున్నాడు. డిటెక్టివ్గా వుండడం చాలా ఆసక్తికరంగా వుంటుందంటూ. ఇనప్పెట్టెలు పగల గొట్టే పాత కాపుగా ఓ మాట చెప్తున్నా మీకు, నా జీవితంలో మహా సంతోషదాయకమైన యిరవై నాలుగ్గంటలూ యివి" అన్నాడు.

హఠాత్తుగా 'అడ్మిరల్' మత్తు తగ్గిపోయినట్టయాడు. మా కేసి విచారంగా చూశాడు. తన జీవితం వృథా అయిపోయిందని వున్నట్టుండి అనుకోకుండా గ్రహించిన నడి వయస్కుడిలా వున్నాడు.

ఓసిపావ్ నిటారుగా కూర్చుని 'అడ్మిరల్' కేసి నిశితంగా చూశాడు.

"మహా యుక్తివంతమైన అతిముఖ్యమైన విషయం యివాళ మాకు చెప్పారు, సెమ్యోన్ మిహైలొవిచ్" అన్నాడు మొదటి సారిగా 'అడ్మిరల్'ని అసలు పేరుతో పిలుస్తూ. "యీ నాణేలు కనిపెట్టినట్టుగానే మీ జీవితంలో నూతన స్థానాన్ని మీరు చూడగలిగినట్టయితే — అలాంటిది మనిషికి నిజంగా పుచ్చుకూరగాక మెడమీద తల కాయ వుండి, మురిగిన గుడ్డుకాక హృదయం అనేది వుంటే యెప్పటికీ సాధ్యమే — నామీద ఆధారపడవచ్చు. యీ రకంగా మీకు సాయంచేసి బదులు తీర్చుకోవడానికి సంతోషిస్తాను" అన్నాడు.

'అడ్మిరల్' హఠాత్తుగా జేవురించుకున్నాడు. యెప్పటిలాగానే ఓసిపావ్ అతని మనసులో వూహ కనిపెట్టాడని అర్థం చేసుకున్నాను.

'అడ్మిరల్' తల వంచుకుని ఆలోచనలో మునిగిపోయాడు. ఓసిపావ్ కళ్ళు అతన్నుంచి తప్పించుకోలేదు. అవి మానవ సానుభూతితో మెరిశాయి. అలాంటి సాను భూతి నేరపరిశోధకుడికి తను అంధుడుగా, సంకుచిత మనస్తత్వం గల మనిషిగా కాకుండా వుండేందుకు ప్రజలలో విశ్వాసం అంతగా ముఖ్యం. ఆ తర్వాత సంవత్సరాల్లో మాత్రమే నాకు యీ అంధత్వంతో బాధపడే పరిశోధకులు తగిలారు. దానివల్ల అన వసరమైన దుఃఖం సంభవించింది.

చాలా సేపు మౌనంగా వున్నాక 'అడ్మిరల్' తల యెత్తి, దగ్గర దగ్గరగా గొణుక్కుంటున్నట్టుగా అన్నాడు:

"ఆర్కిమెడీస్ అనుకుంటాను 'నాకు తులాదండం వొకటి వున్నట్టయితే భూమిని పైకెత్తుతాను' అన్నాట్ట. నేను ఆర్కిమెడీస్ని గాను, భూమి నా ప్రమేయం లేకుం

డానే సరి అయిన దిశలో తిరిగింది. అది నాలో కూడా యేదో కదిలించింది. నేను వృద్ధుణ్ణి అయిపోతున్నాను, ఓసిపావ్‌గారూ, యీ వయసులో కొత్త బతుకు ఆరంభించడం కష్టం. కాని మీకు నామీద నమ్మకం వుంది, అది కూడా తులాదండం వున్న చోటే, ఆర్కిమెడీస్ కలగన్న లాంటిది. చితక మోదిన నా పాత ప్రపంచాన్ని కదిలించడానికి ప్రయత్నిస్తాను. నా లోపల నేను యీడుస్తూ వున్న తుప్పు పట్టిన ఇనప్పెట్టెని కరిగించ ప్రయత్నిస్తాను. అక్కడ యేమన్నా వుందేమో, యెవళ్లు చెప్ప గలరు?''

హఠాత్తుగా లేచి గుడ్‌బై అని కూడా అనకుండా పారిపోయాడు.

నేను షెవెర్‌దిన్ దగ్గిరికి వెళ్లి యేం జరిగిందో చెప్పాను. ఆ మనిషి యెంత పగలబడి నవ్వాడంటే నాకు భయం వేసింది. తర్వాత నాకు ఆశ్చర్యం కలిగేటట్టు కటువుగా అన్నాడు:

''యేమైనా గానీ, అబ్బాయ్, నేను మా సహోద్యోగుల్ని సంప్రతించాను. నువ్వు క్రమశిక్షణకి సంబంధించిన సమాధానం యివ్వాల్సి వుందని అందరూ ఏకగ్రీవంగా నిర్ణయించారు. అదీ సంగతి. అంచేత సంజాయిషీ చెప్పాల్సి వస్తుంది.''

నేను గందరగోళ పడిపోయి షెవెర్‌దిన్ ఆఫీసునుంచి వెళ్లిపోయాను. నా ట్యూటర్లయిన స్నిత్కోవ్‌స్కీ, లాస్కిన్‌ల ధగ్గిరికి వెళ్లాను. యిద్దరూ జావగారి పోయి వున్నట్టు తెలుస్తూనే వుంది. బల్లమీద వాయిస్తూ లాస్కిన్ 'హల్లో' అని కూడా సరిగా అన్లేదు. స్నిత్కోవ్‌స్కీ మంచులా జడంగా వున్నాడు. ఎమ్. ఒస్త్రాగోర్‌స్కీ కూడా వున్నాడు. ఆయన ఇన్వెస్టిగేషన్లకి బాధ్యుడైన అసిస్టెంట్ రీజినల్ ప్రాక్యురేటర్. ఎత్తరిగా అందంగా వుండే మనిషి. పాదలాగా వుండే రాగిజుట్టు, బూడిద రంగు కళ్లు వున్నాయి. ఆ క్షణంలో ఆయన కళ్లు కటువుగా వున్నాయి.

''చిన్న పిల్లలు చిన్న చింతలు, పెద్ద పిల్లలు పెద్ద చింతలు. కామ్రేడ్ షేయినిన్ (ఆయన అంతకు ముందు యెన్నడూ నన్ను అలా సంబోధించలేదు) నాకు నిజంగా విచారంగా వుంది. మీ వింత ప్రవర్తన చూసి విచారిస్తున్నాను. యేం బాగా లేదు, నిజంగా యేం బాగా లేదు. యిది సిగ్గు చేటుగా వుందని కూడా అన సాహసిస్తాను. యిదేనా మేము మీకు నేర్పింది?''

''కాని నన్ను చెప్పనీయండి...'' అని గొణిగాను.

''చెప్పనియ్యను'' అని బల్ల గుద్దుతూ స్నిత్కోవ్‌స్కీ అడ్డం వచ్చాడు. ''చెప్పనియ్యను. కోర్టు ఇన్వెస్టిగేటర్ బార్‌లో నేరస్థుడితో కూర్చోవడం! టెర్రిబుల్! టెర్రిబుల్'' అన్నాడు.

''యెన్నడూ విని యెరగం'' అని లాస్కిన్ విరుచుకు పడ్డాడు.

"నాకు అసలు అర్థం కావడం లేదు" అని ఒస్త్రొగోర్‌స్కీ గొణిగాడు.

"యేం జరిగిందీ మాకు షెవెర్‌దిన్ చెప్పినప్పుడు దీన్ని తేలిగ్గా పోనివ్వకూడదని అనుకున్నాం. యిది మీకు గుణపాఠం. మీ వృత్తిని అప్రదిష్ట పాల్జెయ్యకుండా వుండ డానికి గుణపాఠం."

ఒక వారం తర్వాత నేను పెద్ద ఆకుపచ్చ టేబిల్ క్లాత్ కప్పిన బల్ల ముందు నుంచుని రీజినల్ కోర్టు డిసిప్లినరీ కల్లీజియమ్ ముందు హాజరయ్యాను. గడ్డం వున్న దెగ్‌త్యర్యోవ్ మబ్బుగా కుర్చీలో కూర్చున్నాడు.

నేను క్షమించరాని ఘోరమైన నేరం చేశానని నా ట్యూటర్లు అప్పటికే నాకు మూరిపోశారు. నేను యేం జరిగిందీ యెందుకు జరిగిందీ కల్లీజియమ్‌కి వున్నదున్నట్టు నివేదించాను. అబ్బ, యెంత దౌర్భాగ్యుణ్ణి నేను!

దెగ్‌త్యర్యోవ్ శ్రద్ధగా ప్రతి మాటనీ విన్నాడు. వింతగా అనిపించవచ్చుగాని దుశ్శకున సూచకమైన ఆయన గోధుమ రంగు కళ్ల లోతుల్లో యెక్కడో దయాన్విత మైన మెరుపు కనిపించింది — ఉల్లాసభరితమైన మెరుపు అని కూడా అంటాను, ఆ మాటకి వస్తే. అందుకనే ఆయ గడ్డం బరుక్కుని తడవతడవకీ గుర్రుమన్నాడు:

"పోనీ, పోనీ! యెత్తు వేశావు ఆఁ. మరో షెర్లాక్ హోమ్స్ అవాలనుకున్నావ్ కదా."

యిదంతా నాకు తర్వాత తట్టింది. అప్పట్లో మాత్రం యేదీ వివరించుకోలేని స్థితిలో వుండిపోయాను. నా బెదురులో యేదన్నా వదిలేస్తానేనే భయపడ్డాను. చెప్ప వలసిన అంతట్నీ చెప్పాను.

జడ్జీలు ఓ యిరవై నిముషాలు మాత్రమే చర్చించుకున్నారు. కాని నాకు మాత్రం ఆ కాసేపూ అనంతంలా కనిపించింది. దెగ్‌త్యర్యోవ్ తీర్పు చదివేటప్పుడు కష్టం మీద, యేదో మసక గుండా చూసినట్టు ముఖ్య విషయాన్ని బోధ పర్చుకున్నాను: నన్ను బయటికి గెంటెయ్యరు. నా కుర్రతనం వల్లా, మనస్ఫూర్తిగా పశ్చాత్తాప పడినందు వల్లా నన్ను గట్టిగా మందలించి ఆ విషయాన్ని వదిలెయ్యాలని కల్లీజియమ్ నిర్ణయించింది.

యిదంతా జరిగి యెన్నాళ్లో అయింది. కళ్ల నీళ్లు తిరిగేటట్టు భోరుమన్నానని కూడా దాచుకోకుండా చెప్తాను. దానికి దెగ్‌త్యర్యోవ్ చాలా జాలిగా, అపరిచిత కంఠంతో స్పందించాడు.

"సర్లే. సిగ్గు పడాల్సింది యేమీ లేదు. శుభ్రంగా యేడ్చెయ్యి. నీకు యింత కంటే దురదృష్టాలు రావు."

చాలా కాలం తర్వాత ముప్పయిలలో మళ్లీ ఒకసారి 'అడ్మిరల్ నెల్సన్'ని కలును కున్నాను. అప్పుడు నేను యు.ఎస్.ఎస్.ఆర్. ప్రాక్యురేటర్ ఆఫీసులో ఇన్వెస్టిగేటింగ్

బ్యూరో చీఫ్‌గా వున్నాను. ఒక రోజున యు.ఎస్.ఎస్.ఆర్. చీఫ్ ప్రాక్యురేటర్ ఐ. అకూలొవ్ ఆఫీసులోకి వెళ్లాను. అతను గందరగోళ పడి వున్నాడు.

"చూడండి యేం జరిగిందో. నా ఇనప్పెట్టె తాళం చెవి పోయింది. నేను రెండు గంటల్లో గవర్నమెంట్‌కి నివేదించాలి. కాగితాలు అన్నీ అందులో వున్నాయి. మన తాళాల మనిషి దానిమీద చెయ్యి వెయ్యనన్నాడు. రహస్య తాళం వున్న ప్రత్యేక ఇనప్పెట్టె యిది. దాన్ని తెరవాలంటే రోజంతా గట్టిగా పని చెయ్యాలట."

ఆ భారీ ఇనప్పెట్టెకేసి చూశాను. 'అడ్మిరల్ నెల్సన్' తన గత జీవితానికి సెలవు చెప్పి మారిపోయాడని కొన్ని యేళ్ల కితం ఓసిపొవ్ చెప్పింది గుర్తు వచ్చింది. అతను మాస్కోకి మకాం వచ్చేశాడు. ఓ మెటల్ వర్కింగ్ కోఆపరేటివ్‌లో చీఫ్ మెకానిక్‌గా పని చేస్తున్నాడు.

"ఓ క్షణం ఆగండి, మీకు సాయం చెయ్యడానికి ప్రయత్నిస్తాను" అన్నాను.

ఓసిపొవ్‌కి వెంటనే ఫోన్ చేసి జరిగిన సంగతి చెప్పాను. ఆయన అప్పుడు ఆంత రంగిక శాఖలో పనిచేస్తున్నాడు.

"యింక చెప్పక్కర్లేదు లేవయ్యా, సెమ్యోన్ మిఖైలొవిచ్ యెక్కడున్నాడో కబురు చేస్తాను. దొరికితే కూడా తీసుకొస్తాను. యేడాదిగా అతను కనిపించలేదు. అసలు వున్నాడో లేదో కూడా తెలీదు."

"మీరు చెప్పిన 'అడ్మిరల్ నెల్సనే'నా అతను?" అని అడిగాడు అకూలొవ్ నేను రిసీవర్ పెట్టేయగానే. అతనికి కాస్త అందిస్తే అంతా అల్లుకుపోతాడు.

"అవును."

"గత అనుభవం దృష్ట్యా చూస్తే అతనే యీ పనికి తగ్గవాడు. పాత కాపులు మనకి దగా చెయ్యరు, యేమంటారు?"

అతను తన వింత ధోరణిలో చిరునవ్వు నవ్వాడు. అతని సహోద్యోగులకి బాగా తెలిసిన మెత్తని కుటిలమైన చిరునవ్వు.

అరగంట లోపునే ఓసిపొవ్ వచ్చాడు. కొంచెం ఆయాస పడుతున్నాడు గాని యింకా గట్టిగానే వున్నాడు. ఆయన తోబాటు చక్కగా ముస్తాబైన మనిషి ఒకతను చిన్న సూట్ కేస్ పట్టుకుని వచ్చాడు. అతనికి ఒంటి కన్ను. రెండో కంటికి నల్లని పట్టీ కట్టాడు. వయసు కనిపిస్తూనే వుంది. 'అడ్మిరల్'ని గుర్తు పట్టడం కష్టం. యీ మధ్యలో వయసు పై బడ్డట్టు కనిపించాడు. కాని ఒంటి కంటిలో యెక్కడన్నో లోతులో మెరుపు కనిపించింది, మొదటి సారి అతన్ని కలిసినప్పుడు కనిపించినలాంటిది.

అకూలొవ్ 'అడ్మిరల్'ని పలకరించాడు.

"యెలా వున్నారు? కూర్చోండి. మీరు చెయ్యి తిరిగిన... ఆఁ... మెకానిక్ అని విన్నాను."

''యూరప్‌లో వున్న పోలీసు బలం ప్రతీదీ అలా అనుకున్న రోజులు ఒకప్పుడు వుండేవి'' అని 'అడ్మిరల్' హుందాగా సమాధానం చెప్పేడు. ''పోలీసులు మరెవ్వళ్ల కన్నా యెక్కువగా తప్పులు చేస్తారు. అయినా నాకు ఇనప్పెట్టెల గురించి యింకా కొంచెం తెలుసు. యిదేనా అది?'' అని ఇనప్పెట్టెని చూపించి అడిగాడు.

''అదే, యిది జర్మన్ దనుకుంటా.''

''అవును, లైప్జిగ్ ఇనప్పెట్టె'' అని దాన్ని పరీక్షిస్తూ 'అడ్మిరల్' వొప్పుకున్నాడు. ''కాని యిది మొదటి రకం కాదు, జర్మన్లన్నట్టు. యిది 'ఆట్టో గ్రిల్ అండ్ కంపెనీ'ది. యిలాంటివి ముందు మనకి తగిలాయి. యిక్కడ వున్నది స్టెయిన్‌లెస్ స్టీల్ డబల్‌లాక్, లోపల స్ప్రింగు ఆటోమేటిక్ పక్క బ్రేకు వున్నాయి. యెడం వేపున అది తాళాన్ని వెనక్కి పట్టుకుంటుంది. యిక్కడనే వుంది రహస్యం. యిది మ్యూజికల్‌ది. యేం చేస్తాం, జర్మన్లకి మ్యూజిక్ యిష్టం'' అన్నాడు.

తాళాన్ని ఆ స్థానంలో నొక్కి వుంచే అయిదు ఇత్తడి బోల్టుల్లోనూ ఒకదాన్ని 'అడ్మిరల్' నొక్కాడు. అది వెంటనే తెరుచుకుని సన్నగా సంగీతం పాడుతూ పక్కకి తిరిగింది.

''రైట్. పోలీసులు అన్ని వేళలా పొరపడరు, సెమ్యోన్ మిఖైలొవిచ్ — ఊఁ? మీరు నిజంగా సిద్ధ హస్తులు'' అన్నాడు అకూలొవ్.

''అప్పుడే పొగిడెయ్యకండి లేకపోతే నాలిక్కరుచు కోవాల్సివస్తుంది. యీ జర్మన్ వాడిని బాగా స్నేహం చేసుకుందాం'' అన్నాడు 'అడ్మిరల్'.

తర్వాత 'అడ్మిరల్' సూట్ కేస్‌లోనుంచి సన్నపాటి వూచని తీశాడు. పొడుగాటి తాళం చెవిని తీశాడు. దానికి కదులుతూ వుండే కొక్కెంలాంటిది వుంది. యేమీ చప్పుడు చెయ్యకుండా అతను దాన్ని తిప్పడం మొదలుపెట్టాడు.

''యినప్పెట్టె తాళాల్ని యెలా పడితే అలా గుంజ కూడదు జాగ్రత్తగా వుండాలి. అవి ఆడవాళ్లలాంటివి. మృదుత్వం కావాలి పశు బలంకంటే. నాలాంటి ముసలి తొత్తు ఆడాళ్ల గురించి మాట్లాడ్డం చిత్రంగా కనిపించవచ్చు. వయసులో వున్నప్పుడు ఒకనాటి 'అడ్మిరల్ నెల్సన్'కి ఇనప్పెట్టెలేగాక వేరేవీ తెలుసు, వున్నది ఒక్క కన్నే అయినా. విన్నారా కామ్రేడ్ అకూలొవ్, నాకా పేరు అలానే వచ్చింది. అడ్మిరల్ నెల్సన్‌కి కూడా ఒకటే కన్ను. 1905లో నేను ఆమ్‌స్టర్‌డామ్ వెళ్లాను. సరే జరిగిపోయినవి రావను కోండి. అక్కడ చాలా భేషైన ఇనప్పెట్టెని తాకానని చెప్పాలి. ఓ వారం రోజుల్లో ఇంగ్లండ్ దేశం గొరాషియో నెల్సన్ శత జయంతి జరపబోతోందని ఆ మర్నాడు పేపర్లలో చదివాను. మీకు తెలుసుకదా ఆయన ట్రఫాల్గర్ యుద్ధంలో అక్టోబరు 21న చనిపోయాడు, అప్పుడే **ఆయన** ఫ్రాంకో — స్పానిష్ ఫ్లీట్‌ని ఓడించాడు. ఆ పేరు వున్న మనిషిగా నా ఉడతాభక్తి ఆయన స్మరణ చేద్దామనుకున్నాను. ఆ మర్నాడు

ఆమ్‌స్టర్‌డామ్‌లో బోలెడు డచ్ తులిప్ పువ్వులు కొని వాటిని ఓడమీద వేసుకుని ఇంగ్లండ్‌కి బయల్దేరాను. మూడు ట్రక్కులు నా తులిప్ పువ్వుల్ని సమాధి దగ్గరికి మోశాయి. నేనే ఆ సందర్భంగా కొత్త ఫ్రాక్ కోటు తొడుక్కుని పొడుగాటి హేట్‌ని పెట్టుకున్నాను. నమ్మండి, నా తులిప్ పువ్వులని చూడగానే జనం అడ్మిరాలిటీ ఫస్ట్ లార్డ్ కంటే యెక్కువగా నా గురించే పట్టించుకున్నారనుకోండి. అప్పుడు నేను ఓ ఉపన్యాసం యిచ్చాను. 'సోదరసోదరీమణులారా, సాటిలేని ఒదెస్స నగరం తరపున యిక్కడకి ప్రతినిధిగా రావడం గౌరవమూ సంతోషమూనూ. ఒదెస్స నగరం ప్రపంచానికి యెంతో మంది కవుల్ని, సంగీతకారుల్ని, నావికుల్ని, నేరస్థుల్ని అందించింది. మీ వొంటి కంటి అడ్మిరల్‌కి తన పని యేమిటో తెలుసు. ఆ లక్షణం చాలా మంది వొంటి కంటి వాళ్లకి వుంటుంది' అన్నాను. యిక చప్పట్లు కొట్టారు చూడండి. నిజంగా, కాంట్ చెప్పినట్టు 'మా వార్ధక్యంలో మాకు జ్ఞాపకాలు మిగుల్తాయి.' నిజంగా, అంతేనేమో నాకు తెలియక పోయినా'' అన్నాడు.

''అంటే జ్ఞాపకాలు మిగుల్తాయనా, లేక కాంట్ ఆ మాటలు అన్నాడో లేదోననా'' అన్నాడు అకూలొవ్ గబగబా.

''మనం యిప్పుడు కాంట్ గురించి మాట్లాడుకుంటున్నామన్న విషయానికి ఓసిపొవ్ సాక్ష్యం. నాకు కొన్ని యేళ్లుగా జ్ఞాపకాలు తప్ప నెమరు వేసుకోవడానికి యేమీ లేవన్నది క్రిమినల్ డిపార్ట్‌మెంట్‌కి లాభం, నాకే కాదు.''

''ఆ ముక్క నిజమే'' అని ఓసిపొవ్ వొప్పుకున్నాడు.

ఆ క్షణంలో ''అమ్మయ్య, తల్లీ దణ్ణం'' అని 'అడ్మిరల్' ఇనప్పెట్టెని తెరిచాడు.

అకూలొవ్ అతనికి థేంక్స్ చెప్పి యెంతివ్వమంటావని నేర్పుగా అడిగాడు. కాని 'అడ్మిరల్'కి మండిపోయింది. దాంతో ఆ విషయాన్ని అక్కడ వదిలేశారు.

''మరో సారి థేంక్స్, సెమ్యోన్ మిహైలొవిచ్. యిప్పుడు మిమ్మల్ని కలుసుకున్నందుకు నాకు నిజంగా సంతోషంగా వుంది. మీ జీవితంలో మహా కష్టమైన పరీక్షలో మీరు నెగ్గారు. యినప్పెట్టెని గురించి అనడం లేదు నేను'' అన్నాడు అకూలొవ్.

''మీరన్నది నాకు తెలిసింది కామ్రేడ్ అకూలొవ్'' అన్నాడు 'అడ్మిరల్' మెల్లిగా. ''దీన్ని తెరిచిన మనిషి గురించి మీరు అనుకుంటున్నారు. నిజానికి యీ పరీక్షకి నేనెప్పటినుంచో తయారవుతున్నాను. చిల్లుల దినార్‌ల కోసం మేం వెతకడం జరిగినప్పట్నుంచీ. యిప్పుడు నేను పూష్కిన్ మ్యూజియంని ప్రతి యేడు సందర్శిస్తాను. అక్కడ ప్రాచీన నాణేల విభాగం వుంది. వాటిని చూస్తూ వుంటాను. యెన్నో యేళ్ల కితం వాటిని తయారు చేసి వెళ్లిపోయిన ఆ అజ్ఞాత వ్యక్తికి కృతజ్ఞతలు చెప్పుకుంటాను. కాని నేను సజీవులై, సుజ్ఞాతమవుతూ వున్న పనివాళ్లకి యింకా యెక్కువ

కృతజ్ఞతలు చెప్తాను మన అద్భుత యుగాన్ని నిర్మిస్తున్నారు వీళ్ళు. నాలాంటి అరిగి పోయిన నాణేల్ని కూడా తిరిగిపోత పోస్తున్నారు. మన కాలమూ, మన ప్రజలూ వర్ధిల్లాలి కామ్రేడ్ ప్రొక్యురేటర్'' అన్నాడు.

''మీతో షేక్ హేండ్ చేస్తున్నాను'' అన్నాడు అకూలొవ్, ఆ విషయానికే కచ్చితంగా కాకుండా 'అడ్మిరల్' అన్న మాటలకి జవాబుగా.

1956

తోడేళ్ల గుంపు

1927లో నేను లెనిన్‌గ్రాడ్ బదిలీ అయినప్పుడు ఆ నగరంలో నేరాలు ఘోరంగా జరిగిపోతూ వున్నాయి. లెనిన్‌గ్రాడ్ ఇన్వెస్టిగేటర్లు కేసుల్లో మునిగిపోయి వున్నారు. 'నూతన ఆర్థిక విధానం' నిరాఘాటంగా పరిఢవిల్లుతూ వుంది. మాస్కో నెప్‌మన్లకీ లెనిన్‌గ్రాడ్ నెప్‌మన్లకీ జీవిత ప్రవర్తనలో తేడా వుంది. లెనిన్‌గ్రాడ్ వాళ్లల్లో చాలా మంది విప్లవాత్పూర్వపు వ్యాపార ఉన్నత వర్గాల వాళ్లు. పూర్వపు రాజధానీ నగర ప్రభువర్గంతో సన్నిహిత సంబంధాలు వాళ్లకి వున్నాయి. రాజ కుటుంబాల వాళ్లని, జమీందారుల కుటుంబాల వాళ్లని పెళ్లాడ్డానికి లెనిన్‌గ్రాడ్ నెప్‌మన్‌లు ఉరకలు వేసుకుంటూ ముందుకొచ్చేవాళ్లు. తమ జీవిత ధోరణుల్లో పీటర్స్‌బుర్గ్ ''ఉన్నత సమాజాన్ని'' అనుకరించేవాళ్లు.

నెప్‌మన్‌లు ప్రభుత్వ సంస్థలా, పరిశ్రమలా మేనేజర్లని తరచుగా దగా చేసేవాళ్లు. వాళ్లతో నానా రకాల ఒప్పందాల్నీ కాంట్రాక్టులనీ కుదుర్చుకునేవాళ్లు. తమకి తగిలిన సోవియట్ల కార్యకర్తలని ప్రలోభాలకి గురిచెయ్యాలని ప్రయత్నించి యీ నెప్‌మన్‌లు లంచాలద్వారా, అనేక రకాల చిన్న చిన్న అవసరాలు తీర్చడంద్వారా, విందులూ ''కానుకలూ'' యివ్వడంద్వారా ''కులాసా జీవితం'' గడిపే కాంక్షని వాళ్లల్లో రేకెత్తించ ప్రయత్నించారు. అలాంటి కాంక్షల్ని రేకెత్తించడానికి ప్రలోభ అవకాశాలు చాలా వుండేవి. నఖిమ్‌సన్ ప్రాస్పెక్టులో దివ్యమైన స్తంభాల భవనంలో ప్రఖ్యాత వ్లదీమిర్ క్లబ్ వుండేది. అక్కడ కాసినో వుండేది. ఆ కాసినోలో మంచి సూట్లు వేసుకున్న క్రూపియర్లు వుండేవాళ్లు. ఖరీదైన అమ్మాయిలు వుండేవాళ్లు. విప్లవానికి ముందు హోటెల్ యజమానిగా ప్రసిద్ధిచెందిన ఫ్యోదొరొవ్ తన రెస్టారెంట్‌ని తిరిగి తెరిచాడు. గుమ్మడి కాయలా మొహమూ వాడూ ఆజాను బాహువు. మధువుల మాధుర్యం తెలిసిన తన ఖాతాదార్లని చకితుల్ని చేసేడు. అతని పోటీ వ్యాపారులు 'సాన్స్ సూసి', 'ఇటాలియా', 'ఏనుగు', 'పాలెర్మో', 'క్వీసీసనా', 'విస్మృతి' 'ఆనందం' యజమానులు.

'యెవ్రోపేయ్‌స్కాయ' హోటెల్ అండర్‌గ్రౌండ్‌లో వున్న ప్రసిద్ధ 'బార్' రాత్రి తెల్లవార్లూ రంగరంగ వైభవంగా వ్యాపారం చేసేది. అక్కడ మూడు అంతస్తుల హాల్ వుండేది. మూడు ఆర్కెస్ట్రాలు వుండేవి. టేబిల్స్ పెద్ద సముద్రంలా వుండేవి. వాటి దగ్గర తార్పుడుగాళ్లు, వేశ్యలు, కళాకారులు, నెప్‌మన్‌లు, దొంగలు, మాజీ రాకుమారులు, రాకుమార్తెలు, ఎర్ర బుగ్గల నావికులు, విద్యార్థులు కూర్చుని తాగి, తిని, వాగి, పాడి, నవ్వి, వాదులాడుకొని ప్రేమ కలాపాలు జరిపేవాళ్లు.

ముచ్చటగా వుండే వగలాడి పుష్పలావికలు వుండేవాళ్లు. వాళ్లు పువ్వుల కంటే యెక్కువే అమ్మేవాళ్లు. తెల్లటి యూనిఫారాలు వేసుకున్న వెయిటర్లు ఆ బల్లల మధ్య తిరిగేవాళ్లు. ఆ బల్లల మధ్య గబగబా పని చేస్తూ తిరుగుతూ వుండే ఆ వెయిటర్లకి ఆ గోలకీ, సంగీతానికీ, ధగధగ మెరిసే బట్టలకీ ముఖాలకీ తల తిప్పు పట్టుకునేది.

లెనిన్‌గ్రాడ్ నూతన ఆర్థిక విధాన "చక్రవర్తులు" అయిన క్యూన్‌లు, మగీద్‌లు, సీమనొవ్‌లూ, సాల్మన్లూ, క్రాఫ్ట్‌లూ, ఫ్యొదొరొవ్‌లూ, సాటిలేని రెస్టారెంట్లలో మామూలుగా గానా బజానా సాగించేవాళ్లు: సదోవయా వీధిలో వున్న 'ఫస్ట్ సొసైటీ', ఫ్యొదొరొవ్ రెస్టారెంటు, 'అస్తోరియా', లేదా 'యెవ్రపేయ్‌స్కాయ' హోటెల్‌లో 'రూఫ్ గార్డెన్' రెస్టారెంటు. వేసవిలో లెనిన్‌గ్రాడ్ పరిసరాల్లో విశ్రాంతి స్థావరం అయిన సెస్త్రొరెత్‌స్క్ రైల్వే స్టేషన్ రెస్టారెంట్‌కి యెక్కువగా వెళ్లేవాళ్లు. దానికి వెల్లడిగా వుండే విశాలమైన హాల్ వుండేది. అక్కడ్నుంచి సముద్రం కనిపించేది. అప్పుడే జనాకర్షకమవుతున్న జాజ్ సంగీతాన్ని అక్కడ వాయించారు. జనం రాత్రి ఉత్యోసొవ్ 'ఫ్రీ థియెటర్'లోనో, మ్యూజిక్ హాల్‌లోనో, లేకపోతే కామెడీ థియేటర్‌లోనో ప్రదర్శన చూసేవాళ్లు. నదేజ్దిన్, గ్రనోవ్‌స్కయాల ప్రైవేటు సంస్థ అద్దెకి తీసుకున్నటువంటిది యీ కామెడీ థియేటర్. చాలా ప్రతిభగల కామెడీ బృందం అక్కడ ప్రదర్శన యిచ్చేది. నగరంలో గొప్పది అదే. ఆ ప్రదర్శనలు చూసింతర్వాత జనం కారుల్లో యీ రెస్టారెంట్‌కి వచ్చేవాళ్లు.

యీ వెల్లడిగా వుండే హాలులో హాయిగా, దీపాల మసక వెలుతురులో బల్లల దగ్గర చేరి చీకటి తీరాన్ని తాకే అలల మంద్రధ్వని నేపథ్యంలో యీ "చక్రవర్తులు" లక్షలకి లక్షలు సాగే వ్యవహారాలు నడిపేవాళ్లు. బేరా లాడేవాళ్లు, వ్యాపార సంస్థల యేర్పాటు చేసుకునేవాళ్లు, ఒప్పందాలు కుదుర్చుకునే వాళ్లు, చాలా వివరంగా "సాధారణ పరిస్థితి"ని గురించి పరిశీలించేవాళ్లు. వాళ్ల అభిప్రాయం ప్రకారం, 1927లో ఆ పరిస్థితి ఉద్రిక్తంగా నిరాశాభరితంగా వుండేది.

"తాత్కాలిక వెనుకంజ" ముగింపు కొస్తోందనీ, తరుణమైనదైనా దృఢంగా వున్న ప్రభుత్వ పరిశ్రమ, వ్యాపారం, సహకార సంస్థలూ ప్రైవేట్ రంగం కంటే ముందుకు

పోతున్నాయనీ బాగా దూరదృష్టిగల వాళ్లు గ్రహించేరు. నెప్‌మన్‌లకి తమ లాభాలమీద పడే పన్నుల గురించి ముఖ్యంగా బెంగగా వుండేది. లెనిన్‌గ్రాడ్ రీజినల్ రెవెన్యూ డిపార్ట్‌మెంట్ పన్నుల విభాగం ఛీఫ్ సెర్గేయ్ తెర్‌అవనేసొవ్‌ని తిట్టిన తిట్టు తిట్టకుండా శాపనార్థాలు పెట్టేవాళ్లు. ఆయన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లపైన అజమాయిషీ చేసేవాడు, ''అసాధ్యుడని'' పేరు వుండేది.

రంగుల ఉత్పత్తిదారు క్యూన్, చాకొలెట్ల ఉత్పత్తిదారు క్రాఫ్ట్ యేదో నిగూఢ పద్ధతిలో తెర్‌అవనేసొవ్ ప్రాపకం సంపాదించారని 1927 చివర్లో కొన్ని వదంతులు వ్యాపించిన మాట నిజమే. కాని మిగతా ''చక్రవర్తు''ల్లో వున్న వీళ్ల మిత్రులు యీ విషయమై అడగ్గా వీళ్లు అది తప్పని వొట్టు పెట్టుకుని చెప్పడంతోటి వాళ్లని ఆఖరికి నమ్మాల్సివచ్చింది.

తర్వాత 1928 ఆరంభంలో కొన్ని దుష్ట ఘటనలు వరసగా జరిగాయి. ఒక్క రోజులో తెర్‌అవనేసొవ్‌నీ, డజను మందికి పైబడి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లనీ, క్రాఫ్ట్, సాల్మన్, మగీద్, ఫ్యోదొరొవ్‌లతో సహా చాలా మంది నెప్‌మన్‌లనీ అరెస్టు చెయ్యడం జరిగింది. పన్నులు తగ్గించినందుకుగాను రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు నెప్‌మన్‌ల దగ్గర లంచాలు తీసుకున్న సందర్భాల్ని ఇన్వెస్టిగేటింగ్ ఆఫీసులు కనిపెట్టాయని వదంతి పుట్టింది. పేరు పొందిన క్యూన్ అదృశ్యం అయిపోయాడు. అతని రంగుల ఫాక్టరీని అధికారులు అటాచ్ చేశారు. ఒదెస్స నగరానికి చెందిన గ్రీకు వ్యక్తి యనాకి మొత్తం పురాతన వస్తువుల మార్కెట్‌ని గుప్పిట్లో వుంచుకున్నాడు. అతనూ క్యూన్‌లాగా ఆ రాత్రే అంతర్థానం అయిపోయాడు. పాత రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ల స్థానంలో కొత్త వాళ్లని వేశారు. యీ కొత్త వాళ్ల దగ్గరికి ప్రాపకం కోసం వెళ్లడం అనేది అసంభవం.

''రెడ్ గెజెట్'' అని ఓ పత్రిక వుండేది. అది అనుబంధంగా ''డైరీ ఆఫ్ లేడీ ఇన్ వెయిటింగ్'' అని ఒక సెన్సేషనల్ సీరియల్‌ని ప్రచురించేది. వీరుబొవా అని రస్పూతిన్* ఉంపుడుకత్తే చక్రవర్తిగారి అభిమాన పాత్రురాలూ అయిన ఆవిడ స్మృతుల్ని ప్రచురించడంతోటి ఆ పత్రికకి విపరీతమైన సర్క్యులేషన్ వుండేది. అలాంటి పత్రిక ఒక నిగూఢమైన దుశ్శకున సూచక వ్యాసాన్ని ప్రచురించింది. చట్ట విరుద్ధంగా నెప్‌మన్‌ల పన్నుల్ని కోసి పారేసిన రెవెన్యూ ఇనస్పెక్టర్ల కేసు విజయవంతంగా పురోగమిస్తోందనీ, కొత్త అనుమానితుల్ని పట్టుకున్నారనీ ఆ వ్యాసంలో ప్రస్తావించింది. సెస్త్రొరెత్‌స్క్‌కి జరిపే రాత్రి యాత్రలూ, 'అస్తోరియా'లోనూ, 'రూఫ్ గార్డెన్' లోనూ సాగే గానా బజానాలూ ఆగిపోయాయి. చాలా ప్రైవేటు షాపులూ, సంఘాలూ

---

* రస్పూతిన్ (1872–1916) – ఆఖరి జార్ రెండవ నికొలాయ్‌కీ ఆయన రాణీకీ అభిమాన పాత్రుడు. – సం.

మూతపడిపోయాయి. "అద్దెకి" అనే పసుప్పచ్చ సంకేతం వున్న కార్లూ బళ్లూ కాతాదార్లు తగ్గిపోవడంతో ఆయా గేటుల్లో పని లేక పడిగాపులుపడి వుండిపోయేవి.

నూతన ఆర్థిక వ్యవస్థ "ముందరి శ్రేణి" చాలా చోట్ల తెగిపోయింది.

నెవ్‌మన్‌లకీ, రెవెన్యూ ఇనస్పెక్టర్లకీ లంచాలు యిచ్చిపుచ్చుకునేవాళ్లకీ సంబంధించిన యీ ముఖ్యమైన కేసుని నాకు అప్పగించారు. యీ కేసు చాలా వాల్యూమ్‌లు నిండిపోయింది. డజన్ల కొద్దీ రికార్డులు, వేల కొద్దీ డాక్యుమెంట్లు లెక్క లేనన్ని నిపుణుల అభిప్రాయాలు వున్నాయి. నడుములు విరిగిపోయేటంత కష్టభూయిష్టమైన పని యిది. యీ కేసుని చూసే రీజినల్ ప్రాక్యురేటర్ మమ్మల్ని తొందర పెడుతూ వుండేవాడు, పది మంది దృష్టీ దీనిమీదే వుండబట్టి.

ఆర్థిక, అధికారిక కేసులని పిలిచే వాటితో వ్యవహరించే ఇన్వెస్టిగేటరుకి ఆశ్చర్యకర మానవ జీవిత సంఘటనలూ మానసిక సంఘర్షణలూ, బలమైన ఉద్రేకాలూ యెప్పుడోగాని తగలవనే తప్పుడు అభిప్రాయం వుంది, అది ప్రాచుర్యంగా కూడా వుంది. అది సరి కాదు. అసూయ కొద్దీ చేసే హత్యలు, ఆత్మహత్యలు, అవినీతి వగైరాల్లాంటి మానవ ప్రవృత్తి ప్రేరిత నేర సందర్భాల్లో ఇన్వెస్టిగేటర్ ప్రేమ, అసూయ, పగ, మోసం, దగా, ఒత్తిడిలాంటి మానసిక సమస్యల్ని కేసు స్వభావాన్నిబట్టే ముఖాముఖీ యెదుర్కొంటాడన్న మాట నిజం. అలాంటి సందర్భాల్లో యీ సమస్యల గురించిన స్పష్టమైన చిత్రం వుంటేనే గాని విచారణ పూర్తి చెయ్యడం అసాధ్యం. వాటన్నిటికీ పరమ ప్రాముఖ్యం వుంటుంది. అవి నేరం వెనక ఉద్దేశాలని, ఆ నేరం యెలా పుట్టి అమలు జరిగిందో ఆ సందర్భాలని విశదం చేస్తాయి.

లంచం విషయంలో యీ ప్రశ్నలు కొన్ని సందర్భాలలో ఉత్పన్నమే కాకపోవచ్చు ఆ మాట నిజమే కావచ్చు. కాని లంచం తీసుకోవడం జరిగిందీ అని రుజువయాక యెందుకని అలా జరిగిందో కోర్టు నిర్ణయించాలి. యితర క్రిమినల్ కేసుల్లోలాగా దీన్ని రెండు పక్షాల కన్‌ఫెషన్లకీ పరిమితం చెయ్యలేం. యేమంటే కన్‌ఫెషనే "సకల సాక్ష్యాలకీ తలమానికం" అని దానిమీదనే ఓ ఇన్వెస్టిగేటరు ఆధారపడితే అది న్యాయపరంగా, మానసిక విషయాల పరంగా అతని అసమర్థతనో లేదా తన పనిని సరిగా చెయ్యడం అతనికి యిష్టం లేదనో తెలియ చేస్తుంది. నెవ్‌మన్‌ల, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ల యీ కేసులో దాదాపు డిఫెండెంట్లందరూ నేరం ఒప్పేసుకున్నారు. కాని వాళ్ల మాటల్ని సరిచూడాలి, పత్రాలూ అంకెలూ ధృవీకరించాలి. యేమంటే అది చట్ట వ్యతిరేకమైన పన్ను రాయితీ.

ఈ కేసు ప్రతి సందర్భంలోనూ చట్ట వ్యతిరేకంగా పన్ను తగ్గించిన వాస్తవాన్నీ,

అందచేసిన లంచానికి ప్రతి సందర్భంలోనూ ఆ రాయితీ కచ్చితమైన మొత్తాన్నీ ధృవ పరచడం నా కర్తవ్యం అయింది.

మరో పక్క సమస్యకిగల సాంఘిక, మనస్తత్వ శాస్త్ర ప్రాముఖ్యం కూడా తక్కువదేం కాదు. అది నా విశ్వాసం. అంటే, అంత పెద్ద సంఖ్యలో — వాళ్లల్లో కమ్యూనిస్టులు కూడా వున్నారు మరి — ఆర్థిక యుద్ధంలో కీలక స్థానాల్లో వున్న వాళ్లు దేశ ద్రోహం అనిపించేలాంటి నేరాన్ని కొన్ని సందర్భాల్లో ప్లేటు ఫిరాయించి, కొన్ని సందర్భాల్లో శత్రువులకి యేజంట్లుగా మారి యెలా చేశారా అనేది ఆ సమస్య. యీ కేసులో యిరికిన ప్రతి ఒక్క రెవెన్యూ ఇనస్పెక్టర్ ప్రవర్తననుంచీ, జీవిత గాథలనుంచీ సమాధానం రాబట్ట ప్రయత్నించాను. క్రమేపీ కేసుకి గల యీ పార్శ్వం స్పష్టమవసాగింది. వాళ్లు చేసిన యీ చర్యలకి కారణం అధిక భాగం తాగుడు, నైతిక అస్థిరత్వం; ఒక సంకల్పం నైతిక సూత్రాలు లేకపోవడంవల్ల తప్పనిసరిగా వచ్చే నీతి భ్రష్టత; దురాశ, సులభంగా సొమ్ము పట్టేద్దామనే కోరిక. నెప్‌మన్‌లు వాళ్లని తెలివిగా వల పన్ని పట్టుకోవడం. యెవడేనా నిజాయితీపూర్వకమైన విశ్వాసాలు, తను యే లక్ష్యం కోసం పని చేస్తున్నాడో దానికి సంబంధించిన కచ్చితమైన అభిప్రాయాలూ విశ్వాసమూ లేకపోతే లంచాలు పడతాడు. యింకోడు తాగుడు వల్ల దానికి బానిసైపోయి తన గౌరవాన్నీ, తన భవిష్యత్తునీ తనకి తెలిసే ముందే తాగేస్తాడు. యింకోడు, పాపం, యెప్పుడూ నిజాయితీగా వుండే మనిషే, కాని చెడు సావాసాలు మరిగి నెప్‌మన్‌ల దగ్గరినుంచి చిన్నా చితకా బహుమతులతో మొదలెడతాడు. నెపమన్‌లాంటి వాళ్లు అతని దగ్గరికి వెళ్లగలిగే కుశలత్వంతోనే వుంటారు. పాపభీతిలేని లంచగొండిగా వాణ్ణి తయారు చేసి "ఆఁ పీడాపోయిరి" అనే పాత సూత్రానికి వాడు పూర్తిగా లొంగిపోయేటట్టు చేస్తారు. యింక నాలుగో రకం వాళ్లుంటారు. వాళ్ల పెళ్లాలు అయ్యో ఖర్మ "పొరుగింటి మీనాక్షమ్మను చూశారా, వాళ్ల ఆయన చేసే ముద్దుముచ్చట కన్నారా," నా బతుకే యిలా కాలిందని రోజూ సలుపుతూ వుంటే, జీతంకంటే వాతం యెక్కువ మోజు అయి వో సీల్ స్కిన్ కోటు బహుమతి పుచ్చుకుని ఆఖరికి పులి పంజా కింద చేరతారు.

నాకు ఓ చిత్రమైన సంఘటన గుర్తుంది. గిర్స్ అనే ఒక నెప్‌మన్ వుండేవాడు. జిత్తులమారి, మోసగాడు. అతను ప్లతోనావ్ అనే రెవెన్యూ ఇన్‌స్పెక్టరుకి ప్రలోభపెట్టి వాళ్ల ఆవిడకి సీల్ స్కిన్ కోటు తీసుకునేటట్టు చేశాడు. ఆమె పడుచుది. ముచ్చటగా వుండేది. మొగుణ్ణి అవీ యివీ తెమ్మని వేధించేది. అతనామెని ఆరాధించేవాడు. ఆ తర్వాత ఆ నెప్‌మన్ గిర్స్ ప్లతోనావ్‌కి ముళ్లు వెయ్యడం మొదలెట్టాడు. యితర నెప్‌మన్‌లనుంచి ఇనస్పెక్టరు పేరుతో లంచాలు తీసుకోవడం మొదలుపెట్టి పెద్ద మొత్తాలు తను దిగ దొక్కుకుని, కొంత అతనికిచ్చి అతన్ని ప్రతి విషయంలోనూ

తనకి ఒదిగి వుండేట్టు చేసుకున్నాడు. ప్లతోనొవ్ యువకుడు. అతని కళ్ళు నీలంగా వుంటాయి. జుట్టు రాగి రంగులో వుంటుంది. ముఖం దయాన్వితంగా వుంటుంది. పెదాలు గుండ్రంగా మృదువుగా వుంటాయి. దృఢ సంకల్పం వున్న మనిషి కాదు. కొన్ని సార్లు ప్రతిఘటించబోయాడు. కాని తన బొటన వేలి కింద అతన్ని నొక్కి పట్టివుంచినట్టు అప్పటికే గిర్స్‌కి తెలుసు. గిర్స్ బెదిరిస్తున్నట్టు కనుబొమలు యెత్తి కటువుగా "నాయనా, నేను తమరికి చేసిన మేలు మరిచిపోతున్నట్టు వుంది" అని రెట్టించేవాడు. యీ మాటలని చాలా బెదిరింపు గొంతుకతో అనేవాడు. విషపూరితంగా కటువుగా చూసేవాడు. దాంతోటి ప్లతోనొవ్ వెంటనే తగ్గిపోయి క్షమించమని అడిగేవాడు. హృదయం లోతుల్లో మాత్రం ఈ దయ్యాన్నీ తన ముచ్చటైన పెళ్ళాన్నీ తనని బానిసని చేసిన సీల్ స్కిన్ కోటునీ తిట్టుకునేవాడు.

తర్వాత ఇన్వెస్టిగేటర్‌గా ఉద్యోగం చేసేటప్పుడు నాకు సంకల్పబలం లేక అస్థిరంగా వుండే మనుషులు చాలా మంది తగిలారు. మొదట్లో వాళ్ళు మచ్చలేకుండా వున్నవాళ్ళే. కాని యితరుల దుష్ట, నేర సంకల్పం పెత్తనం కింద పడి పూర్తిగా లొంగిపోయినవాళ్ళు. అలాంటి దురదృష్టవంతులంటే నాకెప్పుడూ బాధగానే వుండేది — మూగగా, జంతువుల్లాగా లొంగిపోవడం అసహ్యకరంగా వున్నా. దానివల్లనే వాళ్ళు బానిసలైపోయేవాళ్ళు. సంకల్పబలం లేకపోవడం అనేది నేరానికి తోబుట్టువు. యీ భయంకరమైన బాంధవ్యానికి నేను తరచుగా సాక్షిగా వున్నాను.

ఉచ్చు

పిచ్చి ప్రేమ, సంకల్పబలం లేకపోవడం అనేవి అంతకు ముందు నిజాయితీగా వుండే మనిషిని, మచ్చలేని అతని జీవితాన్ని నాశనం చేసి ప్రమాదకరమైన నేరస్థుడిగా యెలా మారుస్తాయో యీ కేసులో పని చేసేటప్పుడు నాకు స్పష్టంగా తెలిశాయి. సెర్గేయ్ తెర్అవనేసొవ్ ఆ మనిషి.

అతను విప్లవం తొలి రోజుల నాటినుంచీ లెనిన్‌గ్రాడ్ రీజినల్ రెవెన్యూ ఆఫీసులో పని చేసేవాడు. అతను అర్థికశాస్త్రవేత్త. గొప్ప ఫైనాన్షియల్ ఎక్స్‌పర్ట్ అనడంలో అనుమానం లేదు. మంచి పనివాడు. పార్టీ మెంబరు కాకపోయినా, అప్పట్లో వాడుకలో వున్న పదబంధం ప్రకారం "సోవియట్ ప్రభుత్వపు వేదికని పూర్తిగా బలపరిచినవాడు."

తెర్అవనేసొవ్ పడుచువాడేం కాదు. అవివాహితుడు. మొదట్లో చదువు, తర్వాత పని తలమునకలుగా వుండడంతో అతనికి దేనికీ వ్యవధి లేకపోయింది. అతని యాభై

యవ పుట్టిన రోజున తన జీవితం దాదాపు అయిపోయిందని అతను కనిపెట్టాడు. తనకో సంసారం, పిల్లలు, పోనీ కనీసం చెప్పుకోదగ్గ ప్రేమ వ్యవహారం లేకపోయాయే అని గ్రహించాడు.

"యితరులు నన్ను చూసినట్టుగా నన్ను నేను చూసుకోడానికి ఆ రోజున జాగ్రత్తగా అద్దంలో చూసుకున్నాను. సిలిండర్లా గుండ్రంగా చిన్నగా వుండి బుంగ మొహంతో నెత్తిమీద అరచెయ్యి వెడల్పున తల బట్టకట్టిన మధ్య వయస్కుడు దిగులుగా నాకేసి చూస్తూ 'సోదరా చూడు నువ్వు నాకు యేం చేశావో! నువ్వు ముసలాడివి, నీ ముసలితనంలో గుర్తుచేసుకోడానికి నీకు యేమీ లేదు. ఆర్థిక పుస్తకాల పురుగు! నువ్వెప్పుడన్నా యేమన్నా చూశావా బడ్జెట్ పేరాగ్రాఫులూ, అదనపు చార్జీలూ, అసెస్‌మెంట్లూ తప్ప, శుంఠ? అసలైన ఆడమనిషితో యెన్నడన్నా సిసలైన ప్రేమ యెరుగుదువా? నీ గుండె స్పందించే ప్రేమ యెరుగుదువా? నిద్రపోనివ్వకుండా అనూయతో వేదన పెట్టే ప్రేమ, శ్వేత రాత్రులప్పుడు నేవా నది గట్టున విహరించేటట్టు చేసే ప్రేమ యెరుగుదువా? ఆమె పట్టించుకోకపోతే పిచ్చెక్కించి, ఆఖరికి వూ అంటే పరవశత్వంతో పులకింపచేసే ప్రేమ యెరుగుదువా?' అని ఆ రూపం అన్నట్టు అనిపించింది. మొత్తంమీద అది భయంకరమైన రోజు, పరమ విచారకరమైన ముగింపులు ముక్తాయింపుగా వచ్చిన రోజు" అని అతను నాతో అన్నాడు.

తెర్‌అవనేసొవ్ నిట్టూర్చి సిగరెట్ ముట్టించాడు. నా గది కిటికీలు ఫంతాంక నది కేసి తెరిచి వున్నాయి. మే నెల యెండ రోజు. దూరంగా శోభాయమానంగా పత్రహరితమైన సమ్మర్ గార్డెన్ వుంది. అక్కడనుంచి పిల్లల కంఠాలు కిలకిలలాడుతూ వినిపిస్తున్నాయి.

"నిజానికి దీనికి నా కేసుతో యేమీ సంబంధం లేదు" అన్నాడతను వున్నట్టుండి. "క్యాన్‌నుంచీ, క్రాఫ్ట్‌నుంచీ వాళ్ల పన్నులు తగ్గించినందుకు లంచాలు పుచ్చుకున్నానని నేను ఒప్పుకున్నాను. మిగిలిందంతా వూరికే మాటలు, నా జైలు గదిలో ఆలోచించవలసినదేదో" అన్నాడు.

"కాని అంతకు ముందెన్నడన్నా లంచాలు పుచ్చుకున్నారా?"

"యెన్నడూ! 1927 ఆకురాలు కాలం దాకా నేను తలవంచాల్సిందేమీ లేకపోయింది. నామీద ఒట్టు!"

యీ మాటల్ని యెంతో నమ్మకంతో, మనస్ఫూర్తిగా అన్నాడు. నేను అది అబద్ధం అనుకోవడానికి అవకాశమే లేదు. పైగా రెవెన్యూ డిపార్ట్‌మెంట్ కొలువులో తను చేసిన దీర్ఘ సేవా కాలంలో తెర్‌అవనేసొవ్ ఒక్క తప్పటడుగు వేశాడని చెప్పేందుకు వీలు లేదు. మరో పక్కనుంచి చూస్తే అధికారిక విధులకి సంబంధించి అతని వైఖరి అందరికీ తెలుసు, వేలు పెట్టి చూపించడానికి లేదు.

యిన్ని యేళ్లు స్థిరంగా తను నడిచిన పథంమీదనుంచి యీ అనుభవజ్ఞుడైన వ్యక్తిని విద్యాధికుణ్ణి, నిజాయితీపరుణ్ణి పక్కకి తోసింది యేదై వుంటుంది?

ఆ ప్రశ్నకి సమాధానం యివ్వగలిగిన మనిషి అతనొక్కడే. కాని అతనికి ఆ కోరిక లేదు. యెన్నో సార్లు అతన్ని ప్రశ్నించిం తర్వాత యీ ధోరణిలో సంభాషణ తిప్పాలని ప్రయత్నించాను. "రికార్డు కోసం" దాన్ని తెలుసుకోవడం నాకు యిష్టం లేదని కూడా విపులీకరించి చెప్పాను. కాని అతను విచారంగా, చిరునవ్వు నవ్వేవాడు. జవాబు మాత్రం చెప్పేవాడు కాదు.

యీ లోపున కేసు ఇన్వెస్టిగేషన్ ముగింపు కొస్తోంది. డిఫెండెంట్ల భార్యలని వారంవారం తమ భర్తలని చూడ్డానికి అనుమతి యిచ్చేవారు. ప్రతి గురువారం వాళ్లు పాస్‌ల కోసం నా దగ్గరికి వచ్చేవాళ్లు. తెర్‌అవనేసొవ్ భార్య కూడా వచ్చేది. అతను అంతకు ముందు రెండేళ్ల కితమే ఆమెని పెళ్లాడేడు. ఆమె చాలా ఆకర్షణీయంగా వుండే పడుచావిడ. పెద్ద ఆకుపచ్చ కళ్లు, సున్నితంగా వంపు తిరిగిన నాసిక, తిమ్మిరెక్కించే గుండ్రటి పెదవులు. ఆమె కూడా యితరుల భార్యల్లాగానే తన భర్త ఆరోగ్యం గురించి గంభీరంగా అడిగేది. పాస్ తీసుకుని ముచ్చటైన తల ఆడిస్తూ వెళ్లిపోయేది. ఆమె యెప్పుడూ తన సమ వయస్కుడైన రాగి జుట్టు షోకు యువకుడొకడితో కలిసి వచ్చేది. ఆ విషయం నేను గమనించాను. అతను ఆమె కోసం వసారాలో నుంచునే వాడు. ప్రతి సారీ యిద్దరూ కలిసే వెళ్లేవాళ్లు. వాళ్లిద్దరూ చెట్టాపట్టా లేసుకుని ఫంతాంక నది గట్టుమీద నడిచి వెడుతూ వుండడం, అతను చెప్పేదేదో వింటూ ఆమె నవ్వడం నేను ఒకటి రెండు సార్లు చూశాను. ఆమె మామూలుగా పోస్ట్ పార్సెల్‌లాంటి వార గుడ్డ పేకేజీని తెచ్చేది. అందులో తినుబండారాలుండేవి. దాన్ని తన మొగుడికిమ్మని అటెం డెంట్‌కి అప్పగించేది. ఆ పేకేజీలమీద యెప్పుడూ కూడా చెరపలేని నీలం పెన్సిల్‌తో రాసిన రాత వుండేది. ఆ రాత కూడా నిబ్బరంగా, దృఢంగా చెయ్యి తిరిగిన రాతలా వుండేది.

ఆమె ఆహార పదార్థాల చిన్న పార్సెల్‌ని తీసుకువచ్చింది. "మీ పాకేజీలమీద యెవళ్లు అంత ముచ్చటగా రాసేవాళ్ళు?" అని ఆమెని ఒక సారి అడిగాను.

"మా స్నేహితులొకరు రాస్తారు" అంది కొంచెం సిగ్గుపడుతూ.

"మీతో కూడా మామూలుగా వచ్చే అతనా?"

"వూఁ" అందామె అయిష్టంగా.

నేను ఆమెని యింక గుచ్చి ప్రశ్నించలేదు. ముఖ్యంగా యెందుకంటే దానికి కేసుతో సంబంధం లేదు కనక. కాని తన కంటే పాతికేళ్లు చిన్నదైన అమ్మాయిని పెళ్లి చేసుకున్నందుకు తెర్‌అవనేసొవ్ మూల్యం చెల్లిస్తున్నాడని అనుకున్నాను. యీ పరిస్థితే గడ్డుగా వుంది. పైగా ఆమె భర్త జైల్లో వున్నాడనీ, హీన పక్షం పదేళ్లు

కఠిన శిక్ష, లేకపోతే అతిపెద్ద శిక్ష మరణదండన ప్రాప్తించవచ్చని ఆమెకి తెలుసు. దాంతో ఆ పరిస్థితి మరింత తీవ్రం అయింది.

డిఫెండంట్ల భార్యలు వాళ్లకి నూటికీ కోటికీ యెవళ్లకో తప్ప నమ్మిన గరితల్లా వుండేవాళ్లు కాదని ఇన్వెస్టిగేటర్‌గా నేను గ్రహించాను. కేసు ఇన్వెస్టిగేషన్ దశలో వున్నప్పుడు కూడా యీ పడుచు అమ్మాయిలు ఆతృతగా "ఎమర్జన్సీ లేండింగ్" కోసం వ్యసన పడిపోయేవాళ్లు. అలా అని ఒకామె నిర్మొహమాటంగా, సినికల్‌గా అంది.

సీల్ స్కిన్ కోటు కోసం అరదండాలు వేయించుకున్నాడే, ఆ వ్లతోనొవ్, భార్య యేపుగా తీవిగా వుండే పడుచు అమ్మాయి. అత్తర్లూ సెంట్లూ ధారాళంగా వాడేది. ఆమె గోధుమ రంగు జుట్టుని మంచి స్టైల్‌గా పెట్టుకునేది. కులుకులాడి స్వభావం. ఆమె రెండు విజిటింగ్ రోజులు వరసగా రాలేదు. నాకు వ్లతోనొవ్ నుంచి కంగారు కంగారుగా ఓ చీటీ వచ్చింది. నేను ఆమెని పిలిపించాను. తను భర్తని చూడ్డానికి రానూ లేదు, కబురూ చెయ్యనూ లేదు కారణం యేమిటా అని అడిగాను.

"అతనికి అంత మాత్రం అర్థం కాదా? నేను కూడా నా గురించి ఆలోచించు కోవాలిగా?" అందామె అందమైన పెద్ద బూడిద రంగు కళ్లని నిదానంగా నాకేసి తిప్పుతూ. "యింతా చేసి నేను జైలు పక్షి పెళ్లాంగా వుండలేను కదా, శిథిలమైన నా బతుకు గురించి యేడుస్తూ కూర్చోలేను కదా. నేనేం బుల్లారి కూచిని కాదు. యిరవై యెనిమిదేళ్లున్నాయి. మంచి మొగుడు దొరకడం కష్టం. దేవుడి దయవల్ల పిల్లల్లేరు. పిల్లలే వుంటే మళ్లీ పెళ్లవడం దుర్ఘటంగా వుండేది" అంది.

"మీ భర్త పట్ల మీకు బాధ్యతలేమీ లేవనుకుంటున్నారా? ఆయన యిక్కడ వుండడం కొంత మీ వల్లనే కదా?" అని అడిగాను వుండబట్టలేక.

"నా తప్పని అనకండి! ఆయన మంద బుద్ధితనం వల్లనే. తనకి చురుకు లేదు. యిక బాధ్యతలంటారా, దేనికైనా వో హద్దు అనేది వుంటుంది. నేను నా సర్వస్వం ఆయనకి యిచ్చాను. నా యౌవనం, అందం, తొలి ప్రేమ. నా జీవితాన్ని అందంగా వుండే టట్టు చెయ్యడం ఆయన బాధ్యత. చెయ్యలేకపోయాడు, అదే ఆయన ఖర్మ" అంది.

వొక తరహా ఆడవాళ్ల పూర్ణ తత్వశాస్త్రం మరో సారి నేను యెదుర్కొన్నాను. వాళ్లు పెళ్లవడం అనేది లోకంలో ఓ మెట్టు యెక్కడం అనుకుంటారు. తమ భర్తలు "తమ యౌవనానికి, అందానికి, తొలి ప్రేమకి" మూల్యంగా తమకి సౌఖ్యప్రదమైన జీవనాన్ని కల్పించే బాధ్యత మొయ్యాలని అనుకుంటారు. తమ భర్తలు కూడా వాళ్ల పడుచుదనాన్నీ తరచుగా తమ తొలి ప్రేమనీ తమకి అర్పిస్తారని యీ ఆడవాళ్లకి యెందుకు అర్థమవదో. ఒక వేపునుంచి పెట్టిన "మదుపు"నే చెప్పుకుని రెండో వేపు దాన్ని యెందుకు చెప్పరు?

ధర్మంగా వుండాలంటే మరో విషయాన్ని గురించి కూడా చెప్పుకోవాలి. గొర్రెల మీద పడే తోడేళ్లల్లా భర్తలు జైళ్లల్లో వున్న అందమైన ఆడవాళ్లమీద వచ్చి పడే బందిపోటు మగాళ్ళూ వుంటారు. భర్త అరెస్టయిన ఆడామె కష్టమైన పరిస్థితుల్లో పడి యెక్కువ "సమంజసంగా" వుంటుందని వాళ్ళు అనుకుంటారు. అలాంటి తుంటరి వెధవలే బహు "శ్రద్ధ" కురిపిస్తారు. అలాంటిది ఆడదానికి యెప్పుడూ ముఖ్యమే. మరీ యెక్కువగా గడ్డు పరిస్థితిలో వున్న ఆడదానికి. కడకి తను సాధిస్తాడు. ఆమెకి గనక ఉద్యోగమో, కొద్దో గొప్పో దాచుకున్న మూటా ముల్లో వుంటే చెప్పనే అక్కర్లేదు – ఆ పరాన్నభుక్కు ప్రేమ కానుకల కంటే యెక్కువగా ఆమె దగ్గర్నుంచి దాన్ని కొట్టెయ్యాలని చూస్తాడు.

తెర్అవనేసావ్ భార్య పాస్ కోసం వచ్చినప్పుడు ఆమెతో కూడా యేడిసే రాగి జుట్టు టీవీ యువకుడు యీ బాపతు మోసగాడే. నేను మొదట్నుంచీ అతన్ని కనిపెట్టే వున్నాను. కాని ఇన్వెస్టిగేషన్ పూర్తయిపోయిందని తెర్అవనేసావ్‌కి చెప్పే రోజు దాకా యీ మనిషి ఆ కుటుంబంలో యెంత గ్రంథసాంగుడైందీ నాకు తెలీలేదు. కేసుకి సంబంధించిన పత్రాలన్నిట్నీ తనకి అందజెయ్యడం జరిగిందనీ యింక యేమీ లేవనీ చెప్పాక అతను సంతకాలు చేసి, వున్నట్టుండి యిలా చెప్పాడు:

"నాలాంటి మచ్చలేని మనిషి, యిలాంటి జీవిత దృక్పథం వున్న వాడు, విశ్వాసాలు వున్న వాడు, లంచాలమారిగా యెలా అయిందీ చెప్పమని మీరు చాలా సార్లు అడిగారు గాని నేను తప్పించేశాను. మనిద్దరం యిలా కూర్చోవడం యిదే ఆఖరు సారి. తర్వాత కోర్టు విచారణ, నాకు శిక్ష వస్తాయి. విడిపోయే ముందు మీ మానవత్వానికి కృతజ్ఞతలు చెప్పాలి నేను. నా స్థితిలో వున్న మనిషి తప్ప యెవళ్ళూ అలాంటి దాన్ని అభినందించలేరు. యేం, తెర్అవనేసావ్ నేరస్థుడు యెలా అయిందీ చెప్తాను. చెప్పమంటారా?"

"తప్పకుండా, నేను యెప్పుడూ తెలుసుకోవాలని అనుకుంటూనే వున్నాను."

"అయితే వినండి. యిప్పుడు ఇన్వెస్టిగేషన్ పూర్తయింది కాబట్టి అంతా చెప్తాను. నేను చెప్పేది రికార్డులోకి యెక్కదు కదా. అది రికార్డు కోసం కాదు" అన్నాడు.

"నా యాభైయవ పుట్టిన రోజు తర్వాత – గుర్తుంది కదా, దాన్ని గురించి మీకు చెప్పాను – ఆర్నెల్లకి ఓ రోజున మాస్కోకి యేదో అర్జంట్ వార్త పంపాల్సి వుండడంతోటి ఆఫీసులో బాగా పొద్దుపోయే దాకా వుండిపోవాల్సివచ్చింది. మే నెలా ఖర్లో, లెనిన్‌గ్రాడ్‌లో శ్వేత రాత్రులు మొదలయే రోజులు. మామూలుగా అందరూ కవితాత్మకంగా వాటిని చూసి పరవశించిపోతారు గాని నాకు యెప్పుడూ అలా అనిపించేది కాదు. ఓ రాత్రీ పగలూ తేడా లేకుండా పోవడం, నిద్ర మగత నగరాన్ని కమ్మే భ్రాంతిమయ సాంధ్య రాగం, ప్రతి వాళ్ల నిద్రకీ అంతరాయం కలిగించడం, కాంతి విహీనంగా

వుండే సూర్యుడు యింకా కాంతి విహీనంగా వుండే ప్రభాతంలో ఉదయించడం అంతా నా స్వభావానికి నచ్చేది కాదు, నా పనికి అంతరాయంగా వుండేవి. ఆ శ్వేత రాత్రులు అనారోగ్యకరమైనవనీ, నష్టదాయకమనీ యేదో వొక రోజున సైన్సు కనిపెడుతుందనే నా నమ్మకం. యింతకీ చెప్పవచ్చేదేమంటే నా కష్టాలన్నీ శ్వేత రాత్రులతోనే మొదలయాయి. ఒక్క ముక్కలో చెప్పాలంటే నేను అర్జంట్ రిపోర్టు పంపాల్సి వుండింది, మా డిపార్ట్మెంట్‌లో వున్న టైపిస్టులందరూ వెళ్లిపోవడంతోటి డ్యూటీ టైపిస్టుని పిలిచాను. కొంత సేపయాక చాలా ముచ్చటగా వుండే అమ్మాయి వచ్చింది. పోర్టరే ఆమె టైప్‌రైటర్ తీసుకువచ్చాడు. నేను డిక్టేట్ చెయ్యడం మొదలెట్టాను.''

తెర్అవనేసొవ్ సిగరెట్ ముట్టించుకోవడానికి ఆగేడు. అగ్గిపుల్ల తర్వాత అగ్గిపుల్లని గీస్తూనే వున్నాడు గాని అతని చేతులు వణికి మంట సిగరెట్ ముట్టించుకోకముందే ఆరిపోయేది. అతను స్థిమితంగా లేడని తెలుస్తూనే వుంది. కాని అతను పైకి కనిపించనియ్యకుండా దాన్ని దాచుకో ప్రయత్నించేడు. అతను ప్రయత్నించినా విఫలం అయ్యాడు. ఆ విషయాన్ని గమనించనట్టు వెంటనే నేనతనికి అగ్గిపుల్ల వెలిగిస్తానని అనలేదు.

''మీ అగ్గిపుల్లలు చెమ్మగా వున్నాయేమో. నా అగ్గిపెట్టె తీసుకుంటారా?'' అన్నాను ఆఖరికి.

అగ్గిపుల్ల గీశాను. కొన్ని సార్లు గట్టిగా పొగ పీల్చి, హఠాత్తుగా నాకేసి తిరిగాడు.

''కథని క్లుప్తంగా ముగించాలంటే, ఆమెని రెండు నెల్ల తర్వాత పెళ్లాడాను. నాకు చాలా ఆనందంగానే వుండేది. కాని యెప్పుడూ తీరిక లేకుండానే వుండేది. యింటికి రావడం ఆలస్యం అయేది. దాంతోటి మా ఆవిడ ఒంటరిగా వుండేది. పెద్ద ఆఫీసరు గారి భార్యని చూసి యీ విషయంలో అసూయ పడదగ్గది యేం వుండదు. నిజం చెప్పాలంటే నాకు యిప్పటికీ అర్థం కాదు ఆ అర్ధరాత్రి సమావేశాలు, యెప్పటికి ముగుస్తాయో తెలీని మీటింగులు, ఆలస్యంగా వచ్చే ఛీఫ్‌ల పిలుపులు యెవడు పెట్టాడో గాని. సరే విషయం అది కాదనుకోండి. గాల్యా ఒంటరిగా వుండేది. నేను పొద్దుపోయి యింటికి వచ్చి అలిసిపోయి యేదో యింత కతికి దున్నపోతులా నిద్రపోయేవాణ్ణి. ఓ రోజున తనకి అలాంటి బతుకు విసుగ్గా వుందని ఆమె అంది. నేను లేకుండానే యెవళ్ల నేనా స్నేహితుల్ని తీసుకుని సినిమాలకీ షికార్లకీ పొమ్మని చెప్పాను. నాకు యిక మార్గాంతరం లేకపోయింది. తర్వాత ఒక రోజున ఆమె ఓ యువకుడ్ని పరిచయం చేసింది. తన స్నేహితురాలి యింటి దగ్గర అతన్ని కలుసుకుందట. అతను ఆర్టిస్టు. కాని అంత ప్రతిభ వున్న వాడు కాదులా వుంది. యేమంటే తనకిగా సత్తాలేకపోబట్టే యేదో లెనిన్‌గ్రాడ్ అడ్వర్‌టైజింగ్ ఆఫీసులో పని చేసేవాడు. అక్కడ ఆర్డర్లు తీసుకోవడం పద్దులు రాయడం చూసేవాడు. కాని తన జీవితంతో తృప్తి పడ్డట్టుగానే కనిపించాడు. త్వరలోనే మా యింటికి రోజూ వచ్చే మనిషి అయాడు. నేను యింటికి యెప్పుడు వచ్చినా

జార్జి అక్కడ వుండేవాడు. మర్యాదస్థుడేగాని నేర్పు వున్న మనిషి. దురదృష్టవశాత్తూ ఓ పిసరు పొగడ్తల రాయుడు. మత్తెక్కించే అతని కళ్ళు పారదర్శక నీలం రంగుగా వుండేవి. ముక్కు కొంచెం పొడుగు. అన్నిట్లోకీ గుచ్చి గుచ్చి చూస్తున్నట్టు వుండే వాడు. నిజం చెప్పాలంటే అతనంటే నాకు వెగటుగా వుండేది. గొప్పకు పోయిన నడ వడిక, తార్పుడుగాళ్ల డాబు షోకు, పతనమైన వాడి పుచ్చు పళ్ళూ వున్న షోకిలాగాడు. యెప్పుడూ పడిగాపులు పడి వుంటూ తను కొలువు చెయ్యాల్సిన "పవిత్ర కళ" గురించి కుహనా గంభీరత్వంతో మాట్లాడేవాడు. నీచ సావాసంలో పెరిగినలాంటి యీ మనిషిలో కుంటెనకాడి లక్షణం యేదో నాకు కనిపించింది. కాని మా ఆవిడతో యేమీ అనలేదు, అనేక కారణాల వల్ల ఆమె తప్పుడుగా వుంటుందనే అనుమానమే నాకు రాలేదు. అలాంటిది నాకు అసలు తట్టనే లేదు!"

తెర్‌అవనేసావ్ తన కథని పూర్తిచేసేటప్పటికి బాగా పొద్దుపోయింది. నాకు ఆశ్చర్యం కలిగింది. కాని ఆశ్చర్యం కలిగించే మానవ నీచత్వం వెనక నెవ్‌మన్‌లు కుటి లంగా పన్నిన ఉచ్చు వుందని నాకు అప్పటికి తెలీదు. అతనే ఆ విషయాన్ని గ్రహించ లేదు, నాకు చెప్పిన మేరకే తనకీ తెలిసి వుండడంతోటి.

తెర్‌అవనేసావ్ భార్యతో పరిచయం అయిన ఆర్నెల్లకి తర్వాత జార్జి కన్నీళ్ల కారుస్తూ ఆమె దగ్గరికి ఓ సారి వెళ్ళాడు. విషాదకరమైన బహిరంగ స్వగతం వల్లిం చాడు. "శాశ్వతంగా సెలవు తీసుకుని వెళ్ళిపోతున్నా"నని చెప్పాడు. యేమంటే వ్లదీ మిర్ క్లబ్‌లో ప్రభుత్వం వారి సొమ్ము పది వేలు నష్టపోయాట్ట. ఆ "అవమానం భరించ" లేడట. ఆత్మహత్య చేసుకుందామని నిర్ణయించుకున్నాట్ట.

ఆ సాయంత్రం పొద్దుపోయి యింటికి వచ్చి చూస్తే తెర్‌అవనేసావ్‌కి భార్య ఒక్క పెట్టున వెక్కివెక్కి యేడవడం కనిపించింది. ఆమెని వూరుకోబెట్టడానికి అతని తాతలు దిగివచ్చారు. ఆఖరికి చెప్పిందండీ ఆవిడ — తను జార్జిని ప్రేమిస్తున్నట్టూ, అతనికి దురదృష్టం కలిగితే తను భరించలేనట్టూ. తెర్‌అవనేసావ్‌కి నెత్తిమీద ఒక్క సారే రెండు పిడుగులు పడ్డట్టయింది. తన భార్య రంకు పోయిందన్న వార్తా, తన ప్రియుడ్ని రక్షించకపోతే ఆమె ఆత్మహత్య చేసుకుంటుందన్న వార్తా.

"గాల్య ఆ భయంకరమైన రాత్రి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించడం తను నాకు అన్యాయం చేసిందన్న విషయం పట్ల నా వైఖరిని నీరసపరిచింది. వింతగా కనిపించవచ్చు గాని ఆమె తప్పుడు ప్రవర్తన మాత్రమే నాకు తెలిసినా యింకా అధ్వా న్నంగా వుండేది. నేను జార్జిని కాపాడకపోతే తను చచ్చిపోతానని అంత కచ్చితంగా చెప్పినప్పుడు నాకర్థమైంది యీ ఆడమనిషి పట్ల నా పిచ్చి ప్రేమ యెంతటి దైందీనీ" అన్నాడతను.

తెర్అవనేసొవ్ నుంచుని గదిలో అటూ యిటూ పచారు చేసి మళ్లీ నే కూర్చున్న డస్కు దగ్గరికి తిరిగివచ్చి కొనసాగించాడు.

"ఆమె యెంతో విచారంగా వుంది. యెంతో వెక్కి వెక్కి యేడుస్తోంది. తను యెంతగానో ప్రేమించిన అతన్ని రక్షించమనీ, అతను లేకుండా తను బతక లేదనీ యెంతో బతిమలాడింది. దాంతోటి యెలాగైనా ఆ సొమ్ము సంపాదిస్తానని ఆఖరికి ఆమెకి మాట యిచ్చాను. కాని యెలా వస్తుంది నాకు? నా పెళ్లి తర్వాత నేను పొదుపుగా వుంచుకున్న ఆ కాస్త మొత్తమూ కర్పూరంలా కరిగిపోయింది. మా ఖర్చులు యెక్కువ, గాల్య యేమడిగినా నేను కాదనలేదు. నా ఉద్యోగంలో నాకు మహా వస్తే ఓ నెల జీతం అడ్వాన్స్‌గా వస్తుంది. నాకు అంత సొమ్ము అప్పు యివ్వగల మిత్రులూ లేరు. సరిగ్గా, ఆ మర్నాడే, యింత సొమ్ము యెలా సంపాదించాలిరా దేముడా అని నేను బుర్రబద్దలు కొట్టుకుంటూ వుండగా లెనిన్‌గ్రాడ్ నెవ్‌మన్‌లలో పెద్దవాడైన రంగుల ఉత్పత్తిదారుడు క్యూన్ తన పన్నుల గురించి ఫిర్యాదు చెయ్యడానికి నా దగ్గరికి వచ్చాడు. నేను దిగాలు పడి పోయి వున్నానని దొంగ వెధవ పసికట్టాడు. మిగతా నెవ్‌మన్‌ల లాగానే అతనూ నన్ను యెన్నో యేళ్లుగా యెరుగును. విషయం యేమిటని అడిగాడు. అలిసిపోయానని చెప్పాను. కాని జరక్కూడనిదేదో జరిగిందని గ్రహించాడు. అప్పుడు నా జీవితంలో మొట్టమొదటి సారిగా దురంతమైన వూహ తట్టింది నాకు. నేనేం అర్థం చక్కర్లేకుండా నుంచున్న పళంగా తాంబూలంలో పెట్టి నాకు పది వేల రూబుళ్లు యివ్వగల మనిషి యిక్కడ వున్నాడు, మాకిద్దరికీ తప్ప మూడోకంటి వాడికి యీ విషయం పొక్కదు. యేమంటే దాన్ని నేనెంత రహస్యంగా వుంచాలనుకుంటానో అతనూ అంతే రహస్యంగా వుంచాలనుకుంటాడు. యీ జర్మన్‌ని తగలెయ్య – క్యూన్ బాల్టిక్ జర్మన్ – నన్ను వదలందే. నేను కష్టాల్లో వున్నానని పసికట్టినట్టే వుంది. తనకి లాభదాయకంగా వుండేట్టు తిప్పుకునే, కష్టం.

"మీకంటే రెండింతలు వయసులో పెద్దవాణ్ణి. కాని మీరు సీనియర్ ఇన్వెస్టిగేటర్, ప్రతి రోజూ నేరస్థుల్ని విచారిస్తారు. మీరు కుళ్లిన మాంసం అయిపోయారని యీ రాబందులు యెలా యెందుకు పసికడతాయో చెప్పగలరా? అవును కుళ్లిన మాంసం. నేను ఆ రోజున సరిగ్గా అలానే అయాను. నేను నిప్పులాంటి మనిషినని వాళ్లు అనేవాళ్లు. అలాంటి వాణ్ణే హఠాత్తుగా "యిష్టపడే" వాడ్ని అయానని యే అదృశ్య చిహ్నాలు యీ క్యూన్‌లకీ, క్రాఫ్ట్‌లకీ, సీమనొవ్‌లకీ, సాల్మన్లకీ చెప్పాయి? నేను క్యూన్‌ని ఆ డబ్బు అడగాల్సిన పనేలేకపోయింది. తనే దాన్ని నాకు ఆవేళ యిస్తానన్నాడు. వేవ్‌స్కీ ప్రాస్పెక్ట్‌లో వుండే బజారు ఆడదాన్లాగా నాకు నేను అతనికి అమ్ముడు పోయాను. నా నీచత్వంతో అవమానంతో కుతకుతలాడి పోయాను.

"రాత్రి యింటికి వెళ్లి మా ఆవిడకి ఆ సొమ్ము యిచ్చాను. ఆమె సంతోషం

పట్టలేక యేడ్చింది, నన్ను కాగలించుకుని నేను చేసిన మేలు యెన్నడూ మర్చిపోనని అంది. తన జార్జి ఆతృతతో నిరీక్షిస్తూ వుండలేడని బాధపడిపోయి బట్టలు వేసేసు కుని డబ్బు తీసుకుని వెళ్ళిపోయింది. నా జీవితంలో పరమ భయంకరమైన రాత్రి అదే, ప్రమాణ పూర్తిగా చెప్తున్నా. జైల్లో నేను గడిపిన మొదటి రాత్రికంటే భయం కరమైందా రాత్రి.

''క్యూన్‌కి తిరిగి ఆ సొమ్ము యిచ్చెయ్యడానికి వీలైన ప్రతీదీ చేద్దామనే ఒట్టు పెట్టుకున్నాను. పొదుపుగా వుంటాను, ఓవర్ టైమ్ పని చేస్తాను. నా వస్తువులన్నిట్నీ అమ్మేస్తాను అనుకున్నాను. అయినా కూడా అతని పన్నులు తగ్గించాలి.

''తర్వాత సరిగ్గా ఒక నెలకి మా ఆవిడకి మళ్ళీ పూనకం వచ్చింది. జార్జి తను పోగొట్టుకున్న దాన్ని తిరిగి సంపాదించాలనుకున్నట్టుంది. అది జరక్కపోగా యింకో పదిహేను వేలు పోగొట్టుకున్నాడు. మళ్ళీ ఆత్మహత్య చేసుకుంటానని గాల్యతో అన్నాడు. ఆమె మళ్ళీ అతన్ని బతిమలాడింది. మళ్ళీ యేడ్చింది నేను గనక సొమ్ము యివ్వకపోతే జార్జి చచ్చిపోతాడు, మరి తను సేవా నదిలో దూకేస్తుంది. మళ్ళీ అలాగేనని మాట యిచ్చాను.

''నేనే క్యూన్‌కి ఫోన్ చేశాను. వెంటనే వచ్చాడు. మరో పదిహేను వేలు అతను నాకు అప్పు యివ్వాలని యేదో గొణిగాను. అతను నాకేసి ఆశ్చర్యంగా చూసి ''లోగడ వ్యవహారం ముగిసినట్టే భావించా''లని చెప్పి, అయినా పదిహేను వేలూ యిస్తానన్నాడు. నా సంతోషం చెప్పలేను. తన మిత్రుడు క్రాఫ్ట్‌ని నాకా సొమ్ము యిమ్మని అడగాలని అతని ఉద్దేశం. అదే అతని సాయం అని నాకు తెలిసింది. ఓ గంట తర్వాత క్రాఫ్ట్‌తో కలిసివచ్చాడు. నన్ను అతనికి పొట్టేలుని అమ్మినట్టు అమ్మేశాడు. మళ్ళీ మా ఆవిడ నన్ను ముద్దు పెట్టుకుంది, నే చేసిన మేలు యెన్నడూ మర్చిపోనని అంది, మళ్ళీ సొమ్ము తీసుకుని తన జార్జి దగ్గరికి దూసుకుపోయింది. ఆ మర్నాడు ఉదయం తిరిగి వచ్చింది. శాంతంగా, సంతోషంగా, తృప్తిగా వుంది.''

తెర్‌అవనేసొవ్ యింకో సిగరెట్ ముట్టించుకున్నాడు. ఫంతాంక గట్టుమీద దీపాలు వెలిగాయి. నదిలో తెడ్లు వేసుకుంటూ బోటులలో వెళ్లే పడుచు వాళ్ల నవ్వులూ అరుపులూ వినిపిస్తున్నాయి. మార్స్ ఫీల్డ్‌లో బాండ్ వాయించే చప్పుళ్ళూ వినిపిస్తున్నాయి.

అతన్ని జైలుకి తీసుకుపొమ్మని ఓ గార్డుని పిలిచి చెప్పాను.

వెళ్ళిపోయేటప్పుడు అతను మెల్లిగా అన్నాడు:

''ఒక రిక్వెస్టు. మా ఆవిడ్ని నాకు యే పాకేజీలూ పంపనివ్వకండి. ఆ ఆర్టిస్టిక్ రాతతో దాన్ని అందుకున్న ప్రతి సారీ నాకు పిచ్చెక్కిపోతోంది. నాకది యెంత వెలపరంగా భయంకరంగా వుంటుందో ఆ తుంటరికి తెలీదా? యిదొక్కటే నా కోరిక.''

తెర్ అవనేసొవ్ చెప్పినదంతా విన్న తర్వాత మాయమైపోయిన ఆ క్ర్యాన్‌ని పట్టా లని యెప్పటికంటే యెక్కువగా అనిపించింది. అతనికి రెండు కాపరాలున్నాయని నాకు తెలుసు. పాత పెళ్లాం ఒకామె వుంది. ఆమెని అతను వదిలిపెట్టదలచుకోలేదు. రెండో ఆవిడ ఓ రకంగా ఉంపుడుకత్తె. మరీయా ఫ్యోదొరొవ్నా అని గోధుమ రంగు జుట్టా ఆవిడా అందంగానే వుండేది. పడుచుది. యీామె వింటర్ పలస్ ఎన్‌బేంక్‌మెంట్‌మీద ప్రభువంశీకుల భవనంలో ఓ విలాసవంతమైన వాటాలో వుండేదని తేలింది. ఆమెకి డబ్బుకి లోటు లేదు. క్ర్యాన్ హఠాత్తుగా అదృశ్యం అయిపోయినా పెద్ద యెత్తులో ఆవిడ బతకడం మాన లేదు. ఉద్యోగం చూసుకుందామనీ ఆమె ప్రయత్నించలేదు. ఆ నెవ్‌మన్‌తో సంబంధం తెగిపోయినట్టు లేదు.

మా ఆఫీసుకి ఆమెనీ పిలిపించాను. క్ర్యాన్ యెక్కడున్నదీ ''యేమీ తెలీద''ని నిబ్బరంగా, తొణక్కుండా చెప్పింది. అతని దగ్గర్నుంచి ఉత్తరాలూ రావట. ఆ విష యంలో తను యేం సాయపడలేనని చెప్పింది.

ఆమె చామన చాయగా, నల్లని కళ్లతో ఠీవిగా వుండే మనిషి – చాలా ఆత్మ స్థైర్యం వున్న మనిషి. ఆమె యేమీ చెప్పదు అనేది స్పష్టంగా తెలుస్తూనే వుంది. కాని, యీ కేసులో మరొక డిఫెండంట్ భార్యతో ఆమెకి స్నేహం వుందని మాటల్లో తెలుసుకున్నాను. ఆమె కూడా పడుచావిడే కాని యీామె అంత ఆకర్షణీయంగా వుండే మనిషి కాదు.

నేను ఇన్వెస్టిగేటర్‌గా కుర్రాణ్ణే. కాని అలాంటి ఆడవాళ్లు యిద్దరు స్నేహితు రాళ్లయితే తక్కువ ఆకర్షణీయంగా వున్నామె రెండో ఆవిడ్ని నాభి దగ్గర్నుంచీ అసహ్యించుకుంటుందనీ, చెప్పలేనంతగా అసూయా పడుతుందనీ నాకు తెలుసు. లెనిన్ గ్రాడ్‌కి బదిలీ కాక ముందు జరిగిన ఓ చిన్న విషయం గుర్తుకొచ్చింది. ఓ కేసులో ఓ వయసు మళ్లిన ఆమెని విచారించాల్సివచ్చింది. చాలా యేళ్లుగా ఆమె ఫాషనబుల్‌గా వుండే ఆడవాళ్ల టోపీల దుకాణం నడిపేది. అది స్త్రాలేష్నికొవ్ వీధిలో వుండేది. యిద్దరు ఆడవాళ్ల మధ్య వుండే స్నేహం గురించి అడగ్గా ఆమె వెటకారంగా చిరునవ్వు నవ్వి సిగరెట్ దమ్ము పీల్చి సాగదీసుకుంటూ చెప్పింది.

''కామ్రేడ్ ఇన్‌స్పెక్టర్, ముప్పై యేళ్లుగా నేను టోపీలు అమ్ముతున్నాను. స్నేహితురాలు లేకుండా ఆడమనిషి ఒక్కత్తీ నా దుకాణానికి రావడం అనేది జరగలేదు. యేమండీ, ఆ కూడా వచ్చిన స్నేహితురాలు సరైన సలహా యిచ్చిన సందర్భమూ ఒక్కటీ లేదు. యిద్దరు ఆడవాళ్లు స్నేహితంగా వుండడం గురించి నేను చెప్పదలచుకున్నదల్లా అంతే'' అంది.

యీ మాట అంటున్నానని కాదు గాని ఆడవాళ్ల మధ్య స్నేహం అనే దాన్ని గురించి పరిశీలించేటప్పుడు టోపీలమ్మే ముసలావిడ చెప్పిన నీతి కథ చాలా సార్లు ఆయా

సందర్భాలకి సరిగ్గా సరిపడేది నాకు. నేర పరిశోధకుడిగా ఒక ప్రత్యేక స్థాయి ఆడవాళ్ళా, ఆ నేపథ్యంతో వున్న ఆడవాళ్ళానే నాకు తగిలే వాళ్లనీ, అంచేత కచ్చితమైన మానసిక దృక్పథంతో వుండే వాళ్లనీ చెప్పాలనుకోండి.

మరీయా ఫ్యోదొరొవ్నా, ఆమె స్నేహితురాలూ యీ వర్గం కిందికే వస్తారు. అందుకనే ఆ రెండో ఆవిడ మామూలుగా ఓ గురువారం విజిటర్స్ పాస్ కోసం నా ఆఫీసుకి వచ్చినప్పుడు ఆవిడతో మరీయా ఫ్యోదొరొవ్నా గురించి ప్రస్తావించాను. ఆమె నాకేసి గిరుక్కున చూసింది. ఒక అనుమానాస్పద ఛాయ ఆమె ముఖంలో దూసుకు పోయింది. మెల్లిగా గుసగుసలాడ్డం మొదలెట్టింది.

"ఆవిడకేం లోటండీ బాబూ! బంగారు పిచ్చికని పట్టి బతుకుతోంది. యెంత తెగించిందని! తన క్యూన్ కోసం కబురు పంపించింది కూడా. యివాళ్టి మట్టుకి యివాళ కూడా పొద్దున నాతో అంది 'నేను హనీ మూన్ గడుపుతున్నట్టుగా వుంది నాకు' అని."

అరగంట తర్వాత అరెస్ట్ వారంట్ సంపాదించి మరీయా ఫ్యోదొరొవ్నా వుంటున్న మేడకి వెళ్లాను. నాతోబాటు రీజినల్ కోర్టు కమాండెంట్ వున్నాడు. ఆయన అసిస్టెంటూ వున్నాడు. వెనకనుంచి మెట్లు లేవని ధృవ పరుచుకున్నాక ముందరి గుమ్మం తలుపు కొట్టాం. చాలా సేపటి తర్వాత భారీ తలుపు వెనకనుంచి తేలిక పదధ్వనులు వినిపించాయి. ముచ్చటైన గౌను వేసుకున్న పని మనిషి మమ్మల్ని లోపలికి తీసికెళ్లింది. వాళ్ల అమ్మగారు యింట్లో వున్నారా అని అడిగేను. వున్నారని చెప్పింది. సరిగ్గా అప్పుడు మరీయా ఫ్యోదొరొవ్నా ముందు గదిలోకి వచ్చింది. నైట్ గౌన్ వేసుకుంది. నేను అరెస్ట్ వారంట్ చూపించాను. "ప్రస్తుతం చట్ట వ్యతిరేకంగా పారిపోయి తిరుగుతూ వున్న నికొలాయ్ క్యూన్ యెక్కడున్నదీ పట్టుకునేందుకు" వెదకడం జరుగుతోందని వివరించాను. ఆమె నే చేప్పేది సాంతం చాలా నిదానంగా వింది. చిరునవ్వు నవ్వింది.

"అయ్యో, రండి! మా యిల్లు మీ అధీనంలో వుంది. క్యూన్ యిక్కడ లేడు. యెక్కడున్నాడో నాకు తెలీనూ తెలీదు. మీరు ఆడవాళ్లని నమ్మరు, యేం చేస్తాం, ఖర్మ, కామ్రేడ్ ఇన్‌స్పెక్టర్" అంది.

అది ఆధునికంగా, బ్రహ్మాండంగా అమర్చిన యేడు గదుల వాటా. ఆ రోజుల్లో నెప్‌మన్ల యిళ్లు డాబుగా ఓ అందం పాడూలేకుండా సామాను పరిచి వుండేవి. మంచి అభిరుచి అనేది యే మాత్రం లేకుండా వుండేవి. అలా కాకుండా మరీయా ఫ్యోదొరొవ్నా యిల్లు చాలా జాగ్రత్తగా మంచి అభిరుచితో వుంది. గది తర్వాత గదిని వెతికాం. ముందు గదితో మొదలెట్టాం. క్యూన్ యెక్కడా వున్నట్టు జాడ తగల్లేదు. మరీయా ఫ్యోదొరొవ్నా స్నేహితురాలు అబద్ధం చెప్పిందేమోనని కూడా నాకు అనిపించేటంత పని అయింది. చివరికి కడపటి గది, పడక గది, చేరాం. బ్రహ్మాండమైన బర్చ్ కొయ్యతో

తయారుచేసి కంచువూతపెట్టిన వెడల్పాటి కురచ మంచంమీద పక్క రేగిపోయి వుంది. రెండు తలగడలు కూరుకుపోయి వున్నాయి. మగాడి జేబు గడియారం యేం పట్టనట్టుగా టిక్కుటిక్కు మంటూ బల్లమీద కొట్టుకుంటోంది. మరీయా ఫ్యోదొరొవ్నా మణికట్టు చూశాను. ఆమె గడియారం ఆమె చేతికే వుంది. బల్లమీద ఆష్ట్రేలో సిగరెట్ పీకలు కొన్ని వున్నాయి. చివళ్లు కొరికి వున్నాయి. అది మగాళ్లకి కొందరికి అలవాటు.

సిగరెట్ పీకలమీద నా కన్ను పడగానే చూసి మరీయా ఫ్యోదొరొవ్నా ఓ పాకెట్ లోనుంచి అప్పట్లో ఫాషన్‌గా వున్న 'సాఫో' సిగరెట్ తీసి ముట్టించుకుంది. యీ ప్రదర్శనలో ముక్తాయింపు మాట చెప్పాలనుకుని ఆమె సిగరెట్ కాల్చడం పూర్తయే దాకా ఆగేను. ఆమె సిగరెట్ పూర్తిగా కాల్చిం తర్వాత పీక యిమ్మని అడిగాను. ఆమె ఆశ్చర్యపోయి నాకు దాన్ని అందించింది. చివళ్లు కొరకకుండానే వుండిపోయిందది, మామూలే. దాన్ని ఆమెకి చూపించి ఆష్ట్రేలో వున్న వాటితో పోల్చి చెప్పాను. యివి మగాడు కాల్చినవి.

"చూడండి మరీయా ఫ్యోదొరొవ్నా యీ సిగరెట్లని క్ల్యాన్ కాల్చేడు మీరు కాదు. పైగా యీ పాకెట్ వాచ్ కూడా అతనిదే అయివుండాలి. యీ నాజూకైన పడక గదిలో యిది నప్పటం లేదు మరి. యీ సిగరెట్ పీకల్ని బట్టి చూస్తే అతను యిక్కడ గంటలోపునే వీటిని కాల్చి వుండాలి. అతను యెక్కడ వున్నదీ చెప్పండి."

"అతను యెక్కడ వున్నాడో నాకు తెలీదు అనే నేను మళ్లీ చెప్తున్నాను. నేను అతన్ని చాలా కాలంగా చూళ్లేదు. మీ అనుమానాలకి ఆధారం లేదు. చివళ్లు నమిలిన సిగరెట్ పీకలంటారా నేను కానన్ డైల్ చదివి చాలా కాలం అయింది, అంచేత మీ డిడక్టివ్ మెథడ్ రైటో తప్పో చెప్పలేను. దాన్ని డిడక్టివ్ మెథడ్ అంటారు కదా?" అంది. ఆమె చిరాకు దాగలేదు.

ఆమె యెత్తికుతంగా చిరునవ్వు నవ్వింది. మేం మళ్లీ వెతికాం. వార్డ్ రోబ్‌లో క్ల్యాన్ సూట్ దొరికింది. ఓ జేబులో మాస్కో లెనిన్‌గ్రాడ్ ఎక్స్‌ప్రెస్ టికెట్ వుంది. దానిమీద గుర్తు అతను లెనిన్‌గ్రాడ్‌కి రెండు రోజుల కితం వచ్చినట్టు వుంది. ఆ టికెట్‌ని ఆమెకి చూపించి డిడక్టివ్ మెథడ్‌కీ దీనికీ కూడా సంబంధం వుందా అని అడిగాను.

"యీ సూట్‌కీ, రైల్వే టికెట్‌కీ క్ల్యాన్‌కీ యే సంబంధమూ లేదు. అవి నా స్నేహితుడైన యింకో అతనివి. అతని పేరు చెప్పాల్సిన అవసరం నాకు లేదు, యేమంటే అది నా వ్యక్తిగత జీవిత విషయం. మీరేమన్నా అనుకోవచ్చు."

మేం యింకా వెతుకుతూనే వున్నాం. మగాడి రెయిన్ కోటు, టోపీ, బూట్లూ కనిపించాయి. అవి తన నిగూఢ నేస్తానివని మరీయా ఫ్యోదొరొవ్నా అంటూనే వుంది.

వంటింట్లోకి వచ్చాం. తెల్లని పెద్ద అల్మారా ఒకటి మొత్తం గోడ యీ చివర నుంచి ఆ చివరదాకా వుంది. దాని వెనక్కాల యేముందని అడిగాను.

''వూరికే గోడ'' అందామె. యింటి నౌకరుకేసి వింతగా చూసింది. అతను సాక్షిగా అక్కడ వున్నాడు. అతను పెద్ద వయసు వాడు. తెల్లని ఆప్రన్ వేసుకున్నాడు. తనేం విననట్టే పక్కకి తిరిగిపోయాడు. తోడున్న వాళ్ల సాయంతో అల్మారాని పక్కకి తోశాను. చూస్తే చీకటి స్టోరేజి గదికి దారి తీసే గుమ్మం వుంది. మరీయా ఫ్యోదొరొవ్నా కంగారుగా పెదాలు కొరుక్కుంది. ఆ గదిలోకి వెళ్లాను. చేతులున్న పాత కుర్చీలు, విరిగిపోయిన కుర్చీలూ సొరుగులూ గుట్టగా వున్నాయి. అక్కడ యెవరూ వున్నట్టు కనిపించలా. కాని ఓ అల్మారా దగ్గరికి వెళ్లేటప్పటికి యెవళ్లో శ్వాస పీలుస్తున్నట్టు వినిపించింది.

''యివతలికి వస్తారా క్యూన్‌గారూ'' అన్నాను అల్మారా తలుపు తడుతూ.

''ఓ క్షణం'' అని లోపల వున్న వ్యక్తి అన్నాడు. తర్వాత బయటికి వచ్చాడు. పొడుగ్గా, దిట్టంగా, గులాబీ బుగ్గలూ, చిన్న మేక గడ్డం, బట్టతల – క్యూన్‌గారే.

''చూశావా'' అన్నాడతను మరీయా ఫ్యోదొరొవ్నాతోటి. '''నా దగ్గరికి రా ముద్దుపెట్టుకుంటా, నా దగ్గరికి రా ముద్దుపెట్టుకుంటా' అంటూనే వున్నావు. ఆఁ, పెట్టుకున్నావు. అయితే నా కోసం వెతుకుతూ వున్న సీనియర్ ఇన్వెస్టిగేటర్ మీరే నన్న మాట'' అని అడిగాడు ఆశ్చర్యపోయి, కాని మనిషి బెదరలేదు. ''వుఁ, బాగా కుర్రాళ్లేనే మీరు! నిజంగా మీరంటే నాకు అసూయగా వుంది. సామెత చెప్పినట్టుగా 'వంటింటి కుందేలు అయి' వచ్చి పడ్డాను. కాని యీ కేసుకి నప్పే అరేబియన్ సామెతా వుంది. 'ఆడదాని సలహా విను, కాని దానికి వ్యతిరేకంగా చెయ్యి' అని. ఆరబ్‌లు చెప్పినట్టు నడుచుకుని వుండాల్సింది నేను. యిప్పుడు శిక్ష అవుతుంది నాకు. లెనిన్‌గ్రాడ్ వెళ్లద్దు బాబూ అని నెత్తీ నోరూ మొత్తుకు చెప్పాడు యనాకి, విన్నాను కాదు. ఆ ముసలి నక్కకి తెలును యేం జరిగేదీనీ, 'నికొలాయ్ యెందుకు నేరం చేసిన తావుకు వెళ్లడం? ఆ రకంగా బోలెడు మంది చేతులు కాల్చుకున్నారు' అని చెపుతూనే వున్నాడు.''

''అయితే యనాకి మాస్కోలో వున్నాడా?'' అని అడిగాను.

''రెండ్రోజుల కితం వున్నాడు. యిప్పుడెక్కడున్నాడో తెలీదు. మీరు అతన్ని పట్టుకోలేరు, యెంతేనా పందెం'' అన్నాడు.

క్యూన్ బట్టలు వేసుకోవడం మొదలుపెట్టాడు. సిగ్గు పడిపోతూ అతన్ని వాటేసుకున్న మరీయా ఫ్యోదొరొవ్నా దగ్గర సెలవు తీసుకున్నాడు.

''వూఁ, వూఁ, మాషెట్ మై డియర్ విచారించకు. నన్ను యింతా చేసి ముద్దు పెట్టుకున్నావు, అందుగ్గాను యే ప్రమాదేన్నానా యెదురోవచ్చు, అంత విలువైంది

అది. మహా అయితే అయిదేళ్ళు పడుతుంది. యింతా చేసి నేను లంచం యిచ్చిన వాణ్ణి గాని పుచ్చుకున్న వాణ్ణిగాను కదా.'' సెలవ్ అన్నాడు చిరునవ్వు నవ్వుతూ.

క్యూన్ తెలివైన వాడు. తన స్థితి తెలుసుకుని హాస్య చతురత నిలబెట్టుకున్నాడు. మా ఆఫీసుకి వెళ్ళి కూర్చుని స్థాయీ పడగానే యెలా తెర్అవనేసావ్‌కి లంచం పెట్టిందీ, తర్వాత క్రాఫ్ట్‌ని వ్యవహారంలోకి లాగిందీ చెప్పాడు.

''యీ అంటరాని తెర్‌వల్ల నాకు పదమూడు వేలు వదిలింది. అప్పట్లో నాకు తట్టలేదు యిది లక్కీ నంబరు కాదని.''

''ఒక్క క్షణం. పదమూడు వేలు యెందుకని?'' అని అడిగాను.

''పది వేలు తెర్‌కి, మధ్యవర్తికి మూడు వేలు. అతన్ని యేమని పిలవాలో మరి నాకు తెలీదు.''

''అంటే అతని భార్య ప్రియుడా?''

''ఆఁ, క్రూర జార్జి. నా కోసం నిరీక్షిస్తూ మీరు కాల హరణం చెయ్యలేదను కుంటాను. అతను అయిదు వేలు అడిగాడు. చివరకి మూడుకి ఒప్పందం అయ్యాం.''

తెర్అవనేసావ్‌ని 'భేదించడం' అసాధ్యం అని ఆశ వదులుకున్న సమయంలో అతని భార్యకి ప్రియుడు వున్న విషయం వరం దొరికినట్టు కనిపెట్టానని క్యూన్ వివరించాడు.

''ఫ్రెంచి వాళ్ళు అన్నట్టు ఆడదే అన్నింటికీ మూలంరా నాయనా. నాకు అప్పు డర్థమైంది అవకాశం దొరికిందిరా అని. ఓ వారం తర్వాత ఆ తుంటరితో పరిచయం కలిగించుకున్నాను. నేనేదో రోమియోతోనో హామ్లెట్‌తోనో వ్యవహరించడం లేదనీ, దేనికేనా లొంగిపోయే సాదా లుచ్చాతో, తార్పుడిగాడితో వ్యవహరిస్తున్నాననీ కనిపెట్టాను. ఓ సాయంత్రం అంతా కూర్చుని పథకం తయారు చేశాం: ప్రభుత్వం వారి సొమ్ము పెద్ద మొత్తంలో పోవడం, ఆత్మహత్య బెదిరింపు వగైరా వగైరా. అలాంటి పరిస్థితి యెదురైనప్పుడు తెర్అవనేసావ్ భార్య అతని నిష్కళంకత నంతట్నీ యిగిర్చేస్తుందన్న విషయానికి సంబంధించి నాకు పిసరు అనుమానం లేదు. అదే రోజున నేను తెర్అవ నేసావ్‌ని చూడ్డానికి వెళ్ళాను. మీకు తెలుసా ఇన్‌స్పెక్టరుగారూ, అతను యెంత భయం కరంగా వున్నదీ చూశాక అయ్యో యిలాంటి పథకం వేసానేమో అని నేను దాదాపు బాధపడ్డాను. కాని గత్యంతరం లేదు చూడండి. చూశారూ మళ్ళీ ఫ్రెంచి వాళ్ళన్నట్టు సె లావీ — అదీ జీవితం.''

నేను అతని స్టేట్‌మెంట్ రాసుకున్నాను. తెర్అవనేసావ్ జీవితంలో యింతటి పాపిష్టి పాత్ర వహించినందుకు ఆ తుచ్ఛుణ్ణి అరెస్టు చెయ్యడానికి చట్టరీత్యా హక్కు వచ్చినందుకు చాలా సంతోషించాను. ఆ రోజు సాయంత్రమే ''క్రూర జార్జి''ని — జార్జి మేయ్‌లన్‌ని — అరెస్టు చేశాం. ఆ బాపతు రకాల్లాగానే అతను ఒట్టి పిరికి

పంద. ఇంటరాగేషన్ అప్పుడు చలిజ్వరం వచ్చిన వాడిలా వణికి పోయాడు యేడ్చాడు, అబద్ధాలు చెప్పాడు. అబద్ధాలు చెప్పాడు, యేడ్చాడు. కడకి అంతా పూసగుచ్చినట్టు చెప్పేశాడు. తన ప్రియురాలి దగ్గర వడికిన పాతిక వేల రూబుళ్లనీ భద్రంగా తన బేంక్ అకౌంట్‌లో పడేసుకున్నట్టు రుజువైంది. యీ అవలక్షణాలకి తోడు అతను చెప్పలేనంత దురాశాపరుడు, పరమ లోభి కూడానూ.

ఆడదాన్ని తియ్యగా చూస్తున్నట్టు కనిపించే నక్క వినయపు మొఖం, దేవురించే గొంతుక, వాపిరి గొట్టు ప్రవర్తన, లేదు మొర్రోమని మొత్తుకోవడాలు తీవిగల ప్రవర్తన అని తను పరిగణించే తీరులో మాట్లాడ్డం గీసుకున్న కనుబొమలు ధగధగ మెరిసే సూటు వెలపరం పుట్టిస్తాయి. తెర్‌అవనేసొవ్ భార్య యీ తార్పుడిగాడి వల్లో యెలా పడిందో ఆశ్చర్యం. తన ప్రేమని, గౌరవాన్ని దురదృష్టవంతుడైన భర్త తలరాతని పీడి కాళ్ల ముందు యెలా విసిరేసిందో ఆశ్చర్యం.

యీ నీచుడికి తగ్గ శిక్ష పడుతుందని నాకు సంతోషం కలిగింది. అదీ గాక యితని అరెస్టు వల్ల తెర్‌అవనేసొవ్, క్యూన్‌లు నిర్వహించిన పాత్రలు మరింత వెలుగులోకి వస్తాయి.

మేయ్‌లన్‌ని జైలుకి పంపడం నాకు చాలా సంతోషం కలిగించింది. యింతకంటే ఘోరమైన నేరాలు చేసిన వాళ్లని చూశాను. కాని యింతకంటే వెలపరమైన మనిషిని నేను అంతకు ముందు చూళ్లేదు. హంతకుల్ని ఎరుగుదును, తాము ఘోరమైన నేరం చేసినా మానవాంశ యింకా కొంత వాళ్లల్లో వుండేది. నేను విధి నిర్వహణలో వాళ్ల నేరం రుజువు చేసిన దానిమీద ఆ నేరాలకి వాళ్ళు శిక్ష అనుభవించాల్సి వుండేది. కాని తనని అమ్ముకున్న యీ తుచ్ఛుడ్ని చూసినప్పుడు కలిగినంతగా మంట పుట్టించే యేవగింపు, రోత వాళ్లని చూసినప్పుడు నాలో కలగలేదు. యితను దేనికేనా తగును. నేను దారి దోపిడీ దొంగల్ని యెరుగుదును — వాళ్ళు మేయ్‌లన్ చేతిని తాకరు తనేం చేసాడో వాళ్లకి తెలిస్తే. నక్క పులి కాదు, కాని పులికంటే యెంత యెక్కువ వెలపరం పుట్టిస్తుంది!

తెర్‌అవనేసొవ్, యీ కేసులో అతని ప్రవర్తన అసహ్యకరమే అయినా కూడా అతను పరిస్థితులకి ఎర అయాడు. క్యూన్, మేయ్‌లన్‌లు పన్నిన ఉచ్చులో చిక్కుకున్నాడు. కోర్టు యీ విషయం పరిగణనలోకి తీసుకుని పదేళ్ల శిక్ష వేసింది.

పదచిత్రం

క్యూన్‌ని పట్టుకున్నాక పేరు మోసిన నెవ్‌మన్ క్రిస్టఫర్ యనాకి జాడ పట్టాల్సివచ్చింది. లెనిన్‌గ్రాడ్‌నుంచి అదృశ్యం అయిపోయే ముందు ఆ తుచ్ఛుడు తన ఫొటోలన్నిట్నీ ధ్వంసం చేసేశాడు. ఆ రకంగా వెతకడం సంక్లిష్టం అయిపోయింది.

క్యాన్ చెప్పిన ప్రకారం యనాకి మాస్కోలో వున్నాడు. లేదా అక్కడికి వెళ్లాడు. యేదో తెలియని మారు పేరు వాడుకున్నాడు. ఆ పేరేమిటో తెలీదు.

యీ చిక్కు విడదీద్దామని నేను చేసిన ప్రయత్నాలు యేమీ ఫలించలేదు. యనాకి పెద్ద చెయ్యి తడిగాళ్లల్లో ఒకడనీ, దొంగచాటు వ్యాపారాల్లో బోలెడు సొమ్ము చేసు కున్నాడనీ యీ లోపున మాకు తెలిసింది.

అందుకని కొన్ని సార్లు యనాకి లెనిన్‌గ్రాడ్ శివారుల్లో వొక చోట కనిపిస్తున్నాడని వున్నట్టుండి నాకు తెలిసేటప్పటికి నాకు చాలా సంతోషం కలిగింది.

వెదకడం కొనసాగించే మార్గాలని ఆలోచిస్తూ "పద చిత్రం" అనే దాన్ని వాడుకోవాలని నిర్ణయించాను. యీ పద్ధతిని 1885లో ప్రఖ్యాత ఫ్రెంచి క్రిమినాల జిస్టు పారిస్ పోలీస్ ప్రిఫెక్చర్ ఐడెంటిఫికేషన్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టరూ అయిన అల్ఫాన్స్ బెర్టిల్యోన్ రూపొందించాడు. దీన్ని తర్వాత స్విస్ క్రిమినాలజిస్టు రీయిస్ విస్తృత పరిచాడు. ఆయన దగ్గరికి 1912లో జారిస్టు జస్టిస్ మినిస్ట్రీ రష్యన్ కోర్టు ఇన్వెస్టిగేటర్ల క్రిమినాలజిస్టుల బృందాన్ని అధ్యయనం కోసం పంపింది.

క్రిమినాలజిస్టులు అంగీకరించిన అర్థంలో "పద చిత్రం" అనేది ఒక మనిషిని కచ్చితంగా వర్ణించి రూపు కట్టించడం (అతని శరీరం, తల, ముఖం). దీనికి ప్రత్యేక పదబంధాలు వాడతారు. ఒక వ్యక్తి యెలా వుంటాడో యెవళ్లైనా వర్ణిస్తే అతన్ని గురించి మాటల్లో చిత్రిస్తున్నట్టే కదా. యేమైనా అతను వాడే మామూలు మాటలు స్పష్టమైన కచ్చితమైన భావాన్ని కలిగించవు. కాని నేరస్థుని కోసం వెతికేటప్పుడు కచ్చితమైన వర్ణన తప్ప ఉపయోగపడదు.

పద చిత్ర పద్ధతి ప్రకారం వ్యక్తి ముఖాకృతిని మూడు భాగాలుగా విడగొడతారు: నుదురు భాగం — జుట్టు మొదలైన వాటి దగ్గర్నుంచి నాసికా దూలం దాకా; ముక్కు; నోరు భాగం — ముక్కు దిగువనుంచి చుబుకం చివరదాకా.

వెతికేటప్పుడు గాని, నేరస్థుని లేదా శవం పోలికలు గుర్తుపట్టడానికి గాని పద చిత్రం ద్వారా ప్రయత్నించేటప్పుడు పరిశోధకుడు అందు కోసం ఉద్దేశించిన కచ్చిత మైన పదాల్నే వాడాలి. అలవాటయ్యే కొద్దీ నేర పరిశోధకుడికి పద చిత్రపు అంశాల్ని ప్రత్యేక పరిచి చూసి గుర్తుపెట్టుకునే సామర్థ్యం పెరుగుతుంది.

యనాకి పద చిత్రం సిద్ధం చెయ్యడానికి నేను చాలా మంది అతన్ని యెరిగిన వాళ్లని ప్రశ్నించాల్సివచ్చింది. వాళ్లు అతి చిన్న చిన్న వివరాలతోసహా చాలా ఉపయోగ కరమైన సమాచారం యిచ్చారు. దీన్ని ఆధారం చేసుకుని నేను కష్టంమీద అతని పద చిత్రం తయారు చేశాను. యనాకి సామాన్యమైన యెత్తు వుంటాడు. దిట్టంగా వుంటాడు. కోల ముఖం. వెనక్కి వాలే కురచ నుదురు. వంపులు తిరిగిన ఎర్రటి కనుబొమలు. అవి పొడుగాటి కొక్కెంలాంటి నాసిక పైన కలుస్తాయి. నోరు సామా

న్యంగా వుంటుంది. అంచుల్లో వాలి వుంటుంది. పెదాలు బండగా వుంటాయి. కింద పెదవి ముందుకి వాలి వుంది. నలుచదరంగా వుండే చుబుకం. చీలి వుంటుంది. పెద్ద త్రిభుజాల్లా వుండే చెవులు. అవి కొంచెం ముందుకు వచ్చినట్టుంటాయి. ఉబ్బిన ఆకుపచ్చ కళ్ళు. ఎర్రటి జుట్టు.

యీ పద చిత్రం గురించి చాలా కష్టపడ్డాను. యెన్నడూ అతన్ని చూడక పోయినా స్పష్టంగానే వూహించుకున్నాను. అతని పద చిత్రాన్ని అనేక డిపార్ట్‌మెంట్లకి పంపించాను. పారిపోయిన యనాకిని పట్టుకోవడానికి యిది ఉపకరిస్తుందనే ఆశించాను. శనివారం నాడు సెస్త్రొరెత్‌స్క్‌కి వెళ్ళాను. ఆదివారం అక్కడ గడుపుదామని అను కున్నాను. అప్పట్లో సెస్త్రొరెత్‌స్క్ ఆదివారాల్లో మామూలుగా రద్దీగా వుండేది. వేసవి కాలం, యెండ రోజులు. అద్భుతమైన బీచ్ స్నానాలు చేసేవాళ్ళతో కిక్కిరిసిపోయి వుండేది.

మర్నాడు స్నానాల వినోదం జోరుగా వున్న సమయంలో మా సహచరులిద్దరి పక్కన బీచిమీద వాలేను. వాళ్ళు రగీన్‌స్కీ, బొదునోవ్‌లు – ఇనస్పెక్టర్లు. ఆ సమ యంలో యిద్దరు యువకులు యెవళ్ళ కోసమో వెతుకుతూ అటు వెళ్ళడం కనిపించింది.

"యీ కుర్రాళ్ళిద్దరూ ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్ వాళ్ళనుకుంటాను. యెవళ్ళ కోసమో వెతుకుతున్నట్టుంది" అన్నాడు బొదునోవ్.

కొన్ని క్షణాల తర్వాత వాళ్ళు మా దగ్గరికి వచ్చారు.

"కామ్రేడ్ షేయినిన్, మేం మీ కోసం వచ్చాం. పద చిత్రం పని కొచ్చింది. యనాకిని దెత్‌స్కొసేల్‌స్కీ రైల్వే పోలీసు స్టేషన్‌లో వుంచాం. మిమ్మల్ని రమ్మని ఛీఫ్ కబురు చేశారు. మీ యింటికి వెళ్ళాం మీరిక్కడున్నారని చెప్పారు" అన్నాడు వాళ్ళల్లో ఒకడు.

సంతోషం పట్టలేకపోయాను. బట్టలు తొడుక్కుని వెంటనే వూళ్ళో పడ్డాను. పోలీసు ఛీఫ్, దెత్‌స్కొసేల్‌స్కీ స్టేషన్లో నా కోసం చూస్తున్నాడు.

"మంచి పనే పెట్టారు మాకు" అన్నాడాయన, సంతృప్తిగా. "భలే తమాషాయే 'పద చిత్రం'. యింతకు ముందెన్నడు వాడి యెరగను. మా వాళ్ళూ వినలేదు. యీ ఉదయం అందర్నీ పిలిచి పద చిత్రాన్ని చదివి వినిపించాను. అందరం వేట మొద లెట్టాం యీ యెర్ర తల వాడి కోసం" అన్నాడు.

"యింతకీ యనాకి యేడి?" అని అడిగాను చిరాగ్గా.

"ఆఁ, యిప్పటికప్పుడే ఓ డజను మంది వుండి వుంటారక్కడ" అన్నాడాయన సంతోషంగా. స్టేషన్ గదికి తీసుకెళ్ళాడు నన్ను. "వాళ్ళల్లో ఒకడు మాత్రం ఖాయంగా యనాకియే. మిగతా వాళ్ళు అన్నదమ్ములాళ్ళై వుంటారు" అన్నాడు.

నేను జావగారిపోయాను. దెత్‌స్కొసేల్‌స్కీ స్టేషన్ పోలీసు ఛీఫ్ బెర్తిల్యోన్, రీయిస్‌ల అభిప్రాయానికి సరిగ్గా వ్యతిరేకమైన దాన్ని చేస్తున్నాడు.

''మీకు అర్థం అవలేదా, పద చిత్రం ప్రకారం ఒఖ్ఖణ్ణే మాత్రమే అరెస్టు చెయ్యాలి, ఆ వ్యక్తి యనాకి తప్ప వేరే వాళ్లు కాకూడదు'' అన్నాను ఉద్రేకంతో నత్తుతూ.

''నేనేం వాదించను'' అన్నాడా హుషారైన ఛీఫ్, చిరునవ్వు నవ్వుతూ. ''ఒకడు మాత్రం ఖాయంగా యనాకియే. మిగతా వాళ్లు పట్టించుకోరనే అనుకుంటున్నాను. మేం అందర్నీ చాలా మర్యాదగా చూశాం. వాళ్లని కొట్లో పడెయ్యలేదు. స్టేషన్ గదిలో వున్నారు. కొంత మంది టీ తాగుతున్నారు, చెక్కర్లు ఆడుకుంటున్నారు. కొంత మంది పత్రికలు తిరగేస్తున్నారు. అదే సంస్కృతి'' అన్నాడు.

బుస్సుమంటూ నేను స్టేషన్ గదిలోకి వెళ్లాను. ముదురు యెరుపు, కారట్ ఎరుపు, మంట యెరుపు తలకాయల మనుషులతో గది వెలిగిపోతోంది. వాళ్లు అటూ యిటూ తిరిగేస్తున్నారు, యేం జరుగుతూ వున్నదీ అర్థం కాక. దెత్స్కా-సేల్స్కీ స్టేషన్ కుర్రాళ్లు ఒక్కొక్క యెర్ర తల మనిషినే పట్టుకొస్తూ వుంటే వాళ్లకి భయం యెక్కువైపోతూ వుంది. అసిస్టెంట్ ఛీఫ్ కొమ్ము ఫ్రేమ్ కళ్లద్దాలు పెట్టుకున్న యువకుడు. పద చిత్రం యిచ్చే అవకాశాలు చూసి ఉత్సాహ పడి పోతున్నాడు. ప్రతి ఎర్ర తల మనిషినీ మర్యాదగానే పలకరించిన మాట నిజమే కాని వెంటనే చెవులు, ముక్కు, నోటి గీతలు, పద చిత్రంలో వున్న యితర అంశాలు జాగ్రత్తగా కొలిచి పరీక్షించడం మొదలెట్టాడు. తన నోట్‌బుక్‌లో నిగూఢమైన దాన్ని రాసుకుంటూ, యేదో గొణుక్కుంటూ వున్నాడు. యీ లోపున మిగతా వాళ్లు చూస్తూ నుంచున్నారు. ఎర్ర తలకాయ మనుషులకిదేదో తాంత్రిక వ్యవహారంలా కనిపించింది. అసిస్టెంట్ ఛీఫ్ వాళ్లడిగిన వాటికి అస్పష్టంగా జవాబు లివ్వడంతోటి మరీ అలా అనిపించింది. ''దీనికంతటికీ బెర్టిల్యోన్, రీయిస్‌ల పద చిత్రంతో సంబంధం వుంది. సీనియర్ ఇనస్పెక్టర్‌గారు యిప్పుడే వచ్చేస్తారు. ఆయన నిర్ణయిస్తారు. ఆయనొచ్చే దాకా మీరు ఆగాలి'' అని అంటున్నాడు.

వాళ్లళ్లో యెవడూ బెర్టిల్యోన్, రీయిస్‌ల గురించి గాని, పద చిత్రం గురించి గాని యెన్నడూ విని వుండలేదు. యెవళ్లూ టీ తాగడం లేదు, చక్కర్లు ఆడ్డం లేదు, పత్రికలు తిరగెయ్యడం లేదు. అందర్లోకీ వయసులో ఒకతను పెద్దగా వున్నాడు. సెన్నోయ్ మార్కెట్‌లో మాంసం అమ్మేవాడు. అతనికి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లన్నా, పన్నుల శాఖ వాళ్లన్నా అన్నిటికంటే యెక్కువ భయం. అతను మిగిలిన వాళ్లతో గుసగుస లాడుతున్నాడు.

''అర్థమైంది — వాళ్లు ఎర్ర తలల వాళ్లమీద ప్రత్యేకం యేదో పన్ను వడేశారు. అందుకనే యిక్కడ మన పని అయిపోయింది'' అంటున్నాడు.

''పన్నులేమిటి బడుద్ధాయితనం, ఇన్‌స్పెక్టరు కోసం చూస్తున్నామని స్పష్టంగా

అంటూ వుంటే. పైగా సీనియర్ ఇన్‌స్పెక్టర్ కోసం. దీనికి తోడు యీ కళ్లద్దాలోడు ప్రతివాడి చెవులూ ముక్కూ కొలుస్తూ వున్నాడు. వేరువేరు ముక్కులకి వేర్వేరు పన్నుటంటాయా?" అని యింకో డంటున్నాడు.

"యిద్దరూ కుర్ర తరహాగా వున్నారు. ఎర్ర తలల వాళ్ళ యేదో కొత్త సిని మాకి అవసరం అయివుంటారు. అనుకున్న కొలతలకి సరిపోతాయా లేదా అని చెవులూ, ముక్కులూ కొలుస్తున్నారు కూడానూ" అని యింకోడు అన్నాడు. అతను పూర్వం స్టాక్ బ్రోకరు.

యీ వాద ప్రతివాదాలు తారస్థాయిలో వుండగా నేను వెళ్లివుంటాను. ఎర్ర తలకాయల వాళ్ళ నన్ను చుట్టు ముట్టేసి, నే క్షమాపణ చెవ్తూ వుంటే చెవులప్పగించి వింటూ వుండిపోయారు. పొరపాటైపోయిందనీ, మేం పారిపోయిన ఓ వ్యక్తి కోసం వెతుకుతున్నామనీ, అతనికి యెర్ర జుట్టు వుందనీ, కాని దెత్‌స్కొసేల్‌స్కీ స్టేషన్ పోలీసాఫీసర్లు దురదృష్టవశాత్తూ మరీ తు. చ. తప్పకుండా సూచనల్ని అమలు జరుపు తున్నారని చెప్పాను. అలా చెప్పడం నా ధర్మం అనిపించింది. వాళ్ల కాగితాలు పరిశీ లించి పద చిత్రం గుర్తులు ప్రయోగించి యనాకి వాళ్లల్లో లేడని తేల్చాను. మరో సారి క్షమాపణ చెప్పి అందరూ వెళ్లిపోవచ్చని అన్నాను. ఆకురాలు కాలపు కారాకుల్లాగా వాళ్ళ ప్లాట్‌ఫారంమీద చెదిరిపోయారు. కాని ఒక ఎర్ర తల అతను మాత్రం దిగడి పోయాడు. అతను నన్ను దగ్గరికి రమ్మని నిగూఢంగా సంకేతం చేశాడు. నన్ను ఓ మూలకి తీసుకుపోయాడు.

"ఆ ముగ్గురు ఎర్ర తల చవటలూ వాదు లాడుకుంటూ వుంటే, అసిస్టెంట్ ఛీఫ్‌కి యే ముక్కులూ, చెవులూ మహా ఆసక్తికారకమో నేను పరిశీలించాను. అతను యనాకి ముక్కు, చెవుల కోసం వెతుకుతున్నాడు. అతను నాకు తెలుసు. అతనిప్పుడు లెనిన్ గ్రాడ్‌లో లేడు. మాస్కోలో వున్నాడని అంటున్నారు. యింతకీ, అతనికి ఓపెరెట్టా లంటే యిష్టం. అదీ విషయం. ఎర్ర తల మనిషిగా సాయం చెయ్యడం నా ధర్మం. సెలవ్ క్రామేడ్ సీనియర్ ఇన్‌స్పెక్టర్" అన్నాడు.

తన పౌర ధర్మాన్ని నిర్వర్తించిన మనిషిలాగా అతను వెళ్లిపోయాడు.

స్టేషన్ ఛీఫ్ ఒక్కడే వున్నప్పుడు నేను అతని గురించీ, అతని "కుర్రాళ్ల" గురించీ నా అభిప్రాయం చెప్పాను. అతను యిబ్బంది పడిపోయి క్షమించమని అడిగాడు. "రేపటినుంచీ నేను నేరపరిశోధనశాస్త్రం చదవడం ఆరంభించి, పద చిత్రం అంటే కచ్చితంగా పట్టుకుంటాను" అన్నాడు. నిజంగానే ఓ నెల తర్వాత అతను నా దగ్గరికి వచ్చి పద చిత్రం చరిత్రని, ఆ పారిభాషిక పదాల్ని, దాని పథకాన్ని, అభివృద్ధిని దడదడ వప్పగించేశాడు. బెర్టిల్యోన్‌ని, రీయిస్‌ని, వైన్‌గార్ట్‌ని, యకీమోవ్‌ని ఉల్లేఖించాడు.

"నన్నంత యిబ్బందికరమైన స్థితిలో పడేసిన దరిద్రుడు యనాకిని చిత్రించు

కోవడానికి నేను వూరికే కళ్ళు మూసుకోవాలంతే. ఆ ఎర్ర తల వాళ్ళందర్నీ పట్టు కొచ్చినందుకు మా ఛీఫ్ తిట్టిన తిట్లు సంగతి చెప్పక్కర్లేదు. కాని బెర్టిల్యోన్ గట్టి బుర్రే. అతను వూహించిన పద చిత్రం మొత్తంమీద గట్టిదే" అన్నాడు.

నేరపరిశోధనలో తన విజయాల్ని దెత్స్కొసేల్స్కీ స్టేషన్ పోలీసు ఛీఫ్ ప్రదర్శించిన మర్నాడు నా చిరునామా రాసిన ఉత్తరం ఒకటి రీజినల్ కోర్టుకి వచ్చింది. దాన్ని యనాకియే రాశాడు.

"ప్రియమైన సీనియర్ ఇన్‌స్పెక్టర్ షేయినిన్,

నన్ను చూడాలని తహతహలాడి పోతున్నట్టుంది మీరు. మీకు లాంటి కోరికే నాకూ వుందని అనలేను. సిసలైన ప్రేమ పరస్పరం వున్నప్పుడే ఆనందం. యేదో ప్రొ. రీయిస్స్ తయారు చేసిన చవట పద చిత్రం పద్ధతి ఆధారంగా నా కోసం మీరు చూస్తూ వున్నారని విని తెగనవ్వు కున్నాను. ఆ ప్రొఫెసర్‌గారవ్నా, ఆయన పద చిత్రం పద్ధతి అన్నా మహా (అ) గౌరవంగా వుంది.

సెలవ్, యనాకి"

నాకు నిజంగా మంటెక్కిపోయింది. యీ నెవ్‌మన్ మోసగాడు చట్టాన్ని ధిక్కరించి పారిపోవడమే గాక నేరపరిశోధనాశాస్త్రాన్నే యెతికుతం చేస్తున్నాడు. యీ పత్రాన్ని రీజినల్ ప్రాక్యురేటర్‌కి చూపించాను. దానిమీద పోస్టు మార్కు మాస్కో అని వుంది. తక్షణం అక్కడికి వెళ్ళేందుకు అనుమతి అడిగాను. యనాకిని కనిపెట్టడానికి నేనేం చెయ్యబోయేదీ నాకు స్పష్టమైన అవగాహన లేదు. కాని 'మూర్'లో వున్న నా పాత స్నేహితుల సహాయంమీద ఆధార పడ్డాను. రీజినల్ ప్రాక్యురేటర్ కూడా అంతగానూ ఆ ఉత్తరం చూసి చిరాకు పడిపోయి తక్షణం బయల్దేరమని నాతో అన్నాడు.

ఆ మర్నాడే నేను 'మూర్'కి వెళ్ళాను. ఓసిపావ్ ఆఫీసుకి వెళ్ళి యనాకి పద చిత్రం యేమైందీ ఆయనకీ, టిల్నర్‌కీ, నొజ్డ్రీత్స్కీకీ మిగతా వాళ్ళకీ చెప్పాను. అప్పుడు ఉత్తరం చూపించాను. ఓసిపావ్ కోపంతో దేపురించుకుపోయాడు.

"అబ్బాయిలూ, లంచాలమారి లుచ్ఛా నెవ్‌మన్ ఒకడు, నేరపరిశోధకశాస్త్రం పట్ల, న్యాయం పట్ల యెతికుతంగా నవ్వుతూ వుంటే మనం సహించడమేనా? మనమేం చెయ్యాలను కుంటున్నారు?" అన్నాడు తన అసిస్టెంట్లని చూసి.

"ఆ ప్రశ్నేమిఃటి?" అని టిల్నర్ అన్నాడు. అతను యెప్పుడూ నిబ్బరంగా, కచ్చి

తంగా ఆత్మస్థైర్యంతో వుంటాడు. "మొదటగా అతని పద చిత్రం మన దగ్గర వుంది. చాలా మంది నెప్‌మన్‌ల లాగానే యనాకికి ఒపెరెట్టాలంటే యిష్టం అని తెలుసు. అంటే 'ఆక్వేరియమ్' హాలు దగ్గరా, 'హెర్మిటాజ్' దగ్గరా చూడాలి. కడగా అతను ఫర్నిచర్ వర్తకం వాడు. అంచేత మాస్కో ఫర్నిచర్ వర్తకుల్లో స్నేహితులుండే వుంటారు. యిక్కడ కూడా చూడాలి మనం. మొత్తం వ్యవహారం అంతా మేటర్ ఆఫ్ ప్రిన్సిపుల్ అయింది కాబట్టి మన బృందం యనాకిని వెదకడంలో పాల్గొవాలి" అన్నాడు.

"నువ్వన్నది రైట్. మనం సాయంత్రంపూట ఒపెరెట్టాల దగ్గర గడపాలి. వంతుల వారీగా 'క్వీన్ ఆఫ్ జార్‌దాన్'నీ, 'దెయ్ ఫ్లెదెర్‌మస్'నీ చూస్తూ గడపాలి. వేరే దారి లేదు" అన్నాడు నొజ్నీత్‌స్కీ తన మామూలు మెత్తని ధోరణిలో.

"అదీ సంగతి. యివాళ 'ఆక్వేరియమ్'లో యేం వుంది?" అని అడుగుతూ ఓసిపావ్ ముగించాడు. సమావేశం ముగిసిందని తెలియ చేస్తూ లేచి నుంచున్నాడు.

నొజ్నీత్‌స్కీ పేపరు తీసుకుని అడ్వర్‌టైజ్‌మెంట్లు చూసి "క్వీన్ ఆఫ్ జార్‌దాన్" వుందనీ, తత్యానా బాఖ్, బ్రౌవిన్, యరోన్‌లు ముఖ్యమైన పాత్రలో నటిస్తున్నారనీ చెప్పాడు.

నేనూ, ఓసిపావ్ 'ఆక్వేరియమ్' సమ్మర్ గార్డెన్‌కి "క్వీన్ ఆఫ్ జార్‌దాన్" ప్రదర్శన చూడ్డానికి ఆ సాయంత్రం వెళ్లాం. మా సీట్లు కుడి వేపున మూడో వరసలో వున్నాయి. మా వెనక కొన్ని వరసల తర్వాత ఓసిపావ్ అసిస్టెంట్లు కూర్చున్నారు. యాష సక్సగాన్‌స్కీ, — సన్నగా వుండే జార్జియన్, అతనికి చిన్న నల్లని మీసం వుంది; పద చిత్రాలకి సంబంధించి నిపుణుడు అంటారు. వాన్య బెజాకొవ్, యెప్పుడూ నవ్వుతూ కులాసాగా వుండే మనిషి. 'మూర్'లో వాళ్లు అన్నట్టు ముందుకీ వెనక్కీ కూడా చూడగలిగే బూడిద రంగు కొంటె కళ్లు యీ మనిషికి వున్నాయి.

మొదటి ఇంటర్వల్‌లో నేనూ, ఓసిపావ్ 'అక్వేరియమ్' సన్నని లిండెన్ చెట్ల దారిలో పచార్లు చేస్తున్నాం. సక్సగాన్‌స్కీ అప్పుడు మా దగ్గరికి వచ్చేడు.

"యిదీ పరిస్థితి. పన్నెండు ఎర్ర తలకాయల వాళ్లు ప్రదర్శన చూస్తున్నారు. రెండు జతల చెవులు మన వర్ణనకి సరిపోతాయి కాని ముక్కులు తేడాగా వున్నాయి. ముగ్గురికి మనకి కావాల్సిన ముక్కులు వున్నాయి కాని చెవులు తేడాగా వున్నాయి. పెదాలకి సంబంధించి మనకి అదృష్టం లేదు. ఒక్క ఎర్ర తల వాడి పెదవి మాత్రం కొంచెం ముందుకు వాలి అదేనా వాడు పైపు కాల్చబట్టేమో. పైపు కాల్చే వాడె వడికేనా పెదవి అలానే వుండచ్చు" అని చెప్పాడు.

యీ సమాచారం విని దెత్‌స్కొసేల్‌స్కీ. స్టేషన్ గది నాకు గుర్తువచ్చింది.

యేమైనా నా ఆందోళనకి ఆధారం లేదు. ప్రస్తుతం నేను ఓసిపొవ్‌తో వ్యవహరిస్తు న్నాను, అక్కడికీ యిక్కడికీ తేడా వెంటనే తెలిసింది.

"యాష, నీ సమాచారం యెలా వుందంటే గోగొల్ నాటకం 'పెళ్లి'లో పెళ్లికూతురు నాకు గుర్తుకొస్తోంది. అందులో కూడా బుర్ర స్థిమితం లేని అమ్మాయి ఒకడి పెదాలూ యింకోడి ముక్కూ కలిపేస్తూ వుంటుంది: కామ్రేడ్ నక్సగాన్‌స్కీ మీ ముక్కుల లెక్కల నాకక్కర్లేదు. నాకు కావాల్సిందొక్కటే ముక్కు, క్రిస్టఫర్ యనాకి ముక్కు. యిప్పుడు చెప్పు, అది యీ పూట యిక్కడ వున్నట్టా లేనట్టా?" అని అడిగాడు ఓసిపొవ్.

"రెండవ ఇంటర్వల్ వేళకి సమాధానం చెప్తాను" అని యాష వాగ్దానం చేసాడు.

"ఎడం వేపున రెండో వరస సరిగా చూడు. మేం దూరంలో వున్నాం. అయినా నాకనిపించింది మనక్కావాల్సిన.... సర్లే, రెండో వరసలో చూడు, యాష" అన్నాడు ఓసిపొవ్.

రెండో అంకంలో నేను స్టేజిమీద కంటే యెక్కువ ఎడం వేపు రెండో వరస కేసే చూస్తూ వున్నానని చెప్పడం అనవసరం. యెవడిదో ఎర్రటి తలకాయ బిలియర్డ్స్ బల్లలా నిగనిగ లాడిపోయే బట్ట తలకీ, కొప్పుముడి వున్న దూది లాంటి జుట్టు ఆడ మనిషికీ మధ్య వుంది. కొంచెం దూరంగా వుండడంతో చెవులు సరిగా కనిపించలా, ముక్కు నోరూ కూడా సరిగా ఆనలా. కాని యాష పంటినెప్పి వున్న వాడిలా దవడమీద చెయ్యి వేసుకుని రెండు సార్లు అటూ యిటూ వెళ్లడం రావడం కనిపించింది.

రెండో అంకంలో ఎడ్వినూ, సిల్వా చెట్టావట్టా లేసుకుని ప్రఖ్యాత యుగళగీతం పడుతూ "ఆనందం మనమీద విరియడం గుర్తుందా" అనే సందర్భం వచ్చేటప్పటికి నిజంగానే నామీద విరిసింది. యాష ఆ క్షణంలో నా దగ్గరికి వచ్చి చెవిలో గొణిగాడు.

"యనాకి ఆరో వరసలో వున్నట్టుంది. ఒక్క తేడా మిగిలిపోయింది. మిగిలిందంతా నప్పుతోంది. అతను యనాకి కాకపోతే రేపు నేను రాజీనామా పెట్టేస్తాను. ఇంటర్వల్‌లో చూపిస్తాను" అన్నాడు.

నేను వెంటనే ఓసిపొవ్‌తో యీ సంగతి చెప్పాను. ఒక్క పిసరు కూడా ఆయన చలించలేదు. సిసలైన కళాపోషకుడిలాగా సంగీతానికి తల వూపుతూ ఆయన మెల్లిగా అన్నాడు:

"యాష తొందర పడి సూత్రీకరణలు చేసేస్తున్నాడులా వుంది. అయినా యేమో చెప్పలేం. ఇంటర్వల్‌లో చూద్దాం."

రెండో అంకం అయిపోయింది. ఓసిపొవ్ నా చెయ్యి పట్టుకున్నాడు. మేం వెలుతుర్తో ప్రకాశించే దారులమీద పచార్లు చేశాం. బాగా ముస్తాబై వున్న గుంపులో కలిసిపోయాం. అప్పట్లో మాస్కో 'అక్వేరియమ్' జనాలు అలానే వుండేవాళ్లు. తెలుపు

బొచ్చు, నలుపు బొచ్చు అంచుల వల్లెవాట్లు వేసుకుని చక్కగా ముస్తాబైన ఆడ వాళ్లు పచార్లు చేశారు. వాళ్ళ కళ్లని మరీ షోకు చేసుకునేవాళ్లు. లిప్ స్టిక్ బాగా వేసుకున్న పెదాలు బాగా పౌడరు అద్దుకున్న బుగ్గలలో నవ్వకుండా అసహజంగా వెలిగేవి. ఎర్రటి ముఖం పచారీ వర్తకులు, చేపల వ్యాపారులూ ప్రదర్శనలకి వచ్చేవాళ్లు. వాళ్ళ ఎత్తు రొమ్ములూ, గుండ్రటి ముఖాలూ వున్న తమ భార్యల్ని పట్టుకు తీసుకెడుతూ వుండేవాళ్లు. ఆ భార్యలు ప్రింటెడ్ పర్షియన్ సిల్కు శాలువాల అంచులు నేలమీద జీరాడించుకుంటూ భర్తలతో నడిచి వెళ్లేవాళ్లు. నికోల్స్కయా, పెత్రోవ్క వీధుల్లో వుండే నడివయస్కులైన ఉత్పత్తిదార్లు స్టైలుగా వుండే పిన్స్‌నెజ్ కళ్లజోళ్లనీ, బంగారం పళ్లనీ ప్రదర్శించుకుంటూ వెళ్లేవాళ్లు. పడుచు షోకిల్లారాయుళ్లు కుర చగా, సన్నగా వుండే లాగులూ బిగుతుగా వుండే అల్పిక చొక్కాలూ తొడుక్కునేవాళ్లు. అప్పట్లో అది మంచి ఫాషనుగా వుండేది. వాళ్లు కులుకులు పోయే ఆడపిల్లల వెనక్కాల గుంపులుగా పడిపోయేవాళ్లు. ఆ ఆడపిల్లకి మగపిల్లల క్రాపులూ, చిన్న నుదుటిమీద కత్తిరించిన జుట్లూ వుండేవి.

హఠాత్తుగా నాకు కొట్టవచ్చినట్టు నల్లటి జుట్టున్న మనిషి ఒకడు కనిపించాడు. ఓ రాగి జుట్టు వగలాడి పక్కన వెడుతున్నాడు. ఆమె తెల్లని కేప్ ధరించింది. నీలం నక్క బొచ్చు శాలువా అలవోకగా చేతిమీద వేసుకుంది. నేనెన్నడూ అతన్ని చూసి వుండను అనేది ఖాయమే, అయినా అతని ముఖం యెందుకనో పరిచయం గల ముఖంలాగే వుంది.

అతని పక్కనున్న ఆడమనిషిని తేరి చూశాను. జుట్టుకి రంగు వేసుకుంది. కాంతిలేని పెరాక్సైడ్‌లా వుందది. అప్పుడు తట్టింది: ఆ మనిషి ముఖం అంత పరిచిత మైనట్టుగా యెందు కనిపించిందో. మాంసలమైన కొక్కెం ముక్కు, కురచగా వెనక్కి వాలినట్టుండే నుదురు, పొదలా అల్లుకున్న కనుబొమలు, నలుచదరంగా, చీలిన చుబుకంతో వున్న గడ్డం, ఎర్రటి త్రిభుజాకారపు చెవులు — యనాకి పద చిత్రంతో నప్పే ప్రతీదీ వుంది.

అతను సిగరెట్ కాలుస్తూ వుండడం చూసి గబగబా దగ్గరికి వెళ్లి అగ్గిపెట్టె అడిగాను. అతను మెల్లిగా జేబులోనుంచి అగ్గి పెట్టె తీసి ఒక పుల్ల గీశాడు. అతని చేతులు చూశాను. నా గుండె దడదడ కొట్టుకోవడం మొదలెట్టింది. గోధుమ రంగు మచ్చలూ ఎర్రటి దళసరి వెంట్రుకలూ వున్నాయి. అతని ముఖంకేసి చూశాను. ఉబ్బిన కళ్లు లేత ఆకుపచ్చ రంగుతో వున్నాయి. కను పక్ష్మాలు ఎర్రగా వున్నాయి. యితనే యనాకి, కాని జుట్టుకి రంగు వేసుకున్నాడు.

వెనక్కి వెళ్లాను. పక్కనే యాష నుంచున్నాడు. శూన్య దృక్కులతో, పరధ్యానంగా యనాకి గురించి గాని, 'అక్వేరియమ్' సమ్మర్ గార్డెన్ గురించి గాని, "క్వీన్ ఆఫ్ జార్‌దాన్" ఒపెరెట్టా గురించి గాని, లేదా మర్నాడు పొద్దుట రాజీనామా చేస్తు

న్నాడో లేదో దాన్ని గురించి గాని పట్టించుకున్నట్టే కనిపించకుండా నుంచున్నాడు.

దగ్గర కంటా వొచ్చి గుసగుసలాడేడు.

"జుట్టుకి రంగేసుకున్న వాణ్ణి చూశారు మీరు సంతోషంగా వుంది. వాడే యనాకి, కాకపోతే నేను గాడిదనే" అన్నాడు.

అయ్యో, యాషా! కొన్ని యేళ్ల తర్వాత అతను క్షయవ్యాధివల్ల చనిపోయాడు. అతను బ్రహ్మచారి (జబ్బు మనిషని తెలిసి అతను పెళ్లి చేసుకోలేదు). గదిలోనుంచి శవపేటికని తీసుకెళ్లేటప్పుడు అతని సహోద్యోగులు చాలా బాధపడ్డారు. అతను ధైర్యవంతుడు, జాలి గుండె వాడు, ఉద్రేకి. చివరి దాకా కష్టమైన తన వృత్తికి అంకితం అయిపోయాడు. అతన్ని తోటి ఉద్యోగులు యెంతో ప్రేమించారు.

మరో సారి "బ్లాక్ ఎడిషన్" యువాకిని చూసి ఓసిపావ్ తోటి యాష అన్న మాట రైటేమోనని చెప్పాను. ఆ మనిషి జుట్టు వింత వూదా ఛాయతో కనిపించింది.

"కావచ్చు" అన్నాడు ఓసిపావ్ యధాలాపంగా అంటున్నట్టు నటిస్తూ. కాని నా చేతిని గట్టిగానే పట్టుకున్నాడు. "యీ దొంగవెధవ జుట్టుకి రంగు వేసుకుని వుండ వచ్చు. అందుకనే అంత నిర్లక్ష్యంగా తిరుగుతున్నాడు. కాని ఒకటికి రెండు సార్లు ఖాయం చేసుకోవాలి. దెత్స్కొసేల్స్కి స్టేషన్ ఛీఫ్‌కి జరిగిన మర్యాదలు నాకు జరిగినా యేం పట్టించుకోను. వీడు యనాకి అయి, మొదటి రోజునే మనం అతన్ని ఉచ్చులో పట్టగలిగామంటే మరోలోకం వుందనీ, ముసలి బెర్టిల్యోన్, రీయిస్‌లు తను పద్ధతిని అవహాస్యం చేసిందానికి శిక్షగా స్వర్గంలో మనకి సాయపడేందుకు పథకం వేస్తూ వుంటారనీ నమ్ముతాను."

మళ్లీ తెర లేచేటప్పటికి ఓసిపావ్, నేనూ మా సీటుల్లో లేం. ఆరవ వరస దగ్గర గోడవార నుంచున్నాం. నల్ల జుట్టు అనుమానితుణ్ణి పరీక్షిస్తూ నుంచున్నాం. ఓసిపావ్ స్టేజి వెనక్కి వెళ్లి కొన్ని క్షణాలుండి తిరిగివచ్చాడు. చాలా సంతోషంగా కనిపించాడు. మేం 'చిత్రమైన మనస్తత్వశాస్త్ర ప్రయోగాన్ని' చూడబోతున్నామని నిగూఢంగా గుసగుసలాడేడు.

"క్వీన్ ఆఫ్ జార్దాన్" ఒపెరెట్టా సహాయంతోటే కుశాగ్రబుద్ధి గల మా మిత్రుడు యీ అనుమానితుడి విషయం ఖాయపరుచుకోవాలను కుంటున్నాడు. ఇది చిత్రంగా కనిపించవచ్చు. ఒపెరెట్టా నటులు గొప్ప చాకచక్యం వున్న వాళ్లు. ఆశువుగా కొన్ని పాదాలు చేర్చి సొంతంగా అతికేస్తారు. యీ విషయం తెలిసే ఓసిపావ్ కొన్ని పాదాలు చేర్చమని వాళ్లని బలవంతం చేశాడు. మదాం వోలప్యుక్ తన యౌవ్వనంలో, వెరైటీ స్టేజి సింగర్ అనీ ఆమెని అప్పుడు "ది నైటింగేల్" అని పిలిచారనీ, తెలిసి ఎడ్విన్ తండ్రి షాక్ తినే రంగం అది. తను ఫర్నిచర్ వర్తకుడు యనాకి కూతుర్ని కూడా అనే ముక్కల్ని మాత్రమే దీనికి జత చెయ్యమని ఓసిపావ్ అడిగాడు.

హాల్లో యెవళ్ళూ యీ చిన్న విషయం గురించి యేలాగూ పట్టించుకోలేదు కాని ఆరవ వరసలో నల్లని జుట్టున్న మనిషి ఒక్క సారి వణికాడు. తను తప్పుగా విన్నానే మోనని అనుకుని తన స్నేహితురాలి మీదకి వాలి ఆ చెప్పిన పేరు యేమిటని అడిగాడు.

"వాడే. యాషని బంగారంతో తూచాలి. యనాకి పద చిత్రాన్ని అంత బాగా తయారు చేసావు, మంచిది. పద, బయటకి వచ్చినప్పుడు అతన్ని పలకరిద్దాం" అన్నాడు ఓసిపొవ్ హమ్మయ్య అనుకుంటూ.

ఓ గంట తర్వాత యనాకి ఓసిపొవ్ ఆఫీసులో వున్నాడు. గందరగోళ పడి వున్నాడు. జుట్టుకి రంగేసుకున్నా పద చిత్రంతోటే తనని పట్టుకోవడం జరిగిందని అర్థం చేసుకోలేకపోయాడు.

"వూఁ, యనాకి, ప్రొఫెసర్ రీయిన్స్ నీకంటే తెలివైన వాడు. చట్టాన్ని ఉల్లంఘించేవాళ్ళ నేరపరిశోధనశాస్త్రం లాంటిదాన్ని హేళన చెయ్యకూడదు అని బోధపడిందా?" అన్నాడు ఓసిపొవ్.

"నేనా విషయం గ్రహించాను గాని, మరీ ఆలస్యంగా ఇనస్పెక్టర్. ఆ ఉత్తరం తలబిరుసుతనం మనిషి రాసింది. ఆ విషయం మీ రిపోర్టులో రాసుకోండి. 'క్రిస్టఫర్ నువ్వు శాస్త్రాన్ని గౌరవించవురా, అది చివరికి ముంచుతుంది' అని నా చిన్నప్పుడు మా నాన్న అంటూ వుండేవాడు. మా నాన్న లాంటి తెలివైన ఆయనకి నా లాంటి బదుద్దాయి కొడుకేమిటి చెప్పండి ఇనస్పెక్టర్, నాలాంటి శుంఠకి అలాంటి తండ్రి వుండడం యేమిటి? వంశ పారంపర్య నియమాలు యేమయాయి? యిప్పుడు నాకు నేరపరిశోధకశాస్త్రం అన్నా ప్రొఫెసర్ రీయిన్స్ అన్నా గౌరవం కుదిరింది. ఆ శాస్త్రం గాని, ఆయన గాని దీన్నంతట్నీ యెలా వివరించడం జరుగుతుందంటారు?"

"యీ ప్రశ్నలు బాగానే వున్నాయి. చర్చించడానికి నాకిష్టమే కాని మీరు శిక్ష అనుభవించాక. సరే మీ మాటని బదులు తెచ్చుకుంటే సెలవ్."

ఆ రకంగా బెర్టిల్యోన్, రీయిన్స్‌ల పద చిత్రం పద్ధతి రుజువైంది.

1956

రాత్రి రోగి

లెనిన్‌గ్రాడ్ నగరంలో 1928 వేసవిలో రొట్టెల దుకాణాలని దోచుకోవడం మొదలైంది. అవి రెండు, మూడు రోజులకో సారి క్రమం తప్పకుండా జరిగేవి. మహా తెగింపుతో, వొకదాన్ని మరొకటి పోలి వున్న దొంగతనాలు.

యిక పది నిముషాల్లో దుకాణాలు మూసేస్తారనగా, అంటే సుమారు రాత్రి పదకొండు గంటల ప్రాంతంలో, సాయుధులైన ముగ్గురు యువకులు దుకాణంలోకి చొచ్చుకు వెళ్లేవాళ్లు, తలుపు మూసేసేవాళ్లు.

"హూఁ నేలమీద పడండి, గబగబా! మీరంతా! తొందర తొందరగా" అని వాళ్ల నాయకుడు ఆజ్ఞాపించేవాడు.

సేల్స్ గరల్స్, కేషియర్, పొద్దుపోయివచ్చే ఖాతాదార్లు నోరుమెదపకుండా ఆ ఆజ్ఞని శిరసావహించేవాళ్లు.

ఆ తర్వాత దొంగలు గల్లాపెట్టె కొల్లగొట్టి వున్న సొమ్మంతా అంకించుకుని పారిపోయేవాళ్లు.

"రసీదు: గల్లాపెట్టెనుంచి కొన్ని బేంక్‌నోట్ల మొత్తం తీసుకోవడం జరిగింది. కచ్చితంగా యెంత అయిందీ లెక్కలు చూశాక కేషియర్ ద్వారా తెలుసుకోవచ్చు" అని వొక రసీదుని అక్కడ పడేసేవాళ్లు.

నేరస్థులెవరైందీ కనిపెట్టడానికి పోలీసులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. రొట్టెల దుకాణాల దోపిడీ సాగుతూనే వుంది.

నగరంలో వున్న రొట్టెల దుకాణాలన్నిటిలోనూ పోలీసులు పొంచి మాటు వేసి దొంగల్ని పట్టాలని నిర్ణయించుకున్నారు. అంచేత క్రిమినల్ డివిజన్ యేజంట్లు అమ్మేవాళ్లగా వేషం వేసుకుని అక్కడ మాటు వేశారు.

వో రోజున తెల్లని అంగీలు వేసుకున్న వాళ్లు సేల్స్‌మన్‌ల పక్కనా, సేల్స్ గరల్స్ పక్కన కౌంటర్ వెనకాల, నగరంలోని రొట్టెల దుకాణాల్లో రొట్టె అమ్ముతూ నుంచున్నారు.

ఆ రోజున దొంగలు రాలేదు. అంచేత మర్నాడు కూడా మాటు వెయ్యాలని అనుకున్నారు.

సరిగ్గా పది నిముషాలు తక్కువ పదకొండు గంటలకి బస్వేయ్‌నయా, జ్నామెన్స్కయా వీధుల మొగల్లో వున్న రొట్టెల దుకాణాల తలుపులు ధనామని తెరుచుకుని తుపాకులు పట్టుకున్న ముగ్గురు యువకులు లోపలికి వెళ్లేరు.

"హేండ్స్ అప్! నేలమీద పడండి, వ్వూ, గబగబా..." అని వొకడు అరిచాడు.

"మీరందరూ చేతులెత్తండి! వ్వూ, చేతులెత్తండి లేకపోతే. కాల్చేస్తాం" అని 'అమ్మేవాళ్లు' కూడా తుపాకులు తీస్తూ అన్నారు.

ఆ సమయంలో కొనుక్కోవడానికి ఆలస్యంగా వచ్చిన యిద్దరు లావాటి ముసలమ్మలు మాత్రం దుకాణంలో వున్నారు.

భయపడిపోయిన ఆ ఆడవాళ్లిద్దర్నీ దొంగలు తమ ముందుకి యీడ్చుకున్నారు. అలాంటి పరిస్థితిలో పోలీసులు కాల్చరని వాళ్లకు తెలుసు. నిశ్చేష్టులైన ఆ ఆడవాళ్ల వెనకనుంచి వాళ్లు మాత్రం కౌంటర్ వేపు కాల్చడం మొదలుపెట్టారు. కౌంటర్ పైనుంచి వో సి. ఐ. డి. ఏజంట్ ముందుకు వురికి వాళ్ల వేపు వెళ్లాడు. కాని అతన్ని ఠకామని కాల్చి చంపేశారు. ఓ దొంగ దుకాణంలో వున్న షాండెలీర్‌ని గురిచూసి కాల్చడం మొదలుపెట్టాడు. ఎల్రక్టిక్ బల్బులు వొకదాని తర్వాత వొకటి టపాటపా పేలిపోయాయి. ఆ చీకట్లో దొంగలు తప్పించుకుపోయారు.

సి.ఐ.డి. యేజంట్లు దొంగలకేసి గురిపెట్టి కాలుస్తూనే వున్నారు. ఓ దొంగకి చేతిమీద దెబ్బ తగిలింది. అతను రివాల్వర్ కింద పడేసి మూలుగుతూ గాయపడ్డ మణికట్టు పట్టుకున్నాడు. దాన్ని సి.ఐ.డి. యేజంట్లు గమనించేరు.

వీధిలో పడ్డాక దొంగలు చెల్లాచెదురై పారిపోయారు.

అప్పుడు సరిగ్గా రాత్రి పదకొండు గంటలైంది.

ఒక ప్రమాదకరమైన నేరస్థుడు, దొంగ, హంతకుడు సి.ఐ.డి. యేజంట్ల కాల్పులకి గురయి గాయపడి పారిపోయినట్టు తెల్లవారకట్ల వొంటి గంటకల్లా నగరంలో వున్న క్లినిక్‌లకి, హాస్పిటల్స్‌కి, ఔట్‌పేషెంట్ డిపార్ట్‌మెంట్లకి, ప్రైవేటు ప్రాక్టీషనర్లందరికీ అధికారయుతంగా తెలియజేశారు.

> "చేతిమీద తుపాకి గాయం అయిన వ్యక్తి యెవరేవా మీ దగ్గరికి వైద్యం కోసం వస్తే పోలీసు హెడ్‌క్వార్టర్స్ ఆఫీసరుకి లేదా దగ్గర్లో డ్యూటీలో వున్న పోలీసుకి యీ కేసు గురించి తెలియ చెయ్యడం, ఆ నేరస్థుణ్ణి పట్టుకోవడానికి వాళ్లకి సాయం చెయ్యడం మీ బాధ్యత"

అని ఆ నోటీసులో వుంది.

ఆ నోటీసుని చదివినట్టుగా వేలాది మంది డాక్టర్లు సంతకం చేశారు. వాళ్ళల్లో డాక్టర్ అర్జుమాన్యాన్ వొకరు. ఆయన "అక్టోబరు 25 హాస్పిటల్"లో సర్జన్.

హాస్పిటల్‌లో డ్యూటీ పూర్తయాక అర్ధరాత్రి దాటిన కొంచెం సేపటికి అర్జుమాన్యాన్ యింటికి వెళ్ళాడు. హాస్పిటల్‌కి యిల్లు దూరం కాకపోవడం వల్ల నడిచే వెళ్ళాడు. వస్తానియా వీధిలో వుంది వాళ్ల యిల్లు.

ఆయన భార్య ఆయన కోసం యెదురు చూస్తూ వుంది. వాళ్ళకి కొత్తగా పెళ్ళయింది. వొకళ్ళ పట్ల వొకళ్ళకి గాఢ అనురాగం వుంది. ఆయన భార్య వేరా ఇవానొవ్నా భర్త వచ్చేక ఆదరంగా పలకరించిగాని నిద్రపోదు.

టీ తాగేటప్పుడు ఆయన హాస్పిటల్‌కి అందిన నేరపరిశోధక విభాగం వారి జరూరు నోటీసు విషయం భార్యకి చెప్పాడు.

"యిదేదో సీరియస్ విషయమే" అని ఆయన వేడివేడిగా వున్న బిస్కట్లు తింటూ అన్నాడు. వేరా ఇవానొవ్నా స్వయంగా ఆ బిస్కట్లు తయారు చేసింది. "నేననుకోవడం... ఉమ్... మై డియర్, వాళ్ళు యెవడో గట్టి నేరస్థుడితో తలపడుతున్నారు లేకపోతే యీ గొడవంతా వుండదు... యేమైనా ఆ తుంటరి యెవళ్ళనో చంపే వుంటాడు..." అన్నాడు.

"చెప్పు, డార్లింగ్" అని వేరా వున్నట్టుండి అంది. "యేదో తప్పి జారి... వొక వేళ వాడు నీ దగ్గరికే వచ్చేడనుకో... యేం చేస్తావ్? నువ్వు చేసే పనులు యెలా వుంటాయి?..." అని అడిగింది.

డాక్టర్ అర్జుమాన్యాన్ చిరునవ్వు నవ్వి గోముగా పెళ్ళాంకేసి చూశేడు.

"చిత్రంగా అడిగేవ్ వేరా" అని ఆమె కళ్ళల్లోకి సూటిగా చూస్తూ అన్నాడు. "నా సంగతి నీకు తెలీదా? వూరికే వాడి మెడ పట్టుకుని పోలీసులకి అప్పగిస్తాను.... వూ, సర్లే, పడుకునే టైమైంది" అన్నాడు గడియారం చూసుకుని.

తెల్లవారకట్ల మూడు గంటల ప్రాంతంలో ఆయనకి మెలుకువ వచ్చింది. యెవళ్ళో డోర్‌బెల్ మోగిస్తున్నారు. యింత రాత్రి వేళ యెవరై వుంటారు చెప్మా అన్నెప్పి ఆయన నైట్ గౌన్ వేసుకుని తలుపు దగ్గరికి వెళ్ళాడు. తలుపు తీసి చూస్తే పొడగరి అయిన యువకుడు వొకడు గుమ్మం దగ్గర కనిపించేడు.

"మరేం అనుకోకండి యిబ్బంది కలిగిస్తున్నాను" అని ఆ వ్యక్తి మర్యాదగానే మొదలుపెట్టాడు. "యీ బోర్డుని బట్టి మీరు డాక్టరే అయివుంటారనుకున్నాను, కదా?" అన్నాడు.

"అవును. నేను సర్జన్‌ని..." అని ఆయన అన్నాడు.

ఆ మాట అన్నాక యిక తరవాయి యేమీ మాట్లాడలేనని ఆయనకి అర్థం అయింది. యేమంటే, హాల్లో మసక చీకటిగా వున్నా గుమ్మం దగ్గర యెదురుగ్గా నుంచున్న ఆ

వ్యక్తి చేతికి కట్టు కట్టి వుందని గమనించాడు. డాక్టరుకి భయం వేసింది, తూలు వొచ్చింది. కింద పడకుండా వుండేందుకు గోడకి ఆనుకుని చేర్లబడ్డాడు.

"వూఁ డాక్టరుగారూ, క్షమించండి, మీ సాయం అర్థించి వచ్చేను. నా చేతికి కొంచెం గాయం అయింది. యిదో ప్రేమ గాథ. నేను ప్రేమించిన ఆవిడ, ఆవిడ భర్త... మీకర్థం అయే వుంటుంది..." అని ఆ పరాయి వ్యక్తి చెప్పాడు.

"ఆఁ... చాలా సంతోషం... అంటే..." అని డాక్టరు నీళ్ల నమిలేడు. తనేం అంటున్నాడో తనకే అర్థం అవడం లేదు. "నాకు సంతోషంగా వుంది..."

"థాంక్యూ" అని ఆ వ్యక్తి మెల్లిగా వందనం చేసి డాక్టరు యేం గొణుగు తున్నాడో వినిపించుకోకుండా జబ్బతో ఆయన్ని మెల్లిగా పక్కకి తోసి హాల్లోకి వెళ్లి తలుపు వేసేశాడు.

"మీరు చదువుకునే గది యెక్కడ?"

డాక్టరు తటపటా యిస్తూ ఆ గది దగ్గరికి వెళ్లాడు. యీ యువకుడు వెన క్కాలే వెళ్లాడు.

"నేను యే హాస్పిటల్‌కేనా, క్లినిక్‌కేనా వెళ్లవచ్చనుకోండి. కాని చూశారుగా, యిది తుపాకీ గాయం. వాళ్లు యక్ష ప్రశ్నలన్నీ వేస్తారు... పోలీసులు... నేను ప్రేమిం చిన ఆమె పేరు బయటకి పొక్కచ్చు, ఆమెకి అప్రదిష్ట... అందుకని ప్రైవేట్‌గా చేయించుకుందా మనుకున్నాను... తెలుసు కదా, డాక్?" అన్నాడతను.

"ఆఁ, ఆఁ, యేమీ ఫరవాలేదు" అని డాక్టరు అర్జుమాన్యాన్ క్రమేపీ చిక్క బట్టుకుంటూ అన్నాడు.

వేరా ఇవానొవ్నాకి హఠాత్తుగా మెలుకువ వచ్చింది. భర్త చదువుకునే గదిలో యేదో పరాయి గొంతు వినిపించింది. ఆమె బట్టలు వేసుకుని, వసారాలోకి వెళ్లి భర్తని పిలిచింది.

"యేమైంది? యెవరు వారు?" అని అడిగింది.

"ఆ దొంగ వచ్చేడు" అని అతను తడబడుతూ జవాబు చెప్పేడు.

వేరా ఇవానొవ్నా పాలిపోయింది. తనకంటే యెక్కువగా భర్త ఆందోళనగా వున్నా డని గమనించింది. దాంతో ఆమె తనని తను చిక్క బట్టుకుంది.

"అతని దగ్గరికి వెళ్లు" అని మెల్లిగా చెప్పింది. "నేను వార్డెన్ ఆఫీస్‌కి వెళ్లి పోలీసుల్ని పిలిపిస్తాను" అంది.

అర్జుమాన్యాన్ జడంగా భార్యకేసి చూసి, తర్వాత బాధగా ఆమె చేతిని పట్టుకు నొక్కి కోపంగా గొణిగాడు.

"నీకేం మతిపోయిందా? మనకేం పట్టింది మధ్యలో. అర్థం పర్థం లేకుండా

వాగడం కట్టిపెట్టు. యితన్ని మనం అప్పగిస్తే మనల్ని పిల్లల్ని చంపినట్టు సఫా చేసేస్తారు, రేప్పొద్దున్న. నీకు తెలీదు ఆ దొంగల సంగతి...''

కోపంగా ఆమెని పంపేసి అతను మళ్ళీ చదువుకునే గదిలోకి వెళ్ళాడు. ఆ రాత్రి రోగి ఆయనకేసి అనుమానంగా చూశాడు.

''యేమిటిదంతా? యెవళ్లతో మాట్లాడుతున్నారు మీరు?'' అని డాక్టర్ని వోకంట కనిపెట్టి చూస్తూ అన్నాడు. ''చూడండి, డాక్....''

''మా ఆవిడ లేచింది. మరేం భయం లేదు అని ఆమెకి సర్ది చెప్పాల్సివచ్చింది'' అని డాక్టరు తప్పు చేసినట్టు అన్నాడు.

తర్వాత డాక్టరు గాయం కడిగి, తుపాకీ గుండు తీసేసి మామూలుగా కట్టుకట్టేడు.

''ఆఁ, చాలు. వొక వేళ వాపుగాని, జ్వరం గాని వస్తే వెంటనే డాక్టరు దగ్గరికి వెళ్ళాలి. ఇన్‌ఫెక్షన్ వచ్చే అవకాశం వుంది'' అన్నాడు డాక్టరు.

''థేంక్యూ'' అని ఆ వ్యక్తి సంతోషంగా, మెల్లిగా అన్నాడు. ''అలా వస్తే యింకో సారి మీ దగ్గరికి వస్తాను....'' అన్నాడు.

అతను డాక్టరుకి డబ్బు అందించేడు. ఆయన దాన్ని తీసుకున్నాడు.

రాత్రి రోగిని సాగనంపి తలుపు వెయ్యగానే తొలి కుటుంబ కలహం మొదలైంది. వేరా ఇవానొవ్నా యేడ్చింది. అరిచి కేక వేసింది. పిరికి వాడివని మొగుణ్ణి తిట్టింది. ఆయన యేదో సాకు చెప్పబోయాడు గాని దాంతో వేరా ఇవానొవ్నా మరీ రెచ్చిపోయింది.

''సిగ్గు లేదు నీకు. స్వార్థపరుడిలా, పశుబుద్ధివాడిలా ప్రవర్తించేవు. పిరికి వాడిలా ప్రవర్తించేవు... యిలాంటి వాడు నా భర్త కావడం నాకు చచ్చే సిగ్గుగా వుంది... యెలా ప్రవర్తించగలిగావు యిలా?''

తెల్లవారుతూ వుండగా ఆ దంపతులు సమాధాన పడ్డారు. రెండవ సారి గనక అతను వస్తే అతన్ని పట్టించి వేస్తానని డాక్టరు వొట్టు పెట్టుకున్నాడు. (''వస్తాడు, వచ్చితీరతాడు నువ్వే చుద్దువు గాని'' అన్నాడు.)

''నాకేం భయం లేదు. నామీద వొట్టు. నిజం. కాని చూడు అంతా అలా అను కోకుండా జరిగిపోయింది. నాకు కాళ్ళూ చేతులూ ఆడలేదు. వేరా, నన్ను అర్థం చేసుకోడానికి ప్రయత్నించు...''

ఆ మర్నాడు సాయంత్రం ఆ వ్యక్తి మళ్ళీ వొచ్చేడు. యీ సారి వేరా ఇవానొవ్నాయే తలుపు తీసింది.

''క్షమించండి డాక్టరుగారున్నారా?'' అని అతను అడిగేడు. వేరా ఇవానొవ్నా కట్టుకట్టిన చేతిని చూసి విషయం గ్రహించింది. ''ఆఁ, వున్నారు రండి'' అంది.

అతన్ని తన భర్త చదువుకునే గది దగ్గరికి తీసికెళ్ళింది. తర్వాత భోజనాల గది లోకి వెళ్ళి మెల్లిగా అర్కుమావ్యాన్‌తో చెప్పింది.

''అతనే, మళ్ళీ వొచ్చేడు. నేను వార్డెన్ దగ్గరికి వెళతాను. ఓ.కే.?''

''యెందుకొచ్చిన యాతన?'' అని అర్జుమాన్యాన్ ఆమెతో అన్నాడు. ''కట్టు మార్చి కట్టేక అతనితోబాటు నేనూ బయటికి వెళ్ళి అప్పగిస్తాను'' అన్నాడు.

ఆమె సరేనంది. డాక్టరు చదువుకునే గదికి వెళ్ళాడు. మళ్ళీ గాయం కడిగి, కొత్త కట్టుకట్టేడు. అతనితో కలిసి అవతలకి వెళ్ళాడు. భర్త రాక కోసం ఆమె ఆతృతగా యెదురు చూస్తూ వుంది. ఆఖరికి అతను తిరిగివచ్చి తన దగ్గరున్న తాళంతో తలుపు తీసుకుని లోపలికి వచ్చేడు.

''వూఁ?'' అని అడిగింది.

''చూశావా?'' అని అతను మళ్ళీ నత్తినత్తిగా మాట్లాడేడు. ''ఖర్మ! రోజూ వుండే పోలీసు అక్కడ లేడు. యెక్కడికి పోయాడో...''

డాక్టరు ఓవర్‌కోటు కాలర్‌ని శుభ్రం చేసుకోవడం మొదలుపెట్టాడు, అవసరం లేకపోయినా. అది శుభ్రంగానే వుంది.

పొద్దుటే నేను ఆఫీసుకి వెళ్ళాను. వెయిటింగ్ రూమ్‌లో ఒకామె కూర్చుంది. ఆమె నా దగ్గరికి వచ్చింది.

''నేను సీనియర్ ఇన్వెస్టిగేటర్‌ని చూడాలి'' అంది.

''చెప్పండి యేం కావాలో. లోపలికి రండి.''

తన పేరు శ్రీమతి అర్జుమాన్యాన్ అని చెప్పింది. ఆమె భర్త డాక్టరు. తన భర్త నేరపూరిత ప్రవర్తన గురించి ఫిర్యాదు చేసేటందుకు సిటీ ప్రాసెక్యూటర్ ఆఫీసుకి వచ్చింది. తన భర్త పిరికితనం వల్ల వొక నేరస్థుణ్ణి కమ్ముకొస్తున్నాడు.

గత రెండు రోజుల్లోనూ జరిగిన సంఘటనలని గురించి పూసగుచ్చినట్టు చెప్పింది.

''మా ఆయనకి వొక్క మాట కూడా చెప్పకుండా మీ దగ్గరికి వచ్చేను. ఆ మనిషి యింకో సారి మా ఆయన దగ్గరికి రావచ్చని నా అనుమానం. అప్పుడు మీరతన్ని పట్టుకోవచ్చు.''

ఆమె చెప్పిన దాన్నంతట్నీ నేను రాసుకున్నాను, ఆమె దానిమీద సంతకం చేసింది.

''మా ఆయనకి యేమన్నా అవుతుందా చెప్పండి'' అంది వెళ్ళిపోతూ. ''ఆయన తప్పు వుంది కాని ఆయనంటే నాకు బాధగా వుంది.''

అదే రోజు సాయంత్రం కుడి చేతికి కట్టు వున్న ఆ మనిషిని డాక్టరు యింటి గుమ్మం దగ్గర అరెస్టు చేశారు. అతను డాక్టరు దగ్గరికి మూడో సారి వెడుతున్నాడు.

అతను పెద్ద దొంగ. బోలెడన్ని పాత సీరియస్ కేసుల రికార్డు వున్న మనిషి. అతని పేరు తిమొఫేయెవ్, అతని మారుపేరు ల్యోంకా బెరెగొవోయ్. తనతోబాటు కలిసి నేరం చేసిన వాళ్ళని అతను పట్టించి యిచ్చేడు.

అందర్నీ విచారణకి తీసుకువచ్చేరు. అదే కేసుకి సంబంధించి డాక్టరు అర్జుమా న్యాన్‌మీద చట్టపరమైన చర్యలు తీసుకున్నారు. చైర్మన్ "కామ్రేడ్ కమాండెంట్, దయచేసి సాక్షి వేరా ఇవానొవ్నా అర్జుమాన్యాన్‌ని పిలిపించండి" అనగానే కోర్టు హాల్లో వున్న యావన్మందీ నిరీక్షగా అటు చూశారు.

హాల్లో గుసగుసలు మొదలయాయి. ప్రతివాది అర్జుమాన్యాన్ ప్రజలనుంచి ముఖం బాటు చేసుకున్నాడు. అతనికేసి వాళ్ళు వెక్కిరింపుగా చూసేరు. డిఫెన్స్ కౌన్సిల్ యేదో హడావుడిగా రాసేసుకున్నాడు. ప్రాసెక్యూటర్ కిమ్మనకుండా చిరునవ్వు నవ్వుకున్నాడు.

వేరా ఇవానొవ్నా వచ్చింది. ఆమె నిబ్బరంగానే కోర్టువారి యెదట నుంచుంది. కాని గ్లవ్‌ని మెలితిప్పడం, కాలిని మార్చుకోవడం చూస్తే ఆమె ఆందోళనగా వున్నట్టు అనిపిస్తుంది.

"మీ పేరు, యింటి పేరు, తండ్రి పేరు, మీ వయస్సు?" అని అలవాటుగా చైర్మన్ అడిగేడు.

"అర్జుమాన్యాన్ వేరా ఇవానొవ్నా, 23 యేళ్ళు" అని క్లుప్తంగా అంది.

"ప్రతివాది మీ భర్త కదా?"

"అవును."

"సిటీ ప్రాసెక్యూటర్ ఆఫీసుకి స్టేట్‌మెంట్ యివ్వడంలో మీ ఉద్దేశాలేమిటో తెలుసుకోవచ్చా?"

"నేను యెంతైనా సోవియట్ వనితని కదా" అంది వేరా ఇవానొవ్నా.

"అంతా విశదమైంది. యిక ప్రశ్నలు లేవు" అని ముగించేడు చైర్మన్.

1930

స్వయంగా నేరం ఒప్పుకోవడం*

నేరాలు చేసిన వాళ్లు తప్పులు ఒప్పుకుంటూ తమంత తామే పోలీసు స్టేషన్లకి వచ్చేవాళ్లు. అలా వచ్చి చెప్పుకునేవాళ్ల గురించి యింకా యింకా యెక్కువగా వార్తలు పత్రికల్లో పడేవి.

భిన్న వయస్కులు, భిన్న వృత్తుల వాళ్లు, భిన్న జీవిత వాతావరణాల వాళ్లు — యేళ్లకి యేళ్లు దొంగతనాలు చేస్తూ గడిపిన వాళ్లు, లాఘవంగా జేబులు కొట్టే జేబు దొంగలు, మోసగాళ్లు, హంతకులు — కనిపెట్టకుండా వుండిపోయిన తమ నేరాల గురించి చెప్పేవాళ్లు.

తమ నేరాల గురించి ఒప్పేసుకుందామనే నిర్ణయానికి వాళ్లల్లో అందరూ సుల భంగా, తొందరగా వచ్చారని కాదనుకోండి. కాని మొత్తంమీద ఆ నిర్ణయాలకి వచ్చారు.

కొయ్యకాలున్న ఓ నగల వర్తకుడు పోలీసు స్టేషన్‌కి వచ్చాడు. తను చాలా కాలం బంగారు, నగల దుకాణంలో పని చేశానని చెప్పాడు. నానా రకాల చిట్కాలు చేశాడట. పుస్తకాలని మార్చేడట, యేళ్ల తరబడి దొంగతనం చేస్తూనే వున్నాట్ట. చాలా కాలం గడిచింది. ఆ దుకాణం యెన్నడనగానో మూసేశారు. అతన్ని పట్టు కోవడం మాట సరేసరి అనుమానించను కూడా అనుమానించలేదు. అయినా ఓ రోజు సాయంత్రం పోలీసు స్టేషన్‌కి వచ్చాడు. నట్టుతూ నట్టుతూ, గందరగోళ పడిపోతూ అంతా చెప్పేడు. బోలుగా వున్న కొయ్యకాలు సీలలు విప్పి కాజేసిన వజ్రాలనీ, బంగా రాన్నీ ఆఫీసరు బల్లమీద కుమ్మరించాడు.

వున్నట్టుండి నేరం ఒప్పుకునే ప్రేరణ యెలా వచ్చిందతనికి?

"మీకు తెలీదా? సోవియట్ రిపబ్లిక్ కోసం పోరాడుతూ వుండగా నాకీ కొయ్య కాలు వచ్చింది. దీన్ని సోవియట్ రిపబ్లిక్‌నుంచి కాజేసిన నగలు దాచుకోవడానికి ఉపయో గించడానికి సిగ్గుగా వుంది. పైగా వీటిని అమ్మడం అంత సులభమూ కాదు."

---

* ఈ వ్యాసం 1937 మార్చి 16న 'ఇజ్వేస్తియా' వార్తాపత్రికలో ప్రచురితమైంది.

యిది గనక యింకో దేశంలో జరిగి వుంటే పత్రికల వాళ్ళు తప్పకుండా అతన్ని వెంబడించి వుండేవాళ్ళు. అతని బంధువులతోటే, స్నేహితులతోటే ఇంటర్వ్యూలు వచ్చేసేవి. అతను యిక అప్పట్లో హీరో అయిపోయేవాడు. మా దేశంలో యీ సంఘటన చూసి యెవళ్ళూ ఆశ్చర్య పడలేదు.

1937లో యు.ఎస్.ఎస్.ఆర్. ప్రొక్యురేటర్‌కి బెలోరష్యానుంచి ఓ ఉత్తరం వచ్చింది. యెవరో బడి పంతులు యాసెంకొ అట రాశాడు.

> "...నేనిక్కడ స్థిరపడ్డాను. యెవళ్ళూ అసలు నన్ను అనుమానించను కూడా అనుమానించరు. తద్భిన్నంగా నేనంటే నిజంగా యిష్టపడి నన్ను గౌరవిస్తున్నారు. కాని నమ్మండి, దానివల్ల నా పరిస్థితి యింకా అధ్వాన్నంగా వుందంతే. ఒక యేడాదిగా నేను నిజాయితీ పూర్వకంగా, కష్టపడి పని చేస్తూ, క్రమబద్ధమైన జీవితాన్ని గడుపుతున్నాను. నేనిక్కడ ఒక యేడాదిగా వున్నాను. యిక యెప్పటికీ యిలాగే వుండిపోగలను. యిప్పుడున్నంత ఆనందంగా ముందెన్నడూ లేను. సరిగ్గా అందుకనే నేను మీకు రాస్తున్నాను కామ్రేడ్ ప్రొక్యురేటర్. నా పేరు అసలు యాసెంకొ కానే కాదు. జైల్లో నుంచి పారిపోయాక యిక్కడ స్థిరపడ్డాను. పూర్వం యెప్పుడో టీచర్ ట్రైనింగ్ అయాను. నేను దాదాపు మర్చిపోయిన వృత్తికి అది సానుకూల పడింది. దొంగ పత్రాలు ఉపయోగించాల్సి వచ్చిందనుకోండి. కాని నా ఉద్యోగం అంటే నాకు అభిమానం పెరిగింది. నా జీవితాన్ని ఉపాధ్యాయ వృత్తికి అంకితం చెయ్యాలని వుంది. కాని మిగిలిన నా శిక్షాకాలాన్ని పూర్తి చేశాక. యెలా యెక్కడికి రావాలో చెప్పండి..."

యీ ఉత్తరం రాసినతను కొన్ని రోజుల తర్వాత యు.ఎస్.ఎస్.ఆర్. ప్రొక్యురేటర్ ఆఫీసులో వున్నాడు. సిగ్గు పడుతూ సాదాగా మాట్లాడేడు. ముచ్చటైన పడుచు ముఖం విచారకరమైన చిరునవ్వు వున్న మనిషి.

"నా ఫీలింగ్సుని వివరించి చెప్పడం కష్టం. కాని ఒకటి మాత్రం స్పష్టం. గత జీవితంకేసి మళ్ళడం అనేది జరగదు. నేను బందిపోటుని, దొంగని, నేరస్థుణ్ణి. కాని ఒక యేడాదిగా, నిజాయితీ పూర్వకంగా బతకాలని ప్రయత్నిస్తున్నాను. యిప్పుడు యింక మరోలా బతకలేను. కాని నేను సొంతనగా వుండాలి. నేను కొద్దిగా రుణం తీర్చాల్సి వుంది. దొంగతనం నేరానికి నాకు అయిదేళ్ళ శిక్ష పడింది. కొన్ని నెలలు శిక్ష

అనుభవించాక పారిపోయాను. మొదట నా రుణం తీర్చేసి, అమరిన హస్తాల్తో నూతన జీవితం ప్రారంభిస్తాను'' అన్నాడు.

తర్వాత తను చేసిన దొంగతనాలు, ఇళ్లకి వేసిన కన్నాలు, తను పాల్గొన్న నేరాలు అన్నీ తారీకులు, స్థలాలు, నగరాలతోసహా సవివరంగా వర్ణిస్తూ చెప్పాడు.

యే వొక్క వూళ్లోనూ యెక్కువ కాలం వుండేవాడు కాదు. కొన్ని యేళ్లల్లోనే చాలా ప్రాంతం చుట్టేశాడు.

''బెలోరష్యా చేరి ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించాక పరమ విసుగ్గా వుంటుందే మోనని భయపడ్డాను. యేమంటే ఓ వూరినుంచి యింకో వూరికి యిట్టే మకాం మార్చె య్యడం, యెప్పుడూ కొత్త ముఖాలు చూడ్డం అలవాటయి పోయాయి. నాకు ఉత్సు కత కావాలి. కాని యిప్పుడేమో బడి, పిల్లలు, మంచు కమ్మిన పొలాలు, నిశ్శబ్దం. వున్న ఆ కొద్ది మంది అదే మనుషులూనూ. కాని తెలుసా నేను అనుకున్న దానికంటే చాలా భిన్నంగా వుండింది. అంతకు ముందెన్నడూ అంత తృప్తిగా వుండలేదు. వింతగా కనిపించచ్చు కాని నిజం. అయినా ఒక విషయం... జాగ్రఫీ చెప్పడం మహా యిబ్బందిగా వుండేది.'' అని చెప్పి యాసెంకొ చిరునవ్వు నవ్వాడు. ''నల్ల సముద్రం గురించి మొదలెట్టాననుకోండి. అక్కడ నేను యిళ్లకి వేసిన కన్నాలు గుర్తువచ్చేవి. పిల్లలకి సైబీరియా గురించి చెపుతూ వుంటే ఓమ్స్క్‌లో చేసిన దొంగతనం గుర్తువచ్చేది.''

అతన్ని మిగిలిన శిక్షాకాలం పూర్తిచేసేందుకు లేబర్ కాలనీకి పంపేరు. యిప్పుడ క్కడ తన కొత్త, కడపటి వృత్తి అయిన ఉపాధ్యాయుడుగా పని చేస్తున్నాడు.

ఇవాన్ ఫ్రొలోవ్ ''ఆత్మ కథ'' యే నాందీ ప్రస్తావనా లేకుండా, హడావుడి లేకుండా వ్యవహారవతుగా క్లుప్తమైన పద్ధతిలో మొదలైంది.

''యు.ఎస్.ఎస్.ఆర్. ప్రొక్యురేటర్‌గారికి
అలవాటు పడిన నేరస్థుడు ఇవాన్ ఫ్రొలోవ్‌నుంచి

అయ్యా!

''1911వ సంవత్సరంలో సరాతొవ్‌లో జన్మించిన ఇవాన్ ఫ్రొలోవ్ అనే నేను యు.ఎస్.ఎస్.ఆర్. ప్రొక్యురేటర్ అయిన మీకు నా దగ్గర ప్రస్తుతం యే రకమైన కాగితాలు లేవని యిందు మూలంగా తెలియచేస్తు న్నాను. దీనివల్ల నేను జైల్లో పడవచ్చని భయపడి అత్యున్నత అధికారి అయిన యు.ఎస్.ఎస్.ఆర్. ప్రొక్యురేటర్‌కి విన్నపం చేసుకోవాలని నిర్ణయిం చుకున్నాను. దీన్ని గురించి విన్నా, లేదా మీ అంతట మీరే చదివినా అలవాటు పడిన నేరస్థుడైన దొంగ చేసిన యీ ప్రకటనని ప్రత్యేక శ్రద్ధతో పరిశీలిస్తారని

ఆశిస్తున్నాను. అవసరమైన చర్యలని సహాయం చెయ్యడానికి — నాకు అంటే నా వొక్కడికే అని కాదు కాని నూతన రాజ్యాంగం* పట్ల నూతన దృక్ప థాన్ని అభివృద్ధి చేసుకున్న దొంగకి, మహాసభలో మీ ఉపన్యాసాన్ని చదివిన వాడికి, సూక్ష్మంగా చెప్పాలంటే అందరు దొంగలూ కొనకి చేరారన్న నిర్ణయానికి వచ్చిన వాడికి — మీరు తీసుకుంటారని అనుకుంటాను.

"నా జీవితం గురించీ, తప్పు మార్గంలో నేను పడ్డానికి కారణాల గురించీ దిగువ చెప్తున్నాను. దీన్ని చదివితే నేను దేనివల్ల కళ్లు తెరుచు కున్నదీ నిజాయితీగా బతక నిర్ణయించుకున్నదీ మీకు అర్థమవుతుంది.

"నేను ముందే చెప్పినట్టుగా సరాతొవ్‌లో పుట్టేను. ఒక పరాయివాడు నన్ను పెంచాడు. నేను మా మారుటి తల్లితో వుండేవాణ్ణి. ఆమె యే ఉద్యోగమూ చేసేది కాదు, గృహిణిగానే వుండేది. వోల్గ నదిలో ఓడలకి సరుకు లెత్తే మా నాయన 1921లో క్షుద్బాధకి బలై చనిపోయాడు...."

దిక్కులేని పక్షిగా తను బాల్య జీవితాన్ని గడిపిన రోజుల గురించి, యెలా దొంగ తనాలు నేర్చుకున్నదీ, ఆ వృత్తిలో యెలా "నిష్ణాతుడైందీ" వర్ణించాడు ఫ్రాలోవ్.

"...నేను జీవితపు వంకర పథం అనుసరించాను. నేను వీధుల్లో బతికాను. నా మిత్రులు దొంగలు. తాగుబోతు జీవితం గడిపాను. నేను సుఖరేవ్‌స్కీ మార్కెట్‌కీ, ఖరీదైన రెస్టారెంట్లకీ, కాఫీ హోటెళ్లకీ, సిని మాలకీ, యింకా డబ్బు అవసరం అయిన అలాంటి చోట్లకీ తరచూ వెళ్లేవాణ్ణి. ఆ రకంగా మాస్కోలో ఒక ఏణ్ణర్థం బాటు, 'మూర్' నన్ను అరెస్టు చేసి శిక్ష వేసేదాకా, గడిపాను. మీకు వ్యక్తిగతంగా విజ్ఞప్తి చెయ్యా లని నిర్ణయించుకున్నాను. యిప్పుడు నేను దూరపు బంధువుల మధ్య పరాన్న భుక్కుగా బతుకుతున్నాను. సుప్రీమ్ ప్రాక్యురేటర్ అయిన మిమ్మల్ని సహాయం చెయ్యమనీ, నా జీవితానికి కొత్త దారి చూపించమనీ అర్థిస్తు న్నాను.

"పని చేసుకుంటూ నిజాయితీగా బతికేందుకు ఉపయోగకరమైన సోవియట్ పౌరుడిగా వుండేటందుకు నన్ను యే బస్తీకేనా పల్లెకేనా గానీ

---

* 1936లో అమలులోకి వచ్చిన రెండవ రాజ్యాంగం. సోవియట్ యూనియన్‌లో సోషలిస్టు సామాజిక సంబంధాలు విజయవంతమయ్యాయని యీ రాజ్యంగం చాటింది. — అను.

పంపించండి. నేను గడుపుతూ వున్న జీవితం అంటే నాకు అసహ్యం పుట్టింది. నిజాయితీగా పని చేస్తూ బతకవచ్చని సమాజానికి ఉపయోగ పడే వ్యక్తిగా వుండవచ్చనీ నేను గుర్తించాను.

దీనిమీద సంతకం పెడుతూ నిజాయితీగా వుంటానని మీకు హామీ యిస్తున్నాను.

భవదీయుడు

ఇవాన్ ఫ్రొలోవ్"

కుటిలత్వంవల్లనో, సిగ్గువల్లనో కాని ఫ్రొలోవ్ తన చిరునామాకి బదులు యీ తాజాకలం జత చేశాడు:

"యీ ఉత్తరానికి జవాబుని మీరు 'ఇజ్వేస్తియా'లో ప్రచురిస్తే కృతజ్ఞుణ్ణి. మీ అభిప్రాయాన్నీ, యిలాంటి కేసులకి సంబంధించి యేం చెయ్యదలచుకున్నదీ ప్రచురిస్తే చాలు. విషయం యేమిటంటే నేను మొదట జైలుకి, లేబర్ కేంప్‌కి వెళ్లాలా? లేదా అవి లేకుండా సరిపోతుందా అనే విషయం కూడా ప్రచురించండి."

మీ ఉత్తరానికి జవాబిమ్మని యు.ఎస్.ఎస్.ఆర్. ప్రాక్యురేటర్ నాకు అధికారం యిచ్చారు, ఇవాన్ ఫ్రొలోవ్.

వారంలో యే రోజునేనా మీరు ప్రాక్యురేటర్ ఆఫీసుకి రావచ్చు. మీ సమస్యని చర్చించి అవసరమైన సాయం చేస్తాం.

ఇవాన్ ఫ్రొలోవ్ ఆఫీసుకి వస్తాడని నాకు తెలుసు. నూతన జీవిత విధానం, మానవ సంబంధాలు అతని ముందు విచ్చుకుంటున్నాయి. అంచేత రావాలన్న అతని ప్రేరణ శిక్ష పడుతుందన్న భయంకంటే యెక్కువ, అతని పాత అలవాట్లకంటే, ప్రపంచంలో మరిదేనికంటే బలవత్తరమైంది.

1937

గ్రోవర్‌గారి నిజమైన ప్రేమ

కలీనిన్ ప్రాంతంలోని స్తరీత్‌స్కీ జిల్లాలో గ్లూఖొవో అనే గ్రామం వుంది. 1938 నవంబరు 13న ఒక వింత సంఘటన జరిగింది. అది తర్వాత చాలా కాలం అక్కడి వాళ్లకి గుర్తు వుంది. ఆ రోజు మధ్యాహ్నం బాగా పొద్దుపోయాక ధగధగ మెరిసి పోయేటట్టు రంగు వేసిన ఒక చిన్న విదేశీ విమానం వున్నట్టుండి ఆకాశంలో మబ్బుల మాటునుంచి దూసుకుంటూ వచ్చి ఒక పొలంలో దిగింది. పైలట్ కిందికి దిగాడు. ఇంగ్లీషు పద్ధతి ఉచ్చారణతో రష్యన్ మాట్లాడుతూ తన విమానం చుట్టూ పోగయిన రైతులని సంబోధించి చెప్పాడు:

''నమస్కారం! నేను ఇంగ్లీషువాణ్ణి. లండన్‌నుంచి వచ్చాను. మా రష్యన్ పెళ్లికూతుర్ని తీసుకెడదామని వచ్చాను.''

''భేషుగ్గా వుంది కథ'' అని సాష అత్తయ్య చిరాగ్గా అరిచింది. ఆమె టీమ్ లీడరు. ఆవిడ కొడుకు ఎయిర్ ఫోర్స్ స్క్వాడ్రన్‌లో కమాండరు. ''లండన్‌నుంచి యెకాయెకీ యీ మూషిక వాహనంమీద వచ్చాడండీ! నా మొహంలా వుంది నీ తెలివి. విమానాల మొహం యెరగని వాళ్లం కాదు నాయనా. ఊఁ, పెళ్లికొడుకుగారూ, గ్రామ సోవియట్‌కి వెడదాం పదండి. వాళ్ళు సంగతేమిటో చూస్తారు. తమ దేశంలో అమ్మాయి లకి కరువొచ్చినట్టు యిక్కడికి వచ్చారండీ పిల్ల కోసం'' అంది.

గ్రామాధికారులు పోలీసుల్ని పిలిచారు. ఆ పరాయి వ్యక్తి అదే పాట మళ్లీ పాడేడు. తను బ్రిటిష్ ఆయిల్ ఇంజనీరు. పేరు బ్రియాన్ మాంటేగ్ గ్రోవర్. లోగడ గ్రోజ్నీలో మాస్కోలో పని చేశాడు. లండన్‌నుంచి స్టాక్‌హోమ్‌మీదుగా గ్లూఖొవో గ్రామానికి యెక్కడా ఆగకుండా విమానం నడుపుకుంటూ వచ్చాడు. సోవియట్ యూనియన్‌కి తను ప్రేమించిన అమ్మాయిని చూడ్డానికి వచ్చాట్ట. ఆమె లేని జీవితం తనకి అర్థ రహితం అట. అంచేత తెగించి సరైన వీసాలేకుండా వచ్చేశాట్ట.

ఆ మర్నాడు గ్రోవర్‌ని మాస్కో తీసుకొచ్చారు. తను యెందుకు ఆ యాత్ర చెయ్యాల్సివచ్చిందో ఆ కారణాలన్నిట్నీ సవివరంగా ఇన్వెస్టిగేటర్ ఆఫీసులో చెప్పాడు.

గ్రోవర్ పొడగరి, చక్కటి జుట్టు వున్న వాడు. నిష్కర్షగా ప్రపంచంకేసి చూస్తూ వుండే బూడిద రంగు కళ్లు అతనివి.

అతను తన గురించి చెప్పాడు. తన పేరు బ్రియాన్ మాంటేగ్ గ్రోవర్. వయసు ముప్పై యేడేళ్లు. ఫోల్క్స్టోన్ వాసి. సోవియట్ యూనియన్‌కి వీసాలేకుండా వచ్చాడు. అలా చెయ్యడం నేరమనీ తెలుసు. కాని దురదృష్టవశాత్తూ మరి మార్గాంతరం లేకపోయింది.

''నాకు ఆర్టికల్ 59 – థర్డ్ తుణ్ణంగా తెలుసు. కంఠతా వచ్చు. శిక్ష భరించ డానికి సిద్ధంగా వున్నాను. ఆ ఆర్టికల్ ప్రకారం నాకు పదేళ్లు జైలు శిక్ష పడవచ్చు. కాని సోవియట్ క్రిమినల్ కోడ్‌లోని మరో ఆర్టికల్, అంటే, 51వది, మొదటి దాన్ని తగ్గించగలదని ఒక బ్రిటిష్ లాయర్ నాకు చెప్పాడు. యీ రెండవది నాకు బాగా వర్తిస్తుం దని అనుకుంటున్నాను.''

గ్రోవర్ రష్యన్ భాష ధారాళంగా మాట్లాడేడు. మధ్య మధ్యలో వ్యాకరణం పొరపాట్లు చేశాడనుకోండి. అతని ముఖ కవళికలు చక్కగా వున్నాయి. నోరు పట్టుదల వున్న వాడి నోరులా వుంది. పళ్లు గట్టిగా వున్నాయి. అతను తన కథని నిదానంగా, తొందర పడకుండా చెప్పాడు. దాన్ని వింటూ ఇన్వెస్టిగేటర్‌కి ఆ పరాయి వ్యక్తిమీద యింకా యెక్కువ నమ్మకం కలిగింది. అతను మామూలుగా అడిగే ప్రశ్నలు అడ గాల్సివచ్చింది. ఆ మనిషి చట్ట వ్యతిరేకంగా సరిహద్దు దాటి వచ్చాడు కదా. కోపం తగ్గించే యింకో విషయం యేమంటే ఆ మనిషి తనని అరెస్టు చెయ్యడం ధర్మమే అని దానికి సిద్ధం అయివున్నాడు కూడా. ''ఆర్టికల్ 51 యీ కేసుకి వర్తించకపోతే'' ఫలితాలు అనుభవించడానికి సిద్ధంగా వున్నాడు.

అతను తన ప్రేమ గాధని చెప్పాడు.

1930ల తొలి భాగం. తను కుర్రాడు. చేసేది యింజనీర్ పని. కాని సమర్థుడైన ఇంజనీరే. అప్పుడు ఉద్యోగం పోయింది. సోవియట్ యూనియన్‌లోని గ్రోజ్నిలో ఫారెన్ స్పెషలిస్టుగా రమ్మని పిలుపు వస్తే సరేనని వచ్చాడు. పెద్ద జీతం, ఆసక్తికరమైన పని, అన్నిటినీ మించి నిగూఢ, అజ్ఞాత ''సోవియట్ రష్యాని'' చూసే అవకాశం ఆశ కలిగించాయి. సోవియట్ యూనియన్ గురించి పరస్పర విరుద్ధ, అస్పష్ట వార్తలు చదివీ, వినీ వున్నాడాయిరి.

మాస్కో వచ్చాడు. 'మెట్రోపోల్' హోటెల్‌లో దిగాడు. అక్కడ ఫ్రెంచివాళ్లు, జర్మన్లు, అమెరికన్లు, స్వీడ్‌లు, బెల్జియన్లు, ఇంగ్లీషువాళ్లు వున్నారు. యెన్ని రకాల జనం వున్నారు! వర్తకులు, యాత్రీకులు, నిపుణులు, డిప్లమేట్‌లు, స్పెషల్ కరస్పాం డెంట్లు, వృత్తి రీత్యా గూఢచారులు, అన్ని రకాల వయసుల వాళ్లు, వృత్తుల వాళ్లు, రాజకీయ వైఖరుల వాళ్లు వున్నారు. కొంతమంది మన దేశం అంటే తమ అయిష్టతని

బహిరంగంగానే వెల్లడించారు. సోవియట్ పంచవర్ష ప్రణాళికల్ని గురించి చులకనగా మాట్లాడేరు. తద్భిన్నంగా మిగిలిన వాళ్ళు, యేది యెలా వున్నాగానీ బోల్షివిక్కులు తమ ప్రణాళికల్ని అమలు జరుపుతున్నారనీ, డబ్బు యెక్కడ్నుంచి వస్తోందో, యే ఆధారాలున్నాయో, యే శ్రమ వుందో తెలియకుండా గూఢంగా వున్నాగానీ అలా చేస్తున్నారనీ అన్నారు. మూడవ గ్రూపు జనం మా ప్రజల ప్రయత్నాలని గురించి గౌరవంగా మాట్లాడేరు. చాలా తక్కువ వ్యవధిలో యింత పెద్ద దేశంలో పారిశ్రామిక వెనక బాటుతనాన్ని అధిగమించడానికి మా ప్రజలు కంకణం కట్టుకున్నారని శ్లాఘించారు.

గ్రోవర్‌కి యీ మనుషులతో పరిచయం అయింది. వాళ్ల వాదనలు విన్నాడు. మాస్కో వీధుల్లో తిరిగాడు. సెయింట్ బెసిల్ కెథ్రెడల్ చూసీ, రెడ్ స్క్వేర్ వైశాల్యం చూసీ, ప్రాచీన క్రెమ్లిన్ బురుజులూ గోడలూ చూసీ ఆశ్చర్యపోయాడు. పలక రాళ్ళ తాపడం చేసిన అర్బాట్ వీధి యిరుకు సందులు చూసీ, చౌకుల్లో వున్న బళ్ళ చూసీ, అప్పట్లో అంత మంచి బట్టలు వేసుకోకపోయినా ప్రత్యేక రష్యన్ పద్ధతిలో నదురుగా ముచ్చటగా వున్న ఆడవాళ్లని చూసీ ఆశ్చర్యపోయాడు.

వీధిలో గ్రోవర్‌కి కామ్సొమోల్ బేడ్జీలు పెట్టుకున్న యువ జనం కనిపించారు. వాళ్ళ ముచ్చటగా వున్నారు, వాళ్లని చక్కగా తీర్చిదిద్దారు అనుకున్నాడు. వాళ్లల్లో యెవళ్ళూ అతన్ని చూసి గుర్రు మన లేదు. అతన్ని చూసి బ్రిటిష్ కిరీటంలోని వజ్రాలని కొట్టేయ్యడానికో లేదా వెస్ట్‌మినిస్టర్ అబ్బేని కూలగొట్టేయ్యడానికో ప్రేరేపించే 'కోమిన్‌టర్న్ ఏజెంట్' అనే సూచన చెయ్యలేదు. పైగా ఆ విదేశస్థు డడిగిన ప్రశ్నలకి సుముఖంగా జవాబులు చెప్పేరు. అతను వెళ్లాలనుకున్న వీధికి దారి యెటో చెప్పారు. చాలా సందర్భాల్లో స్నేహపూరితంగా అతన్ని అక్కడికి తీసికెళ్లి దిగబెట్టారు.

ఆ రకంగా కొద్ది కొద్దిగా బ్రియాన్ గ్రోవర్‌కి యీ దేశం అన్నా, యీ ప్రాచీన నగరం అన్నా, ప్రజలన్నా యిష్టం కలిగింది.

గ్రోజ్ని నగరం వెళ్లి పనిలో ప్రవేశించాడు. అక్కడ అతన్ని చాలా ఆదరంగా చూశారు. తను యెన్నో యేళ్ళగా అక్కడే వుంటున్న వాడిలా, అందుకనే అంత మంది స్నేహితులు యేర్పడుతున్నారని అతనికి అనిపించేటంత ఆదరంగా చూశారు. యీ భావం ఎలేనా గొలియవ్‌ని అతను కలుసుకున్నాక మరింత దృఢతరం అయింది. ఆమె ఓ గ్రోజ్ని మందుల షాపులో ఫార్మసిస్టు. ఆమె పట్ల అతనికి వెంటనే ఆకర్షణ కలిగింది. ఆమె కుదురైన యువతి. ఆమె కళ్ళు నల్లగా వున్నాయి. ఆమె ముచ్చటగా వుంది. ఆమె చిరునవ్వు మురిపిస్తున్నట్టు వుంది. యే దాపరికమూలేని చూపు ఆమెది. దేన్ని గురించీ సిగ్గు పడనవసరంలేని తేట అయిన చూపు ఆమెది.

ఎలేనాకి కొంచెం ఇంగ్లీషు వచ్చు. మాటలని కొంచెం తప్పుగా ఉచ్చరించినా,

ఫరవాలేదు. ఆమె తనకి రష్యన్ నేర్పితే తను ఆమెకి ఇంగ్లీషు నేర్పుతానని గ్రోవర్ ఆమెతో అన్నాడు. యిద్దరూ మంచి స్టూడెంట్లే.

ఓ యేడాది గడిచేటప్పటికి గ్రోవర్ రష్యన్ ఫరవాలేదన్నట్టుగానే మాట్లాడేడు. ఎలేనాకి ఉచ్చారణ మెరుగైంది. యేమైనా వాళ్ల మధ్య సంబంధాలు మాత్రం బాగా పురోగమించాయి. ఎలేనా తండ్రి కూడా కూతురిలాగానే ఫార్మసిస్టు. ఆయన "యీ దీర్ఘపాదుడు మన అమ్మాయితో సాయంత్రం పూట యెక్కువగా గడుపుతున్నాడు" అని తన భార్యతో గొణగడం మొదలెట్టాడు. ఎలేనా తల్లి కూతురి పక్షం వహించింది. బ్రియాన్ గ్రోవర్ బుద్ధిమంతుడని చెప్పి బెరుగ్గా భర్త మాటలకి అభ్యంతరం చెప్పింది. కాని ఆయన జవాబుగా కోపంతో దగ్గేడు. "యు.ఎస్.ఎస్.ఆర్.లో పెళ్లికా దగ్గ కుర్రాళ్లు చాలా మంది" వున్నారని చాలా సహేతుకంగా ప్రకటించాడు. తన కూతురు క్షయవ్యాధితో లండన్‌లో చనిపోయేందుకుగాను ఆమెని తను పెంచలేదనీ అన్నాడు.

లండన్‌లో కొన్ని లక్షల మంది జనం వున్నారు. అందులో యే కొద్ది మందికో క్షయ వుండి వుండచ్చునేమో. ఎందుకు అంతమాత్రాన ఎలేనా క్షయవ్యాధికి గురవాలి అని తల్లి అడిగింది. ఇంగ్లీషు వాళ్ళు వాళ్ల వాతావరణానికి అలవాటు పడ్డారనీ, కాని రష్యన్లు అక్కడ దిగ్గానే వాళ్లకి క్షయవ్యాధి అంటుకుంటుందనీ ఆయన జవాబు చెప్పాడు.

"పైగా ఒక అమ్మాయీ అబ్బాయీ ప్రేమ ప్రకటించుకోవడానికి ఒక భాష చాలు – మన యౌవనం గుర్తుచేసుకో – కాని వీళ్లప్పుడే రెండు భాషలు మాట్లాడు తున్నారు. దానివల్ల యేం లాభం లేదు, ఆఁ" అన్నాడాయన.

గ్రోజ్నికి వేలాది మైళ్ల దూరంలో, పొగమంచు కమ్మిన లండన్ నగరంలో మరొక మాతృ హృదయం ఆవేదన పడుతోందన్న విషయం యీ తల్లిదండ్రుల వూహకే అసలు రాలేదు. గ్రోవర్ తల్లి అతను రాసిన ఉత్తరాలు చదువుకొని ఎలేనా పేరు యింకా యింకా యెక్కువ సార్లు ప్రస్తావన కొస్తోందని భయపడింది.

ఆమెకి ఒక ఫోటో అందింది. తన కొడుకూ, ఓ పడుచు అమ్మాయి వున్న బొమ్మ. అతని కోటు అమ్మాయి భుజంమీద వుంది. ఆ ఫోటో ఆమె కళ్ల దగ్గర కంటా పెట్టుకు చూసింది. యే తల్లికేనాగానీ ప్రపంచంలో – ఇంగ్లండ్‌లో కావచ్చు, రష్యాలో కావచ్చు, రైతు ఆడమనిషికి కావచ్చు, నగర వనితకి కావచ్చు, శరీరవర్ణంతో, నక్షత్ర గతితో నిమిత్తం లేకుండా – కలిగే కలత ఆవిడకి కలిగింది.

త్వరలోనే శ్రీమతి గ్రోవర్ ప్రత్యేకం రష్యన్ రచయితల పుస్తకాలే లైబ్రరీనుంచి తేవడం మొదలెట్టింది. లైబ్రేరియన్ "ఆఁ" అనుకున్నాడు. పాపం ఆ రచయితలు ఆమె భయాల్ని శాంతింప చెయ్యలేదు. అన్నా కరేనినా భర్త నిస్పందేహంగా పెద్ద

మనిషే అయినా ఆమె భర్తకి అన్యాయం చేసింది. అది చాలదన్నట్టు రైలు కింద పడింది. షొలొఖోవ్ నవల్లో ఆక్సీన్యా భర్తని వదిలేసింది. కాని గ్రిగోరికీ ఆనందం యివ్వలేక పోయింది. గొంచరోవ్ "కొండచరి" నవల్లో, యే కారణాలవల్లనో తెలీదుగాని గౌరవనీయుడైన శ్రీ రాయ్‌స్కీ ప్రేమని వేరా తిరస్కరించి యెంతో అనుమానించాల్సిన వోలొఖొవ్‌కి హృదయాన్ని అర్పించింది. ఆఖరికి పూష్కిన్ కవిగారి తత్యానా కూడా శ్రీ ఒనేగిన్‌కి ప్రేమ లేఖ రాసేలాంటి గుండె అదిరే పని చేసింది. ఒనేగిన్ మరి పరమా త్ముడికెరుక, అలాంటి పని ఆమె చేసేందుకు తగ్గ అవకాశమే యివ్వకపోయినా. ఆ రకంగా ఆమె యెంతో మెచ్చుకోవాల్సిన యువకుణ్ణి యిబ్బందికరమైన పరిస్థితిలో పడేసింది.

ఆహా! రష్యా! నిగూఢ దేశమా. కాని ఆ రష్యన్ ఆడవాళ్ళు వింతగా ప్రవర్తించినా, వాళ్ళకి ఒక ప్రత్యేకమైన సొగసు వుంది.

"గ్రోజ్నీలో నా పని పూర్తయాక నన్ను మాస్కో ఆయిల్ ఇన్‌స్టిట్యూట్‌కి బదిలీ చేశారు. ఎలేనా కూడా మాస్కోకి మారింది. నా కాంట్రాక్టు 1934లో ముగిసింది. నేను లండన్‌కి తిరిగివెళ్ళిపోయాను. రష్యాకి తిరిగి రావాలనుకున్నాను. కొత్త కాంట్రాక్టులూ లేవు, వీసా లేదు. ఎలేనా లేకుండా బతకలేనని గ్రహించాను" అని గ్రోవర్ చెప్తూనే వున్నాడు.

అదిగో అప్పుడూ తన ప్రేయసి దగ్గరికి ఎగిరిరావాలని అనుకున్నాడు. లండన్ ఫ్లయింగ్ క్లబ్‌లో చేరాడు. విమానం నడపడం నేర్చుకున్నాడు. అప్పుడు డబ్బు పొదుపు చేసుకుని సెకండ్ హేండ్ పైపర్ కబ్‌కి అవసరమైన నూట డెబ్బై పౌండ్లు కూడబెట్టాడు. బ్రాక్స్‌బర్న్ ఎయిర్ ఫీల్డ్‌నుంచి 1938 నవంబరు 3న బయల్దేరాడు. యు.ఎస్.ఎస్.ఆర్. చేరాలి తను. ఆమ్‌స్టర్‌డామ్, బ్రేమెన్, హాంబుర్గ్, స్టాక్‌హోమ్‌లలో ఆగాలి. అక్కణ్ణుంచి యెకాయెకీని గ్లూఖొవో గ్రామం వచ్చాడు.

ఆశ్చర్యకరమైన యీ సంఘటన గురించిన వార్త ప్రపంచ పత్రికల్లో చాలా వాటిల్లో పడింది. ఆనాటి పత్రిక శీర్షికలు నాకు గుర్తున్నాయి: "యిరవయ్యో శతాబ్దపు ప్రేమ," "ప్రేమ రెక్కలమీద," "ఇంగ్లీషాయన ప్రేమ చేసిన అద్భుతం," "ప్రేమ రోదసిని కుదిపింది."

కన్సర్వేటివ్ పార్లమెంట్ మెంబర్ కేయిజర్ యీ విషయాన్ని చాంబర్లేన్ కామన్ సభలో లేవనెత్తాలని భావించినట్టు నవంబరు 23న బ్రిటిష్ పత్రికలు వార్త ప్రచురించాయి. విచారణ జరిగినట్లు, యీ విషయం గురించి మాస్కోలో వున్న బ్రిటిష్ దౌత్యాధికారిని సోవియట్ ప్రభుత్వంతో చర్చించవలసిందిగా ఆదేశించినట్టు పార్లమెంట్‌కి

సర్ నెవిల్ చాంబర్లేన్ చెప్పినట్టు నవంబరు 28న రాయిటర్ వార్తా సంస్థ తెలియచేసింది.

గడ్డు వాతావరణ పరిస్థితుల్లో స్టాక్‌హోమ్‌నుంచి మాస్కోకి ప్రమాదకరమైన యాత్ర గ్రోవర్ చేశాడని 'డైలీ టెలెగ్రాఫ్ అండ్ మోర్నింగ్ పోస్ట్' పత్రిక రాసింది.

జర్మన్ ఫాసిస్టు పత్రికలు శర పరంపరగా వ్యాసాలు ప్రచురించాయి. ''కమ్యూనిస్టులకి ప్రేమ అనేదాని అర్థం తెలియదు'' కాబట్టే గ్రోవర్‌కి మరణ శిక్ష పడుతుంది. యు.ఎస్.ఎస్.ఆర్.లో ప్రజలు ట్రేడ్‌యూనియన్ కమిటీల ఆదేశాల మేరకే ప్రేమించు కుంటారన్నది వాస్తవం కాదా? అలాంటప్పుడు గ్రోవర్ గాని, నిజంగా అతనికి గల మహత్తర అనుభూతులు గాని వాళ్లకి అర్థం అవుతాయా? లేదు, ఎర్ర మాస్కో ఆధునిక రోమియో జూలియట్లకి చోటు కాదు'' అని ఆ పత్రికలు రాశాయి.

ఓ బ్రిటిష్ లాయరు యింకో అభిప్రాయాన్ని వెలిబుచ్చాడు.

''గ్రోవర్‌ని విచారించేందుకు మాస్కోకి చట్టరీత్యా అన్ని హక్కులూ వున్నాయి. ప్రేమా చట్టమూ — ఎంత పాత సమస్య! అయినా యెంత నిత్య నూతన సమస్య! సోవియట్ క్రిమినల్ కోడ్‌లోని అధికరణం ఒకటి, నిండు ప్రేమతో కొట్టుకునే పడుచు గుండె ఒకటి! యీ విషాదకరమైన పెనగులాట చూసి కఠినమైన నిజమైన న్యాయాధికారి హృదయం కరగదా? గ్రోవర్ విచారణ విషాదంగా ముగుస్తుందని మేము అనుకోము, ఫలితం కోసం ఆశావహంగా యెదురు చూస్తున్నాం.''

యీ లోపున గ్రోవర్ చెప్పింది యదార్థమో కాదో చెప్పవలసిందిగా ఎలేనా గొలియన్‌ని ప్రశ్నించారు. యిద్దరు చెప్పినవీ పూర్తిగా సరిపోయాయి. అతను సోవియట్ యూనియన్‌కి విమానంమీద వచ్చాడనీ తక్షణం అతన్ని చూసేందుకు ఆమెకి అనుమతీ యిస్తున్నారనీ తెలియచేశారు. కొన్ని క్షణాల్లో తను ఎలేనాని చూస్తాడని అతనికీ తెలియజేశారు. మామూలుగా ప్రశాంతంగా వుండే అతని ముఖంలో ఆరాటం వెల్లడైంది. అతను పెదాలు కరిచి సిగరెట్ ముట్టించాడు.

ఇన్వెస్టిగేటర్ అతన్ని తన అసిస్టెంట్‌తోబాటుగా ఒక గదిలో వుండమని చెప్పి తను ఎలేనాని తీసుకురావడానికి వెళ్లాడు.

ఆమె లోపలికి రాగానే అతను ఒక్క ఉదుటన ఆమె దగ్గరికి వెళ్లాడు. యిద్దరూ కాగలించుకున్నారు. నవ్వుకున్నారు. గుసగుసలాడుకున్నారు. ఆనంద భాష్పాలు కార్చారు, మళ్లీ గుసగుసలాడుకున్నారు.

యిప్పుడు ఇన్వెస్టిగేటర్‌కి అర్థం కాని దేదేనా వుంటే బ్రియాన్ గ్రోవర్ ఎలేనా చెవిలో యేం చెప్పాడన్నదే.

ఆ నవంబరు నెలలో బావురుమంటూ వుండే ఒక రోజు ఉదయం బ్రాక్స్‌బర్న్

ఎయిర్ ఫీల్డునుంచి తను బయల్దేరడం గురించి చెప్పాడా? మబ్బుగా కల్లోలంగా వుండే బాల్టిక్ సముద్రంమీదుగా స్టాక్‌హోమ్‌నుంచి మాస్కోకి తను ప్రయాణం చేసిన సాహసం గురించి చెప్పాడా? తన బుల్లి విమానం రెక్కల కింద దూరం తరిగిపోతూ వుండడం గురించి చెప్పాడా? మంచు తెరలు విమానాన్ని కుదుపుతూ వున్నా తను పట్టువదలకుండా స్టీరింగ్‌ని వదలకుండా దీపకాంతికేసి పోతున్నట్టుగా ఆమె గోధుమ రంగు కళ్ల కాంతికేసే యెలా ప్రయాణించి వచ్చాడో చెప్పాడా? తన జీవిత పరమార్థంగా, ఆనందదాయకంగా, ప్రేమ పూరితంగా వున్న ఆ కళ్ల కాంతి కోసమే తను యెలా ప్రయాణం చేసి వచ్చాడో చెప్పాడేమో. తను ఆమె కోసం యెంతో బెంగపెట్టుకున్నానని చెప్పాడేమో. యేమైతేనేం దగ్గరికి వచ్చేను, అని ఆమె చిన్ని చేతిని తన చేతిలోకి తీసుకుని, తృప్తిగా వుందన్నాడేమో. లేదా ఎలేనాని దగ్గరికి తీసుకుని, ఒక రష్యన్ అమ్మాయి తన కొడుకుని యెంతగానో ప్రేమించినందుకు ఇంగ్లీషు తల్లి కృతజ్ఞతలు తెలియచెయ్యమని చెప్పిందని ఆమె అంటే తనకి సంతోషంగా వుందనీ, యింకా చెప్తే ఆడదైనందువల్ల కొంచెం ఆమాయగా వుందని కూడా తన తల్లి చెప్పమందని అన్నాడేమో. తాము వేరు వేరు దేశాల్లో పుట్టినా, తొలి మాటలు భిన్న భాషల్లో పలికినా ఉమ్మడి భాష కనిపెట్టామని చెప్పాడేమో.

1938 డిసెంబరు 31న మాస్కో సిటీ కోర్టులో ఆ కేసు విచారించారు. "బ్రియాన్ మాంటేగ్ గ్రోవర్, ఫోల్క్‌స్టన్‌లో 1901లో జన్మించిన బ్రిటిష్ పౌరుడు ఆర్.ఎస్.ఎఫ్.ఎస్.ఆర్. క్రిమినల్ కోడ్ 59–3వ నిబంధన ప్రకారం నింది తుడు" కేసు విచారణ సందర్భంగా మొత్తం బ్రిటిష్ రాయబార కార్యాలయపు సిబ్బంది అంతా హాజరైంది. ఒంటి కంటి మలోచనాలు పెట్టుకున్న దౌత్యవేత్తలు, బంగారు లార్నెట్‌లు పట్టుకున్న వాళ్ల భార్యలు, బ్రిటిష్ అమెరికన్ కరస్పాండెంట్‌లు, అనేక రాయబార కార్యాలయాధికారులు హాజరయారు.

అంతకు ముందెన్నడూ అంత ఘనమైన సభ్యులు సంసార పక్షంగా వుండే ఆ చిన్న కోర్టు గదికి రాలేదు. దౌత్యవేత్తల రోల్స్ రాయిస్ కార్లు, బ్యూక్ కార్లు గుమ్మం దగ్గర మెరిసిపోయాయి.

ప్రిసైడింగ్ జడ్జీగారి ముఖంలో దయ కనిపిస్తూ వుంది. ఆయన జుట్టు రాగి రంగులో వుంది. ఆయన కళ్లు నీలంగా వున్నాయి. యిద్దరు ప్రజా అసెస్సర్లు కూడా వున్నారు. ఆ యిద్దరూ ఆడవాళ్లు. ఎర్రటి రుమాళ్లు కట్టుకున్నారు. ఒకామె త్రెఖ్‌గోర్నయా ఫాక్టరీలో పని చేసే జౌళి కార్మికురాలు. పెద్దావిడ. రెండవ ఆమె ఎలక్ట్రిక్ ప్లాంట్‌లో పని చేసే యువ కార్మికురాలు. అందరూ జడ్జీగారి గదిలోనుంచి వచ్చి ఎర్ర క్లాత్ కప్పిన బల్ల ముందు కూర్చున్నారు. కోర్టు గది నిశ్శబ్దంగా వుంది.

అక్కడ పోగయిన వాళ్ళు జడ్జీలనీ, జడ్జీల బల్లపైన వున్న లెనిన్ బొమ్మనీ, సాదాగా నిరాడంబరంగా వున్న వాతావరణాన్నీ ఆసక్తిగా చూశారు.

అవును, ఈ గదిలో త్రాసు పట్టుకున్న న్యాయ దేవత విగ్రహం లేదు. శిలువలు లేవు. పాలరాతి స్తంభాలు లేవు. ఆడంబరంగా యూనిఫారాలు తొడుక్కున్న పోలీసులు లేరు. న్యాయాధికార కార్యాలయాన్ని సూచించే హూందా లాంఛనాలు లేవు. జడ్జీలు నల్లని పట్టు అంగీలు వేసుకోలేదు. గంజిపెట్టిన తెల్లని కాలర్ పట్టీలు పెట్టుకో లేదు. వాళ్ళకి బంగారు గొలుసులు లేవు, పౌడర్లు అద్దిన విగ్గుల్లేవు. నల్లని ఫ్రాక్ కోట్లు, గంజిపెట్టిన చొక్కాలు తొడుక్కున్న నాజూకు ముఖాల సుప్రసిద్ధ ధర్మకర్తలు లేరు. నల్ల పాలరాయిలా యెత్తుగా వుండి, అధిక్షేపపూరితమైన ప్రశ్నలడిగే విషపుచ్చి ప్రాక్యురేటర్లు లేరు. బిగుసుకు పోయిన బైలిఫ్‌లు లేరు. షోగ్గా కొప్పులు ముడుచు కున్న పొగరు మోతు స్టెనోగ్రాఫర్లు లేరు. యీ బాపతు వాళ్ళెవరూ లేరు!

కాని యీ సాదా కోర్టు గదిలో, జడ్జీల నిజాయితీపూర్వక ఆలోచనామగ్న నేత్రా లలో, నిష్కపటంగా దయాన్వితంగా వున్న వాళ్ల వదనాల్లో, యే నాటకీయమైన హంగులూ లేని సాదా న్యాయాధికార కార్యక్రమంలో అంతకు ముందెన్నడూ ప్రజలు చూడనిది యేదో వుంది. అయాచితంగానే గౌరవ భావాన్ని కలిగించేదేదో వుంది. విశ్వాసాన్ని కలిగించేదేదో వుంది. చరిత్రలో మొట్టమొదటి సారిగా, ప్రజా న్యాయ స్థానం అని పిలిచే హక్కుని యీ కోర్టు యెలా సంపాదించుకుందో వివరించేదేదో వుంది.

''కోర్టు సమావేశమవుతోంది. ప్రతివాది కోరిక మేరకి మాస్కో లాయర్ల కల్లిజియం సభ్యుడు బారిస్టర్ కొమ్మొదొవ్ అతని తరపున వాదిస్తాడు'' అని ప్రిసై డింగ్ జడ్జి శాంతంగా ప్రకటించాడు.

మూడు గంటల తర్వాత జడ్జీలు తమ గదుల్లోకి వెళ్లిపోయారు. ప్రతివాదీ, అతని లాయరూ చేసిన వాదనలు ఆ మూడు గంటలూ శ్రద్ధగా విన్నారు. కోర్టులో కలకలం రేగింది. బ్రియాన్ గ్రోవర్ సోవియట్ జడ్జీలకి తమ ప్రేమ గాధని గురించి చెప్పాడు. రష్యన్ అమ్మాయిని తను ప్రేమించడం, తనని ఆ అమ్మాయి ప్రేమించడం విషయం చెప్పాడు. తను యెలా చట్ట వ్యతిరేకంగా సరిహద్దు దాటి వచ్చిందీ, యు.ఎస్. ఎస్.ఆర్.లో ప్రవేశించిందీ, తన ప్రేమ కోసం యెలా తను ఆ పని చేసిందీ చెప్పాడు.

''గౌరవనీయులైన న్యాయాధికారులారా, మీకు నిజం పూర్తిగా చెప్పాను. యిప్పుడు నేను చెప్పదలచుకున్న విషయాన్ని, నాకు దుబాసీ వున్నా కూడా, నేనే రష్యన్‌లో చెప్తాను. మీ దేశాన్ని, మీ ప్రజల్ని, నా ప్రియమైన ఎలేనా అంతగామా నేను ప్రేమిం చాను. నేను రష్యాలో కొన్ని యేళ్ళు వున్నాను. నా తీరిక సమయాన్ని రష్యన్లతో గడి పాను. వాళ్లతో పని చేశాను. మీ శ్రమ అనే మహా సముద్రానికి నేను సైతం బిందు వొక్కటి ధారపోశాను. నాకు అందుకు గర్వంగా వుంది. నేను రష్యన్లతో కలిసి

పని చేశాను, జీవించాను. వాళ్లతో పాటు కలిసీ హసించాను, కలిసీ పాడాను. యీ ప్రజ లతో బాంధవ్యం కలిగించుకోవడం గౌరవంగా భావిస్తాను. నే చెప్ప దలచుకున్నదంతా యింతే'' అని బ్రియాన్ గ్రోవర్ ముగించాడు.

జడ్జీలు సంప్రదించుకోవడానికి వెళ్లారు. కోర్టు గది అంతా వొకటే కలకలం. తీర్పు కోసం గ్రోవర్ శాంతంగా నిరీక్షించాడు. తన భవిష్యత్తుని నిర్ణయించే యీ సాదా రష్యన్లు తను చెప్పిందాన్ని అర్థం చేసుకోలేదనే భయం అతనికి లేదు. ప్రపంచంలోని సమస్యలన్నిట్నీ యిలాంటి సాదా ఇంగ్లీషు, రష్యన్, అమెరికన్, జర్మన్ ప్రజలు పరిష్కరిస్తే యెవళ్లకీ భయం అనేది వుండదని అనుకున్నాడు.

గంట మోగింది. జడ్జీలు తిరిగివచ్చారు. ప్రిసైడింగ్ జడ్జి తీర్పు చదివాడు. బ్రియాన్ గ్రోవర్ చట్ట విరుద్ధంగా యు.ఎస్.ఎస్.ఆర్.కి విమానంలో వచ్చి సోవియట్ సరిహద్దుని దాటేడు. క్రిమినల్ కోడ్ ఆర్టికల్ 59–3వ నియమం ప్రకారం అతను దోషి అని కోర్టు భావిస్తోంది.

''అయినాగానీ, యీ నేరానికి వెనక వున్న కారణాలని కోర్టు పరిగణనలోకి తీసుకోకుండా వుండలేదు. ప్రతివాది నిజంగానే ఒక సోవియట్ అమ్మాయిని ప్రేమించాడు, ఆమె కూడా అతన్ని ప్రేమించింది. యీ యదార్థ విషయాన్ని కోర్టు పరగణనలోకి తీసుకుంటోంది. వాళ్ల ప్రేమ కాల పరీక్షకి నిలిచింది. ఎడబాటుని జయించింది. అంచేత దాన్ని మన్నించాలి. ప్రేమ మాత్రమే ప్రతివాదిని యు.ఎస్.ఎస్.ఆర్.కి విమానం మీద వచ్చేటట్టు ప్రేరేపించింది. క్రిమినల్ కోడ్ 51వ ఆర్టికల్ ఆధారంగా కోర్టు బ్రియాన్ గ్రోవర్‌కి ఒక నెల ఖైదులో వుండేటట్టు శిక్షగాని, లేదా 1,500 రూబుళ్ల జరిమానాగాని విధిస్తోంది'' అని ప్రిసైడింగ్ జడ్జి తీర్పు చదివాడు.

జడ్జి చదవగానే భేష్ భేష్ అంటూ చప్పట్లు మోగిపోయాయి. ఆ సాయంత్రం మాస్కో రేడియో యీ తీర్పుని ప్రసారం చేసినప్పుడు అది హర్షామోదాలతో గ్రేట్ బ్రిటన్ అంతా ప్రతిధ్వనించింది.

మూడ్రోజుల తర్వాత గ్రోవర్ తన భార్య ఎలేనాతో కలిసి అవసరమైన వీసా వగైరాలు తీసుకుని లండన్‌కి వెళ్లిపోయాడు.

మరో సారి పేపర్లు వార్తలతో నిండిపోయాయి. సోవియట్ ప్రభుత్వం చాలా మానవత్వంతో వుండగలదని 1939 జనవరి 6వ తేదీ 'డైలీ టెలిగ్రాఫ్ అండ్ మోర్నింగ్ పోస్ట్' పత్రిక రాసింది. లండన్ చేరాక గ్రోవర్ చేసిన ప్రకటనని అదే పత్రిక ప్రచురించింది: ''చట్ట వ్యతిరేకంగా నేను యు.ఎస్.ఎస్.ఆర్.లోకి ప్రవేశించాను. ఆ కేసుని చాలా న్యాయంగా ధర్మబద్ధంగా నడిపారు.''

ఆ రకంగా ఆ కేసు ముగిసింది. పదిహేడేళ్లు గడిచిపోయాయి. ఆ గ్రోవర్‌గాని,

అతని భార్యగాని, అసలంటూ వుంటే వాళ్ల పిల్లలుగాని యేమయారో యేమిటో నాకేమీ తెలీదు. కాని వాళ్ల ముఖాలు నాకు స్పష్టంగా గుర్తువున్నాయి. వాళ్ల కలుసుకోవడం, ఉద్రేకంతో సంతోషంగా గుసగుసలాడుకోవడం, వాళ్ల ప్రేమ గాథ నాకు స్పష్టంగా గుర్తు వున్నాయి.

పిళ్ల ప్రేమ కోర్టు తీర్పులో రుజువైంది. అది చట్టం. మరి ప్రతివాది దానిమీద అప్పీలు చెయ్యలేదుగా. అంచేత అనుమానానికి తావు లేకుండా, యెప్పటికీ వుండే ప్రేమ అది అని నేరపరిశోధకుడిగా అంటున్నాను.

అందుకనే బ్రియాన్ మాంటేగ్ గ్రోవర్‌కీ, అతని భార్యకీ, వాళ్ల పట్టుదలగల స్వభావం రీత్యా పరస్పర మంచితనం రీత్యా ఖాయంగా వాళ్లకి పిల్లలు వుండే వుంటారు — వాళ్లకీ, ఆనందం కలగాలని కోరుతున్నాను.

నేరపరిశోధకులు జీవితంలోని చీకటి పార్శ్వంతోటే వ్యవహరిస్తూ వుంటారు అనే దురభిప్రాయం శుద్ధ తప్పు అని దీన్ని ఉదాహరణగా చూపిస్తూ కడగా చెప్పదలచుకున్నాను.

1956

వేట బాకు

ఆఖరికి ఆ కాగితాలమీద సంతకాలు అయ్యాయి. జూఆలజీ ప్రొఫెసర్ బూరొవ్, ఆయన అసిస్టెంట్ వోరొనొవ్‌లిద్దర్నీ బారెంట్స్ సముద్రంలో వున్న కొల్గుయెవ్ ద్వీపంమీద ఒక యేడాది పాటు పరిశోధనలు జరపడానికి పంపిస్తున్నారని రాసి వుంది.

యూనివర్సిటీలో వున్న వాళ్ల సహోద్యోగులు అది చదువుకుని నవ్వుకున్నారు. ఆ ప్రొఫెసరుగారికీ ఆయన అసిస్టెంట్‌కీ మధ్య వచ్చుగడ్డి వేస్తే భగ్గుమంటుందని ఉపాధ్యాయులకీ, విద్యార్థులకీ బాగా తెలును. నిర్జనంగా వుండే ద్వీపంమీదకి, యిరవై నాలుగ్గంటలూ చచ్చినట్టు ఒకళ్లతో ఒకళ్లు కలిసే వుండేటట్టు ఒక యేడాది పాటు గెంటెయ్యడం జరుగుతుందన్న వార్త విని కొందరు భుజాలు యెగరేసారు, కొందరు ముసిముసి నవ్వులు నవ్వుకున్నారు. కావాల్సికే యిద్దర్నీ అలా పంపుతున్నారని కొందరన్నారు. కటువైన వాతావరణంలో వాళ్ల స్వభావాలు చక్కబడ్డానికి యిది పథకం అని కొందరన్నారు.

"యిద్దరూ చెట్టాపట్టా లేసుకుని తిరిగివస్తారు. చూడండి ఆదర్శ మూర్తులైన స్నేహితుల్లా కలిసివస్తారు" అని మరి కొందరు అన్నారు.

కాని అసలు బాగా ఆశ్చర్యపోయిన యిద్దరూ యెవరయ్యా అంటే యిందులో నిమగ్నమైన వాళ్లిద్దరూనే. ఆ శీతకట్టులో తనకి తోడుగా వుండేది యెవరైందీ విని ప్రొఫెసరుగారికి కంటిమీద కునుకు లేకపోయిందట. ఆ రాత్రి వోరొనొవ్ కూడా అంతే కళవిళ పడ్డాడు.

అయినా ఆర్డర్లు ఆర్డర్లే కాబట్టి కొన్ని రోజుల తర్వాత ప్రొఫెసర్ బూరొవ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ వోరొనొవ్‌లిద్దరూ వున్న యూనివర్సిటీ బృందం సుదూర బారెంట్స్ సముద్ర ద్వీపానికి బయల్దేరింది. ఒక దీర్ఘ ఆర్కిటిక్ సంవత్సరం అంతా యిద్దరూ కలిసి గడపాలి.

వాళ్లు రాసిన తొలి ఉత్తరాలు ఒక నెల తర్వాత వచ్చాయి. తమకి కలిగిన తొలి

అనుభూతుల గురించీ, ప్రయాణం వివరాల గురించీ, భవిష్యత్ పథకాల గురించీ వాళ్ళు రాశారు.

"అంతా దివ్యంగా వుంటుంది, యీ మనిషి యెదురుగా యిరవై నాలుగ్గంటలూ తగలడకపోతే. యే జూఆలజీ స్పెషలిస్టైనా అధ్యయనం చెయ్యడానికి తగ్గ వస్తువు యీ మనిషే. యితన్ని చూస్తే నాకు మంటెక్కి పోతోంది. యిక్కడ వుండడం మూలానా, దురదృష్టవశాత్తూ అస్తమానూ చూస్తూ వుండవలసి రావడం మూలానా నాకు ఆదిలో అతనంటే కలిగిన అయిష్టత అహేతుకం కాదు అని నమ్మకం కుదిరింది" అని ప్రొఫెసరుగారు రాశాడు.

"ఆ ముసలాడ్ని భరించడం పరమ కష్టం, రాత్రి పగలూ ఆయనతో వుండడం చిత్రహింస" అని వోరొనొవ్ తన వంతుగా తనూ రాశాడు.

యూనివర్సిటీలో యీ ఉత్తరాల్ని చదువుకుని నవ్వుకున్నారు. ఒకళ్ల పట్ల ఒకళ్లకి గల అయిష్టత విషయంలో యిద్దరి పట్టుదలలూ చూసి ఆశ్చర్యపోయారు. విడి విడిగా చూస్తే వాళ్లు మంచివాళ్లే.

నిరాధారమైన యీ వైరం యెంత కాలం వుంటుందో వాదించుకున్నారు. యిద్దరూ ఆఖరికి కలిసిపోతారని, ఒకళ్లంటే ఒకళ్లు యిష్టపడతారనీ కూడా ఆశావాదులు అన్నారు. సరిగ్గా వ్యతిరేకంగా వుంటుంది అని నిరాశావాదులు అన్నారు. యీ విషయంమీద బోలెడు పందేలు, కడకి తేలి ఫలితం కోసం చూశాయి. రెండు పోట్లాటలు యీ విషయంమీద జరిగి పోయేయి.

...యేమైనా ఒక నెల తర్వాత ముక్తసరిగా ఒక టెలెగ్రామ్ వచ్చింది. ప్రొఫెసర్ బూరొవ్‌ని అసిస్టెంట్ ప్రొఫెసర్ వోరొనొవ్ హత్య చేశాడని యూనివర్సిటికీ కొల్గుయెవ్ ద్వీపంనుండి వార్త తెలియచేసిన టెలెగ్రామ్.

యీ కేసుని విచారించాల్సిన స్పెషల్ ఇన్వెస్టిగేటర్ ఆ ద్వీపం యెలా చేరాలా అని మార్గం కోసం వెదికాడు. వాతావరణ పరిస్థితుల వల్లా, యితర పరిస్థితుల వల్లా ప్రతి యేడూ అలానే వుండే ఆ సమయంలో ప్రయాణం అసాధ్యమైంది.

ఇన్వెస్టిగేటర్ ఆ ద్వీపం దగ్గర వున్న హిమ విచ్ఛేదక నౌక కేప్టెన్‌కి రేడియో ఆజ్ఞలు జారీచేశాడు. గడ్డకట్టించిన మృతకాయాన్ని ఆ కేప్టెన్ మాస్కోకి తీసుకురావాలి. నేరం జరిగిన ప్రదేశాన్ని క్షుణ్ణంగా శోధించాలి. యెవరన్నా సాక్షులుంటే వాళ్లని ప్రశ్నించి సమాచారం తేవాలి.

అన్ని ముందు జాగ్రత్తలూ తీసుకుని తప్పించుకు పారిపోవడానికి వీలివ్వకుండా వోరొనొవ్‌ని మాస్కోకి తీసుకురమ్మని ఇన్వెస్టిగేటర్ ఆదేశించాడు.

ఓడ కేప్టెన్ ఇన్వెస్టిగేటర్ ఆజ్ఞలని అమలు జరిపాడు. కొన్ని వారాల తర్వాత

ఇన్వెస్టిగేటర్ ఆఫీసుకి వచ్చాడు. కూడా ఓ ముప్పై యేళ్ల మనిషి వచ్చాడు. అతను భయంగా దిక్కు తోచనట్టుగా చూస్తూ వున్నాడు. అతను వోరొనొవ్.

"కూర్చోండి" అన్నాడు ఇన్వెస్టిగేటర్. అతనికేసి వింత కుతూహలంతో చూశాడు.

"థేంక్యూ" అన్నాడు వోరొనొవ్ నిదానంగా.

ప్రశ్నించడం మొదలైంది. ఇన్వెస్టిగేటర్ వోరొనొవ్ గతం గురించి తెలియచేసే రికార్డుల్ని జాగ్రత్తగా అధ్యయనం చేశాడు.

అతని ముప్పై రెండేళ్ల జీవితంలోనూ యెప్పుడూ నిజాయితీగానే, బుద్ధిగానే బతికాడు. వోరొనొవ్ యువకుడు. కాని నిస్సందేహంగా ప్రతిభగల శాస్త్రజ్ఞుడు. చాలా శాస్త్రీయ వ్యాసాలు రాశాడు. విజయ పథంమీద తిరుగులేకుండా సాగుతున్నాడు.

ఇన్వెస్టిగేటర్ మామూలుగా నిదానంగా, తొట్రుటు పడకుండా వుండే మనిషే. కాని అతనే వుండబట్టలేక "యింతకీ, యేం మాయో, ప్రొఫెసర్‌ని మీరెందుకు చంపాల్సి వచ్చిందండీ" అని ఇన్వెస్టిగేటర్ ఆశ్చర్యంగా అన్నాడు. "దేన్ని గురించి మీరిద్దరూ పోట్లాడుకున్నారు?" అని అడిగాడు.

వోరొనొవ్ నిస్సహాయంగా భుజాలు యెగరేశాడు.

"చూడండి" అని అర్థిస్తున్నట్టు, సందేహిస్తున్నట్టు కనిపించే గొంతుకతో మొదలెట్టాడు. "చూడండి... విషయమేమిటంటే ఆయన్ని నేను చంపలేదు" అన్నాడు.

"కాని ఆయన హతుడయ్యాడు కదా?"

"అవును."

"మీరిద్దరూ తప్ప నేరం జరిగిన ఆ చోట వేరే యెవళ్లేనా వున్నారా?"

"లేరు. మేం యిద్దరమే వున్నాం. యింకెవళ్ళూ లేరు. యెవళ్ళూ వుండడానికి వీలూ లేదు. అందులో సందేహం లేదు."

"అలా అయితే మీరెందుకు తప్పు ఒప్పుకోవడం లేదో నాకర్థం గావడం లేదు. యిద్దరు మాత్రమే కలిసి వుంటున్నప్పుడు, వాళ్లల్లో ఒకడు హత్య చెయ్యబడ్డప్పుడు – మీరు ఒప్పుకోవాలి, హంతకుడు..."

"...రెండోవాడే అయివుండాలి" అని వోరొనొవ్ మాటకి అడ్డం వచ్చి ఒప్పుకున్నాడు. "అది ఖాయంగా అంతే వుంటుంది. కాని నేను ఆయన్ని చంపలేదు. నా పరిస్థితిలో వున్న నిస్సహాయత్వం గురించి నాకు తెలుసు, అదే భయంకరమైన విషయం. నన్ను సమర్థించుకోవడానికి ప్రపంచంలో నాకు అవకాశమే లేదు. కావచ్చు, నన్ను – దాన్నేమంటారు? – నేరం చేస్తున్నట్టు పట్టుకున్నారు. నేనే మీ స్థానంలో వుండి వుంటే ఒక్క క్షణం సందేహించి వుండను. నాకర్థమైంది. దేనికేనా సిద్ధ పడి వున్నాను. దేనికైనా. కాని నేను ఆయన్ని చంపలేదు."

హఠాత్తుగా వోరొనొవ్ యేడవడం మొదలుపెట్టాడు. తను మాట్లాడినట్టే అంత

వింతగానూ వెక్కాడు. యీ పొడుగాటి మనిషి, నిబ్బరంగా వుండే సంస్కారవంతుడు నిస్సహాయంగా, కోపం లేకుండా, హృదయం కదిలేటట్టుగా చిన్న పిల్లాడిలా యేడ్చాడు. తను చెప్పేదాన్ని వింటూ వున్న మనిషి స్పందించాలని ఉద్దేశించినవి కావు ఆ కన్నీళ్లు. కాని అతను కన్నీటిని దాచుకునే ప్రయత్నమూ చెయ్యలేదు. తను మాట్లాడినంత సాదాగానూ, అంత సహజంగానూ, యేడ్చాడు.

''నిబ్బరించుకోండి'' అని ఇన్వెస్టిగేటర్ కేక వేశాడు. ''ఆయన్ని మీరు చంపినట్లయితే—సాక్ష్యం అంతా అలానే వుంది—ఒప్పుకోవడం మెరుగు. చంపలేదూ, రుజువు చెయ్యండి. నా వాదనలని కాదనండి, మీ చర్యల గురించి వివరించండి, మీ పక్షం వాదనవి చెప్పండి'' అన్నాడు.

వోరొనొవ్ నేరం చేసినట్టు కనిపిస్తూ వుండడంవల్ల ఇన్వెస్టిగేటర్ అలా అన్నాడు. వోరొనొవ్ బూరొవ్‌ని చంపాడనీ మరెవ్వరూ కాదనీ సాక్ష్యం తెలియచేస్తోంది. కాని యే మాత్రం యెవళ్లూ యే ఉప్పూ అందించకుండా వోరొనొవ్ అదనపు సమాచారాన్ని, తనమీద నేరారోపణకి బలం కూర్చే సమాచారాన్ని యివ్వడం, అదీ తనని సమర్థించుకుంటున్నట్టు కాకుండా చెప్పడం ఇన్వెస్టిగేటర్‌కి ఆశ్చర్యం కలిగించింది. తన నేరం లేదని చెప్తూనే అతను గబగబా కొత్త విషయాల్ని, యదార్థాలని, అనుమానాల్ని వెల్లడించడం మొదలుపెట్టాడు. అన్నీ కేసుకి యింకా ముప్పు తెచ్చేవే. అలా చేసి, తీవ్రంగా, స్థిరంగా అతను తనకి వ్యతిరేకంగా తనే సాక్ష్యాన్ని పోగు చేస్తున్నాడు.

''మేమూ ద్వీపం చేరాక మా వైషమ్యం యింకా పెరిగింది. మా ఉద్రేకాల్ని అదుపు చేసుకుందా మనుకున్నాం. కాని మా విద్వేషం ప్రతి మాటలోనూ, చూపులోనూ, కదలికలోనూ ప్రవేశించింది. యెప్పుడూ అదుపులో వుండటం కష్టం కదా. తను అదుపులో వుంచుకోవడం కూడా పరిస్థితికి యేం దోహదం చెయ్యలేదు. అయినా దురదృష్టవశాత్తూ పరిస్థితి మెరుగవలేదు. ప్రొఫెసర్‌గారు నన్ను చూసి నిలవలేక పోయేవాడు, నాకూ ఆయనంటే అలానే వుండేది. నిజం చెప్పాలంటే ఒకో అప్పుడు ఆయన్ని కొట్టాలని, బాదెయ్యాలని యింకా చెప్తే చంపెయ్యాలనీ కూడా అనిపించిన క్షణాలున్నాయి. యీ ఆలోచనలే నన్ను వేధించడం మొదలుపెట్టాయి. యీ ఆలోచనలు నా డైరీలోకి కూడా యెక్కాయి. నేను దాన్ని కూడా తెచ్చాను. యిదిగో చూడండి'' అన్నాడు.

యీ మాటలంటూ వోరొనొవ్ ఇన్వెస్టిగేటర్‌కి పెద్ద నోట్‌బుక్‌ని అందించాడు. నిజంగానే అక్కడ రాసిన మిగతా విషయాలతో బాటుగా ప్రొఫెసరుగారిని చంపెయ్యాలన్న ఆలోచన తనకి కలిగిన సంగతిపీ వోరొనొవ్ రాశాడు.

''నాకు తెలీదు. బహుశా ఆఖర్న నా ఉద్రేకాల్ని అదుపు చేసుకోలేకపోతే ఆయన్ని నిజంగా చంపి వుండేవాణ్నేమో. బహుశా! కాని నేను ఆయన్ని చంపలేదు. అదీ విషయం.''

''ద్వీపం మధ్యలో ఒక సరస్సు వుంది. అక్కడికి ఆ రోజు ఉదయం బాతుల వేట కని బయల్దేరాం. కుక్కల స్లెడ్జ్‌మీద వెళ్లాం. మా బండి తోలేవాడు వాస్య అని సెనెట్స్ తెగవాడు. సగం దారిలో స్లెడ్జ్ విరిగిపోయింది. యింకా రెండు మైళ్ల వెళ్లాల్సి వుంది. నడిచి వెడదామని బయల్దేరాం. వాస్య స్లెడ్జ్‌ని బాగు చేస్తూ వెనక దిగడిపోయాడు.

''సరస్సు దగ్గరికి వెళ్లి షూటింగ్ మొదలెట్టాం. బాతులు అవతలి వేపు యీదుకుపోయాయి. ప్రొఫెసర్‌గార్ని అక్కడ్నే వుండి పొమ్మన్నాను. నేను అవతలి వేపు వెళ్తాను బాతుల్ని షూట్ చెయ్యడానికని అన్నాను. ఆయన సరేనన్నాడు. నేను అటు వేపు వెళ్లాను.

''ఒక మైలు దూరంలో వున్నాను నేను. ప్రొఫెసరుగారు అక్కడనే ఒక్కడూ నుంచున్నాడు. నాకు స్పష్టంగా కనిపిస్తూ వున్నాడు. ఆయనకి దగ్గర్లో యెవరూ లేరు. యెవరూ వుండడానికీ లేదు. అంత మట్టుకి ఖాయంగా చెప్పగలను. అప్పుడు యించుమించులో ఆయన నుంచున్న చోట ఒక గుండు పేలింది. ఆయన వింతగా కదిలిపోయి పడిపోయాడు. యేం జరిగిందా అని ఆశ్చర్యపోతూ ఆయన దగ్గరికి పరిగెత్తి వెళ్లాను.

''నేను దగ్గరికి వెళ్లేటప్పటికి ఆయనకి యింకా ప్రాణం వుంది, స్పృహ లేదు. వేట బాకు పిడి దాకా ఆయన యెడమ కంట్లో దిగబడి వుంది. కన్ను పుచ్చి ఉబ్బి నట్టుగా పిడి బయటికి పొడుచుకు వచ్చింది. ఆయన రైఫిల్ పక్కనే పడి వుంది.

''ఆ దురదృష్టవంతుడికి యెలా సాయం చెయ్యాలా అని తోచక నా మతిపోయింది. కంట్లోనుంచి బాకుని యివతలికి తీద్దామని ప్రయత్నించాను కాని వీలవలా. చాలా బలంగా పొడుచుకుంది. అప్పుడు స్లెడ్జి బండిని వదిలిన చోటికి పరిగెత్తి వెళ్లాను. వాస్య అప్పడే మరమ్మత్తులు పూర్తిచేశాడు. చాలా పెద్ద ప్రమాదం జరిగిపోయిందనీ, కుక్కల్ని వూపుగా తోలమనీ చెప్పాను. మేం అక్కడికి చేరేవేళకి ప్రొఫెసరుగారు చని పోయాడు. ఆయన దేహాన్ని శిబిరానికి తీసుకువచ్చాం. చాలా ప్రయాసపడ్డమీద బాకుని యివతలికి తియ్యగలిగాం. అదీ జరిగింది. సిగరెట్ కాల్చుకోవచ్చా?'' అని అడిగాడు.

''ఆఁ కాల్చుకోండి.''

హోరొనొవ్ సిగరెట్ ముట్టించాడు. ఆకలిగా పొగపీల్చాడు. కాసేపాగాక మళ్లీ మాట్లాడేడు.

''అంచేత నన్ను నేను సమర్థించుకోవడం కష్టం. యీ కేసులో సాక్ష్యం అంతా నా నేరాన్ని చూపిస్తుందని గ్రహించే తెలివి నాకుంది. నిజానికి నేరం ఒప్పుకుంటే కోర్టులో నాకు పరిస్థితి మెరుగవుతుంది. నేరానికి పశ్చాత్తాప పడుతూ, వొప్పేసుకుంటే, లేదా దానికి మీరే పేరు పెట్టినా నాకు మేలే. నేను లాయర్ని కాను. కాని యీ మాటని

ముందే విన్నాను. అయినా నేను అలా చెయ్యలేను. నేను ఆయన్ని చంపలేదు. నేను ఆ పని చెయ్యలేదు, నేను రుజావు చెయ్యలేకపోయినా. నాదొక్కటే ప్రార్థన, యీ ఉత్తరాలు నేను ప్రేమించిన అమ్మాయివి, యీ ఉత్తరం నేను ఆమెకి రాసింది. వీటన్నిట్నీ ఆమెకి పంపించగలరా?''

''లేదు, పంపించను. మీరే ఆమెకివ్వండి. మిమ్మల్ని అరెస్టు చెయ్యడం లేదు వోరొనొవ్'' అని ఇన్వెస్టిగేటర్ జవాబిచ్చాడు.

కొన్ని కేసులుంటాయి. వాటికి ముగింపు మామూలుగా వుండదు, పరిష్కారం హఠాత్తుగా వుంటుంది, తుది నిర్ణయం కూడా. యివి మామూలుగా వుండే ఆధారాలూ, సాక్ష్యం, అప్పటికే స్థాపితమై వెల్లడైన తర్కబద్ధ క్రమం అనే వాటి పరిణామ ఫలితంగా వుండవు. చివరికి సంఘటనలు సమాప్తమవడం అనేది వీటి పర్యవసానంగా జరగదు. ఎన్నో చిక్కు పడిన చీకటి ముళ్ళు, వివరాలు, మానవ సంబంధాలు, పరిస్థితి సమకూర్చే సాక్ష్యం, యధాలాపంగా జరిగిన సంఘటనలు వుంటాయి. అలాంటి వాటిని చూసి అనుభవజ్ఞుడైన ఇన్వెస్టిగేటర్ కూడా అయ్య బాబోయ్ అని చేతులెత్తేస్తాడు. అతనికి మార్గ నిర్దేశకంగా వుండేవి అతని సద్యోవబోధ, అనుభవం, పట్టుదల, అంతరాత్మ, మానవత్వం — సోవియట్ న్యాయ నిర్వహణాధికారికి వుండే మానవత్వం. యివే అతన్ని ఆఖరికి సత్యం వేపు నడిపిస్తాయి.

వోరొనొవ్‌ని వదిలిపెట్టేసి ఇన్వెస్టిగేటర్ యిరుకు పరిస్థితిలో వడ్డాడు. ఓ పక్కనేమో అతని నేరాన్ని కాదనడానికి లేదు. కేసుకి తర్కబద్ధంగా వున్న పరిస్థితి అదీ. అంతకంటే వేరే మార్గం లేదు. పైగా అది పాతుకున్న ధోరణి, యీ కేసు గురించి విన్న వాళ్ళూ, అందులో ఆసక్తి వున్న వాళ్ళు ఒప్పుకునే పద్ధతీ అదే.

మరో పక్క వోరొనొవ్‌ని వదిలిపెట్టడం అనేది ఇన్వెస్టిగేటర్ సద్యోవబోధవల్లనే జరిగింది. సాక్ష్యం అంతా వ్యతిరేకంగా వున్నాగానీ పరిస్థితుల్నీ, యదార్థాలనీ పక్కకి పెట్టి వోరొనొవ్ చెప్పిందాన్ని నమ్మి అతను అలా వదిలిపెట్టాడు. అతను వోరొనొవ్‌ని నమ్మేడు. అతని నమ్మకం మసగ్గా, అస్పష్టంగా, అనిశ్చితంగా వున్న కారణాలమీదే ఆధార పడవచ్చు. కాని ఆ కారణాలు అతని మనసులో యేర్పడ్డవే. పైకి చూస్తే సర్వదా తర్కబద్ధంగా కనిపించవు. వాటిని మాటలలో వ్యక్తం చెయ్యడం చాలా కష్టం. ఎన్నడూ వాటిని గురించి ప్రస్తావించరు. కాని ఇన్వెస్టిగేటర్ నైపుణ్యాన్ని బట్టీ, అతని మానసిక, వృత్తిపర నిశితదృష్టిని బట్టీ, అతని సద్యోవబోధ నైశిత్యాన్ని బట్టీ ఆ కారణాలు పైకి వస్తాయి. యివి యెన్నో యేళ్ల ఆలోచనాయుత, అవిశ్రాంత కృషికీ, పరిశీలించడానికీ, నేరపరిశోధనలోని అనుభవానికీ, సంఘటనలనీ వ్యక్తుల్నీ నిరంతరంగా విశ్లేషణ చేసే అలవాటుకీ సానుకూల ఫలితంగా వస్తాయి.

వోరొనొవ్ ప్రొఫెసర్‌ని హత్య చెయ్యలేదని ఇన్వెస్టిగేటర్‌కి నమ్మకమే. కాని దాన్ని వివరించాలి. రుజువు చెయ్యాలి. ప్రొఫెసర్ బూరొవ్ మృతి రహస్యాన్ని పరిష్కరించాలి.

వోరొనొవ్ అమాయకుడని ఇన్వెస్టిగేటర్‌కి నమ్మకం కలిగినంత మాత్రాన అతనిమీద వున్న ఆరోపణలన్నిట్నీ తొలగించడం జరగదు.

శవ పరీక్షకి పి. సెమెనోవ్‌స్కీని బాధ్యుడుగా వుంచారు. ఆయన తన మామూలు నైపుణ్యంతో, శ్రద్ధతో దాన్ని నిర్వహించి తను శోధించిన వాటిని నివేదించాడు. విషయం రెండు పాయింట్లకి తేలింది.

1. ప్రొఫెసర్ బూరొవ్‌కి వేట బాకు దెబ్బ తగిలింది. ఆ తీవ్రమైన గాయాలకి ఆయన చనిపోయాడు. ఆ బాకు ఆయన యెడమ కంట్లో దిగింది.

2. మనిషి బలం కంటే యెక్కువ శక్తితో ఆ దెబ్బని కొట్టడం జరిగింది.

"'మనిషి బలం కంటే యెక్కువ శక్తితో' అంటే యేమిటి మీ ఉద్దేశం? యీ విషయాన్ని యెలా అర్థం చేసుకోవాలి?" అని ఇన్వెస్టిగేటర్ అడిగాడు.

"అంటే, యీ తగిలిన దెబ్బ మామూలు మనిషి కొట్టే దాని కంటే యెక్కువ శక్తితో వుంది. అందుకనే 'మనిషి బలం కంటే యెక్కువ' అన్నాను. కాని యెంతటి శక్తి అయిందీ చెప్పలేను" అని సెమెనోవ్‌స్కీ వివరించాడు.

ఇన్వెస్టిగేటర్ తన విచారణ కొనసాగించాడు. ప్రొఫెసరుగారి రైఫిల్ పరీక్షించాడు. అది వించెస్టర్ తయారీ. కేసుకి ఆసక్తికరంగా వుండే సమాచారాన్ని దేన్నీ యివ్వదు. మరణాంతకమైన దెబ్బకొట్టిన బాకు కూడా సామాన్యమైందే. అది ఓ రకంగా చవక బారు వేట బాకు. దానికి కొయ్య పిడి వుంది.

దాన్ని జాగ్రత్తగా పరిశీలించాడు. పిడిలో చిన్న దోషం కనిపించింది. పని వాడు బాగా చెయ్యలేదు. యినప వూచ చిన్నగా వున్న కొనకి పిడిని తగిలించాడు. దాన్నుంచి వాడి కొన బాకు వెనక్కి పొడుచుకు వస్తుంది. కాని ఆ కొనని యెవళ్లూ గుర్తించరు.

ఆ చిన్న యినప ముక్కని ఇన్వెస్టిగేటర్ వేలితో తడిమాడు. హఠాత్తుగా గంతు వేశాడు యేదో ఆలోచన వెలిగినట్టుగా.

ఓ గంట తర్వాత నిపుణులు, గన్ స్మిత్‌లూ వేటగాళ్లూ ఇన్వెస్టిగేటర్ ఆఫీసులో మూగిపోయారు. వాళ్లందర్నీ హడావుడిగా పిలవనంపడం జరిగింది.

"చెప్పండి. ఓ వేటగాడికి పటకాలో కొయ్య పిడి వున్న వేట బాకు వుంది. తుపాకీ తూటా ఒకటి జారి తుపాకీ కుందాలోకి దిగి అడ్డం పడింది. మాటకి ఆ తూటా చెమ్మవల్ల ఉబ్బినా, వంగినా, లేదా చవకరకందైనా — వేటగాడు అప్పుడేం చేస్తాడు?" అని అడిగాడు.

నిపుణులు ఆశ్చర్యంగా ఒకళ్లకేసి ఒకళ్లు చూసుకుని తమలో తాము గుసగుస లాడుకున్నారు.

వాళ్లందరూ యేకాభిప్రాయానికి వచ్చాక ఒకాయన చెప్పాడు.

"అలాంటి సందర్భంలో అతను వేట బాకుని తీసుకుని, సాఫీగా వున్న కొయ్య పిడిని తూటా కాప్సూల్‌మీద జాగ్రత్తగా కొడతాడు దాన్ని లోపలికి తొయ్యడానికి."

"నేనూ అదే అనుకున్నాను" అన్నాడు ఇన్వెస్టిగేటర్ చిరునవ్వు నవ్వుతూ. "వూఁ, చూడండి యీ బాకుకేసి. కొయ్యలోనుంచి పొడుచుకు వచ్చిన యినప ముక్కని చూడండి. వేటగాడు బాకుతో తూటాని లోపలికి తోస్తున్నాడనుకోండి. అప్పుడేం జరుగుతుందంటారు?" అని అడిగాడు.

నిపుణులు బాకుని పరీక్షించారు. గట్టిగా వున్న యినప ముక్కని చూశారు. ఒక అభిప్రాయానికి వచ్చారు.

"యీ యినప ముక్క యింత వాడిగా, గట్టిగా వుండబట్టి ఫైరింగ్ పిన్‌లా పని చేస్తుంది. తూటా కాప్సూల్‌ని తట్టడానికి యీ బాకుని వాడి వుంటే పేలుడు సంభవించి రైఫిల్‌ని అంటించి వుంటుంది" అన్నారు వాళ్లు.

తర్వాత ఇన్వెస్టిగేటర్ గన్ స్మిత్‌లకేసి తిరిగాడు.

"తూటా కుందాలోకి వెళ్లకుండానే, వేటగాడి అజాగ్రత్తవల్ల, రైఫిల్ పేలితే పేలుడు శక్తి యెటు మళ్లుతుంది, అది యెంత బలం గల దవుతుందో చెప్పండి" అని అడిగాడు.

"పేలుడు శక్తి వెనక్కి తన్నుతుంది, బాకుని పట్టుకున్న చేతిని ముఖంకేసి విసురుతూ. దాని శక్తి చాలా యెక్కువ వుంటుంది, అయిదునుంచి యేడు వాయు పీడనాల దాకా వుంటుంది."

ఇన్వెస్టిగేటర్ హమ్మయ్య అనుకున్నాడు. అతని శంక నిజమే.

సరిగ్గా అప్పుడే సెమెనోవ్‌స్కీ ఆఫీసులోకి వచ్చాడు. ఇన్వెస్టిగేటర్ అతనికి బాకుని చూపించాడు. నిపుణుల అభిప్రాయాన్ని చెప్పాడు.

"అంతా బాగా యుక్తిగానే వుంది. నమ్మేటట్లే వుంది కూడా, చిన్న సందేహం లేకపోయినట్లయితే. ప్రొఫెసరుగారు ఎడం కంటికి గాయం అయి చచ్చిపోయాడు. మీరు చెప్పిందాని ప్రకారం ఆయన కుడి చేతో కుడి కంటికి గాయం తగిలించుకుని చనిపోవాలి. ఎడం కంటికి కాదు" అన్నాడు మెల్లిగా.

ప్రొఫెసరుగారి యెత్తునీ, ఆయన చేతి పొడవునీ సెమెనోవ్‌స్కీ గుణించి, ఆయన శరీరంలోని అనేక భాగాల సంపుటీకరణని గుణించి, పేలుడు వల్ల అలాంటి దెబ్బ తగిలి వుంటే ఆయన కుడి చెయ్యి కుడి కంటిని గాయపర్చి వుంటుందనీ యెడమ కంటిని యెన్నడూ కాదనీ తేల్చాడు.

యింతో స్పష్టంగా, నిర్దుష్టంగా వున్నట్టున్న ఇన్వెస్టిగేటర్ వాదన తునా తునకలై పోతోంది.

కాని అతను పట్టు వదలని విక్రమార్కుడు. తను రైటేనని అతని నమ్మకం. తన పరిశోధన కొనసాగించేడు.

"ప్రొఫెసరుగారి ఆరోగ్యం బాగానే వుండేదా?" అని ఆయన బంధువుల నొక ళ్లని అడిగాడు.

"ఆఁ, శారీరకంగా, మానసికంగా కూడా" అని జవాబిచ్చారు.

"ఆయనలో వింతగా వుండేదేదేనా వుండిందా? ఆయన కేమన్నా దోషాలుండేవా?"

"యేం లేదు, వింత యేమీ లేదు, దోషాలూ లేవు."

"ప్రొఫెసర్‌గారు స్కాల్‌పెల్ వాడడం యెప్పుడన్నా చూశారా" అని వదలకుండా ఇన్వెస్టిగేటర్ అడిగాడు.

"అయ్యో యెందుకు చూళ్లేదు? ఆయన యింటి దగ్గర చాలా సార్లు పని చేసేవాడు."

"స్కాల్‌పెల్‌ని యే చేత్తో వాడేవాడు?" అని జాగ్రత్తగా, ఓ రకంగా బెరుగ్గా అడిగాడు, తన కడపటి ఆశ ఉడిగిపోతుందని భయపడుతూ.

"ప్రొఫెసరుగారిది యెడం చెయ్యి వాటం" అని జవాబు వచ్చింది.

ఇన్వెస్టిగేటర్ సంతోషాన్ని అదుపు చేసుకోలేకపోయాడు. ఆఖరికి జవాబు వచ్చింది. నిజం తేలింది. పరిష్కారం దొరికింది. వివరణ వచ్చింది.

ఆయనది యెడమ చెయ్యి వాటం. ఇన్వెస్టిగేటర్ సెమెనోవ్‌స్కీని చూడ్డానికి పరిగెట్టి వెళ్లాడు. ఆయన మళ్లీ గుణించడానికి కూర్చున్నాడు. ప్రొఫెసరుగారు తూటాని యెడమ చెత్తో పెడితే, అది పేలి వుంటే, మాటికి నూరుపాళ్లూ ఎడమ కంటికే దెబ్బ తగులుతుందని లెక్కలు కచ్చితంగా రుజువు చేశాయి.

ప్రొఫెసరుగారి ఎడమ చెయ్యి పేలుడు శక్తివల్ల వెనక్కి తోసుకువచ్చి ముఖంమీద, ఎడమ కంటిమీదా యెలా పడి వుంటుందో సెమెనోవ్‌స్కీ ఇన్వెస్టిగేటరూ పటం తయారు చేశారు.

కడకి అంతా స్పష్టమైంది. నిజం బయట పడింది. ప్రొఫెసరు బూరోవ్ మరణం యెలా సంభవించిందీ వివరించడం జరిగింది. వోరొనొవ్ నిర్దోషిత్వం రుజువైంది.

"నేరం లేకపోవడం వల్ల" కేసుని ముగించవచ్చును.

ఆ పత్రాల్ని పురాతన భాండారానికి పంపెయ్యవచ్చు.

ఇన్వెస్టిగేటర్ యింకా చూడాల్సి వున్న యితర కేసులు పట్టుకోవచ్చు.

మరోసారి అతను యదార్థాల, మానవ సంబంధాల మయసభలో తడబడుతూ సాగుతూ తప్పులు చేస్తూ, ఆవిష్కరణలు కూడా చేస్తూ వుండి పోయేవాడు.

అవును, బహుశా. కాని బాకు మాట యేమిటి? ఆ ముదనష్టపు బాకు యెక్కణ్నుంచి వచ్చింది?

కేసుతో పరిచయం వున్న ప్రొఫెసరుగారి తమ్ముడు మరోలా వాదించాడు.

"మీరు అన్నది రైటేననీ, మా అన్నయ్య తన అజాగ్రత్తవల్లనే చనిపోయాడనీ ఒప్పుకోవడానికి సిద్ధమే. కాని బాకు యెక్కడిది? అలాంటి బాకు మా అన్నయ్య దగ్గర లేదు అని చెప్తున్నాను. వాళ్లకి వస్తువుల్ని యిచ్చినప్పుడు అలాంటి బాకు యివ్వలేదు. యెవరి బాకు అది? యెవరిదై వుండచ్చు? యీ ప్రశ్నకి జవాబు దొరికే దాకా కేసు మూయడానికి వీల్లేదు ఇనస్పెక్టర్" అన్నాడు.

ఓ రకంగా అతనన్నది రైటే. దానికి కచ్చితంగా జవాబు చెప్పాలి.

ప్రొఫెసరుగారికి బాకు యెక్కడ్నుంచి వచ్చిందో వోరొనొవ్‌కి తెలీదు.

"అది ఆయన బాకే ననుకుంటాను. ఆయన అలాంటి దాన్ని వాడడం చాలా సార్లు చూశాను" అన్నాడు.

ఇన్వెస్టిగేటర్ సరుకుల జాబితా చూశాడు. బిల్లులు లిస్టులు, రసీదులు, రిపోర్టులు లాంటి వేల కొద్దీ ఐటమ్స్ వున్న పెద్ద గుట్ట. అందులో గుళ్ళ, రైఫిల్సు, గుడారాలు, తిండి పదార్థాల డబ్బాలు, బైనాక్యులర్లు, పాన్‌లు, థర్మాస్ ఫ్లాస్కులు, గొడ్డళ్లు, ఫోర్కులు, ప్లయర్లు, సుత్తులు, యినప డబ్బాలు, కిరోసిన్ స్టవ్‌లు, థర్మామీటర్లు, పాత్రలు యింకా సవాలక్ష వస్తువులు వున్నాయి. కాని ఇన్వెస్టిగేటర్‌కి శ్రమ వృథా అయింది: వేట బాకు, నాలుగు రూబుళ్ళ అన్నదెక్కడా కనిపించలేదు.

యాత్ర అర్ఖాంగెల్స్క్‌నుంచి బయల్దేరింది. అక్కడ కొన్ని రోజులు వస్తువులూ అవీ కొనుక్కోవడానికి వాళ్లు ఆగేరు. యీ విషయం గుర్తువచ్చి ఒక రోజు అర్ఖాంగెల్స్క్ వెళ్లడానికి అనుమతీ యిమ్మని ఇన్వెస్టిగేటర్ ప్రొక్యురేటర్‌ని అడిగాడు.

"యెందుకు?" అని ప్రొక్యురేటర్ అడిగాడు.

"బాకు కోసం" అని నవ్వుతూ జవాబిచ్చేడు.

ఆ మర్నాడు ఉదయం అక్కడికి చేరాడు. హోటెల్‌లో కూడా దిగకుండా హడావుడిగా దుకాణాలకి వెళ్లాడు. వందలాది బాకులు చూపించారక్కడ. ఖరీదైనవి, చవకవి, ఫిన్నిష్ బాకులు, వోలొగ్దా, క్రస్తోమా, వ్యాత్కా, పావ్‌లొవ్ పసద్‌లాంటి వూళ్లల్లో తయారైన బాకులు చూపించారు. కాని అతనికి తను వెతికే బాకు దొరకలేదు. గందరగోళ పడుతున్న యీ కాతాదారుణ్ణి చూసి అమ్మేవాళ్లు నిర్ఘాంతపోయారు. స్టోర్ మానేజర్లు భుజాలు యెగరేశారు. కేషియర్సు యికిలించారు. కాని యెక్కడా అతనికి కావాల్సిన బాకు కనిపించలేదు.

ఆఖరికి సాయంత్రం వేళకి ఓ దుకాణానికి వెళ్లాడు. ద్వినా ఒడ్డున వేట వస్తు

వులమ్మే దుకాణం అది. మొదటగా అతనికి కనిపించింది కొయ్య పిడి వున్న వేట బాకు. ప్రొఫెసరుగారు చనిపోవడానికి కారణమైన ఆ బాకుకి సరిగ్గా నకలు.

"యీ బాకు ఖరీదు యెంత?" అని ఇన్వెస్టిగేటర్ ఆందోళనగా అడిగాడు.

"మూడూ డెబ్బై అయిదు" అన్నాడు సేల్స్‌మన్.

ఇన్వెస్టిగేటర్ మేనేజర్‌ని పిలిచాడు. అలాంటి బాకులని ఒక్క సంస్థే తయారు చేస్తుందనీ, మొత్తం తను ఉత్పత్తి చేసిన సరుకు నంతట్నీ తమ దుకాణానికే పంపుతుందనీ మేనేజర్ చెప్పాడు. అర్ఖాంగెల్స్క్‌కి యాత్ర వెళ్లినప్పుడు ఆ బాకుల్ని అమ్మడం జరిగింది.

"బోలెడు కత్తులమ్ముతాం. యెవళ్లెవళ్లు కొన్నారో అందర్నీ గుర్తుపెట్టుకోగలమా? అయినా యెందుకు గుర్తుపెట్టుకోవాలి?" అన్నాడు మేనేజరు.

ఇన్వెస్టిగేటర్ మాస్కోకి తిరిగివచ్చాడు. ప్రొఫెసర్‌గారి నోట్‌బుక్‌లో బోలెడు విషయాలు రాసి వున్నాయి. అందులో ఒక చోట "అర్ఖాంగెల్స్క్ వేట బాకు 3 రూబుళ్లు 75 కోపెక్కులు" అని వుంది.

"కూర్చోండి, కామ్రేడ్ వోరొనొవ్" అన్నాడు ఇన్వెస్టిగేటర్ పొడిగా. "మిమ్మల్ని పిలవడం యిదే ఆఖరు సారి. కేసుని క్లోజ్ చేస్తున్న ఆర్డర్ చదవండి. మీకో కాపీ ముట్టినట్టు యిక్కడ సంతకం పెట్టండి. యిక్కడ" అన్నాడు.

వోరొనొవ్ కలం తీసుకున్నాడు. వున్నట్టుండి ప్రతీదీ అతని కళ్ల ముందు తిరుగుతూ వున్నట్టుంది. కలం, సిరా బుడ్డి, బల్లకి ఆవలి వేపున కూర్చున్న ఇన్వెస్టిగేటర్ ముఖం అన్నీ తిరుగుతున్నట్టు అనిపించింది.

చివరికి ఇన్వెస్టిగేటర్ మాటలు బోధపడ్డాయి. భయంకరమైన ఆ అనుభవం గతించి పోయిందనీ తన నిర్దోషిత్వం రుజువైందనీ, నిజాన్ని కనిపెట్టారనీ అతనికి బోధపడింది. తనకి యెదురుగా ముభావంగా కూర్చున్న మనిషి తన జీవితాన్నీ తన గౌరవాన్నీ కాపాడేడనీ బోధపడింది.

1938

పాఠకులకు మనవి

ఈ పుస్తకం గురించీ, దీని అనువాదం గురించీ మీ అభిప్రాయాలను "రాదుగ" ప్రచురణాలయానికి దయచేసి తెలుపండి.

మీ అభిప్రాయాలను ఈకింది చిరునామాకు పంపండి:

Raduga Publishers
17, Zubovsky Boulevard
Moscow, USSR

మా ప్రచురణలు దొరికే చోట్లు:



ISBN 5-05-001443-3